రామాయణం

# రామాయణ సుధ-ఉత్తర కాండము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "సీచాతిసీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# రామాయణ సుధ

## (ఉత్తర కాండము)

(మహర్షి వాల్మీకి రచనానుసారంగా సరళ వచన రామాయణం)

*

రచయిత :

ఆచంట లక్ష్మీనరసింహం

*

ఆచంట పబ్లికేషన్సు
ఎస్. ఆర్. టి. 418, సనత్‌నగర్,
హైదరాబాదు - 500 018.

కళా ప్రపూర్ణ

డా. దివాకర్ల వేంకటావధాని M. A. (Hons) PhD.

# అభినందనము

పూజ్యులు శ్రీ ఆచంట లక్ష్మీనరసింహంగారు వచనమున రచించిన రామాయణోత్తర కాండనందందు చదివి యానందించితిని. వారిదివరకే పూర్వరామాయణమును మనోహరమైన శైలిలో వచనమున రచించి ప్రచురించి యున్నారు అందలి హృద్యమైన గద్యశైలియు, నిపుణమైన కథా కథన విధానమును పలువురు పాఠకుల నలరించి యుండుననుటలో సందేహముండదు. ఇప్పుడు వారుత్తర కాండను కూడ ప్రచురించి శ్రీ మద్రామాయణమును పూర్తిగా రచించిన భాగ్యమునకు పాత్రులైనారు. గ్రంథాంతమున రామాయణ పఠన శ్రవణ ఫలముగ్గడింప బడినది. ఆ ఫలము రచించినవారికి ద్విగుణీకృతముగా కలుగుననుట నిర్వివాదము. ఎవ్వరైనను మర్యాదా పురుషోత్తముడైన శ్రీరాముని చరిత్ర రచింపబూనుట పూర్వజన్మ సుకృతము; దానిని నిర్విఘ్నముగా పూర్తిచేయుట ఆ సుకృతమునకు పరిపక్వ ఫలము.

ఉత్తర కాండము వాల్మీకి కర్తృకమౌనా కాదా అను విషయమున పండితులలో భిన్నాభిప్రాయములున్నవి. కాని పలువురు దానిని వాల్మీకి కృతముగానే అంగీకరించు చున్నారు. గాయత్రీ రామాయణమున "ఏ రాత్రి శత్రుఘ్నుడు ఆశ్రమమున ప్రవేశించెనో, ఆ రాత్రియే సీత దారకద్వయమును ప్రసవించెన" ను అర్థముగల శ్లోకమున్నది. అది ఉత్తరకాండకు సంబంధించినదే. మరియు రావణాదుల యొక్కయు, హనుమంతుని యొక్కయు, సీత యొక్కయు పూర్వజన్మ వృత్తాంతములను తెలుపు సన్నివేశములీ యుత్తరకాండయందున్నవి. నిజమున కవి కూడ నున్నగాని రామాయణ కథ పూర్తికాదు. అందుచే ఆ భాగములను పూరించుటకై వాల్మీకి ఉత్తరకాండను రచించెనని భావించవచ్చును. లోకమున రామాయణ

మును రచించిన పలువురు యుద్ధకాండాంతము నందలి రామపట్టాభిషేక కథతోడనే ముగించి వైచుచుందురు. రామలక్ష్మణ నిర్యాణము, సీతా పరిత్యాగము సీత భూగర్భ విలీనము మున్నగు విషయములు కరుణరస భరితములును అశుభ సూచకములు నగుటచే కాబోలు వారీ కాండను విడిచి వైచుచుందురు. ఇది వాల్మీకి రచన కాదేమో అను సందేహము కూడ వారు దానిని విడుచుటకు కారణమై యుండును. తిక్కనవంటి మహాకవి కూడ రామ నిర్యాణ కథను విడిచివేయగా జయంతి రామభట్టనునతడు దానిని ఏకాశ్వాసముగా రచించి యుండెను.

శ్రీ లక్ష్మీ నరసింహముగారు వాల్మీకి ఉత్తరకాండము నందలి కథ నంతను సంపూర్ణముగా వివరించి యున్నారు. హనుమద్ వృత్తాంతము, వేదవతీ వృత్తాంతము, రామాశ్వమేధ వృత్తాంతము ఉత్తరకాండ మందలి కథలలో మిక్కిలి హృదయంగమములుగా నుండును. సీతా పరిత్యాగము నకు పూర్వమందలి సీతారాముల లీలా విహారము, ఆ పరిత్యాగమునందలి కరుణరసమునకు నైశిత్యము నొదవించు చున్నది. సీతా పరిత్యాగము వివాదముతో కూడిన విషయము. ఆ సందర్భమున రెండు ధర్మములకు సంఘర్షణము సంభవించినది. భార్యను ప్రేమతో నుపలాలించుట భర్తకు విహితధర్మము. అట్లే ప్రజలను రంజింపచేయుట రాజునకు విహిత ధర్మము. ఇచ్చట రాజ, భర్తృ ధర్మములకు వైరుధ్యము సంభవించినది. ప్రజలను రంజించుటయే రాజ ధర్మముగా భావించిన రాముడు భార్యను విడువవలసి వచ్చినది అందలి అధర్మమునతడు గుర్తించియుండక పోలేదు. కాని అతడట్లు చేయక తప్పినదికాదు. అతడు రాజ్యమునే విడిచినచో, భార్యా మోహితుడై ప్రజలనుపేక్షించెనను అపకీర్తికి పాలై యుండును. అతడీ రెండు విషయములను పరిశీలించి, ప్రజారంజనమునకే ఎక్కువ ప్రాధాన్యమునిచ్చి, భార్యను విడిచివేసెను. భవభూతి యీ వృత్తాంతమును వస్తువుగా గ్రహించి, అతిప్రసిద్ధమైన నాటకమును రచించెను. అతడందు సీతారాముల పునస్సమాగమము సంఘటించెను.

ఉత్తర రామచరితమందలి తృతీయాంకము రామునికి సీత యందుగల లోకోత్తరమైన ప్రేమను వర్ణించుచునే, అతని చేతను సమర్థించు చున్నది.

ఉత్తర రామాయణము నవరసభరితము. విష్ణువు రాక్షసులను సంహరించిన వృత్తాంతము వీర, రౌద్ర, బీభత్సములకును, హనుమద్ వృత్తాంతము అద్భుతమునకును, సీతాపరిత్యాగ రామ నిర్యాణాదులు కరుణరసమునకును, రంభా రావణ వృత్తాంతము శృంగారాభాసమునకును, సీతారాముల లీలావిహారము నిర్మల శృంగారమునకును నిధానములు. పూర్వ రామాయణమున, భరతుని భాతృభక్తివలె, ఉత్తర రామాయణమున లక్ష్మణ, శత్రుఘ్నుల భాతృభక్తి చక్కగా వర్ణించబడినది. పూర్వ రామాయణమున, భరత శత్రుఘ్నుల పరాక్రమ మెట్టిదో మనకు తెలియదు. ఉత్తర రామాయణమున గంధర్వ, లవణాసుర వధ వృత్తాంతముల వలన వారి అపూర్వ విక్రమము మనకు తెలియవచ్చుచున్నది. కుశలవుల వృత్తాంతము సర్వమనోహరముగా నున్నది. వాల్మీకి రామాయణం "పాఠ్యే గేయే చ మధురమ్మ" ని వ్రాసిన వ్రాత యిందు సార్థకమగు చున్నది. రామునివంటి అవతారపురుషుడు కూడ భార్యను విసర్జించవలసి వచ్చుటయు, సీత భూగర్భ విలీనయగుటయు, విధి బలీయస్త్వమును వివరించుచున్నది. రావణుడెంత బలశాలియైనను, అధర్మాచరణచే శాపములకు గురికావలసి వచ్చెను.

కథా కథనమొక ప్రశస్తమైన కళ. వాల్మీకి కవిత్వమునందువలెనే, కథా కథనమునందును, రసపోషణమునందును అప్రతిమాన ప్రతిభ కలవాడు. శ్రీ లక్ష్మీనరసింహముగారు మూల సౌందర్యమున కెచ్చటను భంగము రాకుండునట్లుగా కథా కథనము సాగించి యున్నారు. వారు పదాడంబరమునకై ఎచ్చటను ప్రయత్నించి యుండలేదు. శైలివ్యావహారిక మయ్యు రమణీయముగా నున్నది. అచ్చటచ్చట దొరలిన వ్యాకరణ

స్ఖాలిత్యములను సులభముగా దిద్దుకొనవచ్చును. వారు రామాయణము రచించుటకు శ్రీరామునియందలి భక్తియేకారణము. ఆ భక్తివిశేషము చివర నుదహరించిన దాశరథీ శతకము నందలి మనోహరమైన పద్యముల వలన తెలియుచున్నది. ఆ భక్తియే వారు గ్రంథారంభమున రామ కర్ణామృతమునందలి కొన్ని శ్లోకములను చేర్చుటకు కూడ కారణము. భక్తి ప్రవాహము వంటిది అది భాషాదోషములను కనపడనీయదు. నిజము నకు భక్తి పరవశులగువారికి వానిని చూడవలసిన అవసరము కూడ లేదని పండిత పామర మనోరంజకముగా రామాయణమును పూర్తిచేసి, తాము తరించుటేగాక, పాఠకులకు కూడా తరణోపాయము చూపించిన శ్రీపంతుల గారిని వందన పూర్వముగా అభినందించుచున్నాము.

డా॥ దివాకర్ల వేంకటావధాని

# రచయిత విజ్ఞాపన

శ్రీరామచంద్రమూర్తి కరుణవల్ల, నేను ఆయనపై భారముంచి 1982 సం॥రంలో వచనంలో వ్రాసిన "రామాయణ సుధ"ను మిత్రులు, పత్రికలు శ్లాఘించి, ఆదరం చూపడంవల్ల, తొలి ప్రచురణ కాపీలన్నీ విడుదలైనాయని ప్రకటించడానికి సంతోషిస్తున్నాను. పుస్తకవిక్రేతలపై ఆధారపడకుండానే దివ్యజీవన సంఘసభ్యులు, ఆస్తికులైన సోదర సోదరీమణులు చొరవచూపడంవల్లనే విశేషభాగం విడుదలయ్యాయి. పబ్లిక్ లైబ్రరీలన్నిటిలో ఆ గ్రంథాన్ని అనుమతిస్తూ, పబ్లిక్ గ్రంథాలయాల డైరక్టరు గారు ఆమోదించడంవల్ల, కొన్ని జిల్లా గ్రంథాలయ సంఘాలు, ఆసౌకర్యాన్ని వినియోగించుకున్నాయి. ప్రధానంగా భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానం వారి పుస్తక విక్రయశాలలోను హైదరాబాదు నగరంలోని శ్రీ బిర్లా వెంకటేశ్వరస్వామి దేవాలయంవద్ద తమ పుస్తక విక్రయ కేంద్రంలోనుంచి శ్రీ బిర్లా ఆర్చిలాజికలు, మరియు సాంస్కృతిక కేంద్రంవారు, గాంధీ జ్ఞానమందిరంలోని పుస్తక విక్రయ కేంద్రంవారు పూనికతో చాలకాపీలు విక్రయించియున్నారు. వీరందరికీ ధన్యవాదాలు తెలుపుచున్నాను. ఇప్పటికీ మిత్రులనుండి, రామాయణ సుధ కాపీల నిమిత్తం వుత్తరాలు వస్తున్నాయి. అయితే కాగితం దర, అచ్చుఛార్జీలు విపరీతంగా పెరగడంవల్లను, నావయోభారాన్నిబట్టి పునర్ముద్రణకు పూను కొనలేకున్నాను. ఆ కరుణామయుడు అనుగ్రహిస్తే, భవిష్యత్తులో ఏ ధార్మిక సంస్థయైన వహించవలసినదే.

పై రచనకు లభించిన ప్రజాదరణనుబట్టి ఉత్తేజితుడనై ఇక రామాయణంలోని చివరిదైన వేదవతీ చరిత్రను, సీతాదేవి ఆఖరి శపథంచేసి పాతాళలోకం చేరిన గాథను, నిష్కారణ ప్రజానిందకు జంకి శ్రీరామమూర్తి సీతాదేవిని విడిచిపెట్టినా, తరువాత తానుచేసిన యాగాలన్నిటిలోను ఆమె స్థానంలో ఆ మహాదేవి స్వర్ణప్రతిమను వెంటబడినుంచుకొనియే దీక్షలు

సాగించి, జీవితాంతంవరకు తన ఏకపత్నీవ్రత దీక్షను పాలించడం, సోదరులయందు ఆయన అనురాగాన్ని, మహాప్రస్థానంలో తన్ను వెంబడించి వచ్చిన పరివారం, పౌరులు జానపదులేగాక, వారి తాలూకు పశుపక్ష్యాదులకు కూడ తలుపులు తెరచిన దివ్యలోకాలకు చేర్చిన ఆయన పరతత్వాన్ని చాటే ఉత్తరకాండను, రామాయణ సుధ - ఉత్తరకాండ పేరుతో ప్రక్షిప్తాలన్నిటినీ వదలి నా మొదటి రచనలోవలెనే, వాల్మీకి మహర్షి రచనాను సారంగా, సరళ వచనరూపంలో వ్రాసి, శ్రీసీతారామచంద్రులకు అంకితం చేసి, ప్రజలముందుంచుచున్నాను.

ఈ గ్రంధానికి కూడ పూజ్యకులపతి, కళాప్రపూర్ణులైన, డాక్టరు శ్రీ దివాకర్ల వేంకటావధాని, ఎం. ఏ., ఆనర్సు,పి.హెచ్.డి. గారు కరుణతో తమ దివ్య అభినందనము యిచ్చినందుకు నేను వారికి నా కృతజ్ఞతను తెలుపుచున్నాను. అట్లే లోగద రామాయణ సుధకువలెనే ఈ ఉత్తర కాండను కూడ పరిశీలించి, ప్రచురణ నిమిత్తం, రు. 4228 లు తమ విరాళంగా ప్రకటించి తోడ్పడిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారికీ, ఆ సంస్థ కార్యనిర్వహణాధికారి శ్రీ లక్ష్మీనారాయణగారికి కృతజ్ఞుడను. అదే విధంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహార శాఖవారు ఈ గ్రంథ ప్రచురణ నిమిత్తం రు. 4200 లు విరాళం ప్రకటించినందుకు, ఆ శాఖ డైరక్టరు శ్రీ ఇ. వి. సుబ్బారావుగారికీ, ఆం. ప్ర. సాధారణ పరిపాలనాశాఖ కార్యదర్శిగారైన శ్రీ పి. వి. ఆర్. కే. ప్రసాద్‌గారికి కృతజ్ఞుడను. మరియు కోరిన వెంటనే, ఈ గ్రంధానికి సుందరమైన త్రివర్ణ ముఖచిత్రాన్ని తమ కానుకగా పంపిన ప్రముఖ చిత్రకారుడు, దర్శకుడైన శ్రీ బాపుగారికీ, వాని తాలూకు బ్లాకులను రామాయణ సుధకువలెనే ఈ ఉత్తరకాండకును, ఉచితంగా అందచేసిన ఇండియా బ్లాక్‌మేకర్సు కంపెనీ అధిపతి శ్రీ శింగరాజు సుబ్బారావుగారికీ, నాకు సోదరతుల్యులై ప్రతి ముఖ్య సందర్భంలోనూ సాయపడుచున్న ప్రియమిత్రులూ, దివ్య జీవన సంఘ, సనత్‌నగర శాఖ కార్యదర్శిగా, నగరంలోని ఎన్నో భారత,

భాగవత, రామాయణ ప్రవచనాలను ఉద్దండులైన పండితులచే జరిపిస్తున్న వారూ అయిన శ్రీ జి. సి హెచ్. రామారావుగారికి నా కృతజ్ఞతలు తెలియ చేస్తూ, పై వారందరికీ శుభాలను కలిగించాలని, కరుణామూర్తులైన శ్రీ సీతా, రామచంద్రులను వేడుచున్నాను.

ఈ సందర్భంగానే, నా జన్మదాతలైన తల్లిదండ్రులను గూర్చి, గాంధిజీ నిర్మాణ కార్యక్రమ దీక్షలో, సర్వస్వాన్నే గాక, అసువులను సైతం అర్పించి అమరుడైన నా అన్నగారు సత్యనారాయణగారిని గూర్చి, ఆయన అడుగుజాడల్లోనే నడచి, ఖాదీ, హరిజన కార్యక్రమాల్లో యించుమించు అర్ధ శతాబ్దం గడిపిన నా లోగడ జీవితాన్ని గూర్చి సంక్షేపంగా తెలుపుచున్నం దుకు, పాఠకులు మన్నించగలరని వేడుచున్నాను.

మా వంశీకులు, ఒక శతాబ్దంక్రితం నైజాం పరగణాలో దేశ పాండ్యాలని పేరుపొంది, నైజాంవద్ద వుద్యోగాలుచేసి, మన్ననలు పొందా రనీ కారణాంతరాలవల్ల, అక్కడనుండి ప్రస్తుత పశ్చిమ గోదావరి జిల్లాలోని నర్సాపురం తాలూకాలోని పెక్కు గ్రామాల్లో స్థిరపడ్డారని తెలుస్తోంది. మా తల్లి, దండ్రులు ఆ తాలూకాలోని పెద్ద గ్రామమైన ఆచంటకు 2 మైళ్ళ దూరంలోనున్న వేమవరం నివాసులు. మా తల్లి, దండ్రులైన బాపిరాజు, సుబ్బమ్మగార్లు సంపన్న కుటుంబంవారు. మా తాతగారు లక్ష్మీపతిగారు. వేమవరంలో మా కుటుంబీకులు చాలమంది వుండేవారు. అచట శివ, కేశ వుల ఆలయాలు, మా కుటుంబానికి ఆడుపడుచని పిలువబడుతూ, వారి శుభ కార్యాల్లో చీర, రవికలగుడ్డలు కానుకలు సాంప్రదాయంగా అందుకునే శ్రీ కనకదుర్గమ్మ గుడి వున్నవి. ఆ పూజ్య దంపతులకు క్రీ శ. 1900 వ సంవత్సరంలో మా అన్నగారు, 1905 సంవత్సరంలో నేనూ జన్మించాము. నాకు 3, 4 సంవత్సరాల వయస్సులోనే మా తండ్రిగారు స్వర్గస్థులు కావడం వల్ల, ఆయన్నిగూర్చి పూర్తి వివరాలు తెలియకపోయినా మా అమ్మగారు ఆయన నైష్ఠికుడై, గ్రామస్థుల గౌరవాదరాలు పొందినవారనీ దిట్టమైన రైతనీ వివాహానికి పూర్వం తల్లి, దండ్రులకు శ్రద్ధతో సేవచేసేవారని,

తెలియచేసింది. ఆనాటి పరిస్థితినిబట్టి మా అమ్మ చదువుకొనకపోయినా, మా మాతామహులైన కొండేపూడి నర్సయ్యగారి సాంప్రదాయాన్నిబట్టి, భాగవత, రామాయణ, భారతాలను గూర్చి బాల్యంనుండి తెలిసికొని, దైవ భక్తురాలై, ఎన్నో పాటలు నేర్చి, నోములు, వ్రతాలు నిత్యం సూర్య నమస్కారాలు చేస్తూ, "స్వచ్ఛంద, అనాయాస మరణం ప్రసాదించాలని ప్రార్థించేది అమె అట్లే 1932 సం।రంలో, బంధువులో ఎవరికీ బాధ కలిగించకుండాను, స్మారకం తప్పకుండాను కన్ను మూసింది). మా మాతామహుడైన నర్సయ్యగారు గొప్ప భక్తుడై, వుదయం లేచే సమయంలో ఎన్నో దాశరధీ శతకం, గజేంద్ర మోక్షంలోని పద్యాలు చెవుల పండువుగా పాడేవారట. ఆనాటికే చిన్న అక్షరాలతోనూ, బొమ్మలతోనూ అచ్చయిన ఆంధ్ర మహా భాగవతంవంటి గ్రంధాలు ఆయనవద్ద వుండేవి. వాటిని ఆయన గ్రామస్థులకు వినిపించేవారట. బాల్యంలో నాకు ఆ గ్రంధాల్తో పరిచయం అక్కడనే కలిగింది. వారి నివాసం పశ్చిమగోదావరిజిల్లా భీమవరం తాలూకా కొండేపూడి గ్రామం.

మా తండ్రిగారు మా బాల్యంలోనే మరణించడంవల్ల, అమ్మగారే మా పెంపకం, విద్యావంతులను చేయించే కృషి శ్రద్ధతో వహించారు. మా చదువు మొదట కాకినాడలోను, తనువాత విజయనగరంలోను జరిగింది. మా అన్నయ్య స్ఫురద్రూపి, ఆజానుబాహువు, బలిష్ఠుడు కుశాగ్రబుద్ధియై, దీక్షతో చదివి, విజయనగరాన్నుండి, విశిష్టతతో బి. ఏ. లో వుత్తీర్ణులై 1920 సం॥రంలో మద్రాసు మెడికల్ కాలేజీలో ప్రవేశించారు. అదే సం॥ చివరిభాగంలో పూజ్యగాంధిజీ "బ్రిటిష పాలనతో సహాయనిరాకరణ కార్యక్రమాన్ని మద్రాసులో వుజ్వలంగా ప్రారంభించారు.. ఆ ప్రచండ శంఖారవంతో వుత్తేజితులై కాలేజీలను బహిష్కరించిన మొదటి జట్టులోనే మా అన్నయ్య వైద్యకళాశాలనుండి బైటకువచ్చి, గాంధిజీకి ప్రియతమమైన ఖాదీ వ్యాపకం చేపట్టి, నగరంలోని తిరువల్లిక్కేణి ప్రధానవీధిలో గాంధీ ఖాదీనిలయం పేర, నగరంలో మొదటి ఖాదీవస్త్రాలయం, జాతీయ గ్రంథ ప్రచురణ ప్రారంభించారు. ఆ మహాకృషిలో ఒంటరిగా సతమత

మగుచున్న ఆయనకు తోడ్పడటం నా కర్తవ్యమని గుర్తించి, 1921 సం॥రంలో నేను కాలేజీనుండి బైటకువచ్చి, ఆయనకు తోడయ్యాను.

మా అన్నగారి దీక్షను గుర్తించిన నెల్లూరు జిల్లా కలక్టరుగా పని చేస్తున్న రామచంద్రరావు గారనే గాంధిజీ అభిమాని, (ఈయనయే గాంధిజీ 1915 సం॥లో భారతదేశానికివచ్చి, గోఖలేగారి ఆదేశానుసారంగా 1 సం॥రం అజ్ఞాత దేశ సంచారంచేస్తూ, నెల్లూరుకువచ్చినప్పుడు ఆయన్ని వ్యక్తి గతంగా ఆహ్వానించి, ఆయనతో మాటాడారు). ఆయనతో మీ శక్తి యుక్తులు, జనసముద్రమైన ఈ నగరంలో వృధాచేయడం కంటె, గాంధిజీ వాంఛించే దీనజన సేవచేయాలంటే నెల్లూరు జిల్లాలోని ఉత్తర రెవిన్యూ డివిజన్ కందుకూరుకు చెందిన మెట్టప్రాంతాలైన కందుకూరు, కనిగిరి, పొదిలి, దర్శి తాలూకాల్లో వడుకుపని యింకా అక్కడక్కడ వున్నదనీ, పత్తి వగైరా పండుతోందనీ, ప్రజలు పేదవారనీ, అది స్వయంగా పరిశీలించి పని ప్రారంభించ వచ్చుననీ బోధించారు.

ఆయన సలహానచ్చి, సత్యనారాయణగారు త్వరలోనే ఆ ప్రాంతానికి వెళ్ళి, ఆ తాలూకాల్లో 2, 3 మాసాలు వివరంగా పరిశీలన చేసి, స్వంత వస్త్రాలకొరకు కొందరు మాత్రమే రాట్నాలు వడుకుచున్నా, అటకలమీద పనిచేయగల 25000/ల రాట్నాలున్నాయనీ, ఆ వడుకునూలు నేయగల హరిజన, తొగటుల 2000 చేనేతమగ్గాలున్నాయనీ, కందుకూరు, కనిగిరి తాలూకాల్లో సమృద్ధిగా పత్తిపండుతోందనీ, గ్రామాల్లో పత్తిని గిలకపట్టే పత్తి రాట్నాలు, దూదిని ఏకులుచేసి యిచ్చే దూదేకులవారి కుటుంబాలున్నా యని, నివేదికను తయారుచేసి, 1923 సం॥రంలో మద్రాసులోని కార్య క్రమాలు చాలించి, కుటుంబాన్ని కందుకూరుకు మార్చారు.

అక్కడనుండి కందుకూరు తాలూకా గ్రామాలన్నిటికి ఆయన కాలినడ కను వెళ్ళి, ప్రజల్లో ప్రబోధంచేసి రాట్నాలువడక సిద్ధపడినవారికి ఏకులు పంచిపెట్టించి, వారు తయారుచేసిన వడుకునూలును హరిజన మగ్గాలపై

నేయించారు. విరామమెరుగకుండా, సాగించిన ఆ మహాకృషితో ఆరోగ్యం చెడి, ఆయన 26వ ఏట, 1926 సం॥ ఏప్రిలు 12 తేదీన దేహం చాలించారు. ఆయన వివాహితుడైనా, సంతానం కలుగలేదు. మా వదిన శకుంతలమ్మ, ఆ మరుసటి సంవత్సరం మరణించారు. ఆ విపత్తుతో భిన్నురాలైన మా అమ్మ మీ యిద్దరు సోదరులు పనిచేయడంవల్ల, స్వస్థలానికి బహుదూరంలో వున్నా నేను కించపడలేదనీ, అన్న మరణంతో ఒంటరివీ, చిన్నవాడవైన నీకు యిక్కడ వివాహమెట్లౌతుందనీ, కనుక పశ్చిమగోదావరి జిల్లాకు బయలుదేరుదమనీ, నన్ను తొందరించింది. నేను అన్నకు స్మారకంగా ఆయన కృషిని సాగిస్తాననీ, అక్కడ వ్యక్తిగత సంస్థగాకాక గాంధీజీ స్థాపించిన అఖిలభారత చరఖా సంఘ స్థాపనకు కృషిచేస్తాననీ, ఆమెకు నచ్చచెప్పాను. నేను పైలక్ష్యంతోనే అక్కడ పనిసాగించి, 1929 సం॥ మేనెలలో ఆంధ్రలో గాంధీజీ సాగించిన ఖాదీయాత్రలో, కష్టంమీద కందుకూరును చేర్పించి, అక్కడ గాంధీజీ గడిపిన పూటలో, 1 గంట నేను ఆయనతో సంభాషించి, అచటి పరిస్థితులు, అన్నగారుచేసిన కృషిని వివరిస్తూ, అచటి కూలి 1 వీశ ఏకులు 8, 10 రోజులు వడికితే రు 1/ యిస్తున్నామని తెలుపగా, ఆయన ఆశ్చర్యచకితులయ్యారు. ఆయన ఆశీస్సులతో, మరి రెండునెలల లోపుగానే అచట అ. ఖా. చరఖాసంఘ వుత్పత్తిసంస్థ నిర్మాణం నన్నే మేనేజరుగా నియమిస్తూ ఏర్పాట్లు జరిగాయి. నేను ఆ సంస్థలో వివిధ హోదాల్లో 21 సంవత్సరాలు, మద్రాసు, ఆంధ్ర ప్రభుత్వాల తీవ్ర ఖాదీ కార్యక్రమాల్లోనూ ఖాదీ కమీషన్‌లోనూ 12 సంవత్సరాలు, చివరకు గాంధీ స్మారక నిధిలో 6 సంవత్సరాలు పనిచేసి, 1968 సం॥రంలో పదవీ విరమణ చేశాను. (కందుకూరులోని ఖాదీ సంస్థ, స్వంతభవనం కలిగి, యిప్పటికీ కృషిచేస్తోంది.) 1926 సం॥రం చివరిభాగంలో తూర్పుగోదావరిజిల్లా గోపాలపురం వాస్తవ్యులైన పోతాప్రగడ రామయ్యగారి కుమార్తె శ్యామలా దేవిని నాకు వివాహం చేశారు. నా మామగారైన రామయ్యగారు శ్రీరామ భక్తులై, ప్రాతఃకాలంలో, తన తంబూరాపై, శ్రీరాముని గూర్చిన గేయాలు మనోజ్ఞంగా పాడేవారు.

అన్న గారుమద్రాసులో జరిపిన ఖాదీ విక్రయాల్లో వుత్సాహపిగాని, వ్యాపార పద్ధతులు తెలియకను, అప్పులు యివ్వడం, బ్రిటిష్ ప్రభుత్వం 1 ప్రచురణను నిషేధించి, కాపీలు స్వాధీనం చేసికోవడంవల్లను, మేము సుమారు 30,000 లు నష్టం వచ్చి పిత్రార్జితాన్ని కోల్పోయాము.

మాకు శ్రీరామానుగ్రహంవల్ల సత్యనారాయణ, బాపిరాజులను కుమారులు, సౌభాగ్యవతులు లలిత, సీత, వసుంధరలను కుమార్తెలు కలిగారు. ఆయన కృపవల్లనే వారందరిబాధ్యతలు నెరవేరి, వారు కుటుంబాలతో తమ బాధ్యతలు నెరవేరుస్తున్నారు. నా ఇల్లాలు శ్యామలాదేవి, గడచిన సంవత్సరాలన్నిటిలో నాకు భాగస్వామియై నిలబడి వయసుమళ్ళినా ఇప్పటికి నాకు తోడ్పడుచుంటటం, ఆయన ప్రసాదమే।

ఈ ఉత్తర కాండ రచనాకాలంలో, ఒక అవాంతరం వచ్చి, నా ఎడమకంటి దృష్టి పూర్తిగా తొలగింది. శ్రీరామచంద్రుని కరుణవల్ల ఎడమకంటి దోషం కుడికంటికి సోకకుండునట్లు, స్థానిక సరోజనిదేవి నేత్ర వైద్యాలయ సూపర్నెంటు, శ్రీ రంగారెడ్డిగారు నా ఎడమకన్నుకు ఆపరేషన్ చేశారు. ఇప్పుడు నాకు దృష్టి యిస్తున్నది ఒక కన్నే అయినా, నా పఠన, రచనా వ్యాసంగాలకుగాని, నిత్యాకృత్యాలు నెరవేర్చడానికి గాని ఎట్టి యిబ్బంది కలుగకుండా ఆయనయే నడిపిస్తున్నాడు। ఈ అవ్యాజకరుణకు, ఆయనకు కింకరుడనుగా సేవించడంకంటె,నేను మరే విధంగా నాకృతజ్ఞతను తెలుపగలను।

ఈ నా కృషిని, కరుణాసాగరులైన శ్రీ సీతా, రామచంద్రులకు అంకితం చేస్తూ, సహృదయులందరూ ఆదరించగలరని ఆశిస్తున్నాను.

24-3-85 ఆచంట లక్ష్మీనరసింహం

ఉత్తరకాండ

# విషయ సూచిక


వరుస సంఖ్య పుట స

1. అగస్త్యాది మహర్షులు శ్రీరాముని చూడవచ్చుట
2. మహర్షులు శ్రీరాముని అభినందించుట
3. రాఘవుడు ఇంద్రజిత్తు అతిపరాక్రమ కారణం తెలుపగోరుట
4. అగస్త్యమహర్షి రావణాదుల వృత్తాంతం వినిపించుట
5. విశ్రవునకు కుబేరుడు జన్మించుట
6 అగస్త్యమహర్షి పూర్వరాక్షసుల చరిత్ర వినిపించుట
7. సుకేశుని పుట్టుక, వానికి పార్వతీ పరమేశ్వరులు వరాలు ప్రసాదించుట
8. సుకేశునకు మాల్యవంతాది కుమారులు కలుగుట
9. మాల్యవంతాదులు లంకలో ప్రవేశించుట
10. శంకరుడు దేవతలను మహావిష్ణువును శరణువేడమని బోధించుట
11. మాల్యవంతుడు సోదరులతో సురలపై యుద్ధానికి బయలుదేరుట
12. మహావిష్ణువు దేవతలకు తోడై రాక్షసులను కూల్చుట
13. మాల్యవంతుడు పుండరీకాక్షుని తూలనాడి పోరాడుట
14. నారాయణుడు మాల్యవంతుని ఓడించుట
15. సుమాలి తన కుమారితో భూలోకానికి వచ్చుట
16. సుమాలి తన కుమారి కైకసిని విశ్రవుని వరించడానికి పంపుట
17. రావణ కుంభకర్ణ విభీషణులు పుట్టుట
18. రాఘవుడు రావణాదుల తపస్సును గూర్చి ప్రశ్నించుట
19. బ్రహ్మదేవుడు సోదరులతో రావణునకు వరాలు యిచ్చుట
20. సుమాలి మనుమల్ని చూడటానికి భూలోకానికి వచ్చుట
21. రావణుడు ప్రహస్తుని కుబేరుని వద్దకు దూతగా పంపుట
22. రావణుడు బలగాలతో లంకలో ప్రవేశించుట
23. మయుడు రావణునకు మండోదరి వృత్తాంతం తెలుపుట
24. మయుడు మండోదరిని రావణునకు వివాహం చేయుట
25. రావణుడు సోదరులకు వివాహాలు చేయుట
26. రావణుడు నిరంకుశుడై లోకాలను బాధించుట
27. కుబేరుడు రావణునకు హితవు చెప్పడానికి దూతను పంపుట

28. రావణుడు కుబేరుని దూతను చంపుట
29. రావణుడు కుబేరునిపై దండెత్తుట
30. యక్షరాక్షసుల యుద్ధం
31. కుబేరుడు రావణుని దూషించుట
32. కుబేర రావణుల యుద్ధం
33. నందీశ్వరుడు రావణుని శపించుట
34. రావణుడు కైలాసాన్ని పెల్లగించుట
35. ఈశ్వరుడు ప్రసన్నుడై రావణునకు వరాలు యిచ్చుట
36. రావణుడు వేదవతి తపస్సును గూర్చి ప్రశ్నించుట
37. వేదవతి రావణుని శపించి శరీరత్యాగం చేయుట
38. రావణుడు మరుత్తు యజ్ఞశాల ప్రవేశించుట
39. దేవతలు తాము ధరించిన రూపాల జంతువులకు వరాలు ప్రసాదిం
40. అనరణ్యుడు రావణునితో పోరుట
41. అనరణ్యుడు రావణుని శపించుట
42. నారదమహర్షి రావణుణ్ణి యముని జయించమని బోధించుట
43. రావణుడు యమభటులచే పీడించబడే జీవుల్ని విడిపించుట
44. యముడు రావణునితో పోరుట
45. పరమేష్ఠి కాలుని దండాన్ని విడువవద్దని ఆదేశించుట
46. రావణుడు పాతాళంలో నాగులను జయించుట
47. బ్రహ్మదేవుడు రావణ నివాతకవచుల్ని మైత్రిచేసికొమ్మని బోధిం
48. రావణుడు కాలకేయులతో పోరాడుట
49. రావణుడు వరుణ నగరాన్ని జయించుట
50. రావణుడు వరుణ పుత్రుల్ని పరాభవించుట
51. రావణుడు ఎందరో మహిళలను బలాత్కారంగా చెరబెట్టుట
52. చెరపెట్టబడిన మహిళల శోకం
53. చెరపెట్టబడిన మహిళలు రావణుని శపించుట
54. శూర్పణఖ రావణుని నిందించుట
55. రావణుడు సోదరిని ఓదార్చుట
56. రావణుడు పెద్దకుమారుడు మేఘనాదుని చూడబోవుట
57. విభీషణుడు అన్నకు కుంభీనసిని మధుడు అపహరించినట్లు తెలుపుట

58. రావణుడు మధునిపై యుద్ధానికి బయలుదేరుట
59. కుంభీనసి రావణుని తన భర్తను కాపాడ వేడుట
60. రావణుడు కామపరవశుడగుట
61. రావణుడు రంభను కామించి వేడుట
62. రంభ తన్ను విడువుమని రావణుడు వేడుట
63. రావణుడు రంభను భంగపరచుట
64. నలకూబరుడు రావణుని శపించుట
65. దశకంఠుడు దేవలోకంపై దండెత్తుట
66. మాధవుడు ఇంద్రునితో యుద్ధానికి రానని తెలుపుట
67. దేవ దానవ సంగ్రామం
68. జయంత, మేఘనాదుల పోరాటం
69. మహేంద్ర, రావణుల యుద్ధం
70. రావణుడు శత్రుమధ్యంలో ప్రవేశించి పోరుట
71. మేఘనాదుడు మాయతో దేవేంద్రుని బంధించుట
72. విధాత ఇంద్రునికి స్వయంకృతాపరాధంవల్లనే పరాభవించబడినట్లు తెలుపుట
73. రావణుడు కార్తవీర్యార్జునితో పోరాడబోవుట
74. రావణుడు శివపూజ చేయుట
75. కార్తవీర్యార్జునుడు భుజాలతో నర్మదా జలాలను అడ్డగించుట
76. రావణ, కార్తవీర్యార్జునుల యుద్ధం
77. కార్తవీర్యార్జునుడు రావణుని బంధించి, నగరానికి తీసికొని పోవుట
78. పులస్త్య మహర్షి రావణుని విడిపించుట
79. రావణుడు వాలితో యుద్ధానికి కిష్కింధకు పోవుట
80. వాలి రావణుని చంకలో ఇరికించికొని సముద్రాల్లో ముంచుట
81. రావణుడు వాలితో మైత్రి చేయుట
82. శ్రీరాముడు హనుమంతుని చరిత్ర వినగోరుట
83. అగస్త్యుడు హనుమంతుని చరిత్ర వినిపించుట
84. దేవ దానవ మానవులు ప్రజాపతికి తమ గోడు వినిపించుట
85. బ్రహ్మాది దేవతలు పవన కుమారునికి వరాలు యిచ్చుట
86. ఋషులు బాలమారుతి దుడుకుపనులకు శపించుట

87. హనుమంతుడు భాస్కరుని నుండి విద్యలు నేర్చుట
88. అగస్త్యాది మహర్షులు తమ ఆశ్రమాలకు మరలుట
89. దాశరథిని వంది మాగధులు సుప్రభాత గీతాలతో మేల్కొల్పుట
90. రఘునాయకుడు రాజులను వారి వారి రాజ్యాలకు పంపుట
91. శ్రీరామచంద్రుడు సుగ్రీవ విభీషణాదులకు కానుకలు యిచ్చుట
92. శ్రీరాముడు సుగ్రీవ విభీషణాదుల్ని వీడ్కొలుపుట
93. శ్రీరాముడు మారుతిని సత్కరించి వరం ప్రసాదించుట
94. కుబేరుడు పంపగా పుష్పకం రామచంద్రుని వద్దకు వచ్చుట
95. శ్రీరామచంద్రుడు సీతాదేవితో అశోకవనంలో విహరించుట
96. సీతాదేవి తపోవనాలను చూడగోరుట
97. శ్రీరామచంద్రుడు భద్రుని లోకుల వార్తలడుగుట
98. శ్రీరాముడు సోదరులను పిలువనంపుట
99. రాఘవుడు సీతను గూర్చి విన్న నిందను గూర్చి సోదరులకు తెలుపుట
100. శ్రీరాముడు పౌరుల నిందలను బట్టి సీతను త్యజించినట్లు తెలుపుట
101. శ్రీరాముడు లక్ష్మణునితో సీతను వాల్మీకి ఆశ్రమప్రాంతంలో విడిచిరమ్మని ఆదేశించుట
102. లక్ష్మణుడు సీతమ్మను ఋష్యాశ్రమాలు చూచుటకు తీసికొనిపోవుట
103. జానకీదేవి అపశకునాలను చూచి కలవరపడుట
104. సీతాదేవి మరదిని ఓదార్చుట
105. లక్ష్మణుడు సీతమ్మకు రామాజ్ఞ వినిపించలేక విహ్వలుడగుట
106. లక్ష్మణుడు జానకీదేవికి రామాజ్ఞను వినిపించుట
107. సీతాదేవి భర్త ఆజ్ఞవిని విలపించుట
108. సీతాదేవి రామచంద్రునకు సందేశం పంపుట
109. సౌమిత్రి సీతను విడిచి మరలుట
110. సీతాదేవిని గూర్చి వాల్మీకికి శిష్యులు ఆ మహర్షికి విన్నవించుట
111. మహర్షి వాల్మీకి సీతాదేవికి స్వాగతం తెలిపి ఊరార్చుట
112. వాల్మీకి మహర్షి సీతాదేవిని మునిపత్నులకు అప్పగించుట
113. సౌమిత్రి సుమంత్రునితో సీతాదేవిని గూర్చి తెలిపి దుఃఖించుట
114. సుమంత్రుడు దశరథ, దుర్వాసుల సంభాషణ వినిపించుట

115. లక్ష్మణుడు అన్నను ఊరార్చుట
116. రాఘవుడు సౌమిత్రికి నృగమహారాజు చరిత్ర తెలుపుట
117. నృగమహారాజు ఊసరవెల్లియై బిలంలో ప్రవేశించుట
118. శ్రీరాముడు నిమి కథను వినిపించుట
119. వశిష్ఠుడు దేహం ధరించుట
120. దేవతలు, ఋషులు నిమికి వరమిచ్చుట
121. శ్రీరాముడు యయాతి చరిత్ర తెలుపుట
122. పూరుడు తండ్రి వృద్ధాప్యాన్ని తీసికోడానికి అంగీకరించుట
123. శ్రీరామ దర్శనార్థం చ్యవనుడు మొదలైన ఋషులు వచ్చుట
124. చ్యవనుడు లవణుని వృత్తాంతం, తమ బాధలు తెలుపుట
125. శ్రీరాముడు లవణ వధకు శత్రుఘ్నుని నియమించుట
126. శ్రీరాముడు శత్రుఘ్నుని మధురాధిపతిగా అభిషేకించుట
127. శ్రీరాఘవుడు లవణవధ నిమిత్తం నారాయణాస్త్రాన్ని తమ్మునకు యిచ్చుట
128. శత్రుఘ్నుడు వాల్మీకాశ్రమంలో మజిలీ చేయుట
129. వాల్మీకిమహర్షి సౌదాసుని చరిత్ర వినిపించుట
130. ఆ రాత్రి సీతాదేవి కవల కుమారులను ప్రసవించుట
131. చ్యవన మహర్షి శత్రుఘ్నునకు లవణునిచే మాంధాత మరణించిన కథ తెలుపుట
132. శత్రుఘ్నుడు లవణుని పట్టణం ప్రవేశించకుండ అడ్డగించి యుద్ధానికి ఆహ్వానించుట
133. లవణ శత్రుఘ్నుల యుద్ధం
134. శత్రుఘ్నుడు లవణుని నారాయణాస్త్రంతో సంహరించుట
135. లవణుని వధించిన శత్రుఘ్నునకు దేవతలు వరాలు యిచ్చుట
136. శత్రుఘ్నుడు శ్రీరామ సందర్శనం కొరకు అయోధ్యకు బయలుదేరుట
137. శత్రుఘ్నుడు అద్భుత గానంతో శ్రీరామాయణం వినుట
138. ఒక విప్రుడు మరణించిన బాలకుని శవంతో రాఘవుని సమీపించుట
139. నారదుడు బాలుని మరణ కారణం వినిపించుట
140. శ్రీరాముడు శూద్రమునిని వెదకబోవుట

| | | |
|---|---|---|
| 141. | శ్రీరాముడు శంబుకుని వధించుట | 136 |
| 142. | దేవతలు శ్రీరామునకు వరమిచ్చుట | 136 |
| 143. | అగస్త్యుడు శ్రీరాముని అభినందించి దివ్యాభరణం సమర్పించగోరుట | 137 |
| 144. | అగస్త్యమహర్షి శ్రీరామునకు శ్వేతుని కథ వినిపించుట | 139 |
| 141. | అగస్త్యమహర్షి దండకారణ్య వృత్తాంతం తెలుపుట | 141 |
| 142. | శుక్రుడు దండుని రాజ్యంపై మట్టివాన కురియునట్లు ఘోరంగా శపించుట | 142 |
| 143. | శ్రీరాముడు తమ్ములతో రాజసూయాన్ని గూర్చి చర్చించుట | 144 |
| 144. | అన్నకు లక్ష్మణుడు అశ్వమేధాన్ని చేయవచ్చునని తెలుపుట | 145 |
| 145. | సౌమిత్రి ఇంద్రుడు వృత్రాసురుని సంహరించిన కథ తెలుపుట | 146 |
| 146. | నారాయణుడు వృత్రుని సంహారంనకు వుపాయం తెలుపుట | 146 |
| 147. | ఇంద్రుడు అశ్వమేధంచేసి బ్రహ్మహత్యాదోషం తొలగించుకొనుట | 147 |
| 148. | శ్రీరాముడు ఇలుని గాథ వినిపించుట | 148 |
| 149. | శంకరుడు ఇలునకు శాశ్వత పురుషత్వం ప్రసాదించుట | 152 |
| 150. | శ్రీరాముడు లక్ష్మణుని అశ్వమేధానికి ఏర్పాట్లు చేయగోరుట | 153 |
| 151. | శ్రీరాముడు భూప్రదక్షిణకు అశ్వాన్ని విడుచుట | 154 |
| 152. | వాల్మీకిమహర్షి అశ్వమేధాన్ని చూడవచ్చుట | 155 |
| 153. | వాల్మీకిమహర్షి కుశలవులను రామాయణం గానంచేయ నియమించుట | 155 |
| 154. | కుశలవుల రామాయణగానాన్ని శ్రీరామచంద్రుడు వినుట | 156 |
| 155. | కుశలవులు శ్రీరాముడిచ్చిన కానుకలను నిరాకరించుట | 157 |
| 156. | శ్రీరాముడు కుశలవులను రామాయణాన్ని గూర్చి ప్రశ్నించుట | 158 |
| 157. | శ్రీరాముడు వాల్మీకిమహర్షి వద్దకు దూతలను పంపుట | 159 |
| 158. | శ్రీరాముడు సీతా శపథాన్ని దర్శించడానికి సభికులను రమ్మని ఆహ్వానించుట | 159 |
| 159. | సీతాదేవి శపథం చూడటానికి ప్రజలు సమూహాలుగా వచ్చుట | 160 |
| 160. | వాల్మీకిమహర్షి సీతాదేవితో యజ్ఞశాలకు వచ్చుట | 160 |
| 161. | వాల్మీకిమహర్షి సీతాదేవి పతివ్రత, నిర్దోషియని ప్రమాణంచేయుట | 161 |
| 162. | శ్రీరాముడు లోకనింద తొలగడానికి సీతను శపథం చేయగోరుట | 162 |

163. సీతాదేవి శపథం చేయుట
164. భూమాత సీతాదేవిని రసాతలానికి తీసికొనిపోవుట
165. శ్రీరాముడు సీతకై శోకించి భూదేవిపై ఆగ్రహించుట
166. బ్రహ్మ శ్రీరాముని శాంతింప చేయుట
167. శ్రీరాముడు మిగిలిన ఉత్తరకాండను వినుట
168. కౌసల్యా కైక సుమిత్రలు స్వర్గస్థులగుట
169. యుధాజిత్తు గార్గ్యుని శ్రీరాముని వద్దకు పంపుట
170. భరత యుధాజిత్తులు గంధర్వులతో సమరంచేసి వారిని జయించుట
171. శ్రీరాముడు అంగదీయ చంద్రకాంత పురాలకు లక్ష్మణ కుమారులను అభిషేకించుట
172. శ్రీరామచంద్రుని దర్శించడానికి యముడు వచ్చుట
173. యముడు శ్రీరామునకు బ్రహ్మసందేశం తెలుపుట
174. దుర్వాసమహర్షి రామదర్శనంకొరకు వచ్చుట
175. శ్రీరాముడు సౌమిత్రిని గూర్చి చింతాక్రాంతుడగుట
176. వశిష్ఠమహర్షి ఉపదేశం ప్రకారం శ్రీరాముడు లక్ష్మణుని త్యజించుట
177. సౌమిత్రి శరీరంతో స్వర్గలోకం చేరుట
178. శ్రీరాముడు మహాప్రస్థానానికి బయలుదేర నిశ్చయించుట
179. శ్రీరాముడు కుశలవులకు పట్టాభిషేకం చేయుట
180. శత్రుఘ్నుడు కుమారుల్ని అభిషేకంచేసి, అయోధ్యకు వచ్చుట
శ్రీరాముడు హనుమ, విభీషణులకు వరాలు ప్రసాదించుట
182. శ్రీరామమూర్తి సకలజీవులతో మహాప్రస్థానానికి బయలుదేరుట
183. బ్రహ్మాది దేవతలు శ్రీరాముని దర్శింప వచ్చుట
184. శ్రీరాముడు సోదరులతో సహా, స్వశరీరాలతో వైష్ణవ తేజస్సులో ప్రవేశించుట
185. శ్రీరామాయణం చదువుట, వినుటవల్ల కలిగే ఫలం

# ఉత్తరకాండ ధ్యాన శ్లోకాలు

1. భవసంచిత పాపౌఘ, విధ్వంసన విచక్షణం
విఘ్నాంధకార భాస్వంతం, విఘ్నరాజ మహంభజే.

2. శరదిందు వికాస మందహాసం
స్ఫురదిందీవర లోచనాభిరామం
అరవింద సమాన సుందరాశ్యాం
అరవిందాసన సుందరీ ముపాసే.

3. రామం పురాణ పురుషం, రమణీయవేషం
రాజాధి రాజ మకుటార్చిత పాదపీఠం
సీతాపతిం సునయనం జగదేకవీరం
శ్రీరామచంద్రమనిశం కలయామి చిత్తైః.

4. సీతామనోమానస రాజహంస, సంసార తాపహర క్షమాశో
శ్రీరామ దైత్యాంతక శాంతరూప, శ్రీతారక బ్రహ్మనమో నమస్తే

5. మజ్జీవం మదనుగ్రహం మదధిపం మద్భావనం మత్సుఖం
మత్తాతం మమసద్గురుం, మమవరం మోహాంధ విచ్ఛేదకం
మత్పుణ్యం మదనేక బాంధవజనం మజ్జీవనం మన్నిధిం
మత్సిద్ధిం మమసర్వకర్మ సుకృతం రామంభజే తారకం.

6. సకల భువన రత్నం సచ్చిదానంద రత్నం
సకలహృదయ రత్నం సూర్య బింబాంత రత్నం
విమల సుకృత రత్నం, వేదవేదాంత రత్నం
పురహర జపరత్నం పాతుమాంరామరత్నం.

7. మాణిక్య మంజీర పదారవిందం
రామార్క వత్ఫుల్ల ముఖారవిందం
భక్తాభయ ప్రాపి కరారవిందం
దేవీంభజే రాఘవ వల్లభాం తామ్.

8. గోష్పదీకృత వారాశిం
మశకీకృత రాక్షసాం
రామాయణ మహామాలా
రత్నం వందే అనిలాత్మజం

9. యః పిబన్ సతతం
రామచరితామృత సాగరం
అతృప్తస్తం మునిం వందే
ప్రాచేతస మకల్మషమ్.

10. వాల్మీకి గిరి సంభూతా
రామ సాగర గామినీ
పునాతి భువనా పుణ్యా
రామాయణ మహానదీ

## భూతకోటికి శ్రీరామచంద్రమూర్తి అభయ ప్రదానం

శ్లో॥ మిత్ర భావేన సంప్రాప్తం
నత్యజేయం కధంచన
దోషోయద్యపి తస్యస్యాత్
సతామేత దగర్హితం.

తా. "నాయందు విశ్వాసముంచి, వున్నచోటునుండియే నన్ను శరణు చొచ్చినవానిని, నేను వెతకి రక్షిస్తాను. నన్ను శరణు వేడిన వానిలో సద్గుణాలు లోపించినా, దోషాలున్నా కూడ విడువజాలను".

శ్లో॥ సకృదేవ ప్రపన్నాయ
తవాస్మీతిచ యాచతే
అభయం సర్వభూతేభ్యో
దదామ్యేతత్ వ్రతంమమ.

తా. "ఎవ్వడైనా, ఒక్కసారియైనా, నీ వాడనని నన్ను శరణు వేడినచో, సమస్త భూతకోటినీ రక్షిస్తాననేదే నా వ్రతం".

శ్రీ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత
శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

# రామాయణ సుధ

## ఉత్తరకాండ ప్రారంభం

### అగస్త్యాది మహర్షులు శ్రీరామచంద్రుని చూడవచ్చుట

శ్రీరామచంద్రుడు లోకకంటకులైన రాక్షసుల్ని యుద్ధంలో నిర్మూలించి వచ్చి, పట్టాభిషిక్తుడై, రాజ్యపాలన చేస్తుండగా ఒకనాడు చాలమంది మహర్షులు, ఆయన్ని అభినందించడానికి అయోధ్యకు వచ్చారు. వారిలో కౌశిక, యవక్రీత, గార్గ్య, గాలవుడు మొదలైన మునులు తూర్పు దిక్కు నుండి, కవష, ధౌమ్య, రౌద్రేయాదులు శిష్యులతో పడమటి దిశనుండి వచ్చారు. మరియు మహాత్ములైన అగస్త్య, అత్రి, నముచి, ప్రముచి, సుముఖ, విముఖులు దక్షిణ ప్రాంతంనుండి, వశిష్ఠ, కశ్యప, జమదగ్ని, గౌతమ, భరద్వాజ, అత్రి, విశ్వామిత్ర మహర్షులు ఉత్తర దిశనుండి విచ్చేశారు.

అగ్నివంటి తేజశ్శాలురు, వేదపారంగులైన ఆ మహర్షులందరూ సమూహంగా రాజమందిర ద్వారంవద్ద చేరారు. వారిలో అగస్త్య మహర్షి ద్వారపాలకునితో "ఓయీ, మేమంతా మీ రాజేంద్రుని దర్శించడానికి వచ్చామని ఆయనకు తెలుపుము" అని పలుకగా యోగ్యుడైన ఆ రాజ సేవకుడు వేగంగా పోయి శ్రీరామమూర్తికి ప్రణామంచేసి "ప్రభూ! తమ దర్శనంకోరి బాలసూర్యునివంటి తేజోవంతులైన అగస్త్యాది మహర్షులు చాలమంది ద్వారంవద్ద వేచియున్నారు" అని విన్నవించాడు. ఆయన

సంతోషంతో వారిని వెంటనే సగౌరవంగా లోనికి తీసికొని రమ్మనగా అతడు భక్తి శ్రద్ధలతో అట్లు చేశాడు.

సీతా వల్లభుడు ఆనందంతో వారికి ఎదురువెళ్ళి, చేతులు మోడ్చి నమస్కరించి; ఒక్కొక్కరికి పాదములకు, అర్ఘ్యమునకు జలాలు, గోవులను యిచ్చి, పవిత్రాలైన ఆసనాలను ఏర్పరచగా, వారందరూ ఆనందంతో ఆశీనులయ్యారు.

రఘుపతి వారి నుద్దేశించి "మహాత్ములారా, మీరంతా, మీ శిష్యులతో కుశలంగా ఉన్నారా? వనాల్లో, మీ కేవిధమైన తొందరలు లేవుగదా" అని వారి క్షేమ సమాచారాలు ప్రశ్నించాడు

## మహర్షులు శ్రీరామమూర్తిని అభినందించుట

వారందరూ హర్షంతో "దశరథ నందనా, మా మహాభాగ్యంవల్లనే, దుర్జేయులైన అసురులను సంహరించి పట్టభద్రుడవైన, నిన్ను చూడగలిగామయ్యా! నీవు కోదండం ఎక్కుపెట్టితే, లోకాలు గడగడలాడే శౌర్యంతో, లోక భయంకరుడైన రావణుణ్ణి, పుత్రులు మనుమలు, బంధువులు, వరివారంతో నిశ్శేషుని చేశావు! అట్టి నీవు మాకు రక్షకుడవై యుండగా, ఇక మాకు బాధ లెక్కడివి? రఘువంశ భూషణా నీవు విజయలక్ష్మిని వరించి నీ జీవితేశ్వరీ, సేవా పరాయణుడైన సౌమిత్రితో క్షేమంగా తిరిగి వచ్చి, సోదరులూ, తల్లులూ, లోకులూ ఆనందిస్తుండగా పట్టాభిషిక్తుడవై, ప్రజలను పాలించడం చూచి మిక్కిలి ఆనందిస్తున్నామయ్యా!

"మహాబాహూ, నీవు సాధించిన విజయం నిస్సంశయంగా సాటిలేనిది సుమా! ఎవరి భీకరాకారాలు చూస్తే పగవారి గుండెలు తల్లడిల్లుతాయో, ఏ క్రూరులు ఎరుగని శస్త్రాస్త్రాలు లోకంలో లేవో, ఎవరిని జయించిన వీరులు ఇంతవరకు లేరో, అట్టి దేవాంతక, నరాంతక, కాలాంతక, అకంపన, యుద్ధోన్మత్త మత్త కుంభ నికుంభ ప్రహస్త, విరూపాక్ష

త్రిశిర యజ్ఞకోప, ధూమ్రాక్ష, మహోదరుడు మొదలైన ఎందరు రణ, ధీరులు, నీ పరాక్రమాగ్నిలో మిడతలవలె మాడిపోలేదు?

"పరాక్రమనిధీ, ఎవని ఆకారం మానవాతీతమైనదో, ఎవడు సురలకు గుండెగాలమో, అట్టి లోకభీకరుడైన కుంభకర్ణుణ్ణి, నీవు కను బొమ్మలు ముడివేయకనే నేలకూల్చడం లోకులు ముక్కున వ్రేలుంచి చూచారయ్యా! రామభూపాలా దేవతలనే వనానికి కార్చిచ్చువంటివాడు ముల్లోకాల్ని దద్దరిల్లచేసిన శౌర్యశాలి రావణుణ్ణి, వేగవంతాలూ, మదగజాల కుంభస్థలాన్ని ఛేదించే సింహపు గోళ్ళవంటి తీక్షణాలైన నీ మహాశరాలతో సంహరించిన. నీ మహా విక్రమం అద్వితీయమైనది!

"ప్రచండ విక్రమా, అంతేకాదు మహా వంచకుడు ముల్లోకాధిపతి వాసవుని చెరబెట్టిన మేటి, లయకాలునివంటి విక్రమశాలియైన ఇంద్రజిత్తును మట్టుబెట్టడం, పై మహాకార్యా లన్నిటికీ కిరీటంవంటిదిసుమా! ఆ కుటిలుడు యమపాశాలకు సాటియైన సర్పముఖ బాణాలు కుప్పతిప్పలుగా కురిపించి మిమ్ము బంధించగా మీరు పునర్జీవితులు కావడం మా మహా సుకృతంవల్లనే నయ్యా! రాఘవమణీ, ఎట్టివారికైనా దుర్జయుడూ ఎన్ని మాయల్లోనో దిట్ట, మింట కానరాకుండా సంచరించే ఆ మహావీరుని కూల్చిన వార్త మా కందరికీ మహదానందం కల్గించింది!

"లోకబంధూ, ఆ విధంగానే క్రూర కార్యాలు చేసేవారూ, కోరిన రూపాలు ధరించగల మాయావులూ, అయిన దైత్యులు మరెందరినో నేలకూల్చి, మాకు అభయ దక్షిణ యివ్వడం, మేము మహా భాగ్యంగా భావిస్తున్నాము" అని శ్లాఘించారు.

### రాఘవుడు ఇంద్రజిత్తు అతి పరాక్రమ కారణం తెలుపగోరుట

ఆ తపశ్శీలుర వాక్కులు విన్న దాశరథి రావణి ప్రశంసకు అబ్బురపడి వారికి అంజలిచేస్తూ "మహనీయులారా, మీరు అతి విక్రమ

వంతులైన అతికాయ, త్రిశిర, కుంభనికుంభులనూ దేవాంతక, నరాంతక, ధూమ్రాక్ష, అకంపనులనూ, మహా భీకరుడైన కుంభకర్ణునీ, సాటిలేని విక్రమ వంతుడైన రావణునీ విడిచిపెట్టి మేఘనాధుని వీరత్వాన్ని విశేషంగా వర్ణించడానికి కారణమేమిటి? అత డెట్లు మిగిలిన వారికంటె అధికుడైనాడు? అతని బల, పరాక్రమాలు ఎట్టివి? అతడు ఎట్టి వరాలు సంపాదించాడు? ఆ వీరునికి తండ్రిని మించిన బలపరాక్రమాలు ఎట్లు లభించాయి? ఇది నేను వినదగినచో, కరుణించి వినిపించవలసినదిగా మిమ్ము వేడుచున్నాను" అని కోరాడు.

## అగస్త్య మహర్షి రావణాదుల వృత్తాంతం వినిపించుట

అగస్త్య మునీంద్రుడు ఆనందంతో "రఘుపతీ నీవు కోరినట్లు రావణ కుమారుని బలవిక్రమాలు, అతడు వేల్పులకు అజేయుడై మహేంద్రుని బంధించడం మొదలైన వివరాలన్నీ వినిపిస్తాను. అయితే అంతకు ముందు రావణుని వంశం, అతడు అతని సోదరుల పుట్టుక, విక్రమం, తపస్సు ద్వారా వారు పొందిన వరాలు, అతని విజయాలతో కూడిన గాధ ముఖ్యమైనది కనుక ముందు ఆ వివరాలు తెలుపుతాను. ఆలకించుము.

"రాజీవలోచనా పూర్వం కృతయుగంలో బ్రహ్మ కుమారుడైన పులస్త్యు డనబడే బ్రహ్మర్షి సుగుణాలు శీలసంపదలో తండ్రికి ప్రతినిధి వంటివాడై దేవతలూ, లోకు లందరికీ ప్రియుడై ఖ్యాతిపొందాడు. ఆ పుణ్యమూర్తి మేరుపర్వతంవద్ద తృణబిందు ఆశ్రమంలో దీక్షాపరుడై తపస్సు చేయుచుండెను. ఆ ప్రదేశం అన్ని ఋతువుల్లోనూ పూచి, కాసే సుందర వృక్ష సమూహాలూ, హంసలు చక్రవాకాల సంచారంతో మనోజ్ఞాలైన కొలకులూ కలిగి హాయి కలిగించే చల్లగాలితో రమ్యంగా ఉండటంవల్ల అక్కడికి దేవ యక్ష నాగ రాజర్షుల కన్యలు విహారంగా వస్తూ ఆనందంతో వీణెలు మీటుతూ నాట్యగానాలు సందడిగా చేయుచుండిరి. ఆ కన్యలు

అమాయికంగా చేసే సవ్వడి, తన తపస్సుకు అంతరాయం కలిగించగా, పులస్త్యుడు విసుగుతో కోపించి, "ఏ తరుణి నా ముందు సంచరించినా, గర్భిణి యగుగాక!" అని శాపమిచ్చాడు. అది విన్న కన్యలందరూ భీతి చెంది, అచటికి రావడం మానుకున్నారు. కాని తృణబిందు డనబడే రాజర్షి కూతురు, ఆ విషయం తెలియకపోవడంవల్ల, వెనుకటివలె ఒకనాడు అచటికి వచ్చి తన స్నేహితురాండ్రు ఎవ్వరూ కానరానందున, వెదకుచు, వేదాధ్యయనం వినబడగా, ఎవరి ధ్వనియోనని ముని సమీపానికి రాగా, ఆమె శరీరమంతయు తెల్లబడి అలసటవంటి గర్భలక్షణాలు కన్పించాయి. అందుకా కన్య కారణం తెలియక దిగులుతో మెల్లగా తండ్రి ఆశ్రమంచేరి నలతతో ఆయనముందు నిలిచి నమస్కరించింది. ఆయన కూతురు లక్షణాలు చూచి, కంపిస్తూ, ఆమెను కారణం ప్రశ్నించాడు. ఆ కుమారి సిగ్గుతో తలవంచి, జరిగినది వివరించింది. అప్పుడు ఆ రాజర్షి ధ్యాన దృష్టితో సర్వం గుర్తించాడు. ఆ వెంటనే ఆయన, ఆ కన్యామణితో పులస్త్యుని సమీపించి, కమ్మని పలుకులతో "పూజ్యుడా, రూప, శీల, వినయ భూషితురాలైన యీ నా కన్యారత్నాన్ని నీ పత్నిగా అంగీకరించి, నన్ను పావనుని చేయు"మని ప్రార్థించగా, మహర్షి అంగీకరించి, ఆమెను వివాహ మాడాడు.

ఆ గుణవతి వినయంతో అగ్నులను కాపాడుతూ, తపస్సమాధిలో నున్న భర్తకు శుశ్రూష చేస్తూ ఆయనకు సంతృప్తి కలిగించింది. ఒకనాడు ఆయన ఉల్లాసంతో "దేవీ, నీ సేవలకు మెచ్చి, మన ఉభయ వంశాలను పావనం చేయగల కుమారుడు నీకు కలుగునట్లు వరం యిస్తున్నాను. నా వేదాధ్యయనం విని అతడు నీ గర్భంలో ప్రవేశించడంవల్ల అతడు విశ్రవసుడను[1] పేరుతో ఖ్యాతి పొందుతాడు" అని పలుకగా ఆ సాధ్వి సంతోషించి, మరికొంత కాలానికి కుమారుణ్ణి ప్రసవించింది. ఆ పౌలస్త్యుడు

---

1. విశ్రవుసు, విశ్రవసుడూ అను రెండూ సమానార్థాలే.

క్రమంగా పెరిగి, విద్యలు నేర్చి, వేదాధ్యయనంచేస్తూ తండ్రివంటి ధర్మ పరాయణుడూ, తపశ్శాలియై ముల్లోకాలకు వ్యాపించే కీర్తి గడించాడు.

## విశ్రవునకు కుబేరుడు జన్మించుట

ఆ విశుద్ధాత్ముని సుగుణాలను విన్న భరద్వాజ మహర్షి సంతోషించి, తన తనయ దేవవర్ణిని ఆయనకు పరిణయం చేశాడు. వారికి బలవంతుడు, సుగుణవంతుడైన కుమారుడు కలిగాడు. తాత పులస్త్యుడు బాలుని జన్మ లగ్న వేళనుబట్టి అతడు దిక్పాలకుడు, ధనపతి కాగలడని గుర్తించి అతనికి వైశ్రవణుడని నామకరణం చేశాడు. అతడు క్రమంగా పెరిగి పెద్దవాడై ధర్మ మొక్కటే శ్రేష్ఠమని తలచి తపోవనంలో దీక్షలు సాగిస్తూ ఆహారం మాని, కొన్నాళ్లు నీరు, కొన్నాళ్లు వాయువు భక్షిస్తూ వెయ్యి సంవత్సరాలు తపస్సు చేశాడు. ఆ ఘోర తపస్సుకు మెచ్చిన పరమేష్ఠి వేల్పులతో అతని ముందు ప్రత్యక్షమై ''వత్సా లెమ్ము. నీ తపస్సుకు ప్రసన్నుడ నయ్యాను, నీ కోర్కె ఏమో తెలుపుము" అని కోరాడు. వైశ్రవణుడు భక్తితో ఆయనకు ప్రణామంచేస్తూ "వాణీ వల్లభా, నాకు దిక్పాల పదవి, ధనాధ్యక్షత ప్రసాదింపుము'' అని వేడుకున్నాడు. విధాత అతణ్ణి ప్రసన్న దృష్టితో చూస్తూ "సువ్రతా, నేను నాలుగు దిక్కులకు అధిపతులను ఏర్పరచు తలపుతో ఇంతవరకు ఇంద్ర, యమ, వరుణులు ముగ్గురనే నియమించుటచే, నీవు ఉత్తర దిక్పాలకుడవు, ధనాధ్యక్షుడవు కమ్ము! అంతేగాక, నీమీద ప్రీతితో దివ్యము, సూర్య సమానమైన పుష్పక విమానాన్ని కూడ నీకు ప్రసాదిస్తున్నాను. దానితో దేవతా సమానుడవై విహరించుము'' అని అనుగ్రహించి అమరులతో తన లోకం చేరాడు.

తరువాత విశ్రవుసు తండ్రివద్దకు పోయి తనకు లోకకర్త యిచ్చిన వరాలను తెలిపి, తన నివాసానికి తగిన ప్రదేశం తెలుపవలసినదిగా ప్రార్థించాడు. అందు కాయన ''కుమారా, పూర్వం విశ్వకర్మ, అసురుల కొరకు దక్షిణ సముద్ర మధ్యంలో త్రికూట పర్వతంపై, చుట్టూ ప్రాకారం,

బురుజులు, ద్వారాలు, యంత్రాలు అమర్చిన వంతెనలూ, బంగారు వైడూర్య తోరణాలతో మనోహరమైన లంక అనే నగరం వున్నది. లోక రక్షకుడైన శ్రీమహా విష్ణువు ఎందరో రాక్షస వీరులను సంహరించుటచే మిగిలిన లంకా వాసులైన దానవులు భీతితో ఆ నగరాన్ని విడిచి పాతాళానికి పోగా, చాలకాలంగా ఆ నగరం రక్షణలేక, నిర్జనంగా వున్నది. కనుక నీవా నగరంలో సుఖంగా నివశించుము'' అని ఆదేశించగా, కుబేరుడు అట్లు లంకలో నివాసం ఏర్పరచుకొని, పుష్పక విమానంలో సూర్యునివలె, తల్లిదండ్రులవద్దకు తరచు వచ్చిపోతూ, వారికి ఆనందం కల్గించుచుండెను.

ఇట్లా మహాత్ముడు అగస్త్యుడు వినిపించిన వృత్తాంతాన్ని విన్న జలజాక్షుడు ఆయనతో ''మహాత్మా, పులస్త్య వంశీకులే రాక్షసులని విన్నాను. కాని తాము, రావణాదులకు ముందు దనుజు లున్నారని తెలుపడంవల్ల వా రేవంశంవారో ఏపాటి పరాక్రమవంతులో, వారు ఏ అపరాధంచేస్తే నారాయణుడు వారిని శిక్షించాడో తెలిసికోవలెనని కుతూహలంగా వుండటంవల్ల, కరుణతో వారి వృత్తాంతం కూడ వినిపించండి'' అని కోరాడు.

## అగస్త్య మహర్షి పూర్వ రాక్షసుల చరిత్ర వినిపించుట

ఆ మహర్షి ఆదరంతో ''రాఘవేంద్రా వినుము. పూర్వం విష్ణు దేవుని నాభికమలంనుండి జన్మించిన విధాత తాను నిద్రించే సమయంలో జలాన్ని రక్షించడంకోసం అనేక జీవుల్ని సృష్టించాడు. ఆ జీవులు ఆకలితో బాధపడుతూ, ఆ లోకకర్తను తమ్మేల పుట్టించినది తామేమి చేయవలసినదీ తెలుపవలసినదిగా కోరాయి. ప్రజాపతి ''నేను సృష్టించిన జలాన్ని రక్షించడమే మీ విధి'' అని పలుకగా, ఆ జీవుల్లో ఆకలి లేనివి "రక్షిస్తా మన''గా, ఆకలితో నున్నవి ''భక్షిస్తామ''ని తెలిపాయి. పరమేష్ఠి

వారితో "మీలో రక్షిస్తా[1]మన్నవారు రాక్షసులు, భక్షిస్తా[2]మన్నవారు యక్షులు అవుతారు" అని ఆదేశించాడు

అట్టి రాక్షసుల్లో హేతి, ప్రహేతి అనబడే సోదరులు, తమకంటె పూర్వీకులైన మధు, కైటభులవంటి అతి శౌర్యవంతులై ప్రసిద్ధులయ్యారు. వారిలో ప్రహేతి ధర్మపరుడై తపస్సు చేయడానికి అరణ్యాలకు పోయాడు. హేతి యముని సోదరి భయను పెండ్లాడగా, ఆమెకు విద్యుత్కేశుడనే కుమారుడు కలిగి, తాను క్రమంగా జలాలవల్ల వృద్ధిపొందే కమలంవలె పెరిగాడు. తండ్రి కుమారునికి వివాహ వయస్సు వచ్చినదని గుర్తించి సంధ్య కూతురు తేజోవతియైన సాలకటంకటను తన కుమారునకు పెండ్లి చేయమని కోరగా ఆమె అంగీకరించి వివాహం చేసింది. ఆ దంపతులు ఇంద్రుడు శచీదేవివలె సౌఖ్యా లనుభవించుచుండిరి.

## సుకేశుని పుట్టుక, వానికి పార్వతీ పరమేశ్వరులు వరాలు ప్రసాదించుట

కొద్దికాలం గడిచాక సముద్ర జలాలతో గర్భం ధరించిన మేఘంవలె సాలకటంకట గర్భిణియై, వెంగలి కావడంవల్ల మందర పర్వత ప్రాంతానికి వెళ్ళి నెలలు నిండని మగ శిశువును ప్రసవించి నిర్దయురాలై విడిచిపెట్టి, భర్తవద్దకు పోయింది. ఇక్కడ ఆమె పాపడు శరత్కాల సూర్యునివంటి కాంతితో, ఆకలికి కుడిచేతి వ్రేళ్ళు నోటిలో పెట్టుకొని ఏడ్చుచుండెను. వాని అదృష్టంవల్ల, ఆ సమయంలో నందివాహనంపై కూర్చుండి తన దేవితో లోకసంచారం చేస్తున్న పరమశివుడు ఆ ప్రాంతంమీద పోవుచుండెను. బాలుని రోదనం విన్న లోకమాత భవాని, నాథుని ప్రేరేపించగా, ఆ కరుణామయుడు, అసుర బాలుడు వెంటనే తల్లి వయస్సు

---

1. తాను "రక్షాను" అన్నవారు రాక్షసులు 2. "భక్షాను" అన్నవారు యక్షులు తొలుతాని బ్రహ్మ ఉద్దేశించాడు.

కలవాడగునట్లూ, మరణం లేకుండునట్లూ వరాలు యిచ్చి, మరియు అతడు ఆకాశంలో సంచరించడానికి విమానాన్ని అనుగ్రహించాడు. కరుణామూర్తి సర్వమంగళ, క్రూరలైన రాక్షస స్త్రీలందరూ అట్టే శిశువులను విసర్జించ వచ్చునని తలచి, వారు గర్భిణులు కాగానే ప్రసవించునట్లూ, ఆ పుట్టిన పాపలకు వెంటనే వయస్సు వచ్చునట్లూ అమోఘాలైన వరాలు ప్రసాదించింది.

శంకరుని వరశక్తితో సుకేశు డనబడే ఆదైత్య బాలుడు పరాక్రమవంతుడై, విమానంలో సంచరించ సాగాడు. అతణ్ణి చూచి సంతోషించిన గ్రామణి అనబడే గంధర్వుడు రూపసి యుక్తవయస్కురాలైన తన కూతురు దేవవతిని అతనికి వివాహం చేశాడు.

## సుకేశునకు మాల్యవంతాది కుమారులు కలుగుట

దేవవతి, తన శక్తి సామర్థ్యాలతో ఐశ్వర్యాన్ని సంపాదించిన భర్తను అనురాగంతో సేవించింది. కొద్ది కాలంలోనే ఆ దంపతులకు ముల్లోకాలూ, మూడు అగ్నులూ, మూడు మంత్రాలూ, శరీరానికి మూడు తత్వాలు (వాత, పిత్త, శ్లేష్మాలు) వంటి మాల్యవంతుడు, సుమాలి, మాలి పేర్లుగల బలవంతులైన కుమారులు కలిగి, ఉపేక్షించిన వ్యాధులవలె వృద్ధిపొంది, యుక్తవయస్కులయ్యారు తమ తండ్రి వరశక్తివల్ల సిరి సంపాదించాడని గ్రహించి, వారు మేరు పర్వత ప్రాంతంలో దీక్షాపరులై, దేవ, దానవ, మానవులకు భీతి కలిగించే విధంగా తీవ్రమైన తపస్సు చేశారు.

వారి దీక్షకు ప్రసన్నుడైన లోకకర్త[1] దేవతలతో ప్రత్యక్షమై వారిని వరాలు కోరమని ఆదేశించాడు. వారు వణకే దేహాలతో ఆయనకు ప్రణమిల్లి "ప్రజాపతీ[2], కరుణతో మాకు దీర్ఘాయుస్సు, ఒకరియందు మరొకరికి అను

1. లోకకర్త, 2. ప్రజాపతి = బ్రహ్మదేవుని నామములు.

గాగం, శత్రువులకు దుర్జేయులమై, వారిని ఓడించే శక్తిని ప్రసాదింపుము'' అని వేడగా, ఆ కరుణామూర్తి "అట్లే అగుగాక!" అని పలికి అంతర్థాన మయ్యాడు. ఆ వరాల శక్తితో వారు నిర్భయులై లోకాలను వేధింప సాగారు. వారు విశ్వకర్మను రప్పించి తమకొక సుందర నగరాన్ని నిర్మించమని కోరారు.

## మాల్యవంతాదులు లంకలో ప్రవేశించుట

అతడు దక్షిణ సముద్ర మధ్యంలో త్రికూట పర్వతంపై నూరామడల పొడవు, ముప్పది ఆమడల వెడల్పు కలిగి బంగారు ప్రాకార, తోరణ, ద్వారాలతో ఇంద్రుని ఆజ్ఞానుసారం మయుడు నిర్మించిన లంక అనబడే నగర మున్నదనీ, దానిని స్వాధీన మొనర్చుకోవచ్చుననీ తెలుపగా ఆ సోద రులు సంతోషంతో అంగీకరించి, వేలకొలది తమ సైన్యాలతో లంకలో ప్రవేశించి, వేల్పులు అమరావతిలోవలె, సుఖంగా నివసించసాగారు. అప్పుడు నర్మద అను గంధర్వమహిళ కీర్తి, ధైర్యం, లక్ష్మివంటి తన ముగ్గురు కూతుళ్ళను ఆ సోదరులకు వివాహాలు చేయగా, వారు భార్యలతో, దేవకన్యలతో సురలవలె సుఖంగా జీవించారు.

కాలక్రమాన మాల్యవంతుని ఇల్లాలు సుందరి సుప్తఘ్న, దుర్ముఖ, ఉన్మత్త, యజ్ఞకోప, వజ్రముష్టి విరూపాక్షులను కొడుకులను అనల అనబడు కూతుదును ప్రసవించింది. సుమాలి పత్ని కేతుమతి అకంపన కాలకార్ముక, సుపార్శ్వ, భాసకర్ణ సంహ్రాది ప్రఘస ప్రహస్త వికట దండ ధూమ్రాక్షు లను కుమారులను పుష్పోత్కట కైకసి కుంభీనసలను కుమార్తెలను కన్నది. మాలి భార్య వసుధకు అనిలుడు, అనలుడు, సంపాతి, హరుడు అను కుమారులు (వీరు నలుగురు విభీషణుని మంత్రులైరి.) కలిగారు, ఈ విధంగా వారి వంశం తామర తంపరంగా వృద్ధిపొందింది.

## అమరులు రుద్రునకు మాల్యవంతాదుల దుష్కార్యాలను వినిపించుట

మాల్యవంతాది సోదరులు పుత్రులు, బలగాలతో లోకాల్లో సుడిగాలి, మృత్యువులవలె నిరాఘాటంగా సంచరిస్తూ ఇంద్రాది దేవతలను యక్షులు ఋషి సమూహాలను బహువిధాల బాధించుచుండిరి. వారి బాధలు భరించలేక, దీనులైన నిర్జర, ఋషి సమూహాలు లోకాధారుడైన పరమశివుని సమీపించి, గద్గద కంఠాలతో అంజలిచేస్తూ "మహాదేవా, బ్రహ్మ వరశక్తి గర్వంతో మాల్యవంతాదులు దుండగులు భూతకోటికి శత్రువులై తామే త్రిమూర్తులమని ఆర్భాటంచేస్తూ మమ్ము స్థానభ్రష్టులనుచేసి, దేవలోక వనాల్లో విహరిస్తున్నారు. ఆర్తత్రాణ పరాయణా, నీవా దుష్టుల్ని దండించి మమ్ము ఆదుకోవాలి'' అని వేడుకున్నారు :

## శంకరుడు దేవతలను మహా విష్ణువును శరణు వేడమని బోధించుట

వారి మొర లాలకించిన మహేశ్వరుడు తాను లోగా సుకేశునకు వరాలు యిచ్చివుండటంవల్ల వారితో "అనిమిష, మునివరుల్లారా, ఆ దానవులు నా భక్తుని సంతతి కావడంవల్ల నేను వారిని చంపను. అందువల్ల లోక రక్షకుడైన నారాయణుని శరణు వేడండి ! ఆ మహాత్ముడు వారిని పరిమార్చ గలడు" అని బోధించాడు. వా రాయనకు ప్రణామంతో జయజయ ధ్వనులు చేసి; మాధవుని సమీపించి ప్రణామాలుచేస్తూ "సర్వభూతరక్షకా, జగన్నాథా, దీనులమైన మా మొరాలింపుము ! సుకేశ తనయులైన మాల్యవంత, సుమాలి, మాలి, అనబడే దైత్యులు అజుని వరప్రభావంవల్ల, త్రేతాగ్నులవలె దుర్జయులు. లంకా నగరవాసులై, దుండగాలుచేస్తూ, మమ్ము నివాసాలనుండి వెళ్ళగొట్టి, మిక్కిలి వేధిస్తున్నారు ! ఆ క్రూరుల్ని హత మార్చడానికి నీవుతప్ప మాకు వేరు రక్షకులు లేరు. దేవాదిదేవా కనుక నీవు మంచును హరియించే మార్తాండునివలె విజృంభించి, బలగాలతో వారిని మట్టుపెట్టి, మమ్మూ, లోకాలనూ రక్షింపుము'' అని వేడుకున్నారు. వారికి

జనార్దనుడు సమాధానంగా "నిలింపులారా, నీరజ గర్భుని పరశక్తితో మాల్యవంతాదులు సాగిస్తున్న దురాగతాలు నేను గమనిస్తూనే వున్నాను. త్వరలోనే వారి కావర మణగిస్తాను. కనుక మీరు భీతి వీడిచి, మీ నివాసాలకు పొండు'' అని ఆదేశించగా, వారు ఆనందంతో ఆయన్ని శ్లాఘిస్తూ, తమ నెలవులకు చేరారు.

## మాల్యవంతుడు సోదరులతో సురలపై యుద్ధానికి బయలుదేరుట

ఆ వార్త తెలుసుకున్న మాల్యవంతుడు తమ్ముల కా విషయం విని పిస్తూ "సోదరులారా, పురుషోత్తముడైన మధుసూదనుడు దుర్జేయుడు! ఆయన చక్రధారియై లోగా ప్రచండ విక్రమంతో హిరణ్యకశ్యప, నముచి, కాలనేమి సంహ్లాది హార్దిక్య శుంభనిశుంభుల్ని, మాయావి రాధేయుణ్ణి యమళార్జునులవంటి ఎందరో సాహసులు రణపండితుల్ని నేలమట్టం చేసియున్నాడు. కనుక మనమా లోకాధ్యక్షునితో పోరుట మంచిదో కాదో నిర్ణయించండి'' అని పలికాడు. అందుకు వారు సమాధానంగా "అన్నా మనం వేదాలు పఠించి, దాన ధర్మాలుచేసి, కొల్లలుగా సిరిసంపద లనుభవించి, చిరకాలం జీవించాము. కనుక యిప్పుడు విజృంభించి మన వైరులైన సురలను ఓడించామంటే ఇక మనకు మృత్యుభయముండదు. దిక్పాలకులు మనతో కయ్యానికి సాహసించరు సుమా! ఇక కేశవు డంటావా, వేల్పులు మొరపెట్టగా, ఆగ్రహించి పలికియుంటాడు. కనుక ఆయన దోషంలేదు. కనుక ఆయన్ని రెచ్చగొట్టిన సురలపై మనం దండెత్తి వారి కావరం అణగిద్దాం'' అని సలహా యిచ్చారు.

మాల్యవంతుడు వారి సలహాను ఆమోదించి, సైన్యాలకు చాటింపు చేయించి, త్వరలో లంకనుండి రథాలు, ఒంటెలు, ఏనుగులు, కంచర గాడిదలవంటి వాహనాలపై, పెద్ద సైన్యంతో దేవతలపై యుద్ధానికి బయలు దేరాడు. నెత్తురువాన కురవడం, నక్కల అరుపులవంటి పెక్కు అపశకునాలు ఎదురయ్యాయి. కాని ధీరులైన మాల్యవంతాదులు, ఆ ఉత్పాతాలను

గుర్తించినా, తాలప్రాణాలకు వశులై, వెనుదీయక, పుత్రస్నేహావేశాలతో సైన్యాలను నడిపిస్తూ, సాగిపోయారు. మాల్యవంత పర్వతానికి సాటియైన మాల్యవంతుణ్ణి, అగ్నిని అనుసరించే మంటలవలె సోదరులు, బలగాలు కేకలు, బొబ్బలతో వెంబడించి అమరావతీ నగరాన్ని ముట్టడించారు.

## మహావిష్ణువు దేవతలకు తోడై, రాక్షసులను కూల్చుట

కమలనాథుడు దూతద్వారా అసురుల ముట్టడి వార్త తెలియగానే బంగారు వస్త్రం, సూర్యకాంతి కలిగిన కవచం, అమ్ములతో నిండిన తూణీర, చాప, ఖడ్గాలు, శంఖ, చక్రాయుధాలు ధరించి పర్వతంవంటి గరుత్మంతుని ఆరోహించి సుర, యక్ష, సిద్ధ కిన్నరులు జయజయ ధ్వనులు చేస్తుండగా, మేరు పర్వతంపై మెరుపుతో కూడిన నీలమేఘంవలె గర్జిస్తూ యుద్ధభూమిని ప్రవేశించాడు.

ఆకాశంలో వాయువేగంతో సంచరించే పక్షిరాజు రెక్కలు సృష్టించే వాయు వేగానికీ, నారాయణుని శరవర్షానికీ రాక్షస సైన్యం దిక్కుతోచక గగ్గోలుపడింది. అయినా వారి వీరుల దేహాలు నెత్తురు కండలతో ఎర్రబడినా, తేరుకొని, పైనపై ముసరే మిడతలదండు వధంగానూ, సముద్రంలో చొరబడే మొసళ్ళవలెనూ, కొండను ఆవరించే మేఘాలవలెనూ, మధు వైరిపై బాణవర్షం కురిపించారు. మరియు రథికులు, ఇతర వాహనాలపై నున్నవారూ, ఆకాశానికి ఎగిరి, చమ శక్తులు, గదలు, ముద్గరలు, రోకళ్ళూ ఆయనపై గుట్టలుగా విసిరి బ్రాహ్మణుడు ప్రాణాయామంతో ఊపిరి బిగబట్టినట్లుగా, ఆయన్ని స్తంభింపచేశారు.

అయితే త్వరలో చేపలచే చలించిన సముద్రంవలె కేశవుడు విజృంభించి తన శార్ఙ్గమనే ధనుస్సు మ్రోగిస్తూ, నిశితాలూ వాయువేగాలైన శస్త్రాలు వెల్లువగా కురిపించి వేలకొలది అసురులను నేలకూల్చాడు. తరువాత పాంచజన్యమనే మహా శంఖం పూరించాడు. ఆ శంఖం యొక్క

భయంకర ధ్వనితో, మావటులతో మత్తగజాలు, రధికులతో రథాలు, రౌతులతో ఒంటెలు, అశ్వాలు, చేష్టలుమాని మూర్ఛిల్లిన పదాతులు, బాణ వర్షంతో తలలు పగిలి, దేహాలు చీలి, వజ్రాయుధంతో నరకబడిన పర్వత శిఖరాలవలె నేలకూలారు. అయినా నారాయణుడు, మరికొందరు రాక్షస వీరులు చేస్తున్న సింహనాదాలను మింగునట్లు, మహా భయంకరంగా హుంకారం చేశాడు.

ఆ రణరంగం సూర్యునినుండి కిరణ సమూహాలూ, పర్వతాలనుండి సర్పాలూ, మేఘాలనుండి వర్షధారలవలె విరిగిపడే పతాకలు, పగిలే రథాలు, నేలకు ఒరిగే గజతురగాలు, తెగిపడే వీరుల తలలు మెడలు, కళేబరాలతో రాక్షస సైన్యాలు బీభత్సంగా నేలపాలయ్యాయి. ప్రాణాలు దక్కించుకొన్న సైనికులు చెల్లాచెదరై దిక్కులకు పరుగెత్తసాగారు. అది చూచిన సుమాలి, ముందుకువచ్చి, సూర్యుని ఆవరించే మంచు విధంగా, తన బాణ పరంపరతో పద్మనాభుని ముంచి సింహగర్జన చేయగా, వెనుకకు మరలిన సైన్యాలు తమ నాయకునిచుట్టూ చేరి, వైరిపై తమ ఆయుధాలు విసిరారు. మాధవుడు రోషభీషణుడై, తీవ్ర బాణాలతో నిశాటుని కిరీట, భూషణాలను, సారథి శిరస్సును కూల్చగా ఆ రథాశ్వాలు బెదరి రథాన్ని ప్రక్కలకు లాగాయి. దానితో చలించే ఇంద్రియాలవల్ల మనస్సు స్తిమితాన్ని కోల్పోయినట్లు సుమాలి స్థైర్యాన్ని కోల్పోయాడు. అది గ్రహించిన మాలి ఆగ్రహంతో లక్ష్మీపతిపై పిడుగులవంటి బాణాలు వేశాడు. క్రౌంచ పర్వత బిలంలో సంచరించే హంసలవలె, ఆ అస్త్రాలు ఒంటిపై నాటినా, చలించని యోగివలె అచ్యుతుడు అచంచలుడై శింజినీ ధ్వనితో దిక్కులు మార్మోగిస్తూ, వజ్ర సమానాలైన అస్త్రాలు అసురుని శరీరంలో నాటగా, అవి పాములు అమృతాన్ని త్రాగునట్లుగా అతని దేహాన్ని రక్తమయం చేశాయి. అతడు నిస్తేజుడయ్యాడు.

అయితే దైత్యాంతకుడు అంతతో విడువక విశిఖాలతో శత్రుని పతాక కిరీటం, చేతనున్న ధనుస్సూ, ముక్కలుచేసి అశ్వాలను నేలమట్టం

చేశాడు అంతట రాక్షస వీరుడు వెంటనే చేత గదతో నేలకుదిగి, ఆ గదతో గరుత్మంతుని తలపై మోదగా, ఆ బాధతో అతడు వెనుకకు తిరిగాడు. అందువల్ల శౌరి పెడమోముగా తిరిగినా, మహాగ్రహంతో, చేతనున్న సూర్య తేజస్సుకలిగి లోకభీకరమైన కాలచక్రంవంటి సుదర్శన చక్రాన్ని అసురునిపై విసరగా, అది పూర్వం రాహువు శిరస్సును ఖండించినట్లు మాలి శిరస్సును ఛేదించి, నేల కూల్చింది. అమరులు ఆనందంతో సింహ నాదాలు చేశారు.

మాలి మరణించడం చూచి, దుఃఖంతో సుమాలి, మాల్యవంతులు, సైన్యాలతో లంకవైపు పరుగులెత్తారు. అయితే అప్పటికి తేరుకొన్న పక్షిరాజు రెక్కలాడిస్తూ విజృంభించగా, మాధవుడు హర్షంతో, పెనుగాలికి ఎండుటాకులవలె, భీతితో అదిరే గుండెలు వ్రేలాడే తలవెంట్రుకలు తడబడే పాదాలతో చెల్లాచెదరుగా పరుగెత్తే అసురులను వెంబడించి తరిమాడు. అది చూచిన మాల్యవంతుడు చెలియలి కట్టను తాకి, వెనుకకు మరలే సాగరం వలె ఆగ్రహావేశంతో కిండ్లెర్రపడగా వెనుకకు తిరిగివచ్చి శ్రీహరిని రూక్షంగా చూస్తూ.

## మాల్యవంతుడు పుండరీకాక్షుని తూలనాడి పోరాడుట

"నారాయణా యుద్ధభూమిలో నిలబడలేక పరుగులెత్తే భీరువులను తరమడం ధర్మ విరుద్ధమనీ, పాపమనీ, ఎరిగిన నీబోటివాడు, పామరులవలె ఆ పని చేయడం తగునా! నీకు యుద్ధమే కావలెనంటే నన్నెదిరించుము! నేనిదే సిద్ధంగా వున్నాను" అని పలికి పర్వతంవలె నిలబడ్డాడు. వైకుంఠుడు సమాధానంగా "ఓయీ మాల్యవంతా, మీ హింసలకు గురియైన సురలు, నన్ను శరణు వేడటంవల్లనూ, వారిని రక్షించడం, నాకు ప్రాణసమాన మైనది కావడంవల్లనూ నేను వారికి అభయమిచ్చి, మిమ్ము సంహరించ తలచాను, కనుక మీరు పాతాళంలో దాగినా మిమ్ము విడువను"! అని పలికాడు. వెంటనే అసురవీరు డాయన గుండెకు గురిచూచి, భీషణమైన

తన శక్తిని విడువగా అది మేఘ మధ్యంలో మెరిసే మెరుపు తీగవలె పోయి ఆయన వక్షానికి నాటింది.

## నారాయణుడు మాల్యవంతుని ఓడించుట

ఆ పురుషోత్తముడు సరభసంగా, ఆ శక్తినే పెరికి మాల్యవంతునిపై విసిరాడు. ఆ శక్తి పర్వతాన్ని చీల్చే వజ్రాయుధంవలె అసుర శ్రేష్ఠుని కవచాన్ని చీల్చి, హృదయంలో నాటగా, అతడు మూర్ఛిల్లాడు. అయినా బలశాలి కావడంవల్ల త్వరలో తేరుకొని, పర్వతంవలె నిలచి, పెక్కు వాడి మేకులతోనున్న తన శూలాయుధాన్ని నారాయణుని రొమ్మున గ్రుచ్చి, తృప్తిలేక గరుడుని పిడికిళ్ళతో పొడిచి, గుద్ది, వెంటనే ఉపాయంతో వెనుకకు నాలుగడుగులు తగ్గాడు. పక్షిరాజు ఆగ్రహంతో తన రెక్కలు విదిలించగా ఆ వాయువేగంతో రాక్షసరాజు నిలువలేక, ఎండుటాకువలె దూరంలో పడ్డాడు. అన్న దుస్థితి చూచిన సుమాలి, భీతితో సైన్యాలను వెనుకకు మరల్చి లంకకు పలాయన మయ్యాడు. ఈ విధంగా మాధవునిచే ఓడించబడిన, మాల్యవంతుడు, సుమాలి మొదలైన సాలకటంకట వంశీయులైన పూర్వ రాక్షసులు, బింకంవీడి, లంక విసర్జించి, పాతాళలోకంచేరి, సుఖంగా జీవించ సాగారు. పురుషోత్తమా నీచే హతులైన రావణాదుల కంటెను, ఈ పూర్వ రాక్షసులు హెచ్చు యుద్ధనిపుణులు, ధైర్యశాలురు, విక్రమవంతులు. (రావణుని తల్లి కైకసి సుమాలి కుమార్తియే.) ఆ దేవ దేవుడు ధర్మ సంస్థాపన, శిష్టరక్షణ, దుష్టశిక్షణలకై అవతారాలు ధరిస్తాడు.

"రఘుపతీ[1], ఆ పురుషోత్తముని దివ్యాంశతో, రావణాది ఖలులను రూపుమాపడానికే, నీవు రఘువంశ జలధిలో, సుధాకరుడవై జన్మించి, ఆ మహత్తర కార్యం నెరవేర్చావు. మహాబాహూ, నీవు కోపడంవల్లనే ఈ

1. రామునికి సంబోధించడంవల్ల రామావతార ప్రాశస్త్యము, రామ చంద్రమూర్తి తత్వము వీరత్వము వెల్లడించబడింది.

పూర్వ రాక్షసుల చరిత్ర వినిపించాను. ఇక తిరిగి రావణ వంశ చరిత్ర, ఆ వీరుల బల విక్రమాలు వినిపిస్తాను. ఆలకించుము. సుమాలి అప్పటి నుంటి భూమిపై మొగం చూపక తనవారితో పాతాళ లోకంలోనే చిరకాలం సుఖంగా నివసించాడు. అదే విధంగా కుబేరుడు తానాక్రమించుకొన్న లంకలో చిరకాలం సుఖంగా జీవించాడు.

## సుమాలి తన కుమారితో భూలోకానికి వచ్చుట

రాక్షసపతి సుమాలి ఒకనాడు, తేజోవతి, లక్ష్మీదేవివంటి రూపసి యైన కూతురును వెంటబెట్టుకొని భూలోకానికి వచ్చి, ఆమెకు తగిన వరుని వెతకుచుండెను. ఆ సమయాన పుష్పక విమానంలో దివాకరునివలె ప్రకాశిస్తూ, తల్లిదండ్రులకు మ్రొక్కి, తన నివాసానికి పోవుచున్న వైశ్రవుణ్ణి వారు చూచారు. తరువాత అతడు కూతురుతో తిరిగి పాతాళలోకం చేరాడు. బుద్ధిశాలియైన అతడు, పతనమైన తన వంశాన్ని తిరిగి వృద్ధిచేయుట ఎట్లా అని తీవ్రంగా యోచించి ఒక నిశ్చయానికి వచ్చాడు.

## సుమాలి తన కుమారి కైకసిని విశ్రవుని వరించడానికి పంపుట

ఒకనాడు అతడు, కుమారిని చేరపిలిచి ఆమెతో "బిడ్డా, నీవు సాక్షాత్తు లక్ష్మీదేవివంటి సౌందర్యం, సుగుణాలు కలిగి, వివాహ యుక్తమైన వయస్సుకు చేరడంవల్ల, నీకు తగిన వరుని వెతకడానికి శ్రమపడు తున్నానమ్మా! నేను అంగీకరించనేమోననే భయంతో, మన చుట్టాలెవరూ నిన్ను కోరడానికి ముందుకు రావటంలేదు. అభిమానవంతుడైన ఏ వ్యక్తియైనా ఆడుబిడ్డ తండ్రియైతే, ఆ కన్య పుట్టినప్పటినుండీ ఆమెకు తగిన వరుని ఎట్లు సంపాదింతునా అని చింతాక్రాంతుడౌతాడు. అంతేగాక ఆమె శీలానికి ఎట్టి మచ్చ కలుగునో అని కన్య తల్లిదండ్రుల వంశాలవారు, భర్త వంశం వారూ సందేహగ్రస్తులై యుంటారు. తల్లీ, కనుక నీవు బ్రహ్మదేవుని మనుమడూ, చిరతపస్వి, మహాత్ముడైన విశ్రవణుని స్వయంగానే సమీపించి

ఆయన పత్నివి కాగలిగావంటే, ఆయన అనుగ్రహంతో మనం చూచిన కుబేరునివంటి తేజోవంతులైన పుత్రులకు తల్లివి కాగలవు. కనుక యిందు నిమిత్తం ఉత్సాహంతో వెంటనే బయలుదేరుము" అని బోధించాడు. ఆ కన్యారత్నం తండ్రి మాటయందు గల గౌరవంతో మారుమాటాడక తక్షణం బయలుదేరి, విశ్రవుని ఆశ్రమ ప్రాంతంచేరి, వికసించిన తన ముఖ శోభతో ఆ ప్రాంతాన్ని శోభింపచేస్తూ వినయంగా ఆ సంయమిని సమీపించింది. అప్పుడు సంధ్యవేళ చేయవలసిన హోమం జరిపి, అక్కడి మూడగ్నులతో బాటు, నాల్గవ అగ్నివలె భాసిస్తున్న మహర్షిని చూచి అది సంధ్యాకాల మగుటచే నిషిద్ధమని గుర్తించక ఆ జవ్వని ఆయనవంక అనురాగ దృష్టితో చూచి సిగ్గుతో తలవాల్చి, కాలి బొటన వ్రేలితో నేలపై గీస్తూ, భూమివంక చూడసాగింది.

పున్నమ జాబిల్లివంటి ముఖం, కలువలవంటి కన్నులు, సింహ మధ్యంవంటి సన్నని నడుముకలిగి ఎదుట నిలచిన ఆ కన్యామణిని తిల కించిన ఆ కులపతి[1] ఆమెతో "శుభశీలా, నీవు ఎవరి కుమారివి? ఇచ్చటికి ఏల వచ్చావు?" అని ప్రశ్నించాడు. ఆ ముగ్ధ ఆయనకు చేతులు జోడించి నమస్కరిస్తూ "బ్రహ్మర్షీ, నా తండ్రియైన సుమాలి ఆదేశంతో కైకసి అనబడే కన్యను మీ సన్నిధికి వచ్చాను. నా మనస్సులోని కోర్కెను లజ్జతో పలుకలేను. మీ దివ్య చిత్తంతో పరిశీలించండి" అని విన్నవించింది.

ఆ మహర్షి ధ్యాననిష్ఠతో ఆమె అంతర్యాన్ని గ్రహించి "జవ్వనీ, నీవు సంతాన వాంఛతో సమీపించావని గ్రహించాను. కాని ఇది క్రూరమైన సంధ్యాకాలమని గ్రహించలేకపోతివి. అందువల్ల నీకు క్రూరులు, విక్రమ వంతులైన ఇద్దరు రాక్షసవీరులు సజ్జనులను హింసించి, భూమండలానికి భారవహులైన కుమారులుగా కలుగుతారు" అని పలికాడు. అందుకా యోగ్యురాలు కంపిస్తూ "బ్రహ్మ మునీంద్రా, నన్ను మన్నించండి. నీవంటి

1. కులపతి - పదివేలమంది శిష్యులకు అన్నంపెట్టి విద్యనేర్పు గురువు.

మహనీయునికి తగిన పుత్రులనేగాని, క్రూరులు, దురాచారులైన కుమారులను నేను భరించలేను'' అని విన్నవించింది. అందుకాయన "గుణవతీ, నీవు కోరిన విధంగా నీ మూడవ కుమారుడు నిస్సంశయంగా నావంటి ధర్మపరాయణుడు కాగలడు'' అని పలుకగా ఆమె అంగీకరించి, ఆయనతో నివసించింది.

## రావణ, కుంభకర్ణ, విభీషణులు పుట్టుట

కొంతకాలం గడచాక, ఆమెకు నిడుపాటి కోరలు, పది తలలు, ఇరువది చేతులు, నల్లని భీకర రూపంగల క్రూరుడైన కుమారుడు జన్మించాడు. ఆ సమయంలో మేఘాలు భీకర ధ్వనులతో నెత్తురు వర్షం కురిశాయి. భూమి వణకింది. సూర్యుని కాంతి తేజస్సు మాసింది. బ్రహ్మ సమానుడు తేజస్వియైన విశ్రవుడు వచ్చి ఆ బాలుని చూచి, అతనికిగల శిరస్సులను బట్టి, వానికి దశకంఠుడని నామకరణం చేశాడు. మరికొంత కాలానికి, ఇంత పరిమాణమని చెప్ప వీలులేని భీకర రూపంగల కుంభకర్ణుడను కుమారుడు క్రూర, కుటిల బుద్ధులు కలది, కురూపియైన శూర్పణఖ అనబడే కూతురు కలిగారు. తరువాత తల్లికి సంతోషం కల్గిస్తూ ధర్మాత్ముడైన విభీషణు డనబడే చివరి కుమారుడు పుట్టాడు. ఆ శుభ సమయంలో వేల్పులు దుందుభులు మ్రోగించి, పూలవాన కురిపించారు. మింటనున్న సిద్ధగణాలు మేలు మేలని పలికారు. ఆ సోదరులు, సోదరి తండ్రి ఆశ్రమంలో పెరుగసాగారు. రావణ కుంభకర్ణులు క్రూరులై, లోకులను హింసించుచుండిరి. విశేషించి కుంభకర్ణుడు, లోకులకు బాధలు కలిగించటమేకాక, తాపసుల్ని చంపితింటూ తృప్తిపడేవాడు. ఇక యోగ్యుడైన విభీషణుడు, వేదాలు పఠిస్తూ జితేంద్రియుడై, ధర్మ పరాయణుడని ఖ్యాతిపొందాడు.

ఇట్లు జరుగుచుండగా ఒకనాడు కుబేరుడు విమానంలో తండ్రి దర్శనానికి వచ్చి, వైభవంతో తిరిగి పోతుండగా, కైకసి రావణునికి అతణ్ణి చూపుతూ "కుమారా, నీ సవతితల్లి కుమారుడైన, మీ అన్న ఎంత వైభవంతో

ఉన్నాడో చూశావా? ఆ విధంగానే నీవూ, నీ సోదరులూ అంతవారై, నా కన్నులకు "ఆనందం కలిగించాలి సుమా'' అని పలికింది.

ఆ మాటలకు అతడు అసూయతో ''అమ్మా నీవు దిగులుపడకుము! నేను అతనికంటె హెచ్చు వైభవాన్ని లేక కనీసం అతనితో సమానమైన స్థితినీ పొందగలనని ప్రమాణం చేస్తున్నానమ్మా! అందుకోసం, నే నిప్పుడే తమ్ములతో తపస్సు చేయడానికి బయలుదేరుచున్నాను అని సమాధానం పలికాడు. ఆ ప్రకారం అతడు తమ్ములతో గోకర్ణ క్షేత్రంలో, బ్రహ్మను గూర్చి ఘోర తపస్సుచేసి, కోరిన వరాలు పొందాడు" అని అగస్త్య మహర్షి శ్రీరామునకు వినిపించాడు.

## రాఘవుడు రావణాదుల తపస్సును గూర్చి ప్రశ్నించుట

అంతట కౌసల్యా నందనుడు ఆయనతో ''మహర్షివర్యా, రావణుడు సోదరులతో ఏ విధం తపోనిష్ఠ సాగించాడో వివరంగా తెలుపండి'' అని ప్రార్థించాడు. ఆ మహర్షి ''సీతారమణా ఆలకించుము. రావణ సోదరుడైన కుంభకర్ణుడు నియమంగా, వేసవిలో పంచాగ్ని మధ్యంలోనూ, శీతకాలంలో నీటి మధ్యనూ నిలిచీ, వర్షకాలంలో వానలో వీరాసనంతో కూర్చుండీ పది వేల సంవత్సరాలు కఠోరమైన తపస్సు సాగించాడు. కడపటి తమ్ముడైన విభీషణుడు ఒంటికాలిపై నిలిచి అయిదువేల ఏండ్లూ, తరవాత దృఢమైన మనస్సుతో బాహువులూ తలా పైకెత్తి దివాకరునిచూస్తూ, వేదాధ్యయన పరుడై నందన వనంలో అమరునివలె, మరొక అయిదువేల ఏండ్లూ దీక్ష సాగించాడు. ఆ దీక్షావంతునిపై పుష్పవర్షం కురిసింది.

అట్లే దశకంఠుడు ఆహారం మాని వెయ్యేసి ఏండ్లు తపస్సు ముగియగానే, తన ఒక్కొక్క తలను నరికి అగ్నిలో హుతంచేస్తూ, ఆ ప్రకారం ౯ తలలు హోమంచేసి, పదవ వెయ్యి సంవత్సరాలు ముగియగానే తన పదవ తలను నరకడానికి సిద్ధపడ్డాడు. ఆ కఠోర దీక్షకు లోకాలు క్షోభించగా వేల్పులతో పరమేష్ఠి ప్రసన్నుడై వచ్చి ''వత్సా దశగ్రీవా, నీ

దీక్ష నాకు అమిత హర్షం కల్గించింది। కనుక నీ కోరిక ఏమో తెలుపుము" అని కోరాడు

## బ్రహ్మదేవుడు సోదరులతో రావణునకు వరాలు ఇచ్చుట

ఆ వాక్కులు విన్న దశకంఠుడు పరమానంద భరితుడై ఆయనకు శిరస్సుతో ప్రణామంచేసి, దగ్గద కంఠంతో "దయానిధీ, దేహికి నిత్యం మృత్యువుతో సమానమైన శత్రువూ, అంతకు మించిన భయమూ లేవుగదా। అందువల్ల నాకు అమరత్వం ప్రసాదించండి'' అని వేడాడు. అందుకు పద్మాసనుడు ''వత్సా. అమరత్వం ఎవ్వరికీ యివ్వతగనిది. కనుక వేరు వరం కోరుము" అని పలికాడు. రాక్షస శ్రేష్ఠుడు ఆయనకు తిరుగ చేతులు జోడిస్తూ "లోకనాయకా, అట్లయినచో, దేవ, నాగ, యక్ష, గంధర్వులు, దైత్య దానవ రాక్షసులవల్లా నేను మరణించకుండా వరం అనుగ్రహించుము. ఇక మానవులు, వారికంటె అల్ప ప్రాణుల్నీ నేను గడ్డిపోచలుగా చూస్తాను" అని విన్నవించాడు. పితామహుడు వాత్సల్యంతో అట్లు వరమిచ్చి, అంతటితో తృప్తిపడక, "వత్సా నీ మీది అనుగ్రహంతో, నీవు తపస్సులో హోమంచేసిన తొమ్మిది శిరస్సులు నీకు ప్రసాదించడమేగాక, నీవు కోరిన రూపం ధరించే శక్తినికూడ యిస్తున్నాను'' అని పలుకుచుండగనే, అందరికీ ఆశ్చర్యం కలిగిస్తూ అతనికి ఆ తలలు తిరిగి వచ్చాయి.

పిమ్మట విధాత విభీషణుని సమీపించి ''సువ్రతుడా, నీవు ధర్మబుద్ధితో సాగించిన తపోదీక్షకు ప్రసన్నుడ నయ్యాను। నీ కేవరం కావలెనో తెలుపుము" అని కోరాడు. అసురోత్తముడు భక్తితో చేతులు జోడించి "భగవాన్, లోకగురుడవైన నీవు ప్రసన్నుడవైనట్లు తెలుపడంకంటె నాకు శ్రేయస్సు వేరేముంటుంది? అయినా నీవు అనుగ్రహించ దలచినచో, నేను ఎంతటి విపత్తులోనున్నా నా మనస్సు ధర్మంనుండి తొలగకుండునట్లూ, నేను ఎవరినుండీ వుపదేశం పొందకుండానే నాకు [illegible] లభించునట్లూ వరం ప్రసాదించుము। అంతేగాక నేను [illegible]

CENTRAL LIBRARY

బుద్ధి ధర్మమందు స్థిరమై యుండునట్లు అనుగ్రహింపుము। ధర్మ పరాయణునకు దుర్లభమేమీ వుండదుగకుక ఉదారాలైన ఈ వరాలు కటాక్షింపుము" అని ప్రార్థించాడు. ప్రజాపతి అతణ్ణి తిరిగి మెచ్చుకుంటూ "వత్సా నీవు కోరిన వరాలు యిస్తున్నాను। నీవు రాక్షసీ గర్భంలో పుట్టినా నీ బుద్ధికి అధర్మమందు అసక్తి లేనందున, నీకు దుర్లభమైన అమరత్వం ప్రసాదిస్తున్నాను'' అని పలికాడు.

తరువాత ఆయన కుంభకర్ణుని సమీపిస్తుండగా, వేల్పు లాయనతో "భగవాన్, ఈ కుంభకర్ణుడు అతి పరాక్రమవంతుడు, దేవ విరోధియై, సహజశక్తితోనే యింతవరకు ఏడుగురు అప్సరలను మింగుచేగాక, ఇంద్ర సేవకులు పదిమందినీ, మరెందరో ఋషుల్ని, మానవుల్ని చంపి తిన్నాడు. ఇక వీనికి నీ వరశక్తి లభిస్తే ఇతడు విశ్వాన్ని మింగకుంటాడా? కనుక యితనికి లోక శ్రేయస్సుకొరకు నిద్ర ప్రసాదించండి" అని విన్నవించారు. ఆయన వెంటనే తన ఇల్లాలు వాగ్దేవిని స్మరించగా ఆమె వెంటనే అంజలితో ఎదుట నిలిచింది. ఆయన ఆమెతో "దేవీ, కుంభకర్ణుడు నన్ను వరం కోరబోయే సమయంలో నీ వతని వాక్కులోకుండి, ఈ దేవతల కోర్కె తీర్పుము'' అని ఆదేశించగా, భారతీదేవి వెంటనే కుంభకర్ణుని నోట ప్రవేశించింది.

లోకపితామహుడు కుంభకర్ణుని ఎదుట నిలిచి "వీరుడా నీ కోరిక ఏమో తెలుపుము" అనగా అతడు "దేవదేవా, నాకు నిద్రాత్వం[1] అనుగ్రహించుము'' అని వేడాడు. వేదమూర్తి "అట్లే అగుగాక" అని పలికి, అసురుని నోటనుండి బయటకు వచ్చిన సరస్వతీదేవి, నిర్జనులతో నిష్క్రమించాడు. తరువాత కుంభకర్ణుడు తానేమి పలికినదీ తలచుకొని "అయ్యో ఎంతపని జరిగినది। నేను ఇట్లెందుకు కోరాను? కుత్సితులైన సురులు నాకు భ్రాంతి కలిగించి యిట్లు పలికించి యుండాలి!" అని అనేక విధాల

1. నిత్యత్వం అడగబోయి భ్రాంతిలో నిద్రాత్వం కోరాడు.

పరితపించాడు. ఆ సోదరులీ విధంగా బ్రహ్మవల్ల వరాలుపొంది, తమ తండ్రి తపోవనానికి పోయి, అక్కడ తమ యిష్టానుసారంగా సంచరించ సాగారు.

## సుమాలి మనుమల్ని చూడటానికి భూలోకానికి వచ్చుట

కైకసి తండ్రియైన సుమాలి తన మనుమలు తపశ్శక్తితో బ్రహ్మదేవుని నుండి వరాలు పొందారని తెలుసుకొని, నిర్భయంగా ప్రహస్త, మారీచ, మహోదర, విరూపాక్షులనబడే మంత్రులతో భూలోకానికివచ్చి ఆనందంతో రావణుణ్ణి కౌగలించుకొని "చిరంజీవీ, నీవు సృష్టికర్తవల్ల, అమోఘాలైన వరాలు పొందడంవల్ల నా చిరకాల వాంఛ నెరవేరిందయ్యా! జగన్నాయకుడైన నారాయణునివల్ల మేము ఓడించబడి, ఆయన భయంవల్లనే, కుటుంబాలతో లంకానగరాన్ని వదలిపెట్టి, పాతాళలోకంలో నివసిస్తూ, అనేక బాధలు పడుచున్నాము! వంశభూషణా, ఈనాడా లంకా పట్టణాన్ని నీ సవతితల్లి కుమారుడైన కుబేరుడు, రాజధానిగా చేసికొని సుఖిస్తున్నాడు సుమా! ఆ నగరం మనదే గనుక నీవు సామదానాది ఉపాయాలతో అతని నుండి లంకను సాధించి, కష్టాల్లోనున్న రాక్షసజాతిని వుద్ధరించి మహారాజువై ఖ్యాతితో పాలించాలని కోరుతున్నాము" అని బోధించాడు.

రావణుడు సమాధానంగా "తాతా నా అన్నయైన కుబేరుడు నాకు తండ్రి వంటి పూజనీయుడు కదా! అందువల్ల నే నాయననుండి, లంకను బలాత్కారంగా తీసికోవడం, న్యాయమా?" అని అడుగగా, సుమాలి సమాధానం చెప్పలేకపోయాడు. కాని ఆయన మంత్రుల్లో ప్రహస్తుడు జోక్యం కలిగించుకొని వీరాగ్రణీ, శూరులు అన్నదమ్ముల మర్యాదలు పాటించ నక్కరలేదు. ప్రజాపతియైన కశ్యపమహర్షికి, అక్క, చెల్లెలు అయిన అదితి, దితి అనబడే సాధ్వులు భార్యలైరి. వారిలో అదితి భువనాలు పాలించే దేవతలను, దితి పర్వతాలు, వనాలతోనున్న భూమండ

లాన్ని శాసించే అసురులను ప్రసవించారు. లోకనాయకుడైన నారాయణుడు సురలమీది పక్షపాతంతో, తన ప్రచండ చక్రాయుధంతో, ఎందరో అసుర వీరుల్ని హతమార్చి, ముల్లోకాలనూ, దేవతలకు అప్పగించాడు. అట్టి వీరులైన రాక్షసుల వంశంలో మహావీరులైన నీవూ, నీ సోదరులూ జన్మించారు సుమా! మహాబాహూ, వేల్పులు - పాటించని సోదర ధర్మాన్ని, నీవేల మన్నించాలో యోచించుము" అని బోధించాడు.

## రావణుడు ప్రహస్తుని కుబేరుని వద్దకు దూతగా పంపుట

ప్రహస్తుని మాటలువిన్న దశకంఠుడు కొంతసేపు యోచించి అతని సలహా ప్రకారం చేయడానికి నిశ్చయించి ఆరోజే పరివారంతో ఉల్లాసంగా లంకానగర సమీపంలోని త్రికూట పర్వతవనాల్లో ప్రవేశించాడు. అక్కడ నుండి మాటకారియైన ప్రహస్తునికి తన సందేశం తెలిపి, కుబేరుని వద్దకు దూతగా పంపాడు. ఆ ప్రకారం అతడు, లంకలో కుబేరునీ సమీపించి ఆయనతో "మహాత్మా, నీ సోదరుడైన రావణుడు నన్ను దూతగాపంపి ఆదరంతో నీకు వినిపించమన్న సందేశం ఆలకించుము. మహారాజా, పూర్వం ఈ లంక నా మాతామహులైన మాల్యవంత, సుమాలి, మాలి అనబడే రాక్షసోత్తముల సొత్తుకావడంవల్ల వారి మనుమడనైన, నాకు అప్పగించుమని నిన్ను వేడుచున్నాను అని తెలిపాడని వినిపించాడు. అందుకు ఉదారుడైన కుబేరుడు సమాధానంగా "వీరుడా, దైత్యులు వదలి పెట్టి, నిర్జనంగా వున్న లంకను, నేను తండ్రి అనుమతితోనే నివాసం చేసుకొని పాలిస్తున్నాను. నీవు నా సోదరుణ్ణి త్వరలో వచ్చి ఈ నగర, రాజ్యాల్ని, యిక్కడి సంపదలతో సహా స్వాధీనం చేసికొని, సుఖంగా పాలించుమని తెలుపుము" అని పలికాడు.

ఆ వెంటనే ఆయన తండ్రిని సమీపించి, అంజలిచేసి, రావణుని రాయబారం, తన సమాధానం, వినిపించి, తన నివాసానికి తగిన ప్రదేశం తెలుపవలసినదిగా వేడుకున్నాడు. ఆ బ్రహ్మర్షి ఆదరంతో "కుమారా

ఈ విషయాన్ని దశకంఠుడు, లోగా నాతో చాలసార్లు ప్రస్తావించగా, తగదని నేను మందలించాను. అయితే ధర్మయుక్తాలైన నా మాటల్ని అతడు ఎన్నోమార్లు ధిక్కరించాడు. తాను ఇటీవల సాధించిన వరాలతో అతడు మరింత కరకుతనంతో పెద్దల్ని, ఉచితానుచితాల్ని లక్ష్యపెట్టడం లేదు. కనుక నీవా దుష్టునితో విరోధపడక, నీవారితో లంకను వదలి, పర్వతరాజమైన కైలాసగిరి యందు సూర్యతేజస్సుగల బంగారు పద్మాలకు నిలయమైన, ప్రఖ్యాత మందాకినీ పరివాహ ప్రదేశంలో ఎన్నో పరిమళాలు వెదజల్లే పుష్పవనాలతో దేవ, గంధర్వ కిన్నరులు విహరించే మనోజ్ఞ ప్రదేశంలో నీ నివాసమేర్పరచుకొని సుఖించుము'' అని బోధించాడు.

కుబేరుడు తండ్రి మాటలయందు గౌరవంతో, వెంటనే భార్యా పుత్రులు, మంత్రులు, బంధువులు వాహనాలు, ధనాలతో, లంకను వదలి, కైలాస ప్రాంతానికిచేరి అక్కడ అలకాపురి నిర్మించుకొని సుఖంగా నివశించాడు.

## రావణుడు బలగాలతో లంకలో ప్రవేశించుట

ప్రహస్తుడావార్తను తెలుపగా, దశగ్రీవుడు సంతోషించి, సోదరులు, బలగాలతో లంకానగరంచేరి, అక్కడ రాక్షసులందరికీ రాజుగా పట్టాభి షిక్తుడై, ఇంద్రుడు అమరావతినివలె పాలించసాగాడు. అక్కడ అతడు చెల్లెలు శూర్పణఖను, కాలకేయులవంశీకుడైన విద్యుజ్జిహ్వుడను వీరునకు వివాహం చేశాడు.

## మయుడు రావణునకు మండోదరి వృత్తాంతం తెలుపుట

అతడు ఒకనాడు వేటకుపోయి ఒక పురుషుడు సుందరియైన కన్యను వెంటబెట్టుకొని వస్తుండగా చూచి ఆయనతో వినయంగా "అయ్యా నిర్జనమైన ఈ వనంలో తిరుగుచున్న మీ రెవ్వరని" ప్రశ్నించాడు. అతడు సమాధానంగా "నాయనా నేను మయుడను రాక్షస రాజను. నాకు దేవతలు,

ఇంద్రునకు శచీదేవినివలె, హేమ అను అప్సరను భార్యగా యివ్వగా, నేనామె కొరకు బంగారు, వజ్ర వైడూర్యాలు కొల్లలుగా కలిగిన సుందర మైన పట్టణాన్ని నా మాయాశక్తితో నిర్మించి, ఆమెతో చాలకాలం సుఖంగా జీవించాను.

"పధ్నాలుగు సంవత్సరాల క్రితం నా హేమ దేవకార్యం నిమిత్తం, స్వర్గలోకానికిపోయి తిరిగి రాకపోవడంతో నేనామె వియోగాన్ని భరించ లేక, నా పట్టణాన్ని వదలిపెట్టి నా ముద్దుల కూతురైన ఈ మండోదరికి తగిన వరుని వెదకుచు తిరుగుచున్నాను. నాకు ఈమెగాక మాయావి, దుందుభి అను యిద్దరు కుమారులున్నారు. నాయనా, ఇక రాజ లక్షణాలు కలిగి, వీరుడవైన నీవెవ్వడవో, ఏ వంశంవాడవో, తెలుపుము" అని అడిగాడు.

## మయుడు మండోదరిని రావణునకు వివాహం చేయుట

దశగ్రీవుడు వినయంతో సమాధానంగా "అయ్యా నేను బ్రహ్మదేవుని మనుమడైన పౌలస్త్య మహర్షి కుమారుణ్ణి నన్ను దశగ్రీవు డంటారు" అని తెలిపాడు. ఆ మాటలు విన్న మయుడు, అతడు మహర్షి కుమారుడు కావడంవల్ల అతనికి తన కుమారిని యివ్వడానికి సంతోషించి, అతని చేతిని తన చేతిలో పెట్టుకొని "రాక్షసరాజా, హేమకు నాకు ముద్దుల కూతురైన, ఈ కన్యా రత్నాన్ని నీ పత్నిగా స్వీకరించుము" అని కోరగా, అతడు సమ్మతించి, అగ్ని సన్నిధిలో ఆమెను పరిణయ మాడాడు. మయుడు తన తపశ్శక్తితో సంపాదించిన అమోఘమైన శక్తిని అల్లునికి కానుకగా యిచ్చాడు. (రావణుడు లక్ష్మణునిపై ప్రయోగించిన దివ్యశక్తి యిదే.)

## రావణుని సోదరులకు వివాహాలు చేయుట

దశకంఠుడు భార్యతో లంక ప్రవేశించి, తమ్ములకు వివాహాలు చేయతలచి, వైరోచనుని మనుమరాలైన వజ్రజ్వాల అను పేరుగల

కన్యను, కుంభకర్ణునకు, గంధర్వ ముఖ్యుడైన శైలూషుని కూతురు, ధర్మ పరాయణ అయిన సరమ అనబడే సుశీలను విభీషణునకు పత్నులుగా పెండ్లిచేశాడు. (సరమ బాల్యంలో మానస సరోవర ప్రాంతంలో తిరుగుచుండేది. వర్షాకాలంలో ఒకనాడామె అట్లు తిరిగే సమయంలో వర్ష జలాలతో సరస్సు పెరగడం చూచి ఆమె తల్లి భయపడి బిగ్గరగా "సరోమా వర్ధయ (బిడ్డా! సరస్సు పొంగుతోంది) త్వరగా రమ్మ" అని పిలవడంతో ఆమెకు సరమ అనే పేరు వచ్చింది. ఇట్లు వివాహితులైన ఆ సోదరులు, తమ సతులతో, నందనవనంలో గంధర్వులవలె సుఖించారు.

ఇట్లు కొంతకాలం గడవగా, మండోదరి పుత్రుణ్ణి ప్రసవించింది. ఆ పాపడు, పుట్టిన వెంటనే లంకానగరమంతా వినపడునట్లు మేఘం గంభీర ధ్వనితో రోదనం చేయగా తండ్రి సంతోషంతో అతనికి మేఘనాధుడని పేరు పెట్టాడు. రాఘవా అతడే, తరువాత మీ రెరిగిన ఇంద్రజిత్తు బిరుదుతో ఖ్యాతి పొందాడు. ఆ శిశువు క్రమంగా, సమిధలతో ప్రజ్వరిల్లే అగ్ని విధంగా, పోషణతో పెరిగి, తల్లిదండ్రులకు సంతోషం కల్గిస్తూ పెద్దవాడయ్యాడు.

కుంభకర్ణుడు విధాత వర ప్రభావంవల్ల గాఢమైన నిద్ర తన్ను ఆవరించగా, అన్నను, తనకు సుఖంగా నిద్రించడానికి తగిన భవనం నిర్మించవలెనని కోరాడు. రాక్షసరాజు అందుకొరకు పనివారిని నియమించగా వారు, విశ్వకర్మ మేరుపర్వత గుహను నిర్మించినట్లు చాల పొడుగు, వెడల్పు, వైశాల్యంతో స్ఫటికం, బంగారు స్తంభాలు, కిటికీలు, తోరణాలతో మహా భవనం నిర్మించారు. కుంభకర్ణుడు అచట చాల సంవత్సరాలు హాయిగా నిద్రించాడు.

## రావణుడు నిరంకుశుడై లోకాలను బాధించుట

రావణుడు తన్ను ఎదిరించగలవారు లేరని క్రూరుడై దేవ యక్ష కిన్నరులను, మునులను హింసించడం, బంధించడం, చంపడం, పరస్త్రీలను

అపహరించి చెరపెట్టడం వంటి పాపకార్యాలు నిత్యకృత్యాలుగా చేయ సాగాడు. అంతేగాక కాన్పించే నందనోద్యానంవంటి వనాలను, తోపులను గాలి దుమారంవలె ధ్వంసం చేయడం, కొండలు, గుట్టలను వజ్రాయుధం వలె పిండికొట్టి నేలమట్టం చేయడం నదులు కానవస్తే, వాని గట్లు తెగునట్లు అల్లకల్లోలం చేయడం సాగించాడు.

## కుబేరుడు రావణునకు హితవు చెప్పడానికి దూతను పంపుట

ఈ వార్తలు విన్న కుబేరుడు, రావణుడు తనకు సోదరుడు కావడం వల్ల అతనికి నీతి బోధించడం తన ధర్మమని తలచి, ఒకనాడు తన సందేశంతో దూతను రావణుని వద్దకు పంపాడు. ఆ దూత లంక చేరి, ముందు ధర్మాత్ముడైన విభీషణుని కలసి, తాను వచ్చినపని తెలుపగా, ఆయన అతణ్ణి రావణునకు పరిచయం చేశాడు.

ఆ దూత రావణునకు వినయంతో నమస్కరించి, "రాజా నన్ను మీ అన్నయైన కుబేరుడు, మీ తల్లిదండ్రుల శీలసంపద, మీ వంశ గౌరవం మీది దృష్టితో మీకు యిట్లు తెలుపుమని నన్ను పంపియున్నారు. "తమ్ముడా, ఇంతవరకు నీవు దుడుకుతనంతో సాగించిన పనులు చాలించి, ధర్మమార్గం అనుసరించుము! ఎంతో కాలంగా శ్రద్ధతో పెంచబడిన ఇంద్రుని నంద నోద్యానవనం, నీ వెట్లు ధ్వంసం చేశావో స్వయంగా చూచి, ఖిన్నుడ నయ్యాను. అంతేగాక దేవ, ఋషిగణాలకు నీవు చేసిన ఎన్నో బాధల గాధలు విని దుఃఖించాను! నాయనా, పూజ్యవంశంలో పుట్టి, తపశ్శాలివైన నీ కిట్టి లోకవిరుద్ధపు పనులు చేయడం తగునా? నన్ను నీవు చాలసార్లు తృణీకరించడం గుర్తించినా, చిన్నవాని దుడుకుపనులు, పెద్దవారు సహించడం సబబని ఉపేక్షించాను సుమా!

"ఇటీవల నేను హిమాలయాల్లో తపస్సు చేయబోయి, అందు వ్రత దీక్షలోనున్న శంకరుని, తేజోమయియైన ఉమాదేవిని దర్శించాను. అంబ

నన్ను తీవ్ర దృష్టితో చూడటంవల్ల, ధూళికప్పిన అగ్ని కాంతివలె నా కుడి కన్ను దృష్టి తొలగింది. వెంటనే నేను మరొక శిఖరం చేరి పరమేశ్వరుని గూర్చి నూట ఎనిమిది సంవత్సరాలు దీక్షతో వ్రతం చేశాను. అంతట పరమశివుడు నాకు కరుణతో దర్శనమిచ్చి ప్రసన్న దృష్టితో చూస్తూ "సువ్రతుడా, నేను సృష్టించిన ఈ వ్రతాన్ని నా తరువాత ఆచరించిన వాడవు నీవే గనుక నేను నీ దీక్షవల్ల జయించబడ్డాను! దేవి తీవ్రదృష్టితో నీ కుడికంటి దృష్టి తొలగడంవల్ల నీవు ఏకపింగళుడవని ప్రసిద్ధుడ వౌతావు. నేను నీచే ఓడించబడ్డాను గనుక నాకు సఖుడవు కమ్ము" అని అనతిచ్చి, అంతర్ధానమయ్యాడు.

"సోదరా, నేను తపస్సు చాలించి, ఇల్లు చేరాక నీ చేష్టలవల్ల కలవరం పొందిన వేల్పులు నిన్ను మట్టుబెట్టే యత్నాలు చేస్తున్నారని విన్నాను. కనుక అన్ననైన నా మాటలు ఆదరించి, జరిగినవేమో జరిగినా, పశ్చాత్తాపపడి; ధర్మ మార్గాన్ని అనుసరించడం యుక్తం సుమా'' అని వినిపించాడు.

### రావణుడు కుబేర దూతను చంపుట

ఆ మాటలువిన్న దశగ్రీవుడు, ఆగ్రహంతో ఇరవై కన్నులు క్రోధంతో ఎరుపెక్కగా, అతణ్ణి చూస్తూ "ఓరీ, మూర్ఖుడా, నాకు నీతులు చెప్పేదనని నన్ను నిందించిన నీవు దూతవుగాని, నిన్ను పంపినవాడు, నాకు గౌరవించ తగిన అన్నగాని కాడు! తనకు ఈశ్వరునితో కలిగిన నెయ్యము, తద్వారా తనకు వచ్చిన ఖ్యాతినీ ప్రకటించడానికే, అతడు నిన్ను దూత నెపంతో పంపాడు! అతడు అన్నయనీ, గౌరవం చూపతగిన వాడనీ, ఇంతవరకు ఉపేక్ష చూపడమే నా పొరబాటు! ఇక సహించలేను! ఇక అతణ్ణేగాక, మిగతా దిక్పాలకుల్ని సైతం నా భుజశక్తితో పరాజితుల్ని చేస్తాను!" అని పలుకుతూ వెంటనే కరవాలంతో అతని తల నరికి, దాన్ని రాక్షసులకు భక్ష్యంగా యిచ్చాడు.

## రావణుడు కుబేరునిపై దండెత్తుట

ఆ వెంటనే దానవపతిని దిక్పాలకులను జయించాలనే సంకల్పంతో, సైన్య సన్నాహాలు, స్వస్తివాచకాలు జరిపించి, ఉత్తరదిక్కుపై దృష్టినిలిపి, రథాన్ని ఎక్కి, ప్రహస్త, మారీచ, శుక, సారణ, మహోదర, ధూమ్రాక్షు లనబడే మంత్రులు, సైన్యాలను నడపగా, బయలుదేరి నదులు, పర్వతాలు, వనాలు, నగరాలు, పల్లెలు దాటి కైలాస ప్రాంతంలోని అలకాపురిని ముట్టడించాడు. యక్షులు రావణుడు తమ ప్రభువునకు సోదరుడు కావడంవల్ల ఆయన అనుమతిలేనిదే ఎదిరించరాదని, ఆయనకు ముట్టడినిగూర్చి తెలిపి, ఆయన ఆజ్ఞతో తిరిగివచ్చి రాక్షసులను భీకరంగా ఎదిరించి పోరాడారు. రక్కసులు వారి ధాటికి నిలువలేక యుద్ధరంగంనుండి పలాయనం ప్రారంభించారు.

## యక్ష రాక్షసుల యుద్ధం

అది గమనించిన రాక్షసరాజు అహంకారంతో మంత్రులతో కూడ హుంకారంచేస్తూ, శత్రువుల్ని ఎదిరించగా, వారు చలించక కత్తులు, గదలు, శక్తులతో, మేఘం జలధారలతో పర్వతాన్ని ముంచునట్లు తీవ్రంగా వారితో పోరాడారు. అయితే రావణుడు వీసమైనా చలించక, ప్రళయకాల యమునివలె తన గదను గిరగిర త్రిప్పుచు, శత్రుసేనా మధ్యంలో జొరబడి, వారిని కుప్పతిప్పలుగా కూల్చాడు. అతని మంత్రులైన శుక, మహోదరులును విజృంభణతో పోరగా, పెనుగాలికి చెల్లాచెదరయ్యే మబ్బులవలె యక్షులు కొందరు దిక్కులకు పరుగులెత్తగా, పెక్కుమంది నేలకూలారు.

తన సైనికుల పరిస్థితికి ఆగ్రహించిన కుబేరుడు సంయోధ కంటకుడనే సేనాపతిని వారికి సాయపడటానికి పంపాడు. ఆ వీరుడు, భీకరాలైన బాణాలు చిమ్ముతూ వైరి సైన్యంలో అన్నివైపులా సంచరించగా, మారీచుడతణ్ణి ఎదిరించాడు. యక్షవీరుడు సుదర్శనాన్ని పోలిన తన చక్రాయు

ధాన్ని అతనిపై విసిరాడు. దానితో పుణ్యం క్షీణించడంవల్ల నేలకూలే గ్రహంవలె, మారీచుడు నేలపడ్డాడు. అయినా ఆ వీరుడు త్వరలోనే సేద తీరి, తన విక్రమంతో ఆ వీరుణ్ణి పరుగెత్తించాడు.

శత్రు సేనాపతి పలాయనం కావడంవల్ల, రావణుడు ఉత్సాహంతో, రత్నాలు పొదిగిన బంగారు సింహద్వారంగుండా కుబేర మందిరంలో చొర బడగా, సూర్యభానుడనే ద్వార రక్షకుడు అడ్డువచ్చి, సమీపంలోనున్న ఒక స్తంభాన్ని పెరికి, దానితో అతణ్ణి మోదాడు. ఆ వ్రేటుతో, నిశాచరరాజు ధాతువులను కక్కే కొండవలె, ధారగా రక్తం కార్చాడు. అయినా విధాత అమోఘ వరశక్తితో బాధ తొలగగా లేచి, అదే స్తంభంతో యక్షుణ్ణి మోది, అంతమొందించాడు. అది చూచిన మిగత యక్ష వీరులు, భయ భ్రాంతులై, తెల్లబడిన ముఖాలతో నదీతీరాలు, గుహల్లో దాగి ప్రాణాలు కాపాడుకున్నారు.

కుబేరుడు తన భటులు వేలకొలది కూలటం, మిగతావారు నిలువలేక తొలగటం చూచి, మాణిభద్రుడనబడే మహావీరుణ్ణి, రావణుని సంహరించ మని పంపాడు. ఆ వీరుడు నాలుగువేల సైన్యంతో బయలుదేరి, ఖడ్గాలు, గదలు, శూలాలతో ఒక్కుమ్మడిగా రాక్షసులను ఎదుర్కొని, డేగవలె ఆ సైన్యాల్లో సంచరిస్తూ భీకరంగా పోరాడగా, దేవ, గంధర్వ, ఋషి సమూహాలు విస్మయంతో చూచారు. శత్రువులను ప్రహస్త, మహోదరులు ఎదిరించి ఒక్కొకరూ వేయిమంది పంతున యక్షులను నేలకూల్చారు. యక్షులు న్యాయ విధానంలో పోరాడగా, అసురులు మాయలతో పోరాడటం వల్లనే వారి బలం పెరిగింది. తిరిగి ధూమ్రాక్షుడు మాణిభద్రుని రొమ్మును రోకటితో నొప్పించగా, ఆ వీరుడు తన గదతో అతని శిరస్సుపై మోదాడు. అతడు నెత్తురు కక్కుతూ నేలబడగా రావణుడు ఆగ్రహంతో ఆ వైరిపై వురికాడు. అయితే మాణిభద్రుడు వెనుకంజ వేయక, అతనిపై శక్తు లనబడే ఆయుధాలు విసిరాడు. వానివల్ల నొచ్చినా రాక్షసరాజు ధీరత్వంతో తన

గదతో మాణిభద్రుని కిరీటాన్ని మోదాడు. ఆ వ్రేటుతో కిరీటం ఒక ప్రక్కకు ఒరిగిందే కాని అతడు చలించలేదు. అందువల్లనే అతడు పార్శ్వ మౌళి (చలించిన కిరీటం కల) వాడని ఖ్యాతి కాంచాడు.

## కుబేరుడు రావణుని దూషించుట

రావణునివల్ల తన సేనాపతి భంగపడటం చూచిన యక్షపతి శంఖ, పద్మనిధుల అభిమాన దేవతలు శుక్రుడు మొదలైన మంత్రులతో వేగంగా రావణుని సమీపించి సోదర మర్యాద మరచి తన్ను ఎదిరించిన అతణ్ణి మందలిస్తూ "ఓరీ దుర్మతీ, సోదరుడవని నీ హితంకోరి పంపిన హిత వాక్కులు వినవైతివికదా! అజ్ఞానంతో గరళాన్ని త్రాగేవాడు, దాని బాధకు లోనై బాధపడునట్లు, పాపఫలానుభవం పొందే సమయంలో మంచి పనులు చేయక, పాపకార్యాలు చేశానే అని దుఃఖిస్తావు సుమా! నీవు కొద్దిగా సుకృతం చేసినా, పాపకార్యాలయందు ఆసక్తి కలిగిన నిన్ను చూచి దేవతలు సంతోషించరు

పాపి పెద్దలను కొలువని వానికి మంచిబుద్ధి కలుగబోదు ఎవ డెట్టి పనిచేయునో దానికి తగిన ఫలితాన్నే పొందుతాడు. కనుక జీవితంలో తపో దీక్షలు మరచిన మందబుద్ధి దుర్గతుల పాలైనప్పుడు శోకిస్తాడు. మందమతీ ధర్మాచరణ ఫలంగా ధనరాజ్య సౌఖ్యాలు శౌర్య, ధైర్యాలు, యోగ్యులైన పుత్రులు లభించునట్లే, అధర్మాచరణవల్ల దేహ దుఃఖాల పాలవుతారు. అది గుర్తించి సౌఖ్యం కోరేవాడు, పాపకార్యాలు మాని, ధర్మమందు శ్రద్ధ వహించాలి! దుష్టుడా పాపబుద్ధివై, నరకయాతనలు కల్గించే మార్గంలో నున్న నీతో మాటాడరాదు అని కటువుగా పలికాడు.

## కుబేర, రావణుల యుద్ధం

తరువాత ధనపతి తన్ను ముట్టడించిన రావణ మంత్రుల్ని బాణ పరంపరతో చెదరగొట్టి, చేతి గదతో రావణుని శిరస్సును మోదాడు.

అయినా ఆ వీటుడు రవంతైనా చలించడయ్యెను. ఒండొరుల్ని మించాలనే అభిలాషతో ఆ వీరులు బడలిక ఎరుగక, వెనుదీయక ఘోరంగా పోరాటం సాగించారు. యక్షపతి ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించగా, నిశాచరపతి దాన్ని తనవారుణాస్త్రంతో కూల్చాడు. అంతేగాక తన మాయా శక్తితో కానరాక పులులు, తోడేళ్ళు, అడవి పందులు, వృక్షాలు, మేఘాలు, కొండలు, సముద్రాలు, యక్ష రాక్షసులవంటి వందలు, వేల రూపాలతో శత్రువును ఎదిరించగా కుబేరుడు ఆ రూపాల్ని, అతని బాణ పరంపరనే గాని. రావణుడు కానరాక చకితుడయ్యాడు ఆ సమయంలో దశకంఠుడు ఒక మహాస్త్రాన్ని విసరగా, కుబేరుడు రక్తం కారుచుండగా, మూర్ఛితుడై మొదలు నరకిన అశోకంపలె నేలకూలాడు. ఆ సమయంలో, శంఖ, పద్మ, నిధుల దేవత లాయన్ని, నందన వనానికి తీసికొనిపోయి సేద తేర్చారు.

అది చూచిన రావణుడు తాను కుబేరుని జయించానని, ఆనందంతో ఆయన నగరం ప్రవేశించి, బ్రహ్మచే నిర్మించబడి, మనోవేగంతో ఆకాశంలో సంచరించగలదై, బంగారు స్తంభాలు వైడూర్య మణి తోరణాలు, సోపానాలతో మనోజ్ఞం, అపూర్వమైన పుష్పక విమానాన్ని విజయ చిహ్నంగా స్వాధీనపరచుకొని, లోకాలన్నిటినీ గెలిచినట్లు పొంగుచూ సైన్యంతో అచటనుండి బయలుదేరాడు

## నందీశ్వరుడు రావణుని శపించుట

రాక్షసరాజు హార, కిరీటాలు ధరించి అగ్నివలె ప్రకాశిస్తూ, సైన్యాలతో పుష్పకంలో కూర్చుండి, పోవుచుండగా, కుమారస్వామి జన్మించిన శరవణం అనబడే జెల్లుగల ప్రదేశంలో స్వర్ణ, సూర్యకాంతిగల పర్వతంపైనున్న వన సమీపంలో, పుష్పక విమానం ఆగిపోయింది. అందుకు రావణుడు ఆశ్చర్యపడి, ఎక్కడికైనా నిరాఘాటంగా పోయే ఆ విమానాన్ని ఎవరు అడ్డగించారో తెలుసుకొమ్మని మంత్రుల్ని ఆదేశించాడు. వారలో బుద్ధి విశారదుడైన మారీచుడు కారణం తెలుసుకోవడానికి పరిసరాలను

పరిశీలిస్తుండగా, పరుగుజ్జు శరీరం, పొట్టి చేతులు బోడితల, కలిగి బలవంతుడు, నలుపు పసుపు ఛాయ కలిగినవాడు, భయంకరుడు, శంకరుని ప్రమథ గణాల్లో ముఖ్యుడైన నందీశ్వరుడు వడిగా విమానం ముందుకు వచ్చి "దశకంఠా, ఆగి వెనుకకు పొమ్ము ! ఈ గిరిపై పార్వతీ పరమేశ్వరులు విహరిస్తుండటంవల్ల, ఇంద్రాది దేవతులకు సైతం ఈ ప్రదేశం ప్రవేశించరానిది'' అని హెచ్చరించాడు.

ఆ మాటలువిన్న రాక్షసపతి ఆగ్రహంతో ఎర్రనైన కన్నులు, చలించే కుండలాలతో ''ఆ శంకరు డెవడో చూస్తానని'' విమానం దిగి, ఆ పర్వతం ముందు మెరుస్తున్న శూలం ధరించి, వానర ముఖంతో రెండవ రుద్రునివలె నిలచియున్న నందీశ్వరుణ్ణి చూచి, హేళనచేస్తూ, మేఘం వురిమినట్లు పకపక నవ్వాడు. నందీశ్వరుడు ''ఓయీ, నా వికట రూపం చూచి, పరిహాసం చేస్తున్నావా ? వినుము. నావంటి ఆకార విక్రమాలు, కొండలవంటి కఠిన దేహాలు, కోరలు గోళ్లు ఆయుధాలుగాకల వానరులు ఎలుగుల మహావీరులు జన్మించి, నీ పుత్ర, మిత్ర, అమాత్య బలగాల్ని నేలపాలు చేయగలరు ! మూర్ఖుడా, నిందలచే యిప్పటికే సగం చచ్చిన నిన్నెందుకు చంపాలని మానానేగాని, లేకున్న యిప్పుడే నిన్ను కూల్చి వుండనా ?'' అని శపించాడు. ఆ మహాత్ముని పలుకులువిన్న దేవతలు ఆనందంతో దుందుభులు మ్రోగించి, ఆయనపై పూలవాన కురిపించారు.

## రావణుడు కైలాసాన్ని పెల్లగించుట

అయినా దురహంకారి రావణుడు నందీశ్వరుని శాపాన్ని లక్ష్యపెట్టక మదోద్రేకంతో "ఓ బసవన్నా ఎవడు తన శక్తితో నా విమానాన్ని స్తంభింపచేశాడో, ఎవడు శత్రు భీతిలేక తన దేవితో యథేచ్ఛగా విహరిస్తున్నాడో ఆ రుద్రునికి నా సామర్థ్యం చూపడానికి ఈ గిరిని పాతులతో పెకలిస్తాను చూడు !" అని పలికి సాహసంతో రెండు చేతులతోనూ, కైలాస పర్వతాన్ని పాతులతో పెకలించి ఆడించగా ఆ గిరి వణకి ప్రమథు లందరూ వణికారు.

పర్వత రాజకుమారి భవాని సైతం వణుకుచు వచ్చి భీతితో ముక్కంటిని కౌగలించింది. అయితే మహాదేవుడు కదలక నిలిచి, కాలి బొటన వ్రేలితో ఆ గిరిని నొక్కగా, అది యథాప్రకారం పాతుకు దిగబడగా, రావణుడు పర్వతానికి భూమికి నడుమ తన యిరవై బాహువులు ఇరుక్కోగా, బాధతో జాలికలుగునట్లు, మహా ధ్వనితో రోదనం చేయసాగాడు. ప్రళయ కాలమేఘ గర్జనవంటి ఆ మహా ధ్వనికి, మహా సాగరాలు, పాతులతో పర్వతాలూ, ముల్లోకాలూ కంపించాయి. ఇంద్రాది దేవగణాలు సైతం తమ నెలవులు వదలి కలవరపడ్డారు. రావణ మంత్రులు తమ ప్రభువును సమీపించి వినయంతో ''రాక్షసేశ్వరా, నీ దుస్థితిని తొలగించ డానికి లోక శరణ్యుడు కరుణామయుడైన పరమశివుడు తప్ప యితరు లెవ్వరూ అడ్డుపడలేరు. కనుక ఆయనను వేడుము'' అని బోధించారు. అతడు అంగీకరించి, భక్తితో ఆ కరుణా సింధువును శోకంతో అనేక విధాల స్తుతిస్తూ వేయి సంవత్సరాలు గడిపాడు.

### ఈశ్వరుడు ప్రసన్నుడై రావణునకు వరాలు యిచ్చుట

అంతట భక్తపాలకుడైన త్రినేత్రుడు అతనియెదుట ప్రత్యక్షమై "దశకంఠా నీ చేతులు బైటకు తీసికొమ్ము! నీ ధైర్య, సాహస, విక్రమాలు నాకు తృప్తి కలిగించాయి! పర్వతం క్రింద చిక్కుకున్న బాహువులతో నీవు చేసిన దారుణమైన రోదన ధ్వనితో, లోకాలను కల్లోల పరచుటచే, నీకు రావణుడనే బిరుదును యిస్తున్నాను. ఇప్పటినుండి లోకులందరూ నిన్నా పేరుతోనే పిలువగలరు. ఇక నీవు పోవచ్చును" అని ఆదేశించాడు. రావణుడు సంతోషంతో "ఆర్తజన పరాయణా, నీవు అనుగ్రహిస్తే నేను నీ శైలం క్రింద ఆక్రందిస్తూ పోగొట్టుకొన్న ఆయువును తిరిగి ప్రసాదించి, నీ దివ్య ఖడ్గాన్ని అనుగ్రహింపుము" అని ప్రార్థించాడు. ఆ కరుణామూర్తి అతడు కోరిన ప్రకారం ఆయువును, నూర్గురు సూర్యుల దీప్తి కలిగిన తన చంద్రహాసాన్ని యిచ్చి అతనితో "రావణా, నీవీ ఆయుధాన్ని పూజించక, ఎప్పుడు ఉపేక్షిస్తావో అప్పుడది నా దగ్గరకు రాగలదు సుమా!" అని

హెచ్చరించాడు. ఆ హెచ్చరికతో అతను శివునకు పరమ భక్తుడై ఆయన ఆయుధాన్ని ఏమరక నిత్యం అర్చించుచుండేను. తరువాత అతడు పుష్పకంలో, పరివారంతో యథా ప్రకారం అహంకారంతో సంచరిస్తూ, లోబడని రాజులను సంహరిస్తూ, శరణన్న వారిని రక్షిస్తూ సంచరించాడు.

## రావణుడు వేదవతి తపస్సును గూర్చి ప్రశ్నించుట

అతడట్లు తిరుగుచు, ఒకనాడు హిమాలయ ప్రాంత ఆశ్రమంలో ఒక సౌందర్యవతియైన కన్యక దేవతవలె శోభిస్తూ, జటలు, జింక చర్మం ధరించి మహా దీక్షతో తపస్సు చేయడం చూసి, కామవశుడై ఒంటరిగానున్న కన్య లభించిందన్న సంతోషంతో ఆమెను సమీపించి "సుందరీమణీ, నీవు ఎవ్వరిదానవు? నీ పతియైన ధన్యు డెవడు? నీ యౌవన సౌందర్యాలకు విరుద్ధంగా ఈ దీక్షలు సాగిస్తూ ఏల కష్టపడుచున్నావు?" అని ప్రశ్నించాడు.

ఆ తపస్విని అతనికి ఆచార ప్రకారం ఆతిథ్యం యిచ్చి సమాధానంగా "రాక్షసరాజా, నా తండ్రి, బృహస్పతి కుమారుడైన కుశధ్వజు డనబడే బ్రహ్మర్షి. ఆ మహాత్ముడు సదా వేదాధ్యయనం చేస్తుండగా వేదమూర్తినైన నేను ఆయనకు అయోనిజనైన పుత్రికగా జన్మించాను.[1] నాకాయన వేదవతి అని పేరుపెట్టి నను తమకు యిమ్మని ఎందరు వీరులు వేడినా అంగీకరించక, ముల్లోకాల్ని పాలించే మహావిష్ణువుకే నా కన్యను యిస్తానని పలికేవాడు. ఆ మాటలకు ఆగ్రహించిన దంభుడనే నిశాచరుడు ఒకనాటి రాత్రి నిద్రిస్తున్న నా తండ్రిని క్రూరుడై అంతమొందించగా, శోకవివశయైన నా తల్లి భర్తతో సహగమనం చేసింది. నేను తండ్రి సంకల్పం నెరవేరుస్తానని ప్రతిజ్ఞచేసి ఈ కఠోర దీక్షలు సాగిస్తున్నాను. పౌలస్త్యా,

1. లోకంలోని సాధ్వుల మొరలువిన్న లోకమాత లక్ష్మీదేవి రావణ సంహారానికి తాను కారణం కావాలని ఈ వేదవతిగాను తరువాత సీతగాను భూలోకంలో జన్మించి, ఆ కార్యం నెరవేర్చింది.

కనుక పురుషోత్తముడైన నారాయణుడే నాకు వల్లభుడు కాగలడు. నా తపశ్శక్తివల్ల సమస్త లోకాల్లో జరిగే సంఘటనలను ఎరుగుదును. కనుక ఇక నీ దారిని పొమ్ము" అని పలికింది.

ఆ దీక్షాశాలిని వాక్కులు విన్న ఆ చపలుడు తన్ను పొగడుకుంటూ ఆమెతో "కన్యకా శిరోమణి, త్రైలోక్య సుందరివీ, సుగుణ భూషితవైన నీకు యౌవనం తొలగుతుందనే లెక్కచేయక, వృద్ధులు పూనవలసిన ఈ దీక్షలు పూనడం తగునా? మహాభాగా, నేను లంకాధిపతిని, మహావీరుడనైన రావణుడను. నీవు వాంఛిస్తున్న విష్ణువు తపో, శౌర్యాల్లోగాని, వైభవ భోగాల్లోగాని నాకు సమానుడు కాడుసుమా! ఇది సత్యం. కనుక నా హృదయేశ్వరివై, నా సర్వ వైభవాల్నీ అనుభవించుము" అని పలికాడు.

## వేదవతి రావణుని శపించి శరీర త్యాగం చేయుట

అతని ప్రగల్భాలువిన్న ఆ శీలవతి "ఓరీ రాక్షసా, అవ్యయుడూ, ముల్లోకనాథుడు, సర్వ భూతాలచే స్తుతించబడే ఆదిదేవుడైన త్రివిక్రముని బుద్ధిమంతు డెవడూ నీవలె తృణీకరించడు సుమా!" అని పలికి తొలగుచుండగా, ఆ పాపి ఆమె కురులను ఒడిసిపట్టి ముందుకు లాగసాగాడు. ఆ మహా తపస్విని ఆగ్రహంతో అగ్నివలె జ్వలిస్తూ తన చేతితో, కత్తితో నరకిన విధంగా వాడు పట్టిన కురులను నరికి విడిపడి, శరీరం త్యజించ నిశ్చయించి ఆ దుష్టుని దహించే విధంగా చూస్తూ "పాపాత్మా, నీ స్పర్శ తగిలిన ఈ శరీరాన్ని నీ ఎదుటనే అగ్నికి ఆహుతి చేస్తాను! ఖలువా, నేను వనంలో దీక్షాశాలినై యుండగా, నన్ను అవమానించడానికి సిద్ధపడ్డావు! నేను అబలను స్త్రీని కావడంవల్ల నిన్ను చంపజాలను! అయినా అందువల్ల తపస్సు క్షీణిస్తుంది కనుక అందుకు పూనటంలేదు! కాని నిన్ను సమూలంగా నాశనం చేయడానికి నేను త్వరలోనే ఒక మహాత్మునికి అయోనిజనైన కూతురను, సాధ్వినై జన్మిస్తాను!" అని శపించి హోమకుండంలో ప్రజ్వరిల్లే అగ్నిలో ప్రవేశించి, శరీరం త్యజించింది. వేల్పులు "అట్లగు

గాక" అని పలుకుచు ఆ పుణ్యశీలపై ముసురుగా పూలవర్షం కురిపించి అభినందించారు.

"రాఘవేంద్రా, కృతయుగమందు జన్మించిన ఆ వేదవతియే, తిరుగ త్రేతాయుగంలో రావణ సంహారం కొరకు మహాత్ముడైన జనకరాజు యజ్ఞం చేయ తలపెట్టి భూమిని దున్నగా, నాగేటి చాలునుండి[1], యజ్ఞవేదినుండి అగ్నిశిఖవలె అయోనిజగా జన్మించి, సీత అనే విఖ్యాత నామంతో ఆ మహారాజు ముద్దుల కూతురై పెరిగి, అమేయాత్ముడవు, పురుషోత్తముడవై రావణ సంహారానికే అవతరించిన నీకు అర్ధాంగియైంది. ఏ మహాభాగ ఆగ్రహించడంవల్లనే పూర్వం రావణుడు మృతప్రాయుడయ్యాడో, ఆ శీలవతీమణియే తిరిగి భూమియందు జన్మించగా, ఆ మహాభాగకే నాధుడవైన నీ లోకాతీత బాణాగ్ని జ్వాలల్లో రావణుడు మిడతయై నశించాడు సుమా!

## రావణుడు మరుత్తుని యజ్ఞశాల ప్రవేశించుట

దురాత్ముడైన రావణుడు వేదవతి అగ్నియందు హుతం కావడం చూచి, తిరిగి పుష్పకం ఎక్కి ధరానలయంలో యధాప్రకారం సంచరించాడు. ఆ సమయంలో మరుత్తు అనబడే నరపతి ఉశీరబీజ మనబడే ప్రాంతంలో యజ్ఞం చేస్తున్నాడని విన్న రావణుడు, అక్కడికి బయలు దేరాడు. అప్పుడు యజ్ఞశాలయందున్న దేవతలు రావణుడు జయించరాని వాడు కావడంవల్ల అక్కడ ఉండడానికి భయపడి ఇంద్రుడు నెమలిగాను, వరుణుడు హంసగాను, యముడు కాకిగాను, కుబేరుడు తొండగాను, ఇతర దేవతలు వేర్వేరు జంతువుల రూపాల్ని ధరించి, తప్పించుకున్నారు. రావణుడు, విమానం దిగి కుక్కవలె ఆ యజ్ఞశాలలో ప్రవేశించి, మరుత్తును చూచి "రాజా, నీకు చేవయున్న నన్నెదిరించుము! శక్తి చాలనిచో, నాకు

1. నాగటికి సంస్కృతంలో "సీత" అని పేరుండటంవల్ల జానకీ దేవికి సీత అని పేరు పెట్టారు.

ఓడానని తెలుపుము" అని పలికాడు. ఆ జనపతి అతని మాటలకు విస్మయ పడి "ఓరీ, ఇట్టి మాటలాడే, నీ వెవడవు?" అని ప్రశ్నించాడు.

రావణుడు వికృతంగా నవ్వుచూ "ఓయీ నందపతీ, నేను పరమ శివుని మిత్రుడైన కుబేరుని తమ్ముడను! ఆ అన్నను ఓడించి, ఈ పుష్పక విమానాన్ని హరించి, ముల్లోకాల్ని హోవడిపెట్టే రావణుడను! ఇట్టి లోకైక వీరుడైన, నన్నే ఎరుగని, నీ అజ్ఞానం నాకు నవ్వు కల్గిస్తోంది" అని సమా ధాన మిచ్చాడు. ఆ మహారాజు ఆగ్రహంతో "రాక్షసరాజా, లోకంలో గొప్పపనులుచేసి కీర్తి సంపాదించే వారుంటారు. కాని నీవలె, అన్నను ఓడించానని ప్రగల్భాలుపలికే నీవంటి వారు లేరు సుమా! ఇంతవరకు నీవు కఠోర తపస్సుచేసి, బ్రహ్మచే వరాలు పొందిన వార్త విన్నానేగాని, ఇప్పుడు నీవే చెప్పిన ఆ కార్యాన్నిగూర్చి వినలేదు. క్షణకాలం నిలువుము! నే నిదే సిద్ధపడి వచ్చి నా తీవ్ర శరాలతో నిన్ను కూల్చి యమాలయానికి అతిధిగా పంపుతాను!" అని పలికి విల్లు, అమ్ములు ధరించాడు.

ఆ సమయంలో, ఆ యజ్ఞానికి నిర్వాహకుడైన బృహస్పతి తమ్ముడు సంవర్తు డనబడే బ్రహ్మర్షి ఆయన్ని సమీపించి, ప్రీతితో చూస్తూ, "రాజ శేఖరా, నా మాటలు ఆలకించ తగినవైతే వినుము. మాహేశ్వర మనబడే ఈ సత్రం యాగానికి ఏ మాత్రం అంతరాయం కలిగినా, నీ వంశమే నశిస్తుంది సుమా! కనుక ఈ యజ్ఞదీక్షలోఉన్న నీవు ఆగ్రహించడంగాని, యుద్ధం చేయడంగాని తగదు! అంతేగాక ఈ నిశాచరుడు జయించరాని వాడు. కనుక ఈ విషయాలన్నీ యోచించుము" అని బోధించగా, మరుత్తు ఆగ్రహాన్ని మాని, శర, చాపాలు విడిచి, యజ్ఞశాలకు మరలాడు.

అది చూచిన రావణ మంత్రి శుకుడు, రావణుడు మరుత్తును జయించినట్లు చాటాడు. నీచుడైన రావణుడు తనవారితో అచటి ఋషులను చంపి వారి రక్త మాంసాలు ఆరగించి, తిరిగి పుష్పకమెక్కి తన విజయ యాత్ర సాగించాడు.

తాము సంప్రదించుకొని, అతనిచే ఓడినట్లు ప్రకటించారు. తరువాత రాక్షస రాజు అయోధ్య రాజైన అనరణ్యుని ఇతరులను వలెనే ప్రశ్నించాడు. ఆ రాజ పుంగవుడు, ఆగ్రహంతో కండ్లెర్రచేసి "రాక్షసుడా, క్షణకాలం నిలువుము! నేను సిద్ధమైవచ్చి నీతో పోరాడగలను" అని పలికి అతణ్ణి ఎదిరించడానికి అదివరకే సిద్ధం చేయబడిన పదివేల ఏనుగులు, పెక్కు వేల అశ్వాలు, రథికులు, పదాతుల సైన్యంతో వచ్చి, చాల రోజులు రావణునితో యుద్ధం చేశాడు.

అయితే క్రమంగా అగ్నిలోపడిన మిడతల దండువలెను, అగ్నిలో వేల్చిన ఆహుతులవలెను, సముద్రంలో ప్రవేశించిన నదులవలెను తన సైన్యం నాశనం కాగా, ఆ మహావీరుడు వెనుదీయక, రోషంతో ఇంద్రచాపం వంటి ధనుస్సు, తీవ్రబాణాలు ధరించి రణరంగం ప్రవేశించి, రావణునకు అడ్డువచ్చిన అతని మంత్రులు, మారీచ శుక సారణాదులను, సింహం అల్ప మృగాల్ని పారద్రోలునట్లు తన వేడి ములుకులతో పరుగెత్తిం చాడు. తరువాత రావణునిపై ఎనిమిది వందల అమ్ములు ధారగా కురి పించాడు.

రాక్షసరాజు వర్ష ధారలను సహించిన పర్వతంవలె ఏమాత్రం తొట్రుపడక, మహాగ్రహంతో, ఆ వీరునిపై దూకి, పిడికిళ్ళతో తలపై పొడవగా, ఆయన నిహ్వాలుడై రథంనుండి నేలపై పడ్డాడు. దశకంఠుడు పిడుగుపాటుకు నేలకూలిన వృక్షంవలె నున్న ఆ వీరుణ్ణి చూసి ఎగతాళి చేస్తూ "భూపతీ, లోకైక వీరుడనైన నన్నెదిరించిన నీ కేగతి కల్గిందో గ్రహించావా? నన్ను ఎదిరించి జీవించగల మగవాడున్నాడా? అంతఃపుర స్త్రీలతో భోగాలనుభవిస్తూ, మందమతివై నా అఖండ విక్రమాన్నిగూర్చి నీవు వినియుండక పోవడంవల్లనే, ఈ స్థితికి వచ్చావు సుమా" అని ఎత్తి పొడిచాడు.

## అనరణ్యుడు రావణుని శపించుట

వీరుడైన అనరణ్యుడు అతనికి గద్గదికంగా సమాధానమిస్తూ "రాక్షసరాజా, ఈ ప్రగల్భా లెందుకు పలుకుతావు? నన్ను జయించిన వాడవు నీవుకావు! దాటరాని కాల ప్రభావంవల్లనే నిమిత్తమాత్రుడవైన నీచే కూల్చబడ్డాను. వీరుడా నీవు ఆహ్వానించగా నేను భీతిచెందక నిన్నెదిరించి పోరాడాను: నీ పరాక్రమంతో నన్ను కూల్చినమాట నిజమే. అయితే అంతతో నీవు తృప్తిపడక, నా వంశాన్ని నిందించడం భరించలేను! దానవుడా, నా రఘువంశంలోనే, దశరథ కుమారుడై జన్మించే రాము డనబడే మహా వీరుడు, తన మహా పరాక్రమంతో, నిన్ను రణరంగానికి బలిచేయగలడు సుమా! నేను దాన, యజ్ఞాలు, తపస్సుచేసి, ధర్మ మార్గంలో ప్రజలను పాలించినవాడనైతే, నా వాక్కులు సఫలాలగుగాక!" అని శపించాడు. దివినుండి సురలు దుందుభులు మోగించి, ఆ రాజఋషిపై పూలవర్షం కురిపించారు. ఆ మహారాజు ప్రాణాలు విడిచి, వీరస్వర్గం చేరాడు. రావణుడు యథాప్రకారం విమానం ఎక్కి రాజులపై దండయాత్రకు బయలుదేరాడు.

## నారద మహర్షి రావణునికి మనుష్యవధ మానమని బోధించుట

ఆ సమయంలో త్రిలోక సంచారి నారదుడు మేఘ మండలంలో సంచరిస్తూ అతని విమానానికి ఎదురుగా వచ్చాడు. రావణు డాయనకు సత్కారాలు జరిపి, ఆయన రావడానికి కారణం అడిగాడు. ఆయన సమాధానంగా "విశ్రవసకుమారా పూర్వం చక్రాయుధుడు దైత్యుల్ని వెదకి సంహరించినట్లు, నీవు సురలు, నాగులపై విజయం సాధించావంటే ఆనందిస్తాను! నాయనా, నీ విజయయాత్ర సందర్భంగా ఒక సూచన చేయ దలచాను; అది నీకు అంగీకారమైతే సంతోషిస్తాను. దేవతలకు అజేయుడవై వుండీ, నీకు సమానులైన వీరుల్ని ఉపేక్షిస్తూ ఆకలి, దప్పి,

వ్యాధులను, వృద్ధాప్యానికీలోనై అలమటిస్తూ మృత్యువుకు వశులైన అల్ప మానవుల్ని నీవు చంపబూనడం న్యాయమేనా? వారిని విడిచిపెట్టడం యుక్తంకాదా?

## నారద మహర్షి రావణుణ్ణి యముని జయించమని బోధించుట

"రాక్షసరాజా, నా మరొక సూచన కూడ ఆలకించుము. లోకులందరూ తరతమ భేదం లేకుండా దండధరుడైన యమధర్మరాజుకు లోబడ వలసిన వారేకదా! అందువల్ల వెంటనే నీవు సమవర్తిని జయించావంటే లోకులందర్నీ జయించినవాడవే కాగలవు సుమా" అని బోధించాడు. రావణు డాయనకు అంజలిచేస్తూ "మహర్షీ, గానకళావినోదివే గాక సమరాల్ని పురిగొల్పుటలోనూ వినోదం పొందే నీ సలహా ప్రకారం, నేను పాతాళలోకంపోయి నాగుల్ని, దివంలో దేవతల్ని జయించి వారందరినీ నా ఆజ్ఞా బద్ధులనుచేసి తరువాత అమృతం సాధించడానికి సాగరం మథిస్తాను" అని పలుకగా ఆ మహర్షి "దశకంఠా యమపురికి పోయే మార్గం యితరు లందరికీ కానరానిదైనా, నీకు మాత్రం సాధ్యమే సుమా" అని పలికాడు.

రావణుడు శరత్కాల మేఘంవంటి తెల్లని మేనుగల ఆయనతో "దేవర్షీ, నేను దిక్పాలు లందర్నీ జయించడానికి ప్రతిజ్ఞ చేయడంవల్ల, మీరు సూచించిన ప్రకారం, దక్షిణ దిక్పాలకుడై, జీవులందరినీ హింసించే కాలునిపై దండయాత్రకు యిప్పుడే బయలుదేరుచున్నాను" అని పలికి తన బలగంతోనున్న విమానాన్ని యమ నగరానికి పోనిమ్మన్నాడు.

అగ్నివంటి తేజశ్శాలియైన నారద మహర్షి మనలో ప్రళయకాళంలో ఇంద్రుడు మొదలైన వారందర్నీ వారివారి కర్మల ప్రకారం శాసించేవాడూ, అగ్నివంటి లోకసాక్షీ, లోకులందరికీ భయం కలిగించేవాడైన యమునిని, దైత్యుడు ఎట్లు ఎదిరిస్తాడో చూడాలనీ, రావణుడు దండయాత్రకు బయలు

దేరాడనే వార్తను రానే ఆయనకు తెలియచేయాలని నిశ్చయించి కాలుని వద్దకు బయలుదేరాడు. అక్కడ ప్రాణుల పుణ్య, పాపాలు పరిశీలించి పగు పక్షంగా శాసిస్తున్న ఆ ధర్మ మూర్తిని సమీపించగా, ఆయన ఉచిత రీతిని మహర్షికి సత్కారాలుచేసి, ఆయన రాకకు కారణం అడిగాడు. ఆయనకు సమాధానంగా "సమవర్తీ, రాక్షసరాజు రావణుడు, నిన్ను జయించాలనే కోర్కెతో బయలుదేరడంవల్ల, నీకు ముందు హెచ్చరికగా, ఆ విషయం తెలుపడానికి వచ్చాను" అని పలికాడు.

## రావణుడు యమభటులచే పీడించబడే జీవుల్ని విడిపించుట

ఇంతలోనే బాలసూర్యునివలె, చీకట్లను తొలగిస్తూ, రావణుని విమానం యమపురి ప్రవేశించింది. దశకంఠుడు, ఆ పట్టణం బయట విమానం దిగి ప్రాణులు తమ పాపపుణ్యాల ఫలాలు అనుభవిస్తుండటం, భీకర రూపాలు కలిగిన యమభటులు క్రూరులై కొందరిని కట్టుచూ, మరి కొందరిని కొట్టుచూ, హింసిస్తుండటం చూచాడు. వారి బాధలు భరించలేక, కొందరు ప్రాణులు అరచుచుండగా, మరికొందరు భీకరాలైన కుక్కలు శరీరాల కండల్ని చీల్చుచుండగా హాహాకారాలు చేయుచుండిరి. రక్తంతో ప్రవహించే వైతరణి నదిలో ఈడ్వబడుచూ కొందరు జీవులను, మండుచున్న ఇసుకలో వేయించగా, గుండెలు పగులునట్లు ఏడ్చేవారు మరి కొందర్ని చూచాడు ?

మరొక వైపున పుణ్యకర్మలుచేసిన జీవులు ఇండ్లముందు కూర్చుండి, సంగీత, వీణావాద్యాలకు ఆనందిస్తుండటం, అన్నదాన ఫలంతో రుచికరాలైన వంటకాలు తినడం, గోదాన ఫలంగా తృప్తిగా పాలు త్రాగడం, ఇళ్ళు దానాలు చేసిన పుణ్యాత్ములు చక్కని ఇళ్ళలో నివశించడం, మరికొందరు అధికంగా చేసిన దానధర్మాల ఫలంగా రత్నాభరణాలు ధరించిన మహిళలతో వుల్లాసంగా కాలం గడపుచుండటం చూచాడు.

వెంటనే మహావీరుడైన, రావణుడు పాపకర్మలవల్ల బాధలు పడుతున్న జీవులకు అడ్డుపడి, బలత్కారంగా వారిని యమభటుల బారినుండి తప్పించి, వారికి ఊహాతీతంగా కొంతసేపు ఆనందం కలిగించాడు. అయితే, అందుకు ఆగ్రహంతో యమభటులు వందలు, వేల సంఖ్యలో గదియలు, కత్తులు, కిటార్లు, శూలాలు ధరించి, అట్టహాసంగా రాక్షస రాజును అతని బలగాన్ని ఎదుర్కొని, వారిపై తమ ఆయుధాలు విసరి విమానాన్ని నష్టపరచారు. అయితే దివ్యమైన ఆ విమానం వెంటనే యథాప్రకారం, బాగుపడింది రావణ మంత్రులు, శత్రువుల ఆయుధాలవల్ల నెత్తురు కారుతున్నా, వెను దీయక, తమ ఆయుధాలు, చెట్లు రాళ్ళతో పోరాడారు. యముని పరివారం రావణునిపై తమ శూలాలు విసరి, అతని శరీరాన్ని తూట్లు పొడిచారు. రావణుడు కవచం నుగ్గుకాగా, శరీరాన్నుండి నెత్తురు కారుచుండగా విమానాన్నుండి దిగి నేలపై నిలిచాడు. అతడు ప్రళయకాల యమునివలె భయంకరుడై, తన వింటిఅల్లెత్రాటుకు పాశుపతాస్త్రాన్ని సంధించి విడిచాడు. ఆ మహాస్త్రం, భూతజాలంతో దావాగ్నివలె దిక్కులను వ్యాపించి, యమ భటుల్ని భస్మం చేసింది. రావణుని మంత్రులు ఆనందంతో, భూమి వణకునట్లు సింహనాదాలు చేశారు.

## యముడు రావణునితో పోరుట

ఆ మహా ధ్వనితో యమవాహిని కూలడం, శత్రువు విజయం తెలుసుకున్న కాలుడు క్రోధంతో కండ్లెర్రబడి సూతుణ్ణి తన రథాన్ని సిద్ధపరచి, తెమ్మనగా అతడట్లు చేశాడు. యమధర్మరాజు ఆ మహా రథమెక్కగా, లోకులందర్నీ సంహరించే మృత్యువు పాశముద్గరాలతో ఆయన ముందు నిలబడగా, కాలదండమనబడే సాధనం అగ్నివంటి తేజస్సుతో ఆయనకు ఒకవైపున, ముద్గర, కాలపాశాలు మరొక ప్రక్కను నిలచాయి. అట్లు భయంకరంగా సిద్ధపడి నిలచిన ఆయన్ని చూచి, రావణ మంత్రులు భీతితో తొలగడమేగాక, లోకాలు కళవళించాయి!

అయితే అట్టి కాలుని చూచియు బెదరక, రాక్షసరాజులు నిలబడటం చూచి, సమవర్తి అతనిపై శూలాలు మొదలైన ఆయుధాలు వర్షధారలవలె కురిపించాడు. రాక్షసరాజునూ అట్లే చేశాడు. ఆ మహావీరు లిద్దరూ, అట్లు సరభసంగా ఏడురోజులు మహాయుద్ధం చేశారు. ఆ భీషణ పోరాటాన్ని చూడటానికి ఆకాశ మార్గాన విమానాల్లో విధాతతోసహా, దేవ, గంధర్వ, సిద్ధ, మహర్షులు ప్రేక్షకులై చూచుచుండిరి

దశకంఠుడు ఇంద్రధనుస్సువంటి మహా చాపంతో, బాణాలు చిమ్ముతూ, మృత్యువును నాల్గింటితోను కాలుని సూతుణ్ణి ఏడు ములుకులతోను, దండధరుని నూరువేల అమ్ములతోను బాధించాడు. అంతట ఆగ్రహించిన కాలుని నోటినుండి ఆయన శ్వాసనుండి, భువనాలు వణకునట్లు అగ్నిహోత్రుడు పొగలు చిమ్ముతూ బైటికి వచ్చాడు. అప్పుడు రోషించిన మృత్యువు యముని చూస్తూ "దేవా, ఈ పాపి రక్కసుడు నీతో యింతసేపు పోరాడుతాడా! ఇంతకుముందు నేను హిరణ్యకశ్యప, నముచి, శంబర, బలి, విసంధి, ధూమకేతు, దంభ, వృత్ర, బాణులవంటి ఎందరో ఘోర రాక్షసుల్ని, నాగ, గంధర్వుల్ని, విఖ్యాతులైన మహర్షుల్ని, ప్రళయకాలంలో సముద్రాలు, వృక్షాలు, పర్వతాలతో కూడిన భూమండలాన్ని నా వాడి చూపులతో విధ్వంసం చేయలేదా? వారిముందు ఈ దనుజుడు ఎంతవాడు? నన్ను వెంటనే వీనిపై పంపిన, నా సహజ శక్తితో వీనిని సంహరిస్తాను" అని పలికింది.

అయితే శమనుడు మృత్యువును ఆపి మిక్కిలి ఆగ్రహంతో కాలదండాన్ని చేత ధరించగా, ఆయన పార్శ్వాల్లో, అగ్ని జ్వాలవంటి ముద్గర, కాలపాశాలు నిలచాయి. చూపులతోనే ప్రాణుల జీవాల్ని వెలార్చే కాలదండాన్ని సమవర్తి నిశాచరునిపై విడవడానికి సిద్ధపడటం చూచిన నిశాచరులు నాలుగు దిక్కులకు పరుగెత్తగా, అమరులు క్షోభించారు.

## పరమేష్ఠి కాలుని దండాన్ని విడువవద్దని ఆదేశించుట

అప్పుడు విధాత వడిగా యముని సమీపించి, "శమనా, ఆగుము! నీ దండంతో, దైతేయుని చంపబూనకుము! నీ దండంచే సైతం మరణించ నట్లు, నేను వానికి వరమిచ్చుటచే, నా వాక్కు వమ్ముచేయకుము! దేవ, మనుష్యాదుల్లో ఎవరు నా పలుకును పొల్లుచేసినా, వారు లోకాన్ని అసత్య పరచిన వారౌతారు సుమా! సమవర్తీ, అదేవిధంగా నా వరప్రభావంతో, మృత్యువుతోకూడిన కాలదండానికి ఎదురులేని అమోఘ శక్తిని ప్రసాదించాను! కనుక నీవు దీన్ని విడిచావంటే, రాక్షసరాజు మరణించక తప్పదు! అందువల్ల దీనివల్ల రావణుడు మరణించినా, లేక దీని ప్రభావానికి లోబడక జీవించినా కూడా, నావాక్కు దబ్బర కాగలదుసుమా! కనుక నా వాక్కు సత్యం చేయడానికి, ఈ దండాన్ని విడువకుము!" అని ఆదేశించాడు.

ధర్మపరాయణుడైన సూర్యకుమారుడు ఆయనకు ప్రణామంచేస్తూ "పితామహా, నీవు మమ్ము శాసించేవాడవై నీ వాక్కులు మాకు పరమ ప్రమాణాలు కావడంవల్ల, కాలదండాన్ని విడువను! నిశాచరుడు చంపదగని వాడని, నీవు శాసించడంవల్ల, ఇక నేను ఇక్కడ నిలిచి ప్రయోజన మేమున్నది? అని పలుకుచు, తన ఆయుధాలు, రథంతో అదృశ్యుడై నారదునితో ముచ్చటలాడుతూ, విధాతతో దివ్యలోకాలు చేరాడు. అది చూచిన రావణుడు తాను దక్షిణ దిక్పాలకుని జయించానని పగల్భాలు పలుకుతూ విమానం ఎక్కి దూరంలోనున్న పరివారాన్ని సమీపించాడు. మారీచాది మంత్రులు గాయాలతో నలిగి రక్తంకారే దేహంతో వచ్చిన ప్రభువును ఆశ్చర్యంతో చూచి, జయజయ ధ్వనులతో పుష్పకం ఎక్కారు.

## రావణుడు పాతాళంలో నాగులను జయించుట

తరువాత రావణుడు సముద్రంలో దైత్యులు నాగులచేత రక్షించ బడుతూ వాసుకి పాలించే భోగవతీ పురాన్ని ఓడించి, నివాత కవచులనబడే

దైత్యుల నివాసమైన మణిపురం చేరాడు. బ్రహ్మదేవుని వరం పొందిన ఆ నివాత కవచులు యుద్ధసన్నద్ధులై వచ్చి రావణుడు అతని పరివారంతో సమఉజ్జీలై భీకరంగా ఒక సంవత్సరం యుద్ధం చేశారు. రెండు పక్షాలలో ఏ ఒక్కరూ నెగ్గలేదు.

## బ్రహ్మదేవుడు రావణ, నివాత కవచుల్ని మైత్రిచేసికొమ్మని బోధించుట

ఆ పరిస్థితిలో ప్రజాపతి విమానంలో వచ్చి నివాత కవచులతో "దైత్యులారా, పూర్వం నేను మీకు వరమిచ్చినట్లే, రావణునకు కూడ అమరులు దైత్యులవల్ల మరణం లేకుండునట్లు వరం యిచ్చియున్నాను. కనుక మీరు ఉభయులూ యుద్ధం చాలించి, ఒండొరులలో మైత్రిచేసికొని, ఒకరి సంపదలు మరొకరు కూడ అనుభవిస్తూ సుఖంగా జీవించండి" అని బోధించి ఆ ప్రకారం వారు రావణునితో చెలిమిచేసికోగా, సంతోషించి ఆయన తన లోకం చేరాడు. వారి నుండి రావణుడు నూరు రాక్షస మాయలు నేర్చి, అచట విశ్రాంతిగా సుఖాలనుభవిస్తూ, ఒక సంవత్సరం గడిపాడు.

## రావణుడు కాలకేయులతో పోరాడుట

దశకంఠుడు వరుణ నగరాన్ని వెదకుతూ, కాలకేయులనబడే రాక్షసుల అశ్మనగరం చేరి, ఆ వీరులను యుద్ధానికి ఆహ్వానించాడు. వారు ఎదిరించగా, అతను వారిలో నాలుగువందల మందినీ, వారిలోబాటు పొరబాటున గుర్తించక, తన చెల్లెలు శూర్పణఖ భర్తయైన విద్యుజ్జిహ్వుడనే వీరునీ సంహరించి వారిని ఓడించి, విజయాన్ని పొందాడు.

## రావణుడు వరుణ నగరాన్ని జయించుట

తరువాత విజయియైన రావణుడు అక్కడ నుండి బయలుదేరి, చంద్రకాంతి కలిగి, కైలాసపర్వతం వలెనున్న వరుణ నగరాన్ని సమీ

పించగా, ఆచట తన పాలధారచే, పాలసముద్రాన్ని కల్పించినదీ, నందీశ్వరునకు తల్లీ, చంద్రుని జన్మకారణమైనదీ, తన నురుగుతో తపసులకు జీవనాధారమై, అమృతరూపంలో వేల్పులకు, స్వధారూపంలో పితృదేవతలకు తృప్తికలిగించే సురభి అనబడే కామధేనువును చూచి భక్తితో ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు.

తరువాత చాలమంది భటులచే రక్షించబడుతూ, శరత్కాల మేఘం పంటి తెల్లనిదై, జలధారలతో వ్యాపించబడిన, వరుణ భవనాన్ని చూచి, దానిముఖ్య రక్షకుడు ఎదిరించగా వానిని వధించి మిగిలిన వారితో, తాను రావణుడననీ, వారి రాజును ఎదిరించడానికి వచ్చానని ఆయన చేపయున్న ఎదిరించవలెననీ, చాలనిచో తనకు ఓటబడమని చెప్పుమనీ తెలియజేశాడు.

## రావణుడు వరుణ పుత్రుల్ని పరాభవించుట

ఆ వార్తవిన్న వరుణపుత్రులూ, పౌత్రులూ, గోచాగుడనే సేనాపతితో మహాసైన్యసమేతంగా వచ్చి రావణసైన్యాన్ని ఎదిరించగా, రావణ మంత్రులు ఆ సైన్యాన్ని ఛిన్నాభిన్నం చేశారు. అదిచూచిన వరుణపుత్రులు ఆగ్రహంతో తమ వాహనాలతో మింటికి ఎగిరి, పుష్పకంలో నున్న రావణునిపై బాణాలు చిమ్మారు. అయితే రావణమంత్రి మహోదరుడు, తాను కూడా ఆకాశానికి ఎగిరి, తన గదతో శత్రువుల రథాల్ని వాహనాల్ని నేల కూల్చాడు.

వరుణ కుమారులు నేలకూలినా, త్వరలోనే తేరుకొని, తమ శక్తితో తిరిగి మింటికిపోయి మహోదరుని గాయపరచి, మేఘాలు పర్వతాన్ని ఆవరించినట్లు రాక్షసరాజును ఎదుర్కొన్నారు. అతడు దావాగ్నివలె విజృంభించి, వారిపై బాణవర్షం కురిపించి, నేలకూల్చాడు. పరిచారకులు వారిని ఎత్తుకొని గృహంచేర్చి శైత్యోపచారాలతో సేదతీర్చారు.

అక్కడి వీరులతో దశకంఠుడు తన రాక వరుణునకు తెలుపుమనగా, ప్రహాసుడనబడే వరుణుని మంత్రి ముందుకు వచ్చి "రాక్షసరాజా, మా మహారాజు, బ్రహ్మలోకంలో గంధర్వగానం వినడానికి పోయియున్నాడు. ఆయన కుమారులు, మనుమలు, సైన్యాలతో పోరాడి నీ చే ఓడింపబడ్డారు గదా! రాజులేని సమయంలో నీకు వృధా శ్రమ ఎందుకు?" అని తెలిపాడు. అందుకు రావణుడు అంగీకరించి, తాను వరుణుని జయించినట్లు చాటింపు చేయించి, మంత్రులతో ముచ్చటలాడుతూ విమానంలో లంకకు బయలు దేరాడు.

### రావణుడు ఎందరో మహిళలను బలాత్కారంగా చెరబెట్టుట

ఆ దుష్టుడు తన విక్రమానికి విర్రవీగుతూ కాముకుడై మార్గంలో కానవచ్చిన సుందరులైన, దేవ, దానవ, నాగ, యక్ష, కిన్నర, తాపస రాజకాంతలను కన్యలనూ, అపహరిస్తూ వారికి అడ్డువడిన భర్తలు, సోదరులు, తండ్రులను క్రూరుడై చంపుతూ, ఆ రమణులు ఈడిగింపబడినా, తలలు మోదుకుంటూ ఏడుస్తున్నా నిర్దయుడై వారి చేతులు, పైటలు, కొప్పులుపట్టి లాగీ బలాత్కారంగా నేలపై ఈడ్చి, వారిని విమానంలో పడద్రోసి ముందుకు పోయాడు.

### చెర పెట్టబడిన మహిళల శోకం

ఆ సుందరీ మణులు భయ, శోకాలతో కారిన వేడి కన్నీళ్లు వరదలై సాగరంలో కలిసే నదులవలె, పుష్పకాన్ని నింపాయి. వారిలో నిడుపాటి వేణులు కలవారూ, చంద్రబింబాలవంటి ముఖాలు కలిగినవారూ, సన్నని నడుములు కలవారూ, బంగారు శరీరచ్ఛాయ కలవారూ, రూపవతులు, దేవ కాంతలవంటి శోభకలవారు, నడివయస్సులో నున్నవారు, కన్యలు, శోక, భయ దుఃఖాలకు వశులై నిస్తేజులు, నిస్సహాయులు, దీనులు వివశలై, పొరలుచూ, విడిచిన వేడి నిట్టూర్పులు, వేడి గాడ్పులవలె వ్యాపించగా,

ఆ పుష్పక విమానం, అగ్నిజ్వాలలతో నున్న అగ్ని కుండంవలె కాన్పించింది.

ఇట్లా దుష్టునిచే చెరబెట్టబడిన ఆ తరుణీమణులు నిస్సహాయంగా కేసరికి లోబడిన ఆడకరిణులవలె తల్లిదండ్రులు సోదరులు భర్తలు బిడ్డలను తలచుకుంటూ దీనాలైన ముఖాలు చూపులతో శోకమగ్నలై, తలలు మోదుకుంటూ, దుఃఖభారంతో "అయ్యో భగవంతుడా, ఇంతటి శోక సముద్రంలో మునగడానికి గతజన్మల్లో ఎంతపాపం చేశామో కదా! ఈ పాపి రక్కసుని చెరనుంచి బయటపడటం సాధ్యమౌతుందా? ఓ మృత్యు దేవతా, నీకు పుణ్యం లభిస్తుంది. దుఃఖభాగులమైన మమ్ము వేగంగా నీ చెంతకు తీసికొని పొమ్ము! కటకటా ఈ మనుష్య లోకం కంటె నికృష్ట మైన లోకమున్నదా? ఈ ఖలుడు వుదయించే సూర్యుడు చుక్కల గుంపు లను హరించునట్లు, మా వారందరినీ హతమార్చి, మమ్మల్ని అనాథల్ని చేశాడే? ఇక మాకేది దిక్కు?

"హతవిధీ, దుర్జయుడైన ఈ పలువ, లజ్జలేనివాడై, పరస్త్రీలను హరించడానికి, ఎన్నెన్నో పాపపు ఎత్తులు వేస్తున్నాడే! లోకంలో ఈ పాపిని హతమార్చే రక్షకుడే లేడా?" అని గోలుగోలున విలపించారు.

## చెరపెట్టబడిన మహిళలు రావణుని శపించుట

తరువాత వారు ఆగ్రహంతో రావణు నుద్దేశించి "పరస్త్రీలను కామించడం, మిక్కిలి హేయమూ, పాపకార్యమైనా, ఈ పాపి పరకాంత లైన మమ్ము లోబరచుకోడానికి నానా హింసలపాలు చేస్తున్నాడు? మేము సాధ్వులమైతే, మా వాక్కులు సత్యమై, ఈ దుండగీడు పరకాంత కారణం గానే బంధువులతో నాశనమౌ గాక!" అని ఘోరంగా శపించారు. ఆ సమయంలో అమరులు ఆ సతులపై పుష్పవర్షం కురిపించి దుందుభులు మ్రోగించారు ఆ పతివ్రతల శాపప్రభావం... రావణుని

CENTRAL LIBRARY

ప్రభమాసి తేజోహీనుడయ్యాడు. వాని తపశ్శక్తి క్షీణించింది. అతడు వ్యాకులుడై, తనవారు స్తోత్రపాఠాలు పలుకుతుండగా, లంకలో ప్రవేశించాడు.

## శూర్పణఖ రావణుని నిందించుట

ఆ వెంటనే అతని చెల్లెలు, కామరూపిణియైన శూర్పణఖ భర్తమరణంతో దీనురాలై విరబోసుకున్న తలవెంట్రుకలతో ఆ విమానానికి ఎదురువచ్చి శోకమూర్తియై కన్నీళ్లతో అన్నపాదాలు తడుపుతూ, నేల వ్రాలింది. రావణు డామెను ఆప్యాయంగా లేవనెత్తుతూ "చెల్లెలా ఏమైంది? నీకేమి కావాలి?" అని ప్రశ్నించాడు. ఆమె ఎర్రబడిన చెక్కిళ్లనుంచి ధారగా కన్నీళ్లు కారుస్తూ "అన్నా ఏమని చెప్పమంటావు? నీ ఘోర పరాక్రమంతో, కాలకేయులతో పోరాడుతూ, వీరుడూ యుద్ధంలోనైనా నీ చే చంపతగనివాడూ, నాకు ప్రాణాధిపుడూ అయిన నీ మరదిని సంహరించి, నాకు శాశ్వత వైధవ్యం కలిగించావు గదా? ఇంతటి క్రూరుడైన సోదరుడు లోకంలో ఎక్కడైనా ఉంటాడా?" అని పలికి వెక్కి- వెక్కి- ఏడ్చింది.

## రావణుడు సోదరిని ఓదార్చుట

అతడామెను సాంత్వన స్వరంలో ఓదారుస్తూ "చెల్లెలా, శోకించవద్దు! బుద్ధిపూర్వకంగా నే నీ పాతకం చేయలేదు. యుద్ధ మత్తులో, విజయంకోరి, తీవ్రంగా బాణధారలు కురిపించాను. వీరుడై, తీవ్రంగా సమరం సాగిస్తున్న నీ భర్తను గుర్తించ లేకపోవడంవల్లనే ఈ అనర్థం జరిగింది సుమా! అయితే గతాన్ని మరలించలేము గనుక, దుఃఖించి లాభమేముంది? ఇకపై నీకే లోటు రాకుండా శ్రద్ధ వహిస్తాను. ఇప్పుడే మన పినతల్లి కొడుకూ, మహావీరుడూ అయిన ఖరుని దూషణుని నాయకత్వంలో మెరికలవంటి పద్నాలుగువేల అసురసైన్యంతో, దండకలోని మన స్థావరమైన జన

స్థానంలో నీకు తోడుగా నుంటి, నీకేలోటు రాకుండా చూసే ఏర్పాట్లు చేస్తున్నాను" అని పలికి వెంటనే ఆ ఏర్పాట్లన్నీ చేసి, శూర్పణఖను జన స్థానానికి పంపాడు. తరువాత రాను అపహరించి తెచ్చిన యువతుల్ని విమానం నుండి దింపించి వారిని తన అంతఃపురానికి చేర్పించాడు.

## రావణుడు పెద్దకుమారుడు మేఘనాదుని చూడబోవుట

రాక్షసరాజు ఒకనాడు తన ఉపవనం నికుంభిలలో యజ్ఞంచేస్తున్న పెద్దకుమారుణ్ణి చూడబోయాడు అక్కడ జింకచర్మం, శిఖ, కమండలాలు ధరించి, నూరు యజ్ఞవేదికలమధ్య రెండవ అగ్నిహోత్రునివలె ప్రకాశిస్తున్న మేఘనాదుణ్ణి కౌగలిస్తూ ఆప్యాయంగా "వత్సా, ఇక్కడ నీవు సాగిస్తున్న కార్యకలాపాలు వినిపించుము" అని కోరాడు.

అందుకు యజ్ఞానికి బ్రహ్మ తపస్వియైన శుక్రాచార్యుడు సమాధానంగా "రాక్షసేశ్వరా, నీ కుమారుడు చేస్తున్న మహాకార్యాలు ఆలకించుము! ఇతడు గోమేధ అశ్వమేధ, అగ్నిష్టోమ, రాజసూయ, వైష్ణవయాగాలు బహువిధ దక్షిణలతో పూర్తిచేశాడు. తరువాత దుష్కరమైన మహేశ్వరక్రతువును పూర్తిచేయగా, పశుపతియైన మహాదేవుడు ప్రత్యక్షమై నీ కుమారునకు అంతరిక్షంలో సంచరించే దివ్యరథాన్నీ, తామసీనామకమైన మాయనూ, అజేయమైన మహాధనుస్సునూ అక్షయ బాణ తూణీరాన్నీ అనుగ్రహించాడు. ఈ వీరుడు పైసాధన సంపత్తితో వియత్తలంలో, సురాసురులకు సైతం కానరాకుండా సంచరిస్తూ అమోఘంగా సమరం సాగించగలడు!" అని వినిపించాడు. అందుకు రాక్షసపతి "పూజ్యుడా, మనము తపస్సుతో బ్రహ్మమువలన వరాలు పొందడం యోగ్యంగాని మన వైరులైన ఇంద్రాదులను ఆరాధించడం తగునా? అయినా అందువల్లకూడ మంచిఫలితాలే వచ్చాయి గనుక మేలే జరిగింది. కనుక నగరానికి పోదాము" అని పలికి కుమారుడు విభీషణాదులచు పుష్పకం ఎక్కించుకొని లంక చేరాడు.

## విభీషణుడు అన్నకు కుంభీనసిని మధువు అపహరించెనని తెలుపుట

ధర్మపరాయణుడైన విభీషణుడు పరస్త్రీలను బలాత్కారంగా చెరబెట్టిన అన్న చర్యను నిరసిస్తూ "అన్నా వంశానికీ, ధర్మానికీ, యశస్సుకు శాశ్వతంగా హానికల్గించే విధంగా ఎలపెస్తున్న పరస్త్రీలను హరించి తేవడం నీ వంటివానికి తగునా? దీని ప్రతీకారంగా, యిక్కడ ఏమిజరిగింది ఎరుగుదువా? మన నగరానికి మధువనే రాక్షసుడు వచ్చి, కుంభకర్ణుడు నిద్రలోను, నీ కుమారుడు యజ్ఞంలోను, నేను తపస్సులోను ఉండటంవల్ల మన అంతఃపురం ప్రవేశించి, మన పినతల్లి అనలకుమారి, కుంభీనసీకను నిద్రిస్తుండగా, ఆమెను బలాత్కారంగా అపహరించుకొని పోయాడు. యుక్త వయస్సు వచ్చిన కన్యను సోదరులు యోగ్యుడైన వరునకు వివాహం జరిపి సుకృతం పొందాలి. కాని నీ పాపకార్యాల ఫలితంగా మనకా సుకృతం దక్కలేదు సుమా" అని పలికాడు.

## రావణుడు మధునిపై యుద్ధానికి బయలుదేరుట

ఆ మాటలు విన్న రావణుడు తానుచేసిన మహాపాప పరిణామానికి క్షోభించి సైన్యాధ్యక్షునితో "సేనాపతీ వెంటనే నా మహారథాన్ని సిద్ధం చేయించి, కుంభకర్ణాది మహావీరులతో, నాలుగు అక్షౌహిణీలసైన్యం కదలే ఏర్పాట్లు చేయాలి. మొదట నన్ను ధిక్కరించిన మధుణ్ణి రణాంగణానికి బలియిచ్చి, పిమ్మట దేవలోకాన్ని ముట్టడిద్దాము" అని ఆజ్ఞాపించాడు. సైన్యాధ్యక్షుడట్లు సిద్ధపరచగా, రావణుడు సైన్యాలతో బయలుదేరాడు.

మేఘనాదుడు ముందుభాగాన, దశకంఠుడు మధ్యభాగాన కుంభకర్ణుడు వెనుక భాగాన్నుండి ఆ సేనావాహినులను నడిపించాడు. ధర్మాత్ముడైన విభీషణుడు నగర రక్షణకు నిలిచాడు. రమ రాజు ఇంద్రనగరంపై దండెత్తబోతున్నాడన్న వార్తవిని, పూర్వవైరంతో వందలకొలది పూర్వ రాక్షసులు ఆ సైన్యాలతో బయలుదేరారు.

## కుంభీనసి రావణుని తన భర్తను కాపాడ వేడుట

రావణుడు సైన్యంతో మొదట మధునిపురం చేరగా, ఆ వీరుడు కాన్పించలేదు. అతనిరాకను విన్న రావణుని సోదరి కుంభీనసి, భయంతో గుండె అదురుతుండగా వచ్చి అన్నపాదాలపై వ్రాలింది. అతడామెను సాదరంగా లేవనెత్తి, "చెల్లెలా, భయపడక, నీకు ఏమికావలెనో తెలుపుము" అని పూరడించాడు. ఆమె "అన్నా, నీ మాట నిలుపుకొని, సత్యవంతుడవు కమ్ము ! పరస్త్రీలకు వైధవ్యాన్ని పంచిన దుఃఖంలేదు. కనుక దోషియైన నా భర్తను రక్షింపుము" అని వేడింది.

అతడు అంగీకరిస్తూ "చెల్లెమ్మా, నీవు ప్రార్థించడంవల్ల నీ భర్తను రక్షించాను ! నేను అమరావతిపై దండయాత్రకు బయలుదేరుతుంటే, ఆ వీరుణ్ణి నాకు తోడుగా రమ్మనుము" అన్నాడు. ఆమె సంతోషంతోపోయి, నిద్రిస్తున్న భర్తనులేపి "నాథా, మహావీరుడైన నా అన్న రావణుడు, సురలోక దండయాత్రకు నీ సాయం కోరుచున్నాడు. అందుకు నీవు అంగీకరించి నీ బంధువులతో అతణ్ణి సత్కరించుము" అనగా అతడు సమ్మతించి రాక్షసరాజుకు, సపర్యలు చేశాడు. రావణుడు అక్కడ ఆ రోజు గడిపి, మరునాటి ఉదయం సైన్యాలతో కదలి కైలాస ప్రాంతంలో మజిలీ చేయగా సూర్యాస్తమయమైంది. తరువాత కొంతసేపటికి చంద్రుడుదయించి వెండికొండవంటి నిర్మలకాంతితో శోభించాడు. క్రమంగా బడలిన సైన్యాలన్నీ నిద్రించాయి.

## రావణుడు కామ పరవశుడగుట

అంతట వెండికొండలో ఒక శిఖరంపై కూర్చున్న దశకంఠుడు, ఆ వెన్నెలలో మెరుస్తున్న కర్ణికార, కదంబ, అశోక చంపక చూత పున్నాగ, మొగలి, మొల్ల మందారాది వృక్షాల చిగుళ్లు, మొగ్గలు, పూలగుత్తులను, వికసిస్తున్న కలువలలో శోభిస్తున్న నిర్మల గంగాజలాన్నీ ఆసక్తితో

చూచాడు. సమీపంలోని కుబేరనగరాన్నుండి అప్సరల మధురగీతాలు కిన్నర విద్యాధర దంపతుల ఆటపాటలు విహారాలు, చల్లని పిల్లవాయువులు తన్ను రాగవశుని చేయగా, అతడు నిట్టూర్పులతో జాబిల్లిని చూడ సాగాడు.

రావణుడు రంభను కౌగిలించి వేడుట

ఆ సమయంలో అప్సరల్లో మేటియైన రంభ, పూర్ణచంద్రుని వంటి మొగము మన్మథుని చాపాలవంటి కనుబొమ్మలు చిగురాకులవంటి చేతులు, ఏనుగుతొండాలవంటి వూరువులతో, పరిమళ గంధం పూసికొని దివ్యాభర ణాలు ధరించి కంఠంనుండి ఆరుఋతువుల పుష్పహారాలు సువాసనలు వెద చల్లుతూ వ్రేలాడుచుండగా మందారు పుష్పాలు కురుల్లో ముడుచుకొని, మేఘ మండలలోని మెరుపువలె శోభిస్తూ నల్లని మేలిముసుగు ధరించి నిద్రిస్తున్న సైన్యమధ్యనుండి బెదరుచు పోవడం చూచిన తెంపరియైన రావణుడు తటాలున ఆమె కెదురుగా పోయి వణకుచున్న ఆమె హస్తాన్ని పట్టుకొని ఆమెతో "సుందరీమణీ నీవు ఎక్కడికి, ఎవ్వరిని అనుగ్రహించ డానికి పోతున్నావు ?

"కుసుమకోమలీ పురుషుల్లో, విష్ణు, ఇంద్ర, వరుణ అశ్వినీదేవతలు సైతం విక్రమంలోగాని, సౌందర్యంలోగాని నాతో సరితూగలేరుసుమా ; నేను ముల్లోకాలకు విధాతను, ప్రభువులందరికీ ప్రభుడను ; లోక ప్రఖ్యాతుడ నైన దశకంఠుడను, కామవశుడనై నిన్ను వేడుచున్నాను. నన్ననుగ్రహిం పుము" అని ప్రార్థించాడు.

రంభ తన్ను విడువుమని రావణుని వేడుట

ఆ కోమలాంగి భయంతో గజగజ వణకుతూ, లలనికి రెండు చేతులూ మోడ్చి మ్రొక్కుతూ "అయ్యా, నాకు పూజ్యుడవైన మామవై యుండీ, నీ విట్లు నీతికి విరుద్ధంగా పలకడం న్యాయమా ? నేను నీకు

కూతురువంటి వావికల కోడలిని కదా! ఇతరు లెవరైనా నాకు అపచారం చేస్తే, రక్షించవలసిన నీ విట్టి నీచపు పలుకులు పలకడం భావ్యమేనా?

"రాక్షసేంద్రా, నేను నీకు కోడలి నెట్లైతి ననుచున్నావా? వినుము. నీకు సాక్షాత్తు అన్నయైన కుబేరునికి ప్రాణాలకంటె ప్రియ కుమారుడైన నలకూబరునికి నేను భార్యను కావడంవల్ల నీకు కోడలినే. ఆ పుణ్యుడు ధర్మాచరణలో విప్రుడు, శౌర్యంలో అగ్నికి సమానుడు! ఆయన్ని అల రించిదానికే నేను పోవుచున్నాను. ఆయన నా కొరకు ఎదురుచూస్తూంటాడు. మామా, నాకు ఆరాధ్యుడవైన నీవు సజ్జనుల పథంలో నిలచి నన్ను విడువ మని వేడుకొంటున్నాను" అని దీనురాలై పెక్కు విధాల ప్రార్థించింది.

## రావణుడు రంభను భంగపరచుట

కాని ఆ ధూర్తుడు సమాధానంగా "రంభా, సురలు ఏకపత్నీవ్రతు లైనట్లు, నన్ను మామా అనుచున్నావా? మీ లోకంలో అట్టి వావివరుస లెక్కడివి?" అని పలుకుచు కర్కశుడై ఆమెను భంగపరచి విడిచాడు. అంతట ఆ కోమలి, ఆభరణాలు చిక్కుపడి, పుష్పహారాలు వికలాలై రాలుచు, చెదరిన కొప్పుతో, మదగజం జల్లులాడగా, కల్లోలమైన సరస్సు వలె, వాడి వాలిన ముఖంతో, వణకుచు దీనత్వంతో వెక్కివెక్కి ఏడ్చుచు పోయి నలకూబరుని పాదాలపై వ్రాలింది.

## నలకూబరుడు రావణుని శపించుట

అతడు ఆమె స్థితికి చలించి "చెలువా, ఏమైంది? నీకీ దుస్థితి కలి గించిన దురాత్ము డెవడు? తెలుపుము" అని ప్రశ్నింపగా, ఆమె నిట్టూ రుస్తూ, జరిగినదంతా వినిపించింది. అతడు తన ధ్యానస్థితితో సర్వము గ్రహించి, క్రోధంతో నేత్రాలు జేవురించగా ఆచమనంచేసి, జలను తాకి, రావణుని ఉద్దేశించి "పాపియై తన్ను కామించని, ఈమెను భంగపరచిన కూళ రావణుడు, నేటినుండి తన్ను ఒల్లని ఏ యువతినైనా బలాత్కారం

చేరాదా, వాని తల ఏడు వ్రక్కలు అగుగాక!" అని ఘోరంగా శాపమిచ్చాడు. ఇట్లు శపించిన ఆ మహాత్మునిపై సురలు పూలజల్లు కురిపించి, దుందుభులు మ్రోగించారు. అది తెలిసికొన్న వాణీవల్లభుడు, వేల్పులు, పితృదేవతలు, ఋషులు ఆనందించారు. శాప సంగతి తెలుసుకున్న లోకంలోని పతివ్రతలు నలకూబరుని శ్లాఘించి, నిర్భయు లయ్యారు. రావణుడా విషయం హెచ్చరికగా తీసికొని, భీతిచెంది పరస్త్రీలను భంగపరచడం మానుకున్నాడు

## దశకంఠుడు దేవలోకంపై దండెత్తుట

రావణుడు సైన్యంతో కైలాస ప్రాంతాన్నుండి బయలుదేరి, అమరావతిని సమీపించి తన ఆయుధాల ధ్వనులు, సైనికుల సింహనాదాలతో సముద్ర మథనంవలె మహా కల్లోలం కలిగించాడు. ఆ మహాధ్వనికి దేవేంద్రుడు సంచలించి, తన్ను చూడవచ్చిన ఆదిత్యులు, వసువులు, రుద్రులు, దేవగణాల్ని చూచి, దురాత్ముడైన రావణుడు తమతో పోరాటానికి వచ్చాడని, కనుక యుద్ధ సన్నాహాలు చేయుడ"ని హెచ్చరించగా, వారా యత్నాల్లో నిమగ్నులయ్యారు.

తరువాత నిర్జరరాజు, దీనత్వంతో మహావిష్ణు సాన్నిధ్యానికిపోయి ఆయనకు ప్రణామం చేస్తూ "లోకేశ్వరా, వీరుడైన రాక్షసపతి రావణుడు విధాత వరశక్తితో, మత్తిల్లి మాపై దండయాత్రకు వచ్చాడు. వరశక్తితో వాడు దుర్జయుడు కావడంవల్ల, నేను లోగా నీ సాహాయ్యంతో బలి, నరక, వృత్ర శంబరాసురాదుల్ని సంహరించినా, వీనిని ఎదుర్కోవడానికి వెనుదీస్తున్నాను!

"ప్రభూ, మధుసూదనా, సచరాచర సృష్టికి మూలకారణుడవూ, పోషకుడవూ, లయకర్తవూ అయిన నీ ఆజ్ఞ ఏమి? ఈ దానవ రాజును నన్నే ఎదిరించమంటావా? లేక నీవు పూనుకుంటావా? సెలవిమ్ము" అని వేడుకున్నాడు.

## మాధవుడు ఇంద్రునితో యుద్ధానికి రానని తెలుపుట

అతనికి సమాధానంగా కేశవుడు "మహేంద్రా, జరుగవలసిన పని వినుము. ప్రస్తుతం రావణుడు లోబడడు గనుక సురాసురు లతణ్ణి జయించ లేరు. ఇప్పుడు వాడు పుత్రుని సాయంతో ఒక అకృత్యం చేస్తాడు. నేను యుద్ధంలో దిగితే, శత్రువులను హతమార్చనిది, వెనుకకు తిరుగనని నీ వెరుగుదువు గదా! అయినా రావణుని వరశక్తివల్ల యిప్పుడది సాగదు. గనుక నేను సమరంలో పాల్గొనజాలను! పాకశాసనా, మరి కొంతకాలం గడచాక, రావణుణ్ణి బలగంతో నేను సంహరిస్తానని శపథం చేస్తున్నాను. ఇది నీవు గుర్తించి, నీ సైన్యాలతో నిర్భయంగా అతణ్ణి ఎదుర్కొనుము" అని ఆజ్ఞాపించాడు.

## దేవ, దానవ సంగ్రామం

అంతట నిర్జరరాజు సన్నద్ధులై వచ్చిన తన వాహినులతో పోయి రాక్షస సైన్యాలతో తలపడ్డాడు. రావణునితో మంత్రులు, సేనాపతులైన ప్రహస్త, మారీచ, అకంపన, త్రిశిర, దూషణ, దేవాంతక, నరాంతక, నికుంభ, యజ్ఞకోప, జంబుమాలి, శుక, సారణ, సంహ్లాద, సూర్యశత్రు, సుప్తఘ్న, దుర్ముఖ, ధూమకేతు, కరవీరాక్ష, అతికాయ, మహాకాయ, మేఘనాదాది మహావీరులు తమ మహాయుధాలతో శత్రులపై ఉరవడించి, మహావాయువు మేఘాల్ని చెదరగొట్టినట్లు పోరాడారు. అప్పుడు వసువుల్లో వీరుడైన సావిత్రుడు, అల్ప మృగాల్ని వేటాడే కోపపు సింగంవలె, అసురుల్ని హతం చేశాడు.

అదే విధంగా అదిత్యుల్లో మహావీరులైన త్వష్ట, పూషులు, దైత్యులతో తీవ్రంగా పోరాడారు. అసుర వీరుల్లో సుమాలి, క్రోధంతో తీవ్ర శరాలు చిమ్మి, సురలను నేలకూల్చి, వసువులతో భీభత్సంగా పోరాడాడు. సావిత్రుడా వైరిని తీవ్ర విశిఖాలతో ఎదిరించి, అతని రథాన్ని కూల్చి,

వజ్రంవంటి తన గదను అతనిపై విసరగా ఆ వీరుడు తల, కాయం గుర్తు తెలియకుండ ముద్దగా నేలపడ్డాడు. అతని తోడివారు, భీతితో దిక్కులకు పరుగెత్తారు.

## జయంత, మేఘనాదుల పోరాటం

అంతట మేఘనాదుడు, పరుగులెత్తే వారికి అడ్డుపడి, నిలువరించి, తన శరవృష్టితో అమరసైన్యాల్ని ముంచగా, వారు నిలువజాలక, పలాయనమయ్యారు. అంతట ఇంద్రుడు, తన వారికి ధైర్యం కలిగించి, వారిని వెనుకకు మరల్చి, రావణితో పోరాడాడు. ఇంతలో అయన కుమారుడైన జయంతుడు తన మహారథంతో ముందుకువచ్చి, ఆ వైరితో తలపడగా దేవ సైన్యాలు అతనిచుట్టూ చేరాయి. రావణి, శత్రువు సారథిని తన ములుకులతో నొప్పించాడు. జయంతుడు వెనుదీయక వైరిపై తీవ్రవిశిఖాలు కురిపించాడు. మేఘనాదుడు అతనిపై శరవర్షం కురిపించాడు. అంతేగాక ఆ మాయావి తన మాయాశక్తితో కృత్రిమచీకట్లు కల్పించి గదలు, శతఘ్నులు ఖడ్గ శూలాలు రువ్వి, తిప్పలుగా కురిపించాడు. ఆ చీకటితెరల వల్ల, తమవారు, ఎదుటవారని గుర్తుతెలియక, అసురులు అసురుల్నీ, సురలు తమవారినీ తెగటార్చారు.

ఆ సమయంలో శచీదేవి తండ్రియైన పులోముడు, తన మనుమనికి కీడు జరుగవచ్చునని శంకించి, జయంతుణ్ణి యుద్ధభూమినుండి తొలగించి, సాగరంలోని తన మందిరానికి తీసికొనిపోయాడు. తమ యువరాజు అదృశ్యుడు కావడంతో దేవ సైన్యాలు, నిరుత్సాహంతో యుద్ధరంగాన్నుండి పలాయనమయ్యాయి. వైరుల విజృంభణ, తన సైన్యాలు వెనుకంజ వేయడం చూచిన వాసవుడు మాతలి సిద్ధపరచి తెచ్చిన రథంఎక్కి రణ రంగానికి వచ్చాడు.

## మహేంద్ర, రావణుల యుద్ధం

అప్పుడు వాయు ప్రేరితాలైన మేఘాలు మెరుపులతో గర్జిస్తూ దిక్కులు అలముకొన్నాయి. అప్సరలు నాట్యమాడగా, గంధర్వులు వివిధ వాద్యాలు ప్రయోగించారు. తమ నాయకుని వెంట వసువులు, రుద్రులు ఆదిత్యులు, సాధ్యులు, మరుత్తులు, ఆయుధాలతో వెంబడించారు. అయితే కీడు సూచిస్తూ, వాయువులు చిందరవందరగా విసరడం, ఉల్కాలు రాలడం, భాస్కరుడు నిస్తేజుడు కావడంవంటి అశుభ శకునాలు వారికి ఎదురయ్యాయి.

వైరులు సిద్ధపడటం చూచిన రాక్షసరాజు విశ్వకర్మ నిర్మించి, వేడి నిట్టూర్పులు విడిచే సర్పాలచే ఆవరించబడిన మహారథాన్ని సారధి సిద్ధపరచితేగా ఎక్కి, కుమారుని విశ్రాంతి తీసుకొమ్మని తెలిపి, ఉభయ పార్శ్వాల్లో సైన్యాలు నడువగా పోయి, తాను దేవేంద్రుని ఎదిరించాడు. ఉభయసైన్యాలు మేఘాలు వర్షించే విధంగా భీషణంగా పోరాడాయి.

అప్పుడు కుంభకర్ణుడు భీకరాలైన శస్త్రాలు, ఖడ్గశూలాలతోనూ, మోకాళ్లు మోచేతులతోనూ మోదుచు గుట్టుగా శత్రువులను కూల్చాడు. రుద్రులు అతణ్ణి ఎదుర్కొని వివిధాలైన ఆయుధాలతో మోదగా రక్తం ధారగా కారింది. ఇట్లే వారు అసురులపై పదు బాణాలు, ఆయుదాలను వర్షించి సింహాలు అల్పమృగాల్నివలె తరిమి కొట్టారు. ఆ భయంకర సమరంలో కాళ్ళు, చేతులు, తలలు తెగిపడ్డవారు, వాహనాలతో నేల కూలే వారు, కంచరగాడిదలు, అశ్వాలు, రథులు, ఒంటెలశవాల మాటునదాగి ప్రాణాలు దక్కించుకొనేవారూకాగా, రణరంగంలో నెత్తురు సెలయేరులై పారింది.

ఈ విధంగా తన సైన్యం శత్రువులచే గగ్గోలుపడటం చూచిన దశకంఠుడు, శత్రుభయంకరుడై తన మహా ధనుస్సుకు పందలకొలది బాణాలు సంధించి, దేవసైన్యాల ఉద్ధతిని మాన్చి వాసవుణ్ణి ముట్టడించాడు.

అతడును విజృంభణతో, తన శింజినీ ధ్వనితో దిక్కులు మార్మోగించి, అగ్నిశిఖలవంటి కోట్లకొలది అమ్ములతో వైరిని నొప్పించాడు. రావణుడు సైతం అడ్డుచేయగా వారి శరపాతంతో భూమిని చీకట్లు ఆవరించాయి. అయినా ఆ చీకటిలోనే ఉభయసైన్యాలు ఘోరంగా పోరాడారు. సురలు విజృంభణతో పైచేయి అయి, రాక్షససైన్యాల్ని గుట్టలుగా కూల్చారు.

## రావణుడు శత్రు మధ్యంలో ప్రవేశించి పోరుట

ఆ పరిస్థితికి ఆగ్రహించిన రావణుడు, క్రోధంతో నేత్రాలు ఎర్రబడగా, సారథితో "ఓయీ. దీనికి ప్రతీకారంగా, నేడు ఇంద్రుని సహా, అమరులందరినీ నిర్మూలించేస్తాను! కనుక మనరథం శత్రు మధ్యానికి పోనిమ్ము" అని హెచ్చరించగా, అతడట్లు చేశాడు. అదిచూచిన మహేంద్రుడు తనవారితో "వీరులారా, పర్వకాలంలో పొంగే సాగరంవలె నిశాచరరాజు మన సైన్యమధ్యంలో ప్రవేశిస్తున్నాడు. విధాత వరంవల్ల యితడు అవధ్యుడైనా, యితణ్ణి చుట్టుముట్టి బంధిద్దాం". అని హెచ్చరించి, శత్రువు ఉత్తరదిక్కునుండి తన సైన్యాల్లో చొరబడగా, తాను దక్షిణ దిక్కునుండి, రాక్షససైన్యాన్ని హతమార్చసాగాడు. రావణుడు దేవతా సైన్యంలో చిక్కి కానరాకపోగా, రాక్షస సైన్యాలు అతడు శత్రువులకు చిక్కాడని బెదరులో, హాహాకారాలు చేశారు.

## మేఘనాదుడు మాయతో దేవేంద్రుని బంధించుట

తనవారి ఆర్తనాదాలు విన్న రావణ జ్యేష్ఠకుమారుడు ఆగ్రహంతో వేగంగా రథమెక్కి, తనకు శంకరుడు ప్రసాదించిన మాయతో, సురల మధ్యంలో కానరాకుండ ప్రవేశించి, ప్రచండ విక్రమంతో నిర్జరరాజును బాణాలతో నొప్పించాడు. వాసవుడు తన వైరి, కవచం కూలి సమీపంలోనే వున్నా, కానరానందువల్ల ఏమిచేయుదునా అని యోచిస్తుండగా, రావణి మాతలిని తబ్బిబ్బగునట్లు తన శరాలతో మోదాడు. అప్పుడు వజ్రపాణి

రథం దిగి, ఐరావతం పైకి దూకి, వైరిని అన్నివైపుల వెతకసాగాడు. రాక్షస యువరాజు అదృశ్యుడుగానే ఉండి, అన్నివైపుల నుండి, శత్రువు లోబడే విధంగా అమ్ములతో నొప్పించి తరువాత మహాస్త్రంతో కట్టి ఆయన్ని తన రథానికి బంధించికొని పోయాడు.

వాసవుడు కానరానందున, వసువులు, ఆదిత్యులు ఆయన్ని ఎవడో శత్రువు తీసికొని పోతున్నాడని గ్రహించి రావణుణ్ణి చుట్టుముట్టి, ఘోర బాణాలతో అతని కాళ్ళు, చేతులు ఆడకుండ చేసారు. రావణుడు పీలావడి, శరీరమంతా చిల్లులువడి రక్తం కారుచుండగా, ఎదిరించే శక్తిలేక దీనుడయ్యాడు. ఆ సమయంలో రావణి అతణ్ణి సమీపించి "తండ్రీ, వజ్రపాణి మనకు బందీకాగా, సురలు దిక్కులకు పరుగెత్తుచున్నారు. నీ విక్రమంతో మనకు విజయం లభించింది। కనుక నీవు కుదుటపడి, మన సైన్యాలు పోరు చాలించునట్లు ఆజ్ఞాపించుము" అని పలికాడు.

ఆ మాటకు గుండె కుదుటపడగా, ఆ మహావీరుడు అమందానందంతో, యుద్ధం చాలించి, కుమారుని గాఢంగా కౌగలించుకొని "కుమారా ఎంతటి అద్భుతవార్త వినిపించావు। ముల్లోకపతిని బంధించి, అనిమిషుల్ని ఓడించి, మన వంశానికి ఎంతటి మహాఖ్యాతి సంపాదించావయ్యా। ఈ మహా విజయం నీదే। కనుక మహేంద్రుణ్ణి నీ రథంలోనే బంధించి, సైన్యాలన్నిటితో లంక ప్రవేశించుము। మంత్రులతో, నేను నీ వెంబడినే వస్తాను" అని పలుకగా, మేఘనాదుడు అట్లేచేసి తన యోధుల్ని వారి వారి నివాసాలకు పంపి తన మందిరం చేరాడు.

మేఘనాదుడు వృత్రవైరిని బందీచేసి లంకకు తీసికొనిపోగా, దేవతలు పీడితులై, ప్రజాపతిని ప్రార్థించి, ఆయనతో లంక చేరారు. ఆ మహాత్ముడు సురలతో ఆకాశంలో నిలచి, కుమారుణ్ణి శ్లాఘిస్తూ, తన వారితో కొలువుకూటంలోనున్న రావణుణ్ణి సంబోధిస్తూ "వత్సా, రావణా, నీ కుమారుని విక్రమాన్ని అభినందిస్తున్నాను। నీకు సమానుడో కాక మిన్నయో

అయిన అతని విక్రమం ద్వారా నీవు దిక్పాలకు లందరిని జయిస్తానన్న నీ ప్రతిజ్ఞ నెరవేర్చుకోగలిగావు. అతడు ఇంద్రుని ఓడించడంవల్ల ఇంద్ర జిత్తను బిరుదుతో శాశ్వతమైన ఖ్యాతి పొందగలడు సుమా!

''మీ కోరిక నెరవేరడంవల్ల మహేంద్రుణ్ణి విడిచిపెట్టుము. అందుకు ప్రతిఫల మేదైనా కోరితే యివ్వగలను!'' అని పలికాడు.

ఆయనకు మేఘనాదుడు సమాధానంగా "లోకపతీ, నీవు కోరిన ప్రకారం వాసవుని విడుదల చేస్తాను. ప్రతిఫలంగా నాకు అమరత్వం అనుగ్రహింపుము" అని వేడుకున్నాడు. అందుకు పరమేష్ఠి "వీరుడా, జగతిలో పక్షులు చతుష్పాద జంతువులు సహా జీవకోటిలో ఎవ్వరికీ మృతి లేని జీవనం సాధ్యం కాదు'' అని తెలిపాడు.

ఇంద్రజిత్తు కొద్దిగా యోచించి "భగవానుడా, అది సృష్టి నియమ మైనచో, దానికి బదులు నేను సమరానికి బయలుదేరడానికి ముందు, అగ్ని హోత్రుని మంత్రాలతోను, ఆహుతులతోను అర్చించి, ఆయననుండి వెలు వడే ఆయుధ సామగ్రి, తురగాలతో కూడిన రథాన్ని ఎక్కి సాగించే యుద్ధంలో నేను శత్రువులకు అజేయుడ నగునట్లూ, ఆ యాహుతులు పూర్తి కాకముందే నేను రణాంగణం ప్రవేశించవలసివస్తే, వైరివల్ల నేను మర ణించునట్లూ వరం అనుగ్రహిస్తే, అమరేంద్రుని విడుస్తాను. "కమలాసనా, ఇతరులు తపశ్శక్తితో నీవల్ల వరాలు పొందగా, నేను భుజశక్తివల్లనే వానిని నీ వద్దనుండి పొందదలచాను'' అని విన్నవించాడు. సృష్టికర్త అంగీక రించగా, రావణి వాసవుని విడిచిపెట్టాడు.

### విధాత ఇంద్రునికి స్వయం కృతాపరాధంవల్లనే పరాభవించబడినట్లు తెలుపుట

పిమ్మట పితామహుడు తేజోహీనుడు చింతాక్రాంతుడైన ఇంద్రుణ్ణి సురలతో దివ్యలోకానికి తీసికొనిపోతూ అతనితో "ఓయీ వాసవా, రం

పరాభవం నీ స్వయంకృతాపరాధ ఫలితమే సుమా! వివరాలు వినుము. పూర్వం నేను బుద్ధితో సంకల్పించి, ఏకవర్ణం, ఏకభాష, వయో సౌందర్యాలలో భేదాలు లేకుండా జనులను సృష్టించాను! కొంత కాలం గడచాక, విశిష్టమైన మార్పు కలిగించతలచి ప్రజల అవయవాలనుండి నిగ్గుతీసి, దానితో గుణ, సౌందర్య నిధానమైన ఒక రమణీమణిని సృష్టించి, ఏ వికారంలేని ఆమెకు అహల్య అని పేరు పెట్టాను. పిమ్మట ఆమెను ఎవరి కిత్తునా యని యోచించుచుంటిని.

"ఇంద్రా ఆది గ్రహించిన నీవు, పదవినిబట్టి నీకంటె అధికు డెవ డుంటాడనే అహంకారంతో నన్ను సమీపించి, అహల్యను పత్నిగా నీ కిమ్మని వేడావు. కాని నేను అంగీకరించక, ఆ కన్యను మహాతపస్వియైన గౌతమ మహర్షికి పరిచర్య చేయమని, ఆయనవద్ద పెక్కు సంవత్సరాలు యుల్లదగా వుంచాను. ఆ నియతాత్ముడు నిర్వికారుడై ఆమెను తిరిగి నా వద్దకు పంపాడు. నే నాయన నిగ్రహ, తపస్సిద్ధులను మెచ్చి అహల్యను ఆయనకే పరిణయం చేశాను.

"ఇంద్రా, వారు సుఖంగా జీవిస్తుండగా, నీవు అసూయాగ్రస్తుడవై ఒకనాడు ఆ ధర్మాత్ముడు లేని సమయంలో, వారి ఆశ్రమం ప్రవేశించి, అగ్నిశిఖవంటి ఆయన ఇల్లాలి శీలాన్ని హరించావు! ఇంతలోనే పర్ణశాలకు వచ్చిన ఆ తపస్వి, పాతకివైన నిన్ను రోషంతో చూస్తూ "ఖలుడా, ఈ విధంగా నిర్భయుడవై, నా పత్నిని మలినపరచడంవల్ల, నీవు యుద్ధ రంగంలో శత్రువుకు చిక్కి, స్థానభ్రష్టుడవయ్యెదవు గాక! నీవు కారకుడ వైన యీ జారత్వ దోషం యికమీదట లోకంలోకూడ వ్యాపించి, ఆ పాప ఫలంలో సగం కర్తకు, మిగత సగం, యీ దుష్టవ్యసనానికి మూలకారకుడ వైన నీకు సంక్రమించుగాక! పలుగాకీ, అంతేగాక, ఉత్తమమైన నీ పదవి శాశ్వతం కాబోదు! మరియు నీ స్థానంలో వచ్చేవాడు సైతం యీ వ్యసనంతో భ్రష్టుడౌతాడు!" అని ఘోరంగా శపించాడు. (ఈ శాపము బాలకాండలో నీయబడిన శాపానికి అనుబంధమేగాని, వేరుకాదు).

తరువాత ఆయన ఆశ్రమంలో అహల్యనుచూచి గర్జిస్తూ "దుష్టురాలా, అపురూప రూపవతిననే ఏ అహంకారంలో, నీవీ నైచ్యానికి లోబడ్డావో, ఆ సౌందర్యం నశించి ఈ వాకిటనే పడియుందువు గాక! అంతేగాక, నేనొక్కతెనే సౌందర్యరాశిననే నీ మిడిసిపాటు తొలగునట్లు, లోకంలోని స్త్రీలలో సౌందర్యం సాధారణ మగుగాక" అని తిట్టాడు. అప్పుడు భర్త ముందు అహల్య పశ్చాత్తాపంతో తలవాల్చి "నాథా, ఆ చపలుడు నీ రూపంతో సమీపించడంవల్లనే నేను దోషం చేశాను. గాని కాముకురాలనై పొల్పడలేదు. కనుక నా అజ్ఞానానికి విముక్తి తెలుపండి" అని వేడింది.

ఆ మహా తపస్వి సమాధానంగా, "తరుణీ, మహాబాహుడైన విష్ణుమూర్తి, ఇక్ష్వాకువంశంలో రాముడనే విఖ్యాత నామంతో, సత్య ధర్మపరాయణుడై జన్మించి, ఒక బ్రాహ్మణకార్యం నెరవేర్చ యీ ఆశ్రమానికి రాగలడు! ఆయన దర్శనంవల్ల నీ ఘోరపాతకం తొలగి, పవిత్రురాలవు కాగలవు! ఆ మహాపవిత్రుడు మాత్రమే నీ పాపాన్ని తొలగించగల సమర్థుడు! ఆ పావనమూర్తికి ఆతిథ్యమివ్వడంవల్లనే, నీవు తిరిగి నా సాన్నిధ్యంలో నివశించగలవు!" అనిపలికి ఆయన ఆశ్రమంలోనికి పోయాడు.

"శక్రా ఆ మహర్షి శాపంవల్లనే, నీకీ దుర్దశ కలిగింది! ఈ దోష శాంతికోసం నీవు వైష్ణవయాగంచేసి. పవిత్రుడవై నీ లోకానికి పొమ్ము! ఇక నీ పుత్రుడు కానరాలేదని విచారించనక్కరలేదు. అతడు తన తాతగారి వద్ద సుఖంగా వున్నాడు" అనిపలికి తన లోకం చేరాడు. ఆయన ఆజ్ఞానుసారంగా మహేంద్రుడు యజ్ఞంచేసి, తన లోకం ప్రవేశించాడు.

ఈ విధంగా అగస్త్యమహర్షి పాకశాసనుని నిర్జించిన ఇంద్రజిత్తు బల ప్రతిష్టలు వినిపించగా, శ్రీరామచంద్ర, లక్ష్మణులు, కొలువులోనున్న వానర, రాక్షసవీరులు ఆశ్చర్యపడ్డారు. రాముని సమీపంలో కూర్చున్న విభీషణుడు, తాను ఎన్నడో ఎరిగిన గాథను మహర్షి వివరంగా వినిపించా

రని శ్లాఘించాడు. అంతట రాఘవుడు ఆయనకు అంజలిచేస్తూ "మహర్షి శేఖరా, రావణుడీవిధంగా విశృంఖలంగా రాజులను ఓడిస్తుండగా, అతణ్ణి నిర్జించగల రాజుగాని, రాజువంటి శౌర్యవంతుడు గాని భూలోకంలో కరువయ్యారా? క్షత్రియులంత నిస్తేజులయ్యారా?" అని ప్రశ్నించాడు.

## రావణుడు కార్తవీర్యార్జునితో పోరాడబోవుట

శ్రీరామమూర్తి మాటలువిన్న మహర్షి చిరునవ్వుతో "రఘుశేఖరా, రావణుని ఎదుర్కొని, పరాభవించిన కార్తవీర్యార్జునుడు, వాలివంటి మహా వీరులున్నారు. అందు కార్తవీర్యార్జునుని గాథ ముందు వినిపిస్తాను. ఆలకింపుము! రావణుడు విక్రమగర్వంతో పృథ్వీ రాజులను వేధిస్తూ, అమరావతి వంటి మాహిష్మతీ నగరాధీశుడైన కార్తవీర్యార్జునుడు మేటి బలశాలియని తెలుసుకొని అతనితో పోరాడదలచి ఒకనాడా నగరానికిపోయి, తనరాకను ప్రకటించాడు. ఆ రాజు మంత్రులు నాడు రాజు నగరంలో లేడని తెలియ చేశారు.

వెంటనే రాక్షసరాజు మంత్రులతో బయలుదేరి, సమీపంలో భూమిని పెకలించుకొని వచ్చినట్లు కానవస్తూ, హిమాలయంవలె ఆకాశాన్నంటుతున్న వాయన్నట్లుండి పెక్కు శిఖరాలపై దేవ, దనుజ కిన్నర గంధర్వులు, పత్నులతో విహరిస్తుండటం, సింహాది మృగాలు నివశించే పెక్కు గుహలు, అనేక సెలయేళ్ళు స్ఫటికంవంటి నిర్మల జలాలతో అట్టహాసంగా నేలకు దూకుచుండగా స్వర్గంవలె శోభిస్తున్న వింధ్య పర్వతాన్ని ఆనందంతో చూచాడు

తరువాత అతడు అచటనుండి కదలి, సమీపంలోనే తూర్పుదిక్కు నుండి చల్లని స్వచ్ఛజలాలతో పడమటి సముద్రంవైపు ప్రవహిస్తున్న నర్మదా నదిని సమీపించాడు. అచటి సింహ శార్దూల మత్తగజాలు నదిలోదూకి నీరు త్రాగుచుండటం, ఆ జలాల్లో హంసలు, చక్రవాకపు జంటలు, నీటికోళ్ల

వంటి జలపక్షులు ఉల్లాసంగా తిరుగుచు మనోహర ధ్వనులు చేస్తుండటం హర్షంతో చూచాడు. నదీతీరంలోని విశాలాలైన ఇసుక దిబ్బలు, వివిధ రంగుల పుష్పాలతో ఒద్దుననున్న వృక్షాలు శోభకలిగించు చుండెను. పుష్ప రేణువుల పరిమళంతో ఆ నదీ జలాలను చల్లని జలాలతో చందనం అలము కొన్నట్లుండి హాయి కలిగించగా, రావణుడు తృప్తి కలుగునట్లు స్నానం చేసివచ్చి మంత్రులతో తీరంలో కూర్చుండి వారితో వుల్లాసంగా "సచివులారా, గంగవంటి ఖ్యాతికలిగిన ఈ నర్మదానది ఎంత మనోజ్ఞంగా వుందో గమ నించారా? భాస్కరుడు మింటినడుమ బంగారు కిరణాలతో సూటిగానున్నా, నేనిక్కడ వుండటంవల్ల జంకుతూ కిరణాలతో వేడిచూపక, జాబిల్లివలె కానవస్తున్నాడు! అట్లే వాయువు నా భీతితో నదీ జలాలవల్ల, చల్లబడిన పిల్లగాయిలలో కొల్లలుగానున్న పుష్పాల సుగంధాన్ని నాకు కానుకగా చేరవేస్తూ హాయి కలిగిస్తున్నాడు! వీరులారా, మీరందరూ దేవతాశ్రేష్ఠులతో భీకరయుద్ధాలుచేసి గాయాలనుండి నెత్తురుకారగా గాసి చెందారు! కనుక మీరంతా శ్రమ తీరునట్లు నదిలో గజరాజులవలె స్నానాలు చేసిరండు. మీరు వచ్చిన పిమ్మట నేనీ ప్రదేశంలో పశుపతిని ఆరాధిస్తాను" అని పలికాడు.

## రావణుడు శివపూజ చేయుట

శుక, సారణ ప్రహస్త, మహోదర ధూమ్రాక్షులనబడు ఆ మంత్రులు మదపుటేనుగులవలె నదీజలాలను కల్లోలపరుస్తూ స్నానలు చేసి వచ్చి ఆ తీరంలో సమృద్ధిగా నున్న పుష్పాలను కోసితెచ్చి రాశిగా ఆయన ముందుపోశారు. దశకంఠుడు తిరిగి స్నానంచేసివచ్చి సమాధిలో నుండి జపంచేసి, తరువాత అచట వేదిక ఏర్పరచి, తాను నిత్యం పూజించే సువర్ణ లింగాన్ని ఆ వేదికపైనుంచి గంధపుష్పాలతో పూజించి సామగానంచేస్తూ, చేతులు పైకెత్తి నృత్యం చేశాడు.

## కార్తవీర్యార్జునుడు భుజాలతో నర్మద జలాలను అడ్డగించుట

ఆనాడు తన భార్యలతో నర్మదలో జలక్రీడకు వచ్చిన కార్తవీర్యార్జునుడు రావణుడు శివపూజచేస్తున్న ప్రదేశానికి ఎగువను, వారితో ఆడఏనుగుల సమూహంలో గజరాజువలె ఆ జలాల్లో విహరిస్తూ, తన వేయి బాహువుల శక్తిని పరీక్షించడానికి వేగంగా ఆ నదీ జలాలను తన చేతులతో అడ్డగించగా, పడమటిదిక్కుగా పారుతున్న ఆ నదీజలాలు చేపలు, మొసళ్లు, పైనరాలిన పుష్పాలతో వెల్లువగా వెనుకకు మరలాయి. ఆ వెల్లువలో రావణుని పూజా వస్తువులన్నీ కొట్టుకొని పోయాయి.

అందువల్ల రావణుడు మధ్యలో పూజచాలించి, పడమటదిశగాపారే ఆ నదీజలాలు వెనుకకు ఎట్లు వచ్చాయో చూచిరమ్మని, కుడిచేతివేళ్లతో శుకసారణులకు సైగచేశాడు. వారు ఆకాశంలో ఎగురుచుపోయి, అర్ధ యోజనం దూరంలో తన వేయి పాదాలతో భూమిని నిలిపే మేరుపర్వతం వలె, వేయి బాహువులతో నదీ జలాల్ని నిరోధిస్తున్న అర్జునుణ్ణి చూచి, విస్మయం చెంది, తిరిగివచ్చి తమ ప్రభువుకు ఆ విషయం తెలియ చేశారు.

రావణుడు తాను పోరాడటానికి వచ్చిన మాహిష్మతీపతి కార్తవీర్యార్జునుడు అతడేనని గ్రహించి, మంత్రులతో అక్కడకు బయలు దేరాడు. అతనికి అపశకునంగా దుమ్ముతో పెద్దగాలి ఎదురుగా విసరి, మహాధ్వనితో వర్షం కురిసింది.

అయినా రావణుడు లక్ష్యపెట్టక ముందుకుపోయి, నదిలో భార్యలతో జలక్రీడల్లో నున్న రాజునుచూచి ఆగ్రహించి, ఆయనమంత్రులతో తాను రాక్షసరాజు రావణుడనని వారి రాజుతో పోరాటానికి వచ్చానని తెలుపు మన్నాడు. వారు ఆ మహారాజు జలాల్లో వుండగా పిలవడం తగదు గనుక మర్నాడు తమనగరానికి రమ్మనీ, అంగీకారం కానిచో తమతో పోరాడ

వచ్చుననీ పలికి ఆయుధాలు ధరించి వచ్చారు. రావణమంత్రులు వారిని తమ ఆయుధాలతో ఎదిరించి నేలకూల్చారు.

ఆ సమాచారం ద్వారపాలకులవల్ల విన్న మహారాజు తన పత్నులను నగరానికి పంపి, ఆగ్రహంతో తన గద ధరించి గరుత్మంతునివలె వైరిని సమీపించాడు. ప్రహస్తుడు ఆయన్ని ఎదుర్కొని, తన వుక్కురోకలిని ఆయనపై విసిరాడు. ఆ మహావీరుడు, ఆ రోకలిని తన గదతో కూల్చి ఆ గదను గిరగిర తిప్పి, ఆ నిశాచరునిపై విసిరాడు. దానివల్ల వజ్రాయుధం వల్ల కూలే పర్వతంవలె, ప్రహస్తుడు నేల బడగా, మిగత మంత్రులు నిలువ లేక పలాయన మయ్యారు.

## రావణ, కార్తవీర్యార్జునుల యుద్ధం

అదిచూచిన రావణుడు క్రోధంతో గదను ధరించి సహస్రబాహుణ్ణి ఎదుర్కొన్నాడు. ఆ మహావీరులు, తమ గదలతో, రెండు పర్వతాలు, రెండు సాగరాలు, జ్వలించే జంట భాస్కరులు, ఆడఏనుగుకై పోరాడే రెండు మదగజాలవలెను త్రినేత్రుడు, కాలునివలెను భయంకరంగా పోరాడారు. వారి గదల చప్పుళ్లు, పిడుగులు కురిసినట్లుండెను. అర్జునుడు గిరగిర త్రిప్పి విసరిన గద, మెరుపువలెపోయి, రావణుని వక్షంపై నిలచింది. రావణుని గదయు అట్లే అర్జునుని వక్షాన్ని తాకింది. వారు కొమ్ములతో పోరాడే కోడెలవలెను, దంతాలతో పోరాడే దంతావళాలవలెను, బలి వాసవులవలెను పోరాడారు.

## కార్తవీర్యార్జునుడు రావణుని బంధించి నగరానికి తీసికొని పోవుట

పిమ్మట అర్జునుడు విజృంభించి తన గదతో రావణుని రొమ్మును తీవ్రంగా మోదాడు. అతడు నొచ్చినా విధాత, రుద్రుల వరశక్తితో చావక, ఆ గద రెండుగా విరిగి నేలకూలింది. అయినా రావణుడు ఆ బాధతో సోలుచు నాలుగుమూరల దూరం వెనుకకుయిపోయి చేవసడలి నేలపై

కూలాడు. అంతట సహస్రబాహుడైన నరేంద్రుడు సర్పాన్ని ఒడిసిపట్టే పక్షిరాజువలె రావణునిపై వాలి తన బాహువులతో బలిని త్రివిక్రమమూర్తి వలె బంధించాడు. ఆ మహావీరుణ్ణి దేవతాగణాలు పొగడి అయనపై పూల వర్షం కురిపించారు. కేసరి దంతావళాన్నీ, బెబ్బులి అబ్బమృగాన్నీ నిరోధించినట్లు దుర్జయుడైన రావణుణ్ణి బంధించిన కార్తవీర్యార్జునుడు, దిక్కులు అదురునట్లు సింహనాదంచేసి, అప్పటికి తేరుకొన్న రావణమంత్రులు తనపై విసిరిన ఆయుధాలనేపట్టి వారిపై విసరగా వారు నిలువలేక వెనుకకు పోయారు. ఆ మహావీరుడు బందీయైన రావణుని తీసికొని, పౌరుల జయ జయ ధ్వనులు చెలరేగుచుండగా, వైభవంగా తన నగరం చేరాడు.

## పులస్త్య మహర్షి రావణుని విడిపించుట

దుర్జేయుడైన రావణుని హైహయరాజు గాలిని మూటకట్టిన విధంగా చెరబట్టి తీసికొని పోవడం విడ్డూరమని ఆకాశంలో పలుకుచున్న దేవతల పలుకులు విన్న పులస్త్యమహర్షి ఆశ్చర్యపడి మనుమనియందుగల అనురాగంతో ఆకాశమార్గంలో పోయి తుష్టిపుష్టులతో నున్న ప్రజలతో అమరావతివలె నున్న మాహిష్మతీనగర పాలకుని ద్వారంవద్ద విధాతవలె నిలచి, ద్వారపాలకునితో వారిరాజుకు తన రాకను తెలుపకోరాడు. అతడు వడిగా మహారాజును సమీపించి "దేవా కాలినడకను వచ్చిన ఆదిత్యునివలె ప్రకాశిస్తున్న పులస్త్యమహర్షి తమ దర్శనానికి విచ్చేశార" ని విన్నవించాడు.

ఆ వార్తను విన్న మహారాజు అర్ఘ్యపాద్యాలతో పురోహితుడు వెంబడించగా, శిరస్సుకు చేర్చిన అంజలితో ఆ మహాత్ముని సమీపించి ఆయనకు అర్ఘ్యపాద్యాలు మధుపర్కం, గోవును సమర్పించి ఆనందంతో కంఠం గద్గదంకాగా "మహనీయమూర్తీ, నీ రాకతో నేడు మాహిష్మతి అమరావతివలె ధన్యమైంది ! దేవపూజ్యుడవైన నీ పాదాలు అర్చించడంవల్ల నా వంశం, నా తపస్సు వ్రతాలు, జన్మ, ధన్యాలయ్యాయి ! మహర్షిశేఖరా,

నేనూ, నా భార్యా పుత్రాదులు, నా రాజ్య సర్వస్వాలూ నీవే ; నాకు తమ ఆజ్ఞ వినిపించండి" అని వేడుకున్నాడు. ఆ పావనమూర్తి ఆదరంతో ఆయన యోగాక్షేమాలు పరామర్శించి అయనతో "రాజేంద్రా, ఎవ్వని పేరు విన్న వాయు, సాగరాలు కంపిస్తాయో, అట్టి దుర్జయుడైన, నా మనుమడు దశకంఠుణ్ణి సమరాంగణంలో నిర్జించిన నిన్ను అభినందిస్తున్నానయ్యా ! నా మాట మన్నించి నీవు వానిపై అలుకమాని, చెరనుండి విడిపించుము" అని కోరాడు.

హైహయాధిపతి, మహర్షి ఆజ్ఞానుసారం, సంతసంతో వెంటనే రావణుణ్ణి విడుదలచేసి, మంచివస్త్రాలు, ఆభరణాలతో సత్కరించాడు. తరువాత, అగ్నిసాక్షిగా, అతనితో మిత్రుడుగా ఉంటానని ప్రమాణం చేశాడు. తాత మనుమనికి నీతులు బోధించి, సత్యలోకం చేరగా, రావణుడు లజ్జతో లంకప్రవేశించాడు. మహాబాహూ, ఎంతటి వీరునికైనా, అతణ్ణి మించిన ప్రతివీరులుంటారు. కనుక ఎవ్వరును ఎదుటివారిని అవమానించడం తగదు ; దీనికి ఉదాహరణగా అజేయుడనని గర్వించిన రావణుడు, కార్తవీర్యార్జునిచే బంధించబడి, తాతచే విడిపించబడిన కథ ఆలకించావు గదా !

"అయితే సహస్రబాహునితో మైత్రిచేసికొన్న రాక్షసరాజు త్వరలోనే ఆ అవమానాన్ని మరచి, తిరిగి రాజుల్ని వేధించే నిమిత్తం రాజ్యాల్లో తిరుగసాగాడు.

## రావణుడు వాలితో సమరానికి కిష్కింధకు పోవుట

మత్తమాతంగంవలె, అతడు గర్వంతో విక్రమవంతులైన మహీపతుల్నీ, రాక్షసవీరుల్నీ తనతో పోరాటానికి ఆహ్వానిస్తూ, ఒకనాడు కిష్కింధకు వచ్చి, మహావీరుడూ ఇంద్రనందనుడై, సువర్ణమాలను ధరించే వాలిని సమరానికి పిలిచాడు. అప్పుడా వీరుడు నగరంలో లేనందున,

సుగ్రీవుడు, తారుడు, సుషేణుడు అతణ్ణి సమీపించి "వీరుడా, నీవు ఆహ్వానిస్తున్న వానరరాజు, ఇప్పుడు నగరంలో లేడు. ఆయన ఈ ఉషః కాలంలో సంధ్యావార్చటానికి, నాలుగు సముద్రాలకు పోయియున్నాడు. నీవు కొంచెం ఆగినచో ఆయన వచ్చి నీకు తప్పక రణాతిథ్యం యివ్వ గలడు! అయితే నీవు అందుకు సిద్ధపడటానికి ముందు, ఆయనతో పోరాడి మరణించిన, రాజుల కంకాళాలగుట్టలు చూడటం మంచిది! ఎందువల్ల నంటే, నీవు అమృతం త్రాగివచ్చినా, ఆ మహేంద్ర కుమారుణ్ణి జయించి, ప్రాణాలతో నిలువలేవు సుమా! కనుక నీకు జీవితంపై ఏ మాత్రం ఆశవున్నా, లంకకు తిరిగి పోవడం మంచిది! అట్లుగాక, నీవు మూర్ఖంగా పోరాడతలచావా? ఈ సమయంలో ఆ మహాయోధుడు దక్షిణసముద్ర తీరంలో వుంటాడు. అక్కడకు పొమ్ము" అని బోధించారు.

## వాలి రావణుని చంకలో ఇరికించుకొని సముద్రాల్లో ముంచుట

గర్విష్ఠియైన అసురపతి, వారి హెచ్చరికను తృణీకరించి, మంత్రులతో పుష్పకం ఎక్కి, వెంటనే దక్షిణసముద్రతీరానికి పోయి, మేరు పర్వతంవంటి శరీరంతో, బాలసూర్యునివంటి ముఖంతో, సంధ్యోపాసన చేస్తున్న వానరరాజును చూచి, చప్పుడు చేయకుండా వెనుకనుండి పోయి అతణ్ణి పట్టతలచి, నెమ్మదిగా అడుగులువేస్తూ, సమీపించసాగాడు. యాదృచ్ఛికంగా అతని రాకడ గమనించిన వాలి తనలో "నన్ను పట్టడానికి వస్తున్న ఈ పాపిని నా చంకలో ఇరికించుకొని సావధానంగా మిగిలిన మూడు సాగరాల్లోనూ ముంచి, వీనికి నా విక్రమాన్ని చూపుతాను" అని నిశ్చయించి, ఒక కన్ను వానిపైనుంచి, తన దీక్ష సాగించుచుండెను. రావణుడు వడిగా ముందుకువచ్చి, అతణ్ణి పట్టగల దూరంలో నిలచి, తన చేతులు ముందుకుచాచగా, అతని పాదధ్వని విన్న వాలి పాము తలపై దూకే గరుత్మంతునివలె వానిని బలిమితో చంకలో ఇరికించుకొని, వాయు వేగంతో మింటికి ఎగిరిపోసాగాడు.

తన ప్రయత్న దుస్థితి గమనించిన రావణ మంత్రులు, అతణ్ణి విడిపించాలని అరుస్తూ వాలిని వెంబడించారు. కాని ఆకాశంలో ఆదిత్యుని వలె ప్రకాశిస్తూ వాయువేగంతో పోతున్న ఆ మహావీరుణ్ణి అనుసరించే శక్తి లేకను, అతని బాహువుల తొడల సందులనుంచి వచ్చే వాయువేగాన్ని భరించలేకనూ, వారు వెనుకబడిపోయారు. ఆ హరివీరుడు అంబర మార్గంలో అతివేగంగా ఎగురుచూపోతూ, వేల్పులు పొగడుచుండగా, వరుసగా పడమట, ఉత్తర, తూర్పు జలధుల్లో మునిగి, తన దీక్షలు ముగించి, సెట్టి మధ్యాహ్నానికి కిష్కింధ చేరి, రావణుని భారంతో బడలి, ఒక వనంలోదిగి, చంకనుండి రావణుణ్ణి విడిచి, వెనుకకు తిరిగి ఏమీ ఎరుగనట్లు అతనితో "అయ్యా, నీవెవడవు? ఏంవచ్చావు?" అని ప్రశ్నించాడు.

## రావణుడు వాలితో మైత్రి చేయుట

అలసటతో ప్రాణాలు కంఠానికి చేరిన దశకంఠుడు లజ్జపడి, బెదురుచూపులతో "మహేంద్ర కుమారా, నేను రాక్షసరాజైన రావణుడను. నీతో పోరాడాలని మదోద్రేకంతో వచ్చి నీకు లోబడ్డాను। వీరుడను దశ కంఠుడనైన నన్ను బలిపశువుమాదిరిగా నీ చంకలో ఇరికించుకొని మనో వేగంతో ఆకాశంలో ఎగురుచుపోయి మూడు సాగరాల్లోనూ మునిగి తెచ్చిన నీ అమోఘవిక్రమాన్ని ఎంతని కొనియాడగలను! వేగంలో మనస్సు, వాయువు సుపర్ణుడు మాత్రమే సాటిలేని వారుకాగా, నీవు నిస్సంశయంగా వారితో తుల్యుడవు।

"హరివీరా, నీ మహావిక్రమాన్ని గుర్తించిన నేను నీతో అగ్నిసాక్షిగా మైత్రిచేసికోవాలని కాంక్షిస్తున్నాను. నేటినుండి మనమధ్య భార్యలు పుత్రులు వైభవాలు ఆహార వస్త్రాలు, రాజ్యాలు సమానం కాగలవు" అని పలికాడు. వాలి అంగీకరించి, నడుమ అగ్నిని రగుల్చగా, ఒండొరులను

కౌగలించుకొని, సోదరులవలె మెలగగలమని ప్రమాణంచేస్తూ, ఆ పావకుని చుట్టూ ప్రదక్షిణం చేశారు. తరువాత వారు ఒకరిచేతిని మరొకరు పట్టుకొని రెండు కేసరులు గుహలో ప్రవేశించునట్లు కిష్కింధ ప్రవేశించారు. అక్కడ దశకంఠుడు సుగ్రీవునితో చేరి, సోదరుని వలె వారితో సుఖంగా నెల రోజులు గడిపారు. ఇంతలో ప్రహస్తాది మంత్రులు తన్ను పిలువడానికి రాగా, రావణుడు వారితో చేరి, లోకాలను వేధించడానికి బయలుదేరారు. రాజీవనయనా, రావణుని పూర్వగాథను, వాలి అద్వితీయ విక్రమాలను వినిపించాను. అట్టి మహావిక్రమశాలియైన వానరరాజు నీ ఒక్క ప్రచండ శరానికి అగ్నిలోపడిన మిడుతవలె ఆహుతి అయ్యాడు కదా?" అని వినిపించాడు.

## శ్రీరాముడు హనుమంతుని చరిత్ర వినగోరుట

అప్పుడు రాఘవుడు ఆయనకు ప్రణామంచేస్తూ మహాత్మా ఈ విధంగా సంధిచేసికొన్న వాలి, రావణులు మేటి బలవంతులగుట యధార్థమే ! అయితే బల, శౌర్య ధైర్య వినయ, బుద్ధికుశలతాదులకు, దక్షతకు నిలయమైన హనుమకు వారు సాటిరారని నేను నమ్ముచున్నాను. ఈ ప్రాజ్ఞుడు సాధించిన విజయాలు సామాన్యమైనవా ? అగాధము, అపారమైన సాగరాన్ని చూడగానే గగుర్పాటు చెందిన తోడి వానర నాయకులను రణ ధీశాలి ఉత్తేజపరచి, నూరుయోజనాల జలధిని అవలీలగా దాటాడు ! అంతేగాక ఎంతటి విక్రమవంతులకైనా చొరరాని లంకను ఒంటరిగా ప్రవేశించి, అంతఃపురాలు శోధించి, సీతను కనుగొని ఊరడించి, ఆమెకు జీవితాశ కల్పించాడు !

పిమ్మట ఒంటరిగా పోరాడి సేనా నాయకుల్ని మంత్రి కుమారుల్ని రావణ కుమారుడైన అక్షుణ్ణి హతులను చేశాడు ! ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్ర బంధం విడిపించుకొని, నిర్భయుడై సభామధ్యంలో రావణునితో సంభాషించి, లంకను దహించి వచ్చాడు ! ఇక రావణునితో జరిగిన మహా

సంగ్రామంలో ఈ మహావీరుడు చూపిన సాహసవిక్రమాలు, ఇంద్ర, యమ, పాశులైనా చూపినట్లు విన్నామా! ఈ మహావిక్రమశాలి, అపారశౌర్య, సాహస, స్థైర్యాలవల్లనే కదా, నేను యుద్ధంలో లంకను జయించి, సీతా, లక్ష్మణులతో క్షేమంగా తిరిగివచ్చి, బంధుమిత్రులతో కలసి రాజ్యమేల గలుగుతున్నాను! మహర్షిశేఖరా, ఇట్టి మహావీరుడు సుగ్రీవునకు పరమ హితుడై వెంట వుండికూడ, అతడు వాలివల్ల పెక్కు బాధ లనుభవిస్తున్నా ఇతడు ఆ వీరుణ్ణి ఏల కూల్చలేదు? ఇందుకు కారణం హనుమకు తనశక్తి గుర్తులేక పోవడం కారణమై యుంటుందా అనిపిస్తోంది. కనుక ఈ ప్రజ్ఞాశాలి చరిత్రను తెలుపవలెనని వేడుచున్నాను" అని కోరాడు.

## అగస్త్యుడు హనుమంతుని చరిత్ర వినిపించుట

ఆ మహర్షి, హనుమంతుని సమక్షంలోనే, ఇట్లు చెప్పనారంభించాడు. "సీతావల్లభా, నీ ఊహ సరియైనదే! ఈ వాయు కుమారునికి, బల, సాహస, విక్రమ వేగాల్లో గాని, విద్యా, బుద్ధి, విచణల్లో గాని సమానులు లేరు: ఈ వీరుడు బాల్యంలో చేసిన కొంటెపనులకు ఆగ్రహించిన మునులు యిచ్చిన శాప కారణం గానే, ఈ గుణనిధికి, తన అద్భుత శక్తి, సామర్థ్యాలు మరొకరు గుర్తుచేస్తేగాని, జ్ఞప్తికి రావు! ఆ వివరాలతో కూడిన ఈయన చరిత్రను వినిపిస్తాను సావధానంగా ఆలకించుము.

"దాశరథీ, ఈయన తండ్రి వీరుడైన కేసరి సూర్యునివరంవల్ల బంగారు వన్నెతో శోభించే మేరుపర్వత రాజ్యానికి ప్రభువు. ఆయన ఇల్లాలు అంజన, ఆమెకు వాయుదేవుని వరప్రభావంవల్ల ఈ తేజస్వి కలిగాడు. ఒకనాడు తల్లి, ఇతణ్ణి తొట్టెలో పరుండబెట్టి, ఫలాలు తేవడానికి వనానికి వెళ్ళింది. ఆ సమయంలో ఆకలితో బాలుడు మేలుకొని, తల్లి కనిపించనందున, రోదనం చేయసాగాడు. అంతలో తూర్పుదిక్కున దాసనపువ్వువంటి కాంతితో బాలసూర్యుడు ఉదయించగా, ఆ బాలుడు అతణ్ణి ఫలమని తలచి, తేదలచి ఆకాశంలో ఎగిరిపోసాగాడు. వాయువేగంతో అట్లు పోవుచున్న

ఆ కుమారుణ్ణి చూచి, ఋషి, దేవ, దానవ గణాలు విస్మయం చెందారు. అది గుర్తించి, ఆ బాలునికి సూర్యకిరణాలు తాపం కల్గించకుండా వాయు దేవుడు చల్లగావీస్తూ, అతణ్ణి వెంబడించాడు. భాస్కరుడు ఆ వీరకుమారుడు ముమ్ముందు మహాకార్యాలు సాధించగలడని, కరుణతో వేడిమిచూపలేదు. పాపడు తన సహజశక్తి, సమీరుని వరశక్తితో, అంబరంలో వేలయోజనాలు దాటి, రవిని సమీపించాడు.

అనాడు అమావాస్య, గ్రహణదినం కావడంవల్ల దివాకరుని కబళించడానికి వస్తున్న రాహువు, వానరబాలుణ్ణి చూచి, భయపడి, వెంటనే మహేంద్రుని సమీపించి కోపంతో "అమరేంద్రా, సూర్య, చంద్రుల్ని కబళించడానికి యింతవరకు మమ్ము నియమించి, నేడు మరొక రాహువును ఏల పంపావు? అని అడిగాడు. అందుకాయన ఆశ్చర్యంతో వెంటనే లేచి, సువర్ణమాల ధరించి, ఐరావతంపై కూర్చుండి, రాహువుతో బయలు దేరాడు. వెంటనే రాహువు పడిగాపోయి సూర్యాంతుని కబళించబోగా, అంజనీ కుమారుడు, భానుపట్టునున్న సూర్యుని విడిచి రాహువు నల్లని మరొక ఫలమని అతనిపై విజృంభించాడు. దానికి భీతుడైన రాహువు, నిర్జరపతివద్దకు పరుగెత్తి "తన్ను కావుమ"ని ఆయన్ని ప్రార్థించాడు. అతని మొరవిన్న వాసవుడు "ఓయీ భయపడకుము వానరబాలుణ్ణి చూలుస్తాను" అని పలుకుతూ వాయుకుమారునివైపు ఐరావతాన్ని త్రిప్పగా బాలకుడు ఐరావతాన్ని మరొక పండుగా తలచి, ఆ వైపు పడిగా రాసాగాడు.

అది చూచిన సహస్రాక్షుడు ఆగ్రహంతో చేతనున్న వజ్రాయుధాన్ని ఆ బాలవీరునిపై విసిరాడు. ఆ కులిశం బాలుని ఎడమచెంపను గాయ పరచగ అతడు బాధతో మూల్గుచు అచటి కొండశిఖరంపై మూర్ఛిల్లి పడ్డాడు. ఇంద్రుడు తన కుమారుని హింసించినందుకు పవనుడు ఆగ్ర హించి, ఆ కుమారుని ఎత్తుకొని, ఒకగుహలో ప్రవేశించి, పర్జన్యుడు

వర్షాన్ని స్తంభింప చేసినట్లు, సమస్త జీవులదేహాల్లో నుండే తన సంచారాన్ని స్తంభించాడు. అందువల్ల లోకులకు శ్వాసలు ఆడక, మల మూత్రాలు బయటికి రాక, కాలు, చేతులు ముడుచుటకు గాని, చాచుటకు గాని వీలుపడక శరీరాలు కట్టెలవలె బిగిసి, కీళ్లువిరిగీ, పొట్టలు ఉబ్బి క్షోభించారు.

## దేవ, దానవ, మానవులు ప్రజాపతికి తమ గోడు వినిపించుట

అప్పుడు దేవ, గంధర్వ, కిన్నరులు దానవ, మానవులు జలోదరు వలె ఉబ్బిన పొట్టలతో కదలలేక బాధపడుతూ, లోకకర్త బ్రహ్మదేవుని సమీపించి ప్రణామంచేస్తూ "కమలాసనా, నీవు మమ్ము సృష్టించినప్పుడే మా ప్రాణాలకు వాయువును అధిపతిని చేశావు! ఈనాడు ఏలనో అతడు మా దేహాల్లో సంచారం బంధించి, మమ్ము యాతనల పాలుచేస్తున్నాడు! కనుక ఆ కారణమేదో తెలిసికొని మాకు స్వస్థత కలిగింపుము" అని వేడుకున్నారు.

ఆ సర్వజ్ఞుడు వారితో "లోకులారా, రాహువు కోరగా పురందరుడు తన కుమారుని వజ్రాయుధంతో హింసించాడని బాధతో జగత్ప్రాణుడు జీవుల్లో తన సంచారం నిలిపివేయడంవల్లనే మీకీ బాధలు కలిగాయి. ఇప్పుడే నే నాతని బాధ తొలగించి, శాంతుణ్ణిచేసి, మీ గోడు తొలగిస్తాను" అని పలికి, అభయ మిచ్చిపంపి, దేవతా ముఖ్యులతో పోయి సమీరుడు బాలసూర్యుని వంటి తేజస్సు కలిగిన కుమారుని తొడపై నుంచుకొని దుఃఖిస్తున్న గుహను సమీపించాడు.

వాయు భట్టారకుడు లోకపితామహుడు సుర ముఖ్యులతో రావడం చూచి పావకుని వంటి తేజస్సు కలిగిన కుమారుని ఎత్తుకొనివచ్చి, తన కిరీట, కుండల ఆభరణాలు కదలుచుండగా భక్తితో ఆ మహనీయునికి ముమ్మారు ప్రణామం చేయగా, ఆ కరుణమూర్తి ఆయన్ని ఆదరంతో లేవదీసి, తన కరకమలాలతో అ బాలకుని అందుకొని మేను నిమురగా,

వాడిన పైరు వర్షధారలతో తల ఎత్తినట్లు, అతడు జీవితుడై లేచాడు. అది చూచిన జగత్ప్రాణుడు ఆనందంతో, లోకులందరికీ స్వస్థత కలుగునట్లు వారి శరీరాల్లో సంచారం ప్రారంభించాడు. బాధలు తొలగిన లోకులందరూ హర్షించారు.

## బ్రహ్మాది దేవతలు పవనకుమారునికి వరాలు ఇచ్చుట

అప్పుడు ప్రసన్నుడైన పరమేష్ఠి గంధవాహునునకు సంతోషం కల్గింప దలచి, శంకర, వాసవ, ఆదిత్య, యమ, వరుణ కుబేరులతో, వాయు కుమారుడు ముందు లోకహితకార్యాలు చేయవలసి యున్నందున అతడు అమేయశక్తిశాలి యగునట్లు వరాలు ప్రసాదించవలసినదిగా ఆదేశించాడు. అంతట మహేంద్రుడు బాలునికి పద్మమాలను ఇచ్చి తన ఆయుధంతో అతని చెంప గాయపడటంవల్ల అతడు హనుమంతుడని పిలువబడుతాడనీ, అతనికి ఇకమీదట ఆ వజ్రాయుధంవల్ల ఏ విధమైన హానీ కలుగదనీ వరం ఇచ్చాడు. కమలాప్తుడు హనుమకు తన తేజస్సులో నూరవపాలు ఇస్తున్నాననీ అతడు విద్యార్థి దశకు వచ్చినప్పుడు అతడు మనోజ్ఞంగా మాటాడ కల్గునట్లూ, జ్ఞానంలో అతనికి సమానులులేనట్లూ, విద్యలు నేర్పుతాననీ, వాగ్దత్తం చేశాడు.

తరువాత వరుణుడు పావనికి జలాలవల్లగాని, తన పాశాలవల్లగాని ఎన్నడూ, మరణించడని వరం ప్రసాదించాడు. యమధర్మరాజు హనుమ యుద్ధరంగంలో విషాదం పొందకుండునట్లూ, ఎప్పుడు గాని వ్యాధులు లేకుండునట్లూ తన దండం మొదలైన ఆయుధాలవల్ల మృతి పొందకుండు నట్లూ, అట్లే కుబేరుడు తన ఆయుధాలవల్ల అతనికి హాని కలుగనట్లూ వరాలు అనుగ్రహించారు. మహాదేవుడు ఆ కుమారుడు తన ఏ ఆయుధాల వల్లను మృత్యువును పొందడనీ, విశ్వకర్మ బాలుడు దీర్ఘాయుష్మంతుడై, తాను నిర్మించే ఏ శస్త్రంవల్ల హాని పొందడనీ వరాలు ప్రసాదించారు.

పిమ్మట వేల్పుల వరాలకు ప్రసన్నుడైన పవనుని చూచి విధాత హర్షంలో "సమీరా, నీ నందనుడు శత్రుభయంకరుడూ మిత్రులకు హర్షం కలిగించేవాడూ, కోరినరూపం ధరించగలవాడూ, ఇష్టంవచ్చే ప్రదేశాల్లో నీరూ, నిప్పూ, ప్రసక్తి లేకుండా ఏ లోకమందైనా సంచరించగల సమర్థుడూ, మహావిక్రమశాలి, జయించరానివాడూ, ఎదురులేనివాడూ, కోరినవేగంతో పోగలవాడూ, మహోత్తమ కీర్తిశాలి, దీర్ఘాయుష్మంతుడూ, కాగలడు। అంతేగాక ఈ మహాత్ముడు రావణ సంహారానికై శ్రీరామ చంద్రునకు ఆప్తుడై, ఎన్నో అద్భుత కార్యాలు చేయగలడు సుమా!" అని వరాలు ప్రసాదించి, బాలుని ఆయనకు అప్పగించి, వేల్పులతో దివ్య లోకం చేరాడు. సదాగతి సంతోషంతో కుమారుని అంజనాదేవికి యిచ్చి, జరిగిన సంఘటనలన్నీ వినిపించి, పోయాడు.

### ఋషులు బాలమారుతి దుడుకు పనులకు శపించుట

బాల ఆంజనేయుడు క్రమంగా పెరిగి వరాలశక్తితో సముద్రంవలె పొంగుచు మునుల ఆశ్రమాల్లో సంచరిస్తూ, వారి నారవస్త్రాలు చింపుతూ, హోమంచేసే పాత్రలు పగులకొట్టుతూ, అగ్నిహోత్రాలు చల్లార్చుతూ దుడుకు పనులు చేయసాగాడు. తపసులు అతని దుడుకు చేష్టలకు కినిసినా, అతనికిగల వరాలు గుర్తించడంవల్ల కొంతకాలం ఓర్చుకున్నారు. అయినా మారుతి దుంటరిచేష్టలు మానకపోవడంతో వారు విసిగి అతనితో "వనచర కుమారా, ఏ వరాలశక్తితో నీవీ ఆగడాలు చేస్తున్నావో, ఆ శక్తినంతటిని మరచి, మరొకరు నిన్ను ప్రేరేపించినప్పుడే తిరిగి పొందుదువు గాక" అని శపించాడు. నాటినుండి, హనుమ ఆ శాపంవల్ల తన శక్తిని మరచి సాధువుగా తిరుగుచుండెను.

కొంతకాలం గడవగా వాలి సుగ్రీవుల తండ్రి ఋక్షరజుడు మహా వీరుడై వానరరాజ్యాన్ని చిరకాలం పాలించి, స్వర్గస్థుడయ్యాడు. అప్పుడు మంత్రులు తండ్రి స్థానంలో పెద్దకుమారుడైన వాలిని రాజుగాను వాలి

స్థానంలో సుగ్రీవుని యువరాజుగాను అభిషేకం చేశారు. హనుమంతుడు బాల్యంనుండి సుగ్రీవుని నిర్మలమైత్రితో సేవించుచుండెను. మరి కొంతకాలము గడచాక వాలి సుగ్రీవునియందు ద్వేషం వహించి, అతణ్ణి అవమానించి రాజ్యాన్నుండి బయటికి వెళ్ళగొట్టగా, మునుల శాపంవల్ల తన శక్తిని మరచిన హనుమ పామరునివలె ఏనుగుచే తరుమబడిన సింగంవలె సుగ్రీవుని వెంట పరుగెత్తుచుండెను. మునులశాపం సంగతి ఎరుగని సుగ్రీవుడు అతణ్ణి హెచ్చరించడయ్యెను.

## హనుమంతుడు భాస్కరుని నుండి విద్యలు నేర్చుట

"రాజోత్తమా, ఈ అనిలకుమారుడు విద్యలు నేర్చే వయస్సు రాగానే, ప్రభాకరునకు శిష్యుడై, ఆ కర్మ సాక్షితోబాటు ఉదయగిరినుండి అస్తాద్రివరకూ మహావేగంతో సంచరిస్తూ ఆయననుండి వ్యాకరణాన్ని దీక్షగా నేర్చాడు. అంతేగాక ఈ దీక్షావంతుడు వివరణతో సూత్రాలు, సూత్రాలకు అర్థాలు, మహార్థాలతో మిగత శాస్త్రాలు, ఛందస్సులు నేర్చి నవవ్యాకరణ పండితుడై ఖ్యాతి పొందాడు. విద్యలన్నిటిలోను ఈయన దేవతల గురువైన బృహస్పతికి సమానుడు। నీ కరుణతో ఈ మహాత్ముడు ఈ కల్పాంతంలో బ్రహ్మ కాగలడు.

"పురుషోత్తమా శౌర్య, గాంభీర్య ధైర్య సాహస, ప్రతాప, ఉత్సాహ బుద్ధి సంపదల్లోనూ, నీతి, నయ, చాతుర్య మధుర వాక్కుల్లోనూ, హనుమంతునకు సమానులు గాని, అధికులు గాని లేరయ్యా। ఆగ్రహిస్తే జగాలను ముంచే సాగరునివలెను. భువనాల్ని భస్మంచేయగల సర్వభక్షకుని వలెనూ, ప్రళయకాలంలో చెలరేగే కాలునివలెనూ విక్రమించే ఈ మహా వీరుని ఎదిరించగల వారెవరున్నారు? రఘువంశ సుధాకరా, ఈ మారుతితో బాటు నీకు తోడ్పడటానికే, భాస్కర కుమారుడైన సుగ్రీవుడూ, అంగద, మైంద ద్వివిదులూ, సేనానాయకుడైన నలుడు, రంభుడూ, దేవతలచే

సృష్టించబడ్డారయ్యా? నీవు కోరిన విధంగా హనుమంతుని బాల్య, పరాక్ర మాలు వివరించాను" అని వినిపించాడు. ఆయన వినిపించిన గాథలను విన్న శ్రీరామ, సౌమిత్రులు, వానర రాక్షస వీరులూ ఎంతగానో ఆనందించారు.

## అగస్త్యాది మహర్షులు తమ ఆశ్రమాలకు మరలుట

అంతట అగస్త్యమహర్షి రఘునాయకుని చూచి "దశరథ రామా, నీవు అనుమతిస్తే, మా ఆశ్రమాలకు మరలుతాము" అని పలికాడు. అ వినయభూషణుడు హర్షంతో అంజలిచేస్తూ, "మహర్షి శేఖరా, మీ దర్శన భాగ్యంతో నేను, నా బాంధవులు, తండ్రి, తాతలు పితృదేవతలు తృప్తులయ్యాం! ఈనా మనవిని కరుణతో ఆలకించండి. నేను యటీవలనే అరణ్యంనుండి రావడంవల్ల పౌరులు, జానపదులు, తమ విధుల్లో తడబడకుండా నిర్భయత్వం కల్గించి, తరువాత యాగం చేయాలనుకుంటున్నాను. ఆ సమయంలో మీరంతా శిష్యులతో విచ్చేసి, అది ముగిసేవరకూ కార్య కలాపాలన్నీ నిర్వహించాలని అర్థిస్తున్నాను. తపశ్శక్తితో పావనులైన మిమ్మాశ్రయించి, నేను క్రతువును ముగించి, వేల్పుల అనుగ్రహంతో ధన్యుడను కావాలనుకుంటున్నాను" అని విన్నవించగా మహర్షులు సమ్మతించి తమ ఆశ్రమాలకు పోయారు. అప్పుడు సూర్యాస్తమయ సమయం కాగా, రాఘవుడు కొలువు చాలించి, సంధ్యాకార్యాలు ముగించి, అంతఃపురం చేరాడు. ఈ విధంగా శ్రీరామమూర్తి పట్టాభిషిక్తుడైన మొదటిరోజు, ప్రజలందరికీ ఆనందం కల్గిస్తూ ముగిసింది.

## దాశరథిని వంది మాగధులు సుప్రభాత గీతాలతో మేల్కొల్పుట

మరునాటి వేకువ సమయంలో స్తోత్ర పాఠకులు కిన్నరులవంటి కంఠ స్వరాలతో రఘుపతిని పొగడుచూ "కౌసల్యానందవర్ధనా, మేలు కొనుము! లోకబంధూ నీవు కళ్లు మూసావంటే జగతి నిద్రిస్తుంది!

సత్యధర్మ పరాయణా, నీవు విక్రమంలో నారాయణునీ, సౌందర్యంలో అశ్వినీదేవతల్నీ పాండిత్య బుద్ధి సంపదల్లో బృహస్పతినీ, పరిపాలనలో ప్రజాపతినీ, క్షమలో వసుధను, తేజస్సులో భాస్కరునీ, గాంభీర్యంలో సాగరునీ, సౌమ్యత్వంలో సుధాకరునీ స్థిరత్వంలో ముక్కంటికి సమానుడవు। కాకుత్థమణీ, అజేయ విక్రమం, ధర్మమందు అచంచల విశ్వాసం, నిరంతర ప్రజాహిత దీక్షకలిగిన నీ వంటి రాజశ్రేష్ఠులు యింతవరకు జన్మించలేదు। పై సద్గుణ సంపదవల్లనే, నీ యందు లక్ష్మీ, యశస్సులు నిత్య నివాసం చేస్తున్నాయి'' అని తియ్యని పలుకులతో మేల్కొలిపారు.

వంది మాగధుల స్తోత్ర పాఠాలతో సీతారమణుడు మేల్కొని శేష శయ్యనుండి లేచే జనార్దనివలె తెల్లని దుప్పట్లుపరచిన మణిమయ శయ్య నుండి లేచి, పరిచారకులు నమస్కరిస్తూ శుభ్రపాత్రలతో జలం అందించగా స్నానంచేసి, శుచియై హోమంచేసి, ఇక్ష్వాకుల పవిత్ర దేవగృహం ప్రవే శించి, శ్రద్ధతో దేవ, పితృదేవతల్నీ, విప్రులను అర్చించి, బయట ద్వారం వద్దకు రాగా, మంత్రులు, మహాత్ములైన వశిష్ఠాది పురోహితులు అనుస రించగా, జనులు జయ జయ ధ్వనులు చేయుచుండగా సభకువచ్చి సింహా సనంపై కూర్చున్నాడు. భరత, లక్ష్మణ శత్రుఘ్నులు, మూడు శ్రుతుల విధంగా అన్నకు రెండువైపులా కూర్చున్నారు. నానా దేశాధీశులు, మంత్రులు సుగ్రీవునితో యిరువదిమంది వానరముఖ్యులు, నలుగురు మంత్రులతో విభీషణుడు మొదలైన వారు నియత ఆసనాలపై కూర్చుండగా యక్షులతో కుబేరునివలెను మునులు అనిమిషులతో కూడిన మహేంద్రుని వలెను రఘుపతి శోభించాడు. ఆ సభలో పౌరాణికులు ఆసక్తితో మధురా లైన పురాణాలు వినిపించారు. ఈ విధంగా శ్రీరామమూర్తి నిత్యం పౌర జానపదులకు తృప్తి కలిగిస్తూ రాజ్యపాలన చేయసాగాడు.

## రఘు నాయకుడు రాజులను వారి వారి రాజ్యాలకు పంపుట

ఒకనాడాయన కొలువులో ప్రాజ్ఞుడు, మిథిలాధిపతియైన జనక రాజుకు నమస్కరిస్తూ "పావనశీలా! ఇక్ష్వాకు, విదేహవంశాల బంధుత్వం కీర్తికరమూ, ఆనందవర్ధనమూ అయింది. మీ మహిమవల్లనే నేను రావణుని జయించగలిగాను. ప్రజాహితులైన మీరు వచ్చి చాలాకాలం గడచుటవల్ల ఈ రత్నాలు స్వీకరించి నేడు బయలుదేరగలిగితే భరతుడు తోడుగా, మీతో రాగలడు" అని ప్రార్థించాడు. ఆ మహాత్ముడు సంతోషంతో "రఘువంశ తిలకా, నీ దర్శన, సౌజన్యాలవల్ల ధన్యుడనయ్యాను. నీవిచ్చిన మణులు నా తనయలకు ఇస్తున్నాను. పోయి వస్తాను" అని పలికి భరతునితో బయలు దేరాడు.

తరువాత రాముడు, మేనమామ, కేకయ రాజైన యుధాజిత్తునకు అంజలిచేసి "రాజోత్తమా! నేను, నా సోదరులు, మా రాజ్యం, సర్వ సంపదలు మీవే! మీరే మాకు దిక్కు! అయినా మీరు వచ్చి చాలాకాలం గడవడంవల్ల, వృద్ధులైన తాతగారు, ఆత్రంతో మీరాకకు ఎదురుచూస్తుంటారు. కనుక నేడు మీరు బయలుదేరగలిగే యెడల, రత్నధనాలు, మణులతో లక్ష్మణుడు మీతో రాగలడు" అని పలికాడు. ఆయన తిరిగి నమస్కరిస్తూ "విశుద్ధాత్మా! నీకు రత్నాలు నిరంతరం వృద్ధియగుగాక" అని పలికి సౌమిత్రితో బయలుదేరాడు.

తరువాత ఆయన సింహాసనంనుండిదిగి తనకు మిత్రుడు, యోగ్యుడు నిర్భయుడు అయిన కాశీరాజు ప్రతర్దనుణ్ణి తనవుతో వక్షానికి చేర్చుకొని కౌగలించి "మిత్రమణీ, భరతునితో జేరి మహాయత్నంతో రాజులందరిని లంకపై దండయాత్రకు సైన్యాలతో సన్నద్ధంచేసిన, నిన్ను ఎంతని కొని యాడగలను? నీ నగరం వారణాశి తోరణ ప్రాకారాలతో మనోహరమైనది కదా! అచటికీ బయలుదేరుము" అని పలికి ఆదరంతో సాగనంపాడు.

పిమ్మట ఆయన భరతుని సహాయార్థం వచ్చిన మూడువందలమంది రాజులను ప్రసన్నదృష్టితో చూస్తూ "మిత్రులారా, జనకతనయ అపహరించబడిన వార్త తెలియగానే శ్రీ భరతుడు మీకందరికి తెలియబరచినంతనే సత్యధర్మ పరాయణులు, స్వీయశక్తివల్లనే రక్షితులైన మీరందరూ మాయందు గల అనురాగంతో, లంకపై దండయాత్రకు, సైన్యాలతో సిద్ధమైవచ్చారు. మీ అందరి మహిమ శుభాకాంక్షలవల్లనే, నేను నిమిత్తమాత్రుడనై క్రూరుడు, దుష్టుడు అయిన దశకంఠుణ్ణి పుత్ర మిత్ర అమాత్య, బలగాలతో హతమార్చగలిగాను. మీరు రాజ్యాలు విడిచి చాలాకాలం కావడంవల్ల మీరు అంగీకారమైతే మీ రాజ్యాలకు మరలవలసినదిగా వేడుచున్నాను" అని పలికాడు.

ఆయన ఆదరపూరితాలైన వాక్కులకు ప్రీతులైన రాజులు నమస్కరిస్తూ "రామభూపాలా! అపహరించబడిన సీతాసాధ్విని సాధించడానికి సాగరంలో అద్వితీయమైన సేతువును నిర్మించి ఘోరమైన యుద్ధంలో అజేయుడవై, శత్రువర్గాన్ని నిశ్శేషం చేసివచ్చి, మైథిలీదేవితో పట్టాభిషిక్తుడవైన నిన్ను మా మహాభాగ్యంవల్లనే చూచి ధన్యులమైనామయ్యా! స్వీయ దక్షత, లోకాతీత విక్రమంతోనే విజయివైన నీవు శాశ్వత పొగడ్తలకు కీర్తులకు మూలకందమయ్యు, మమ్ము అభినందించడం నీకే చెల్లినదిసుమా! నీవలె మాటాడుటకు సైతం మేము అశక్తులమయ్యా. మేము నిన్ను మరువలేక ఎట్లు నిత్యం స్మరిస్తామో, అట్లే నీవు సైతం మమ్ము మరువరాదని వేడుకొనుచున్నాము" అని పలుకగా ఆయన సమ్మతించి, వారందరిని సత్కరించి, వీడ్కోలు యిచ్చాడు. ఆనందభరితులైన వారందరూ తమ చతుర్విధ సైన్యాలతో బయలుదేరి, శ్రీరామవిజయాలు పొగడుచు తమ రాజ్యాలు చేరి, తమతో వచ్చిన భరత, లక్ష్మణ, శత్రుఘ్నులద్వారా కానుకలుగా రథ, గజ, ఆభరణాలు రామచంద్రునకు పంపారు.

## శ్రీరామచంద్రుడు సుగ్రీవ, విభీషణాదులకు కానుకలు యిచ్చుట

ఉదారుడైన శ్రీరాముడు ఆ కానుకలనుండి అమూల్యమైన ఆభరణాల్ని సుగ్రీవ, విభీషణులకు వనచర, అసుర వీరులకు యివ్వగా, వారు భక్తి ప్రేమలతో వానిని చేతులు, శిరస్సులందు ధరించగా, రామచంద్రుడు ఆనందించాడు. తరువాత ఆయన అమితానురాగంతో, అంగద, హనుమంతులను తొడలపై కూర్చుండబెట్టుకొని వానరరాజుతో "మిత్రమా సుగ్రీవా! నీ కుమారుడైన అంగదుడు, నీ ముఖ్యసచివుడైన ఈ మారుతి, నీకు తెలిపినట్లే నాకును హితవు బోధించుటవల్లనే నాకు విశేష పూజ్యులయ్యారు సుమా!" అని పలుకుచు తాను ధరించిన ఆభరణాలన్నింటితోనూ, వారిని అలంకరించాడు. వానరులందరూ ఆయన కరుణకు హర్షించారు.

ఆ యశశ్శాలి తరువాత నల, నీల, కుముద, పనస, వినత, మైంద, ద్వివిద, కేసరి, సన్నాద, గవాక్ష, గంధమాదన, జాంబవంత, వలీముఖ, దరీముఖ, సుషేణ, ఇంద్రజాను, ప్రజంఘులనబడు వానర సేనాపతులను సంబోధిస్తూ మధుర వాక్కులతో "నెయ్యులారా! మీరు నా సోదరులు, నా దేహంవంటి పరమహితులై, నాకు చేసిన ఉపకారాలకు నేను మీకేమి ప్రత్యుపకారము చేయగలను? అంతులేని దుఃఖ సముద్రములో మునిగియున్న నన్ను మీరందరూ, మీ విక్రమంతో ఉద్ధరించారు. మీరందరూ మిత్రులైన ఈ వానరప్రభువు ఎక్కువ అదృష్టవంతుడు! నా శక్తికొలదీ యిచ్చే ఈ అల్ప కానుకలను, ప్రీతితో స్వీకరించండి" అని పలుకుచు, ఒక్కొక్కరినీ ఆదరంతో కౌగలించుకొని వస్త్రాలు, ఆభరణాలు యిచ్చి వారిని ఆనందంలో ముంచాడు. వారందరూ కందమూల ఫలాలు, మాంసం ఆరగిస్తూ, తేనెలు త్రాగుతూ, సుఖంగా కాలం గడుపుచుండగా, మాఘ, ఫాల్గుణ మాసాలు తెలియకుండానే గడచిపోయాయి.

## శ్రీరాముడు సుగ్రీవ, విభీషణాదుల్ని వీడ్కొలుపుట

అంతట ఒకనాడు ఆ రాజేంద్రుడు వానరపతితో "మిత్రమా! సుగ్రీవా నీ పరివారంతో ఇక జాగుచేయక, సురాసురులకు సైతం దుర్భేద్య మైన కిష్కింధకు పోయి మంత్రుల సంప్రదింపులతో రాజ్యాన్ని యోగ్యంగా పాలించుము. ఈ అంగదుని విశేష అనురాగంతో చూచుకొమ్ము. అట్లే నా కొరకు ప్రాణాలు ఒడ్డిన హనుమ, సుషేణ, నల, నీల, తార, కుముద, గజ, గవాక్ష, గవయుల్ని, శతవలి, శరభ, ఋషభ, జాంబవంతుల ఋణం నేను ఎట్లు తీర్చుకొనగలను? కనుక వీరందరినీ అప్రియం చేయకుండా మన్న నతో పాలించుము'' అని పలికి అతణ్ణి గాఢంగా ఆలింగనం చేసు కున్నాడు.

పిమ్మట విభీషణునితో "విశుద్ధధర్మపరాయణా! ధనపతి దివ్యనగ మైన లంకను, అధర్మం సోకకుండా, ధర్మయుక్తంగా ఏలుకొమ్ము! ధర్మ మార్గాన్ని విడువక, బుద్ధివంతుడై పాలించు ప్రభువు రాజ్యంలో వైభవ, సంపదలు నిత్యంగా నిలుస్తాయి సుమా! నన్నునూ, సుగ్రీవునీ ఎన్నడును మరువకుము! పోయిరమ్ము'' అని బోధించాడు. వానర, రాక్షస వీరు లందరూ, ''శ్రీరామప్రభూ, నీ మనస్సు వాగీశ్వరుని యందువలె సహజ మైన నిగ్రహం కలిగియుటుంది! ఇక నీ అమేయ పరాక్రమ, మధుర వాక్కులు సాటిలేనివి!'' అని ప్రశంసించారు.

## శ్రీరాముడు మారుతిని సత్కరించి వరం ప్రసాదించుట

అంతట హనుమంతుడు వినయంతో సీతాపతిని సమీపించి ''తారక నామా, శ్రీరామా నా మనస్సెల్లప్పుడూ నీ యందు స్థిరమైన ఆదరం కలిగి యుండునట్లూ, అన్ని సమయాల్లోనూ, నా భక్తి అనన్యమై వర్ధిల్లునట్లూ కటాక్షించుము! సీతాపతీ, అంతేగాక నీ పావనచరిత్ర ఎంతకాలం లోకంలో నిలుస్తుందో, అంతవరకు నా శరీరం నిలుచునట్లు అనుగ్రహించుము!

అప్సరలు నిత్యం నీ కథామృతాన్ని వినిపించగా, ఆ పారవశ్యంతో నీకు దూరమైతినను బాధను మరుపగలను'' అని విన్నవించాడు.

ఆయన కోర్కెలు విన్న నీలమేఘశ్యాముడు రత్నసింహాసనం దిగివచ్చి ఆ పరమభక్తుని కౌగిటచేర్చి స్నేహపూరిత వాక్కులతో ''ఆంజనేయా, నిస్సంశయంగా నీవు కోరినట్లే కాగలదు। కావున ఆనందించుము. లోకములుండునంత కాలం, నా చరిత్ర, నా కీర్తి, నిలుచునట్లే, నీ ప్రాణాలు, కీర్తి నిలువగలవు। పవనకుమారా, నీవు చేసిన ఒక్కొక్క ఉపకారానికే, అవసరమైతే నా అసువులను అర్పించనా!'' అని పలుకుచు, సుధాంశునివలె తన మెడలో మెరుస్తున్న వైడూర్యహారాన్ని తీసి, అతని మెడలోవేసి సత్కరించాడు. ఆ హారం ధరించడంవల్ల అమృతకిరణుని శిరస్సుపై ధరించే మేరు పర్వతంవలె మారుతి శోభించాడు. రాముని వాక్కులు విన్న వానర సమూహాలులేచి, ఆ పరమపురుషుని పాదకమలాలకు భక్తితో నమస్కరించి, ప్రయాణమయ్యారు. వానర, రాక్షస రాజులు తమ్ము ఆ పుండరీకాక్షుడు ఆదరపూర్వంగా కౌగలించి, నెయ్యపు పలుకులతో ఊరడించగా, కన్నీరు కార్చుచు, బొమ్మలవలె, జీవుడులేని దేహాలవలె, తమ ప్రదేశాలకు బయలుదేరారు.

## కుబేరుడు పంపగా పుష్పకం రామచంద్రుని వద్దకు వచ్చుట

ఇట్లు అందరిని సాగనంపి, రాఘవుడు విశ్రాంతిలో నుండగా, మధ్యాహ్న సమయంలో ఆకాశంనుండి ఈ విధంగా శబ్దం వినవచ్చింది[1] ''రామభూపాలా, ఇటుచూడుము. నేను పుష్పక విమానాన్ని. నీ యాజ్ఞ ప్రకారం నేను యక్షేశ్వరుని సమీపించగా, ఆయన ఆనందంలో ''విమాన రాజమా, రణరంగంలో రామచంద్రుడు బంధు, బలగాంతో రావణుణ్ణి కూల్చి నిన్ను గెలిచాడు। రావణ సంహారం నాకును ప్రియమైనదే,

1. ఆ విమాన చోదకుడు అట్లు పలికాడు.

ఇప్పుడు నీవా మహాత్ముని సొత్తుపు అయినందున, ఆయన వద్దకే పొమ్మ అని పంపగా వచ్చాను''.

ఆ మాటలకు రాజేంద్రుడు హర్షించి, పుష్పకానికి స్వాగతం పలికి, పుష్ప. ధూపాలతో అర్చించి, తనకు పనికలిగి తలచినప్పుడు రమ్మని, అంతవరకు అంబరంలో స్వేచ్ఛగా తిరుగుచుండవలెనని ఆదేశించగా, పుష్పకం అంగీకరించి, అట్లు చేసింది.

## భరతుడు అన్నకు ప్రజల సుఖ సంతోషాలు తెలుపుట

అప్పుడు భరతుడు లేచి అన్నకు నమస్కరిస్తూ "అన్నయ్యా, నీవు రాజ్యపాలన ప్రారంభించి, నెల మాత్రమే గడచినా అద్భుతాలు జరుగు చుండటంవల్ల, నీవు దేవుడవు అనిపిస్తోంది. ప్రజలు రోగాలు తొలగి సుఖిస్తున్నారు. నిండుముసలితనంవల్ల శరీరాలు శిధిలాలైనా, ముసలివారు మరణించడంలేదు. మహిళలు, ప్రసవవేదనగాని దిగులుగానిలేకుండ సుఖంగా ప్రసవిస్తున్నారు. వానలు సకాలంలో కురుస్తుండటం, వాయువు అన్ని ప్రదేశాల్లోనూ హాయిగా వీస్తుండటం వల్లా, ప్రజలు తృప్తులై ఈ మహారాజే స్థిరంగా భూమిని పాలిస్తూ సుఖంగా వుండాలని చెప్పుకుంటున్నారు'' అని పలుకగా ఆ లోకబంధువు హర్షించాడు.

## శ్రీరామచంద్రుడు సీతాదేవితో అశోక వనంలో విహరించుట

ఆ రాజేంద్రుని అశోక వనంలో అశోక వృక్షాలేగాక, మామిడి, పనస, చందన, అగరు పున్నాగ, పారిజాత, మందార, మద్ది మంకెన దానిమ్మ జమ్మివంటి వృక్షాలు, పొదరిండ్లతో పరిమళాలు చిమ్మే పూలు, పండ్లతో నుండగా వానిపై తుమ్మెదలు ఝుమ్మని ధ్వనులు చేస్తుండగా, చిలుకలు గోరువంకలు కోకిలలవంటి అనేక రకాల పక్షులు, మనోహరంగా ధ్వనులు చేయుచుండెను. మరియు అచట బంగారు, కాటుక కాంతుల పర్వతాలుండెను. అంతేగాక అచట మాణిక్యాలు చెక్కిన మెట్లు, స్ఫటి

కాలు పరచిన నేలలు, వికసించిన కలువలు, తామర పుష్పాలు వాని నడుమ చక్రవాక పక్షులు, హంసలు, యితర జలపక్షుల ధ్వనులతోనున్న దిగుడు బావులు శోభించుచుండెను. ఇంకను ఆ వుద్యానవనానికి అనేక రూపాలలో ప్రాకారాలు, వెడల్పైన సాపరాళ్ళు, వైడూర్యకాంతి కలిగిన పచ్చిక బయళ్ళు, ఆకాశంలో చుక్కల గుంపులవలె, పరచియున్న చలువరాళ్ళపై రంగురంగుల పూలు రాలియుండగా, అది చైత్రరథ నందనవనాలవలె శోభించింది; ఆ వనంలో రఘుపతి తన దేవి చేయిపట్టుకొని, వశిష్ఠుడు అరుంధతీ దేవితోవలె విహరించాడు. ఆయన మైథిలితో, శచీదేవితో దేవేంద్రుని వలె ఆసీనుడై, ఆమెచే ఆసవం త్రాగించాడు. పరిచారకులు ఫలాలను, చక్కగా వండిన మాంసాలను తెచ్చి యివ్వగా వారు ఆరగించారు. అంతట నాట్య, గానాల్లో నిపుణులు, రూపవతులైన తరుణులు వారిని ఆట పాటలతో రంజింపచేశారు. సీతా మనోహరుడు వారికి కానుకలుగా ఆభరణాలు యిచ్చి సంతోషపరచాడు. ఈ విధంగా జానకీ రాములు సౌఖ్యాలకు ఆస్పదమైన శిశిరఋతువు గడిపారు. ఇట్లు వారికి పదివేల సంవత్సరాలు[1] మెల్లగా గడిచాయి. ధర్మ పరాయణుడైన రాముడు మధ్యాహ్నం వరకు ధార్మిక, రాచకార్యాలు నెరవేర్చి, సాయంకాలం అంతఃపురంలో తల్లుల వద్దను, సీతాదేవితోను గడపుచుండెను. అదే విధంగా, సీతాదేవి మధ్యాహ్నం వరకు దేవపూజలు, అత్తల శుశ్రూషలుచేసి, తరువాత చక్కని ఆభరణాలు, చీర ధరించి, ఇంద్రుని సమీపించే ఇంద్రాణివలె, భర్తను సమీపించగా, ఆయన హర్షించుచుండెను.

## జానకీదేవి తపోవనాలను చూడగోరుట

ఒకనాడు సీతాపతి దేవకన్యవంటి మైథిలిని చూచి "రమణీమణీ, నీలో గర్భిణీ లక్షణాలు కన్పిస్తుండటంవల్ల, నీకేదైన కోరిక వున్నచో

---

1. అభిషేకం తరువాత శ్రీరాముడు మొదటి సంవత్సరం వానర మిత్రులతో గడిపి, రెండవ సంవత్సరం సీతాదేవితో విహరించాడు.

సంతోషంతో తీరుస్తాను. ఏనుక తెలుపుము" అని కోరాడు. అందుకు ఆ ముద్దరాలు చిరునవ్వుతో ముఖపద్మం వికసించగా, ఆయన్ని చూస్తూ "ప్రాణవల్లభా, పావన గంగాతీర ప్రాంతాన్ని చూచి అచట ఫల, మూలాలతో జీవించే తేజస్వులైన తాపసుల్నీ వారి పత్నుల్నీ పూజించి, అక్కడ ఒక్క రాత్రియైనా గడిపి రావాలని కోరికగా వున్నది" అని పలికింది. ఆయన అట్లు తప్పక రేపే పంపుతానని తెలిపి ఆప్తులతో రెండవ కక్ష్యకు వచ్చాడు.

## శ్రీరామచంద్రుడు భద్రుని లోకుల వార్త లడుగుట

అక్కడ ఆయన హితులూ, యోగ్యులూ కొలువగా కూర్చుండి కాశ్యప, మత్తకాళియ, దంతవక్ర, సుమాగధ సురాజ, పింగళ, మత్త, భద్రు లనబడు అనేక రూపాలు కలిగిన హాస్యకారులైన చారులు తమ నైపుణ్యంతో వినోద వార్తలు తెలిపి, ఆయనకు సంతోషం కలిగించారు. పిమ్మట శ్రీరామమూర్తి భద్రునితో "ఓయీ, నగరంలో, పల్లెలలో ప్రజల విశేషా లేమిటి? ప్రజాహితం కోరేరాజు, రాజ్యంలోని ప్రజలు ఏమనుకొను చున్నారో తెలుసుకోవడం అగత్యం. అట్లు చేయని పరిపాలకుడు నిందించబడతాడు. ఏనుక భరత, లక్ష్మణ, శత్రుఘ్నులనుగూర్చి, సీతను గురించీ కైకమ్మ మొదలైన నా తల్లులనుగూర్చి వా రేమనుకొనుచున్నారో తెలుపుము" అని కోరాడు.

అతడు అంజలిచేస్తూ "ప్రభూ, పౌరులూ, ప్రజలూ, తాము అద్భుత పరాక్రమంతో రావణాది దుర్జనులను హతంచేసి, విజయం సాధించిన గాధలే సదా చెప్పుకొనుచున్నారు" అని తెలిపాడు. అందుకు ఆయన తృప్తిపడక "భద్రా, ఆ పౌరసత్తులు అట్లుండనీ; లోకులు నేను చేసిన పనుల్లో ఏవి మంచివనీ, మరేవి చెడ్డవనీ భావిస్తున్నారో, ఆ వార్తలు ఉన్నవి ఉన్నట్లు వివరంగా చెప్పుము; అట్లు వినడంవల్ల చెడుగులు విసర్జించి, మంచి పనులు

వృద్ధిచేయడం సాధ్యమౌతుంది! కనుక నీవు భయపడక చెప్పుము" అని ఆదేశించాడు.

భద్రుడు సమాధానంగా "రాజేంద్రా, రచ్చలు, సావడులు, తోపులు, బాటలు, గృహాల్లో ప్రజలంతా మహాత్ముడైన రామచంద్రుడు దేవ దానవులకైనా వూహించరాని సేతువును సాగర మధ్యంలో నిర్మించి దుర్జయుడైన రావణుని బంధు బలగాలతో నేలమట్టం చేశాడు! అయితే అతని స్పర్శ తగిలిన ఇల్లాలిని విడిపించి తెచ్చి ఏలుకొనుచున్నాడు! ఆ రాక్షసుడామెను తొడపై కూర్చుండబెట్టుకొని, లంకకుచేర్చి పదిమాసాలు తన స్త్రీలనే ఆమెకు అశోకవనంలో కాపుంచాడనే విషయాన్ని ఏవగించుకోక, మహారాజామెను నగరానికితెచ్చి ఆమెతో భోగాలనుభవిస్తుండటం, కాముకునకు కన్నుండవనే సామెతకు తార్కాణంగా లేదా? రాజానుమతమే ప్రజలకు ధర్మం కావడం వల్ల, ఇకమీద మనం కూడ ఆయనవలె మనస్త్రీల చర్యలు సహించవలసి ఉంటుంది" అని తమకుతోచిన విధంగా నగరమందు, పల్లెలందు చెప్పుకొనుచున్నారు". అని విన్నవించాడు.

రామచంద్రమూర్తి విషపు ములుకులవంటి ఆ మాటలు విని, దుఃఖంతో దీనుడై ఆప్తులతో "మిత్రులారా, మీరిట్టి దుర్వార్తలు ఎక్కడైనా వినియున్నారా" అని ప్రశ్నించగా వారందరూ, వంచిన తలలతో ఆయనను నమస్కరిస్తూ చారుడు తెచ్చిన వార్త నిజమేనని తెలిపారు.

## శ్రీరాముడు సోదరులను పిలువనంపుట

కాకుత్థుడు వారి పలుకులతో దుఃఖపూర్ణుడై వారందరినీ పంపివేశాడు. పిమ్మట చేయవలసినపని నిశ్చయించి, ద్వారరక్షకుని పిలిచి, భరత, లక్ష్మణ శత్రుఘ్నులను వెంటనే పిలుచుకొని రమ్మని ఆదేశించాడు. అతడు వేగంగా లక్ష్మణుని వద్దకుపోయి నమస్కరించి అన్న ఆజ్ఞను తెలుపగా, అతడు రథంపై అన్నమందిరం చేరాడు. తరువాత కావలివాడు

భరత, శత్రుఘ్నులకును ఆ సమాచారం తెలుపగా, వారు కాలినడకనే ఆ మందిరానికి వచ్చారు. ద్వారపాలుడు రాఘవునకు వారు వచ్చినట్లు తెలిపాడు. దుఃఖంతో తలవాల్చుకొని ఉన్న రాఘవుడు "ఓయీ వారే నా ప్రాణాలవంటివారు! కనుక వారిని వెంటనే లోనికి పంపుము" అనగా అతడట్లు చేశాడు. వారు ముగ్గురును వినయంతో తలలువాల్చి, చేతులు కట్టుకొని సమీపించి, రాహువుచే కబళించబడిన జాబిల్లివలెను, అస్తమించబోయే నభోమణి వలెను కాంతి తొలగిన కమలం వలెను కన్నీళ్ళతో నిండి దీనమై యున్న అన్న ముఖపద్మాన్ని చూచి, తత్తరపాటుతో ఆయన పాద పద్మాలపై తలలు మోపి, నమస్కరించారు.

ఆ భ్రాతృవత్సలుడు కన్నీరు మింగుచు ఒక్కొకర్ని లేవతీసి కౌగిట చేర్చి, సమీపంలోని పీఠాలపై కూర్చుండమని పలికి వారట్లుచేయగా అదరంతో "తమ్ములారా, నా జీవితమూ, నా సర్వస్వమూ మీరే! మీరు ఆర్జించి యిచ్చిన రాజ్యాన్నే నేను పాలిస్తున్నాను. మీరు శాస్త్రార్థాల్ని చక్కగా ఎరిగి నిర్భయులై, నిష్టతో కూడిన మనస్సులు కలవారగుటవల్ల నేను చెప్పబోయే కార్యాన్ని మీరు కాదనక చేయాల్సి వుంటుంది" అని పలుకగా వారాయన ఏమితెలుపునోనని ఆదుర్దాతో వినడానికి సిద్ధపడ్డారు.

### రాఘవుడు సీతనుగూర్చి వున్న నిందనుగూర్చి తమ్ములకు తెలుపుట

దాశరథి దీనుడై కూర్చున్న తమ్ములతో "సోదరులారా, సావధానంగా వినండి. ఇంతకుముందే నేను చారులవల్ల సీతను గూర్చి, పౌరులు, పల్లెవాసులు అన్ని ప్రదేశాల్లోను వ్యాపించ చేస్తున్న నీచాలైన నిందలను గూర్చి విన్నప్పటినుండి, నా ఆయువుపట్లు స్వాధీనం తప్పుచున్నవి! వినడానికే హేయంగా వున్న ఆ అవాచ్యాలు ఎట్లు చెప్పగలను!

"లోకపూజ్యులైన ఇక్ష్వాకుల పుణ్యవంశంలో పుట్టిన నేను, ఆ వంశానికి అప్రతిష్ఠ ఎట్లు తేగలను ? ఇక మైథిలియో, సజ్జనాగ్రగణ్యుడైన జనకుని పుణ్యవంశంలో జన్మించి, పుట్టి మెట్టిన వంశాలకు అప్రతిష్ఠ తేగలదా ? లక్ష్మణా, నిర్జనమైన దండకలో, అసురుడామెను అపహరించగా, నేనా దుష్టుణ్ణి సర్వనాశనం చేయడం, ప్రత్యక్షంగా నీ వెరిగినదే కదా ! అయినా, పరునియింట బంధించబడిన సహధర్మిణిని నగరికెట్లు తీసికొని పోదునా అని శంకించాను. అప్పుడామె తన శీలం నిరూపించడానికి అగ్నిజ్వాలల్లో దూకడం, అగ్నిహోత్రుడు ఆమె నిర్దోషి, పరమ పావని యని ప్రమాణం చేసి నాకప్పగించడం నీవు చూచావు గదా ! పద్మినీ వల్లభుడు, చంద్రుడు, వాయుదేవుడు, ఋషిగణాలు, దేవతల సన్నిధిలో జానకి పాపరహితురాలని పలుకలేదా ? లోకకర్త, మైథిలి పరమ పావని అని తెలిపి, ఆమెను నాకప్పగించలేదా ? అంతేగాక, నా అంతరాత్మలో కూడ జానకి శుద్ధురాలని గుర్తించియే, ఆమెను అయోధ్యకు తీసుకొని వచ్చాను !"

## శ్రీరాముడు పౌరుల నిందకు బట్టి సీతను త్యజించినట్లు తెలుపుట

"నేను ఇన్ని కఠోర నిష్టలకు లోనైన సాధ్విని స్వీకరించడాన్ని గూర్చిన నింద నగరం, పల్లెల్లో వ్యాపించడం వల్ల శోకం భరించరానిదై, నా హృదయాన్ని దహిస్తోందయ్యా ! ఎవని అపకీర్తి లోకంలో ఎంతకాలం నిలుస్తుందో, అంతకాలం అతడు బాధలకు లోనై, అధో లోకంలో వుండవలసినదే గదా ! అందువల్లనే వేల్పులు, అపకీర్తిని నిరసించి, ఉత్తమ కీర్తిని శ్లాఘిస్తారు. కనుక ఉత్తమ లోకాలు పొందగోరేవాడు, కీర్తి కొరకే నిరంతరం కృషి చేయాలి !

"పురుష వృషభులారా, ఉత్తమ యశస్సు కొరకు, మిమ్మందరిని గాని, నా ప్రాణాలను గాని విడవడానికి వెనుదీయని నేను, అపనింద

భయంతో, ధరణీ తనయను త్యజించడంలో ఆశ్చర్యముంటుందా? తమ్ములారా, నేను ఎంతటి శోక సాగరంలో మునిగియున్నానో చూచారా? ఇట్టి మహా దుఃఖాన్ని నేను ఎన్నడు అనుభవించి ఎరుగను।

## శ్రీరాముడు లక్ష్మణునితో సీతను వాల్మీకి ఆశ్రమ ప్రాంతంలో విడిచి రమ్మని ఆదేశించుట

"తమ్ముడా లక్ష్మణా, నీవు రేపటి ఉదయమే, సుమంత్రుని తేరు సిద్ధపరచమని చెప్పి దానిపై మీ వదినను ఎక్కించి, పట్టణాలు, పల్లెలు దాటించి, భాగీరథికి అవలి తీరంలోని వాల్మీకి మహర్షి ఆశ్రమ ప్రాంతంలో నిర్జనమైన చోట ఆమెను విడిచి రమ్ము। ఇంతకు ముందే ఆమె గంగా తీర మందలి ఋష్యాశ్రమాలను చూడ గోరగా నేను అంగీకరించాను. కనుక నీవు మారు మాట చెప్పక, ఆమెను పై కారణంతో తీసికొని వెళ్లి, విడిచి పెట్టి రమ్ము। ఇందును గూర్చి చర్చించవలసిన దేదీ లేనందున, నీవు పాటించాపంటే, నేను ఆగ్రహిస్తాను। తమ్ముడా, ఇందును గూర్చి నా పాదాలు, ప్రాణాలపై ప్రమాణం చేస్తున్నాను। కనుక ఎదురు మాట చెప్పకుము। సోదరులారా, మీరు నన్ను గౌరవిస్తూ, నా ఆజ్ఞల్ని పాలించే వారైతే బదులు వాదం చేయవద్దని ఆజ్ఞాపిస్తున్నాను।" అని పలికి వారిని పొమ్మని, కన్నీళ్లతో నిండిన ముఖంతో తన మందిరానికి పోయి, పాము వలె నిట్టూర్పులు విడుచుచుండెను.

## లక్ష్మణుడు సీతమ్మను ఋష్యాశ్రమాలు చూచుటకు కొనిపోవుట

మరునాటి వేకువనే లక్ష్మణుడు, కలత చెందిన ముఖంతో సుమంత్రుని రప్పించి, రాజాజ్ఞ ప్రకారం, తాను సీతాదేవిని తాపసుల ఆశ్రమాలు దర్శించడానికి తీసికొని పోవుచున్నాను. కనుక త్వరగా రథాన్ని సిద్ధ పరచి రాజభవనం వద్దకు తెమ్మని తెలుపగా, వడిగా అతడట్లు చేసి తెలియ చేశాడు. వెంటనే సౌమిత్రి రాజ మందిరం ప్రవేశించి, జానకీ దేవితో

"వదినమ్మా, నీవు తాపసాశ్రమాలను చూడకోరగా, అన్నయ్య అంగీ కరించాడట కదా! ఆ ప్రకారం నేడే నిన్ను ఆ చోటికి తీసికొని పొమ్మని, నన్నాయన ఆదేశించడంవల్ల రథం సిద్ధపరచి తెచ్చానమ్మా! కనుక నీవు త్వరగా సిద్ధపడుము" అని తెలిపాడు

ఆ మహాభాగ మిక్కిలి ఆనందంతో "మరదీ, నేను నిన్ననే ఆయన్ని యీ విషయం కోరగా, అంగీకరించి, నేడే నిన్ను తీసుకొనివెళ్ల మన్నారా? సౌమిత్రీ నా ప్రాణకాంతుని హృదయం నవనీత మంతటి మృదువైనది సుమా: నేను ఇప్పుడే సిద్ధపడి వస్తాను. అయితే నేను మహారాజ పత్నిని గనుక, తపస్వినుల దగ్గరకు వట్టి చేతులతో రాగలనా? కనుక వారికి తగిన కానుకలు తీసికొని వస్తాను" అని పలికి, వారి నిమిత్తం విలువగల నగలు, ఆభరణాలు, రత్నాలు సిద్ధం చేయించి, త్వర లోనే రథం వద్దకు వచ్చింది. ధీరుడైన రామానుజుడు మనసులో నున్న దుఃఖాన్ని పైకి కానరాకుండా అణచుకొని, రథంపై సామగ్రిని, సీతమ్మను సదిలంగా ఎక్కించి, తరువాత తాను ఎక్కి, సుమంత్రుని వడిగా రథం తోలుమనగా అరదట్లు చేశాడు.

జానకీదేవి అపశకునాలను చూచి కలవరపడుట

అట్లు రథం వడిగా సాగుచుండగా, హఠంసగా అశుభాలైన శకునాలు కానరాగా సీతమ్మ కలవరంతో మరదిని చూస్తూ "అన్నా! లక్ష్మణా ఎన్నో అపశకునాలు ఎదురౌతున్నవేమి? కారణమేమీ లేకుండానే నా కుడి కన్ను అదురుతోంది! శరీరమంతా వణకుతోంది! ఎందువల్లనో మనస్సులో కలవరంలో గుండె తటతటలాడుతోంది! నా సంతోషమంతా దూరమై, ప్రపంచమంతా శూన్యమైనట్లు కానవస్తోందయ్యా! మరదీ భ్రాతృవత్సలుడైన మీ అన్నగారూ నా మరదులూ అట్లే అత్తలందరూ క్షేమంగా వున్నారా?" అని అడిగి చేతులు మోడ్చి "ఓ వేల్పులారా, పట్టణాలు, పల్లెల్లో వుండే మా ప్రజలందరికీ క్షేమం కల్గించండి"అని ప్రార్థించింది. లక్ష్మణుడామెకు

నమస్కరిస్తూ "తల్లీ అందరూ క్షేమంగానే వున్నారమ్మా" అని పలికాడు. సాయంకాలానికి తేరు గోమతీ తీరానికి చేరగా, అచట ఆపించి, అక్కడి ఆశ్రమంలో రాత్రి విశ్రమించారు.

మరునాటి ఉదయం సూర్యోదయం కాగానే, సుమంత్రుడు రథం సిద్ధపరచగా, వారు ఎక్కి, పట్టి మధ్యాహ్నానికి పావన భాగీరథీ తీరం చేరారు. మనస్సు దుఃఖంతో కుములుచున్న సౌమిత్రి, సీతమ్మను విడిచి పెట్టవలసిన గమ్యం సమీపించిందే అనే సంతాపాన్ని నిబ్బరించుకోలేక, బావురుమని రోదనం చేయసాగాడు.

## సీతాదేవి మరదిని ఓదార్చుట

జానకీదేవి మరది అట్లు శోకించడాన్ని చూచి కలవరంతో "లక్ష్మణా ఏమైంది? ఎంతో కాలంగా నా మనస్సులో నున్న కోర్కె తీరనుండటం వల్ల నా మనస్సు కుదుట పడుతుండగా, నీవు యిట్లు శోకిస్తున్నావేమి? నాయనా, నీవు అన్న సేవను క్షణమైనా ఎమరవని నేనెరుగకపోలేదు; ఆయన పరిచర్య లేకుండా రెండు దినాలు గడపవలసి వచ్చిందే అని పరితపిస్తున్నావా? ఆ పురుషోత్తముడు నాకు ప్రాణాధికుడైనా, నేను ఆరాటాన్ని నిగ్రహించటం లేదా? కనుక ఈ మూర్ఖత్వం మానుము; వెంటనే గంగను దాటించే యత్నం చేయుము; మనము త్వరలో తాపసుల దర్శనం చేసుకొని, వారి పత్నులకు ఆభరణాలు, పలువలు సమర్పించి వారితో రేః ఒక్క రాత్రియే గడపుదాము; పద్మలోచనుడు, లోకాభిరాముడైన నా ప్రాణకాంతుని దర్శించడానికి నా మనస్సు వేగిరపడుతుండటంవల్ల, రేపటి దినమే అయోధ్యకు బయలుదేరుదాము." అని పలికి ఓదార్చింది.

ఆమె మాటలతో రామానుజుడు ధైర్యం వహించి, కన్నీళ్ళు తుడుచుకొని, గంగదాటడానికి తోయుసను నావను సిద్ధపరచమనగా వారట్లు చేశారు. తరువాత సౌమిత్రి సుమంత్రుని రథంతో అక్కడ వేచివుండుమని

చెప్పి, సీతాదేవిని ఆమె సామగ్రితో నావపై ఎక్కించి, తాను ఎక్కగా వడిగా నావ అవలితీరం చేరింది.

## లక్ష్మణుడు సీతమ్మకు రామాజ్ఞ వినిపించలేక విహ్వలుడగుట

అక్కడ సౌమిత్రి పతివ్రతా మణిని చూచి, శరీరమంతా కంపిం చగా కన్నీరు కారుస్తూ "సీతమ్మతల్లీ, ధీమంతుడైన అన్న క్రూరమైన తన ఆజ్ఞను నిర్వర్తించడానికి ఈ అభాగ్యుణ్ణి నిర్ణయించి, శాశ్వతమైన లోక నిందకు గురిచేశాడమ్మా! ఆ యాజ్ఞ లోతుగానాటిన మేకువలె నన్ను బాధిస్తోంది! ఇంతకంటె నాకు చావుమేలనిపిస్తోందమ్మా! ఈ ఘోరకార్యం నెరవేర్చడానికి ఆయనకు దౌర్భాగ్యంవల్ల నేనే కన్పించాను! అయ్యో! పతి సుగుణభూషణుడు యిట్టి ఆజ్ఞ యివ్వడం తగునా? మహాభాగా, అని వార్యమైన మహారాజు ఆజ్ఞ నెరవేర్చవలసి వచ్చినా, నేను పాతకిని కానమ్మా! తల్లీ! నా పాపాన్ని క్షమించుము" అని పలికి అంజలితో రోదనం చేస్తూ, అతడు భూమిపై పడ్డాడు.

వసుంధరాతనయ, యిట్లు తన్ను క్షమింపుమని అంజలితో వేడుతూ, దుఃఖంవల్ల ఎర్రబడ్డ కన్నులతో నాకు చావురాదేమని, శోకిస్తున్న ధీశాలి మరదిని చూచి భయపడుతూ "అన్నా లక్ష్మణా, నీవిట్లేల అయోమయంగా శోకిస్తున్నావో నాకు బోధపడటం లేదు! నా ప్రాణకాంతుడు స్వస్థతతో, క్షేమంగా వున్నాడా? నన్ను గూర్చి నీవిట్లు శోకించడానికి కారణమైన రాజాజ్ఞఏమో, వెంటనే వినిపించవలసి నిన్ను ఆజ్ఞాపిస్తున్నాను" అని ఆదేశించింది.

## లక్ష్మణుడు జానకీదేవికి రామాజ్ఞను వినిపించుట

ఇట్లు జానకీమాత ధైర్యం కలిగించగా, సౌమిత్రి లేచి కూర్చుండి దీనుడై తలవాల్చి కన్నీళ్ళతో కంఠం గద్గదంకాగా "తల్లీ ఏమని చెప్పుదును? అన్న సభలో నుండగా, చారుడు వచ్చి నిన్నుగూర్చి పౌరులూ, జానపదులూ

నీచమైన నిందలు వ్యాపింప చేస్తున్నారని వినిపించగా, ఆయన ఎంతో పరితపించి, తన మనసులోని భావాలన్నీ నాకు వినిపించి, మందిరంలోనికి పోయాడు.

"సాధ్వీ శిరోమణీ, ఆయన పలుకులన్నీ నీ ముందట పలుకలేనమ్మా ! నీ మహిమను నేను ప్రత్యక్షంగా ఎరుగుదును ! నీవు నిర్దోషివని అన్నకూడ ఎరుగక పోలేదు ! అయినా లోకుల నిందాభయంవల్ల, నిన్ను విడిచాడే కాని, నీ శీలాన్ని శంకించి అట్లు చేయలేదమ్మా ! జరిగిన యధార్థ మిది. నీ గర్భస్థితిని బట్టి ఆయన ఆజ్ఞాప్రకారం నిన్నీ మహర్షుల ఆశ్రమ ప్రాంతంలో విడిచిపెట్టి పోవలసి వస్తోంది ! నీవు కోరిన చూలింతకోర్కె సాకుతో ఆయన ఇట్లు చేయమన్నాడు. శుభ శీలా నీవు దర్శించకోరిన భాగీరథీ తీరంలోని రమణీయాలూ పావనాలైన తపోవనాలు సమీపంలోనే వున్నాయి. ఈ ప్రాంతంలోనే మా తండ్రిగారికి మిత్రుడూ పరమతపస్వి కరుణా పరాయణుడూ యశస్వి అయిన విప్రుడు వాల్మీకిమహర్షి నివసిస్తున్నాడమ్మా ! మాతా కనుక నీవు దుఃఖపరవశవుగాక తండ్రితో సమానుడైన ఆ మహర్షి శుశ్రూషచేస్తూ, రామచంద్రమూర్తిని మనస్సులో ధ్యానిస్తూ పాతివ్రత్య నియమాలను ఏమరక కాలం వెళ్ళబుచ్చాలి ! నీకు శుభాలు ప్రాప్తిస్తాయి !" అని విన్నవించాడు.

## సీతాదేవి భర్త ఆజ్ఞవిని విలపించుట

ఆ నారీమణి దారుణాలైన మరది మాటలువిని, ఘోరమైన దుఃఖంతో నేలబడి, మూర్ఛిల్లింది ఎట్లో కొంతసేపటికి తేరుకొని ధారగా కన్నీళ్ళు కారుచుండగా దీనుడైన మరదితో "అన్నా లక్ష్మణా, లోకకర్త, నా శరీరాన్ని దుఃఖాలు అనుభవించడానికే సృష్టించాడయ్యా ! అందువల్లనే నేను మూర్తీభవించిన శోకమూర్తినయ్యాను సుమా ! అయ్యో గతజన్మలో నేను ఎట్టి ఘోర పాతకం చేశానో, లేక ఏ సాధ్వికి భర్త వియోగం కలిగించానో కదా !

దాని పరిణామంగానే సలెనీ, శుద్ధురాల నైయుండీ, నిష్కారణంగా భర్తచే త్యజించ బడ్డానేమో ?

"మరదీ, లోగా నీవు అరణ్యవాసం చేయలేదా అంటావేమో ? చేసినమాట నిజమే ! అయితే నాడు భర్త పాద సేవానందంలో వనవాస దుఃఖం మరప కలిగాను ; కాని ఈనాడు నా కా భాగ్యమెక్కడిది ? నేడు రః కారడవుల్లో ఒంటరిని, అనాథనై ఎట్లు సంచరించగలను ? నా ఇడుమలు ఎవరికి వినిపించను ? నన్ను చూచిన మహర్షులు నిర్జనారణ్యాలకు ఏల వచ్చావు ? మహాత్ముడైన రామచంద్రుడు ఏ దోషంచేస్తే నిన్ను విడిచాడో కదా అంటే, ఏమని సమాధానం యివ్వగలను ? నా పతి క్రూరుడై నన్ను విడిచిపెట్టాడని ఆయనపై నిందమోపి పలుకుదునా ? అది యథార్థమే అయినా, సతినైన నేను అట్లు పలకడం యుక్తంకాదే !

"లక్ష్మణా నేను మరణిస్తే నా భర్త రాజవంశం నశిస్తుందన్న భయంతో మానుచున్నానే కాని లేకున్న అయన నిర్దయత్వానికి ప్రతిగా యీ క్షణమే గంగలో దూకి దేహత్యాగంచేసి యుండనా ? అంతేగాక ఈనాడు నేను దుఃఖవివశనై ఆ పనిచేస్తే[1] తరువాత ఆయన నిర్దోషివయ్యీ నా వంశం లేకుండా చేశావా అని పరిహాసమాడుననీ, రఘువంశంలో జన్మించిన క్రూరుడని నా పతికి శాశ్వతమైన అపకీర్తి వస్తుందనీ కూడ ఆ యత్నం మానుచున్నాను సుమా !

## సీతాదేవి రామచంద్రునకు సందేశం పంపుట

"నాయనా, నీ వాయన ఆనతి ప్రకారం దుఃఖితను, అభాగినినైన నన్ను వదలి ఆయన సన్నిధికి పొమ్ము ; కరుణించి అత్తగార్లందరికీ పాద నమస్కారాలు చేసాననీ, వారి కుశలం అడిగాననీ తెలుపుము ; నా

1 సీతాదేవి పై వాక్యాలు శ్రీరామచంద్రమూర్తి ఏకపత్నీ వ్రతాన్ని స్పష్టంగా చాటుచున్నవి.

వల్లభునకు నా మారుగా సాష్టాంగా పాదనమస్కారంచేసి ఆయన సేమ మడిగినట్లు తెలిపి, నా సందేశంగా "రాజమార్తాండా, ధర్మమందే దృష్టి నిలిపి ప్రజలను పాలింపుము ! నన్ను నిందించారని వారిపై ఆగ్రహించకుము! నేను నిర్మలననీ, నీ హితకారిణినీ, నీ భక్తురాలననే యథార్థం నీ వెరుగనిది కాదు ! జనుల నిష్కారణనిందలకు భయపడిన నీ చే విసర్జించబడి, దిక్కులేనిదాననై అడవుల పాలయ్యానని మరువబోకుము ! అయినా నాకు పరమగతివి నీవే కావడంవల్ల నా నిందను తొలగించే భారం నీదేనని జ్ఞప్తిలో నుంచుకొమ్ము !

"జీవితేశ్వరా, ప్రజల్ని, సోదరులనువలె రక్షించుట, పరమ ధర్మమై అభంగ యశస్సును కలిగిస్తుంది. నా శరీరం బాధలకులోనై శుష్కిస్తుందని నేను శోకించడం లేదు ! అజ్ఞానులైన పామరులు క్రూరంగా వ్యాపింపచేస్తున్న నిష్కారణ నిందలు తలచుకొనియే, కుములుచున్నాను సుమా ! ఇకనైనా యిట్టి వృధా నిందలు రాకుండా, హెచ్చరికతో రాజ్య పాలన చేయుము ! ప్రాణనాథా, సహధర్మచారిణులకు పతియే పరమబంధువు గురువు, దైవం కావడంవల్ల, అతని పనులను ప్రాణాలకంటె అధికంగా భావించి నెరవేర్చుటయే, ఆమెకు ఎల్లప్పుడు కర్తవ్యమని మరువబోను ! అని విన్నవించుము. తండ్రీ గర్భిణినైన నా కెట్టి దుర్దశ కలిగిందో చూచి పొమ్ము" అని దీనురాలై పలికింది.

## సౌమిత్రి సీతను విడిచి మరలుట

ఆమె మాటలు విన్న రామానుజుడు మిక్కిలి దీనుడై ఒక్కమాట కూడ బదులు పలుకలేక ఆ మహిళామణి పాదసన్నిధిలో నేలను తాకుచు శిరస్సువంచి ప్రణామం తరువాత ప్రదక్షిణం చేసి, బిగ్గరగా ఏడ్చుచు, తరువాత ఒక్కక్షణం యోచించి "పావన శీలా, నన్ను నీ స్థితిని చూడు మనుచున్నావా ? తల్లీ ఇంతవరకు నీ పాదకమలాలనే గాని, నీ రూపాన్ని చూచి ఎరుగని నేను, నిర్జనమైన అడవిలో నీ స్వామికూడ

లేనప్పుడు నిన్ను ఎట్లు చూడగలనమ్మా! కనుక నన్ను మన్నించుము" అని పలుకుచుపోయి నావ ఎక్కి శోకంతో గంగనుదాటి వెళ్ళి రథంలో కూలబడ్డాడు: అదిచూచి, కమలపత్రాలవంటి కన్నులు గల ఆ యశోధనురాలు, అనాథయై అతిదుఃఖంతో నేలపైబడి పొరలుచు నెమిళ్ళ ధ్వనులతో మనోజ్ఞంగా వున్న ఆ వనంలో నిస్సహాయయై ఎలుగెత్తి ఏడ్చుచుండెను.

## సీతాదేవిని గూర్చి వాల్మీకి శిష్యులు ఆ మహర్షికి విన్నవించుట

ఇట్లు దీనురాలై విలపిస్తున్న ఆ మహాభాగను సమీపంలో తిరుగుచున్న వాల్మీకి మహర్షి శిష్యులు చూచి, తమ గురువు వద్దకు పరుగెత్తిపోయి ఆయనకు నమస్కరిస్తూ "మహాత్మా, సాక్షాత్తు శ్రీమహాలక్ష్మివంటి ఏ మహానీయుని ఇల్లాలో గంగాతీరంలో ఒంటరియై దిక్కులేని దానివలె కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది! ఇంతకు ముందామెను ఎన్నడు చూచి ఎరుగము! ఆ తేజోవతి మింటినుండి కూలిన దేవకాంతవలె నున్నదేగాని, మనుష్య కాంతవలె కాన్పించడంలేదు! ఎన్నడూ శోక మెరుగనట్లున్న ఆ యశోవతి శోకమగ్నురాలై కుములుతోంది. భగవాన్, ఆమె తమ ఆశ్రమ ప్రాంతంలో, దిక్కులేనిదై రక్షణకోసం శోకిస్తుండటంవల్ల, తాము రక్షకులై, ఆమెను రక్షించండి" అని విన్నవించారు.

సర్వజ్ఞుడైన ఆ మహర్షి వారి పలుకులు విని జ్ఞాన దృష్టితో, సీతాదేవి స్థితిని తెలిసికొని, చేయవలసిన పని నిశ్చయించి, శిష్యుల్ని అర్ఘ్య పాద్యాలు తెమ్మని నియమించి, పొంగిపొరలే కరుణతో, పాదుకలైనా ధరించని పాదాలతో వేగంగా పరుగెత్తివెళ్ళి ఆమెను సమీపించాడు.

## మహర్షి వాల్మీకి సీతాదేవికి స్వాగతం తెలిపి వూరార్చుట

ఆ మహాతపస్వి దుఃఖభారంతో తపిస్తున్న రామపత్నిని సాదరంగా చూస్తూ మధురవాక్కులతో "ఓ పతివ్రతా శిరోమణీ, జనకరాజ కుమారివీ, దశరథ మహారాజు పెద్దకోడలివీ, రామచంద్రప్రభువు పట్టమహిషివైన

నీకు స్వాగతమిస్తున్నానమ్మా! తల్లీ ముల్లోకాల్లో జరిగే విషయాలన్నీ గ్రహించే ధ్యాన దృష్టితో యిక్కడికి నీ వేలవచ్చావో తెలుసుకున్నానమ్మా! నీ యందు కేశమాత్రమైనా దోషంలేదు! కనుక భీతి చెందకుము! జానకీ మాతా, నీ తండ్రివంటి వాడనైన నన్ను విశ్వసించి నీవు స్వంత ఇంటికి వచ్చినట్లు భావించి, ఈ అర్ఘ్య పాద్యాలను తీసికొని స్వస్థురాలవు కమ్ము! నా ఆశ్రమ ప్రాంతంలోనున్న తపస్వినులు నిన్ను నిత్యం తమ కన్న బిడ్డనువలె శ్రద్ధతో పోషించగలరమ్మా!" అని పలికాడు. సీతమ్మ, పరమ అద్భుతాలైన మహర్షి వాక్కులను అర్ఘ్య పాద్యాలను ఆదరంతో అంగీకరించి, కృతజ్ఞతామూర్తిగా, ఆయన పాదాలకు శిరస్సుతో ప్రణామం చేసి, వినయంతో మోడించిన చేతులతో మౌనంగా[1] ఆయన వెంట బయలు దేరింది!

## వాల్మీకి మహర్షి సీతాదేవిని మునిపత్నులకు అప్పగించుట

సీతాదేవిని వెంటబెట్టుకొని వస్తున్న మహర్షిని చూచిన మునిపత్నులు ఆనందంతో ఆయనకు నమస్కరిస్తూ "మహర్షిశేఖరా, చాలకాలం తరువాత మా నివాసాలకు వస్తున్న మీకు స్వాగతం పలుకుచున్నాము! మా నమస్కారాలు స్వీకరించి, మేము చేయవలసిన పని ఏమో ఆజ్ఞాపించండి" అని ప్రార్థించారు. ఆ మహాత్ముడు వారితో "అమ్మలారా, ఈ సీతాదేవి మహారాజు రామచంద్రుని అర్ధాంగి! జనకరాజు కుమారి, దశరథ మహారాజుల పెద్దకోడలు! ఈ సాధ్వి పతివ్రతా శిరోమణి, నిర్దోషియైనా విధి వశంవల్ల భర్తచే విడువబడింది! ఈ సాధుశీలను నా కూతురుగా పోషించ తలచాను! కనుక మీరు నా మాటమీది గౌరవంతోను, నిష్కపట గౌరవ భావాలతోను ఈమెను పోషించండి!" అని ఆదరంతో నొక్కిచెప్పి ఆమెను వారికి అప్పగించి, శిష్యులతో తన ఆశ్రమం చేరాడు.

---

1. సీతాదేవి ఎవ్వరితో ఏమి మాటాడదని ఆ రోజునుండి, చివరి ప్రయాణం వరకు మౌనవ్రతం అవలంబించింది.

## సౌమిత్రి సుమంత్రునితో సీతాదేవిని గూర్చి తెలిపి దుఃఖించుట

మహర్షి వెంట సీతాదేవి ఆశ్రమానికి పోవడం చూచిన సౌమిత్రి సారథిని రథం పోనిమ్మని పలికి అట్లు పోవుచుండగా శోకభారంతో ఖిన్నుడై "సుమంత్రా సీతాదేవిని విడువ నిశ్చయించిన శ్రీరాముని దుఃఖం చూచావు గదా! పరమ ధార్మికుడైన జనకుని కుమార్తె, లోకమంతా పొగడే సదాచారసంపన్నురాలైన ఇల్లాలిని, విడుచుటను మించిన దుఃఖం ఆయనకు వుండగలదా? ఆయన భార్యా వియోగంతో కృశించడం విధి నిర్ణయమేమో? దైవనిర్ణయాన్ని దాటడం ఎవరికి సాధ్యమౌతుంది? ఏ మహాబాహుడు దేవ, దానవ మహావీరుల్ని భంగపరచాడో, ఆ మేటియే నేడు దీనుడై దైవానికి లోబడి దుఃఖిస్తున్నాడు కదా!

"ఇంతకు ముందు ఆ ధర్మశీలి, తండ్రి ఆజ్ఞానుసారంగా నిర్జన వనాల్లో పధ్నాలుగు సంవత్సరాలు మితిలేని కష్టాలు అనుభవించాడు. కాని ఈనాడాయన సీతమ్మను త్యజించటంవల్ల కలిగే దుఃఖాన్ని భరించటం లోగడకంటెను కష్టతరమేసుమా! ప్రాణప్రియ పరమసాధ్వియైన పత్నిని, లోకుల వ్యర్థపు మాటలు పాటించి విడిచిపెట్టిన ఆయన ఎంతటి కఠినాత్ముడు? వైదేహి నిర్దోషి, మహాసాధ్వి అని ఎరిగి యుండియు, అజ్ఞులైన పామరుల నిందలు నిరాధారాలని తెలిసికూడా అన్న ఆమెను అరణ్యాల పాలు చేయడం తగునా? అయినా ఇందువల్ల, నింద తొలగుతుందా? నేడు సీతమ్మను నిందించిన ఆ ప్రజలే రేపు ఆయన చూలింత రాలైన ఇల్లాలిని కనికరంలేక అడవులపాలు చేసిన క్రూరుడని నిందించకుంటారా? ఆయన ఏ ధర్మాన్ని ఆచరిస్తాడు? అయ్యో ఎంత చెప్పినా వినిపించుకోడే, ఎంతటి గుండె దిటవు కలవాడు?'' అని అనేకవిధాల పరితపించాడు.

## సుమంత్రుడు హితవాక్యాలతో లక్ష్మణుని ఓదార్చుట

రామానుజుని దుఃఖవాక్కులు విన్న సుమంత్రుడు ఆయన్ని ఓదార్చుతూ "సౌమిత్రీ, సీతామాతకొరకు విచారించకుము ! సౌఖ్యపాత్రుడైన రాఘవునకు భార్య వియోగం తప్పకపోవడమేగాక, మరికొంతకాలం గడచాక నిన్నూ మిగతా సోదరుల్నీ కూడ విడిచిపెట్టడం అనివార్యమౌతుందని లోగా దుర్వాస మహర్షి భవిష్యద్వాణిగా, మీ తండ్రిగారికి, గురుదేవుడు, నేను వినుచుండగా తెలిపియున్నారు. మహారాజు ఈ దేవ రహస్యమెవ్వరికి చెప్పవద్దని ఆదేశించడంవల్ల ఇంతవరకు నేను ఎవ్వరికీ చెప్పలేదు సుమా ! నీ దుఃఖాన్ని చూడలేక నీకు చెప్పతలచాను. అయితే నీవు మాత్రం దీన్ని రహస్యంగా వుంచి రామచంద్రునికి గాని, భరత, శత్రుఘ్నులకు గాని వినిపించనంటేనే తెలుపుతాను" అనగా, అతడు అంగీకరించాడు.

## సుమంత్రుడు దశరథ, దుర్వాసుల సంభాషణ వినిపించుట

సుమంత్రుడు చెప్పడం ప్రారంభించి "సౌమిత్రీ ఆలకించుము. ఎన్నో సంవత్సరాల ముందు, అత్రిమహర్షి కుమారుడైన దుర్వాస మునీంద్రుడు చాతుర్మాస్య దీక్ష (వానకాలం నాలుగునెలలూ సంచారం మాని ఒకచోటనే గడిపే దీక్ష)ను వశిష్ఠాశ్రమంలో గడపుచుండగా ఒకనాడు మహారాజు గారు అక్కడికి వెళ్ళి, వశిష్ఠుల వారి పడమవైపున కూర్చున్న సూర్యునివంటి తేజస్వి దుర్వాస మహర్షిని చూచి, భక్తితో వారికి నమస్కరించగా, మహర్షులు సాదరంగా ఆయనకు అర్ఘ్యపాద్యాసనాలు ఇచ్చి, ఎన్నో మధుర గాధలు వినిపించారు.

మధ్యాహ్న సమయంలో మహారాజు దుర్వాస మహర్షికి నమస్కరిస్తూ "బ్రహ్మసమానుడా నా వంశం ఎంతకాలం నిలిచేదీ రాముడు, నా మిగత కుమారులు ఎంతకాలం జీవించేదీ, శ్రీరామునకు ఎందరు సంతానం కలిగేది తెలుప వేడుచున్నాను" అని ప్రార్థించాడు.

దుర్వాసుడు సమాధానంగా "రాజా వినుము. పూర్వం దేవాసుర యుద్ధంలో, ఓడిపోయిన దైత్యులు భృగుమహర్షి భార్యను శరణువేడగా, ఆమె వారికి అభయమిచ్చినందువల్ల రాక్షసులు నిర్భయులై గర్వించి పాపకార్యాలు చేయసాగారు. దైత్యులకు రక్షణ యిచ్చిన మునిపత్నిపై మధుసూదనుడు ఆగ్రహించి, తన చక్రాయుధంతో ఆమె శిరస్సును ఖండించాడు. భార్య మరణానికి భృగుమహర్షి నారాయణునిపై కోపించి "నారాయణా, నా భార్య స్త్రీయై, ఋషిపత్ని కావడంవల్ల చంపరానిదైనా, క్రోధంతో చంపడంవల్ల నీవు భూలోకంలో జన్మించి, చాల సంవత్సరాలు భార్యా వియోగం అనుభవింతువుగాక।" అని శపించాడు. అయితే తన భార్య దుష్టులకు రక్షణ కలిగించి దోషి కావడంవల్ల విష్ణువు ఖండించడం దోషం కాదని గుర్తించి, ఆయన తన శాపాన్ని అంగీకరించనిచో అందువల్ల తనకు నరకబాధ కలుగుననీ పశ్చాత్తాప పడి భృగుమహర్షి పుండరీకాక్షుని వినయంతో పూజించాడు. భక్తవత్సలుడైన ఆ కరుణానిధి, మునిపతి అర్చనతో ప్రసన్నుడై రావణ సంహారంతో లోకులకు మేలు కలిగించే నిమిత్తం ఆ శాపాన్ని జన్మాంతరంలో అనుభవించడానికి అంగీకరించాడు.

"రాజేంద్రా, అట్లు భృగువుచే శపించబడిన ఆ పురుషోత్తముడే, నీ భాగ్య వశంవల్ల కుమారుడు రాముడుగా జన్మించి ఆ మహర్షి శాపం అనుభవిస్తాడు. శ్రీరాముడు పదకొండువేల సంవత్సరాలు రాజ్యం పాలించి, పరమ ధార్మికుడై, సమృద్ధిగా దక్షిణలతో ఎన్నో అశ్వమేధ యాగాలుచేసి, శత్రువులకు అజేయుడై అనేక రాజవంశాలను ప్రతిష్ఠించగలడు। ఆయనకు సీతాదేవి యందు, లవకుశులు కలుగుతారు. వారికి రాముడే పట్టాభిషేకాలు చేయగా, వారు రాజ్యం పాలిస్తారు. తరువాత రామభద్రుడు వైకుంఠానికి వేంచేయగలడు" అని వినిపించగా మహారాజు ఆయన్ని పూజించి నగరానికి వచ్చెను. సౌమిత్రీ, ఈ రహస్య వృత్తాంతాన్ని, నేను వాగ్దాన ప్రకారం యింతవరకు గోప్యంగా దాచాను. అట్లు తప్పక జరుగు

తుంది. కనుక నీవు సీతకొరకు గాని శ్రీరామమూర్తి నిమిత్తం గాని పరితపించక, ధైర్యం వహించుము" అని పలికాడు.

ఆ గాథను విన్న రామానుజుడు దుఃఖించడం మానాడు. వారిట్లు మాటాడుచుండగానే, కమలాప్తుడు అస్తమించి, సంధ్యాకాలమైంది. వారు కేశినీనదీతీరంలో ఆ రాత్రి విశ్రమించి, మరునాటి సూర్యోదయంలో ప్రయాణం సాగించి, మధ్యాహ్నానికి అయోధ్య సమీపించగానే లక్ష్మణుడు తనలో అన్నమొగ మెట్లుచూతునా, ఏమి పలుకుదునా, సీతను వదలిపెట్టి వచ్చి అన్నకు తగిన తమ్ముడవనిపించుకున్నావనే తల్లులకు గాని, క్రూరుడని నిందించే పౌరులకు గాని ఏమని సమాధానమిస్తాననే మథనతో పరమదీనుడై నిట్టూర్పులతో అన్న భవనంముందు రథం దిగాడు. అక్కడ నుండి తలవాల్చుకొని అన్నభవనంలోనికి పోయి సింహాసనంపై దీనుడై కన్నీళ్లు కారుస్తున్న అన్నకు వినయంతో నమస్కరించి "ఆర్యా నీ ఆజ్ఞ ప్రకారం గంగాతీరంలో శీలవతీ యశోవతీ అయిన వదినమ్మను విడిచిపెట్టి నీ పాదసేవకు వచ్చాను।

## లక్ష్మణుడు అన్నను ఓదార్చుట

"ధర్మమూర్తీ, ఇది కాలప్రభావంవల్ల జరుగుటచే నీ వంటి స్థితప్రజ్ఞుడు శోకించడం తగునా? అన్నా, ధనాలు నశిస్తాయనీ, పెరిగేవన్నీ తరిగేవేననీ, జననం మరణంతో ముగుస్తుందనీ సంయోగ, వియోగాలు అనివార్యాలనీ నీ వెరుగనివా? అందువల్ల భార్యా, సంతతి ఎప్పుడో ఒకప్పుడు తొలగడం ధ్రువమని గుర్తించి, వానియందు అమితాసక్తి వదలడమే ధీమంతుని కర్తవ్యం సుమా!

"కాకుత్థమణీ, లోకాన్నంతా నిగ్రహించగల, నీ విట్లు శోకించడం తగదు। నీ విట్లు శోక పరాయణుడవైనచో, ఏ అపవాద భీతితో జానకిని త్యజించావో ఆమెయందు నీవు అనురాగం విడువలేదని, అదే లోకులు

నిన్ను నిందించకుంటారా? పురుషశార్దూలా, కనుక నీవు దుర్బలత్వాన్ని దూరంచేసి, ధైర్యాన్ని చిక్కబట్టి,శోకాన్ని విడువుము'' అని వూరార్చాడు.

శ్రీరామచంద్రుడు తమ్ముని పలుకులతో తేరుకొని, అతణ్ణి ప్రీతితో చూస్తూ "తమ్ముడా, నీవు యథార్థమే పలికావు. నిష్ఠురమైన నా ఆజ్ఞను నీవు పాలించి వచ్చినందుకు సంతోషిస్తున్నాను. మధురాలైన నీ మాటలు వినడంవల్ల తృప్తి, ధైర్యం కలిగి, శోకాన్ని విడుస్తున్నాను! నాయనా, కష్టకాలంలో నీవలె అనురాగం చూపే బంధువు లభించడం దుర్లభం సుమా! నన్నొక చింతవేధిస్తోందయ్యా అది నీవు తొలగించాలి. నేను పౌరుల వ్యవహారాలు సక్రమంగా విచారించి నేటికి నాలుగురోజులైంది సుమా! ఆ చింత నన్ను కృంగతీస్తోంది! కనుక నీవు వెంటనే మన పురోహితుణ్ణీ మంత్రుల్నీ సభకు రమ్మని కబురంపి, సభలో పనులున్న ప్రజలందర్నీ రప్పించాలి! పౌరుల వ్యవహారాలు నిత్యం విచారించని అలసుడైన రాజు, మరణించిన తరువాత నిర్వాత నరకంలో బాధలనుభ విస్తాడు. ఇందుకు ఉదాహరణగా బాధలపాలైన నృగుమహారాజు చరిత్ర వినిపిస్తాను వినుము.

## రాఘవుడు సౌమిత్రికి నృగుమహారాజు చరిత్ర తెలుపుట

"సౌమిత్రీ, పూర్వకాలంలో శుచి, సత్యవంతుడు, ఆచారపరుడు, బ్రాహ్మణ ప్రియుడైన నృగుడనే రాజు పుష్కరక్షేత్రంలో బంగారు సొమ్ములతో అలంకరించి, తేగలతోనున్న కోటిగోవులను విప్రులకు దాన మిచ్చాడు. వారిలో నిరుపేద, నిర్యాగ్ని హోత్రీ. ఉంఛవృత్తివల్ల జీవించే ఒక బ్రాహ్మణునకు యివ్వబడిన ఆవు తిరిగివచ్చి రాజుగారి ఆవుల మందలో కలసింది. అది గుర్తించని రాజు, దానినే మరొక బ్రాహ్మణునకు దాన మిచ్చాడు. మొదట ఆ ఆవును దానంగా పొందిన బ్రాహ్మణుడు దాని పాలచే జీవించేవాడు గనుక, ఆకలితో బాధపడుతూ, తన గోవును వెదకుతూ చాల ప్రదేశాలు తిరిగి, చివరకు ఒకచోట రెండవ బ్రాహ్మణునకు

యివ్వబడి లేగ లేకుండా వున్న తన యావును గుర్తించి ఆప్యాయంగా దానిని రమ్మని పిలువగా ఆయన కంఠ స్వరాన్ని గుర్తించిన ఆ యావు ఆయన్ని అనుసరించింది.

అదిచూచి, దాన్ని రెండవసారి దానం పొంది, పోషించిన, విప్రుడు ఆయనతో "అయ్యా నాకు నృగుమహారాజు ధారపోసిన గోవును నీవు తీసికొని పోవడం న్యాయమా ?" అని అడ్డగించాడు. దానితో తగాదాపడిన ఆ బ్రాహ్మణులు, అ వ్యవహారం రాజువద్ద తేల్చుకోవాలని నృగుమహారాజు మందిర ద్వారంవద్దకు వెళ్ళారు. అయితే రాజాజ్ఞలేదని కావలివారు వారిని అడ్డగించారు. రాజుకోసం ఎదురుచూస్తూ వారు అచట 1,2 సంవత్సరాలు గడిపి, ఆయన దర్శనంకాక విసుగుచెంది, ఆగ్రహంతో "ప్రజలు తమ గోడులు వినిపించుకోడానికి ద్వారంవద్ద వేచియుంటే, దర్శన మీయని ఈ రాజు ఊసరవెల్లియై, ఎవరికీ కనిపించకుండా ఒక బిలంలో వేలసంవత్సరాలు పడియుండుగాక ! ద్వాపరయుగాంతంలో, భూదేవిభారం తొలగించడానికి యదువంశంలో అవతరించే నారాయణుని కరుణతో ఈ శాపం తీరుతుంది" అని ఘోరంగా శపించి ముసలిది, దుర్బలమైన ఆ గోవును వేరొక విప్రునికి దానం యిచ్చి తమ నివాసాలకు పోయారు.

"తమ్ముడా, ఇప్పటికీ, ఆ నృగుమహారాజు దారుణమైన ఆ శాపాన్ని ఓర్పుతో అనుభవిస్తున్నాడు ! జనుల వ్యవహారాలు వెంటనే, సావధానంగా పరిశీలించనిచో, వారిలో కలహాలు పెరిగి ఆ పరిపాలకుడు దుర్గతుల పాలౌతాడు ! కనుక ప్రజలు ఎవరైన వేచియున్నారేమో కనుగొనుము" అని పలికాడు. లక్ష్మణుడు ఆయనకు అంజలిచేసి, "అన్నయ్యా స్వల్పమైన నేరానికి యమదండంవంటి శాపంపొందిన ఆ నృగుడు ఏమిచేశాడు ?" అని ప్రశ్నించాడు. ఆయన సమాధానంగా "లక్ష్మణా, శాప సమాచారం తెలుసుకున్న రాజు దుఃఖితుడై హితుల్నీ, మంత్రుల్నీ రప్పించి వారితో "సచివులారా, ఈ వార్త విన్నారా, నారద, పర్వతులనబడే మహర్షులు

బ్రాహ్మణ రూపాలతో వచ్చి, నాకు ఘోరశాపం యిచ్చి, వాయురూపంతో బ్రహ్మలోకానికి పోయారట! కనుక మీరు త్వరపడి నా కుమారుడు వసువుకు పట్టాభిషేకం జరపండి. అదే విధంగా నేను శాపాన్ని ఓర్పుతో భరించడానికి వీలుగా ఎండ, వానలు, మంచు తీవ్రతలు బాధించని విధంగా శిల్పులను రప్పించి మూడు పెద్ద బిలాలు నిర్మించి, చుట్టూ యోజనం వరకూ ఫలవృక్షాలు, పూలతీగలు నాటునట్లు ఏర్పాట్లు చేయండి" అని పలుకగా, వారా ఏర్పాట్లన్నీ చేశారు.

## నృగు మహారాజు ఊరువెల్లియై బిలంలో ప్రవేశించుట

పిమ్మట అభిషిక్తుడైన కుమారుడు వసువు సమీపించగా ఆయన ఆశీర్వదించి "నాయనా ధర్మాన్ని ఏమరక, క్షాత్రధర్మానుసారంగా ప్రజలను పాలించుము. నేను చేసిన అల్పదోషానికి[1] విప్రులు ఎంతటి ఘోర శిక్ష విధించారో ఎరుగుదువు కదా! అయితే యిందుకు పరితపించకుము! మనుజులు గతంలో చేసిన పుణ్యపాప ఫలాలనుబట్టి శుభా శుభాలు రెండూ తమంతట తామే ప్రాప్తించడం, తొలగవలసినవి దూరం కావడం జరుగుతుంది. ఆయా సమయాల్లో మనుష్యులు తబ్బిబ్బు కారాదు" అని బోధించి, బిలంలో ప్రవేశించి, దీనుడై కాలం గడుపుతున్నాడు" అని వినిపించి, "తమ్ముడా, నీవు వినదలచినచో యిట్టిదే ఆసక్తికరమైన మన వంశీయుడు నిమి మహారాజు కథను వినిపిస్తాను" అనగా సౌమిత్రి అంగీకరించాడు.

## శ్రీరాముడు నిమి కథను వినిపించుట

రఘుపతి ప్రారంభించి "తమ్ముడా, మన పూర్వీకుడు మహాత్ముడైన ఇక్ష్వాకు మహారాజు పన్నెండవ కుమారుడు నిమిరాజు ధర్మపరుడనీ,

1 రాజుకు తాను చేసిన దోషం అల్పం అనిపించినా అందువల్ల ఎందరు బాధ పడ్డారో ఎరుగడు. ఆయన అలసత్వాన్ని పరీక్షించడానికే నారద ప్రభృతులనబడే ఋషులు బ్రాహ్మణులుగా పుట్టి బాధపడి యమదండం వంటి శాపమిచ్చి పోయారు.

విక్రమశాలియని పేరు పొందాడు. ఆ రాజర్షి గౌతమాశ్రమ ప్రాంతంలో వైజయంత మనబడే పట్టణాన్ని నిర్మించి దీర్ఘ సత్రయాగం చేయదలచి, దాన్ని నిర్వహించమని కులగురువు వశిష్ఠుని ప్రార్థించాడు. ఆయన తన్ను అంతకుముందే యజ్ఞ నిర్వహణకు ఇంద్రుడు ప్రార్థించాడనీ, అందువల్ల తా నా యాగం ముగించి వచ్చేవరకు ఆగమనీ రాజునుకోరి, పోయాడు. అయితే నిమి అట్లు ఆగడానికి యిష్టపడక, భృగు, అత్రి, గౌతమ మహర్షులను ప్రార్థించి, వారు యాజకులుగా దీర్ఘ సత్రయాగం ప్రారంభించి, అయిదువేల ఏండ్లు సాగించాడు. అంతట మహేంద్రుని యాగం ముగించి వచ్చిన వశిష్ఠుడు నిమి యజ్ఞంచూచి ఆగ్రహించి, రాజు కొరకు క్షణం సేపు ఎదురుచూచాడు.

అయితే దౌర్భాగ్యంవల్ల ఆనాటి మధ్యాహ్నం రాజు నిద్రించుటచే, ఆయనవద్దకు రాలేదు. దానితో మహర్షి కోపించి, "రాజా, ముందు నన్ను ఆహ్వానించి, మరొకనిచే యాగం జరిపిస్తూ, యిందును గూర్చి నేను నీతో మాటాడదలచగా, నీవు యింటిలో నుండియు. దర్శనమీయకపోవుటచే, నీవు చైతన్యాన్ని కోల్పోవుదువుగాక" అని శపించాడు.

ఆ విషయం తెలిసికొన్న రాజు, వేగంగావచ్చి ఆగ్రహంతో "మౌనీ, నేను అలసి నిద్రిస్తున్న సమయంలో వచ్చి, ఇట్టి ఘోరశాపం యివ్వడం తగునా? అందువల్ల నీవును చైతన్యం కోల్పోవుదువుగాక" అని బదులు శాపమిచ్చాడు. ఇట్లు వారు ఆగ్రహానికి వశులై ఒకరు, మరొకరిని శపించుకొని, దేహాలు విడిచారు" అనగా లక్ష్మణుడు, "అన్నా తిరిగి వారెట్లు దేహాలు ధరించారో తెలుపుము" అని వేడాడు.

## వశిష్ఠుడు దేహం ధరించుట

శ్రీరామమూర్తి సమాధానంగా, "వారిద్దరూ శరీరాలు లేక, గాలిలో తిరుగుచుండిరి. వారిలో వశిష్ఠమహర్షి తండ్రియైన బ్రహ్మదేవుని సమీపించి,

నమస్కరిస్తూ "సర్వ సృష్టికి కారణభూతుడవైన విధాతా, నేను నిమిరాజు శాపంవల్ల దేహాన్ని పోగొట్టుకొంటిని. శరీరం లేకపోవడంవల్ల కర్మ జరుగక, బాధలుపడవలసి వస్తుంది. కనుక కరుణించి నాకు మరొక దేహం ప్రసాదింపుము" అని వేడాడు: ఆయన "బ్రాహ్మణోత్తమా, నీవు మిత్రా వరుణుల తేజస్సులో ప్రవేశించి, అయోనిజుడవై జన్మించి శరీరం ధరించి, తపస్సు ద్వారా నన్ను చేరుదువుగాక" అని ఆదేశించగా, వశిష్ఠు డాయనకు మ్రొక్కి వరుణ మందిరానికి వచ్చాడు.

ఆ సమయంలో మిత్రుడు వరుణునితో చేరి, రాజ్యం పాలించు చుండెను. అప్పు డచటికి, సౌందర్యవతియైన ఊర్వసి, తన చెలులతో రాగా, వరుణు డామెను, తన్ను కామించుమని కోరగా, ఆమె తన్ను మిత్రు డంతకుముందే కామించెననీ, కనుక అతనికంటె ముందు తన వద్దకు రాజాలననీ పల్కింది. అందుకు అతడు కామాన్ని సహించలేననీ, కనుక తన వీర్యాన్ని కలశమందు విడుస్తానని పలికాడు. అందులకామె అది తనకు సమ్మతమేననీ, దేహసౌఖ్యం మిత్రునకు ఇవ్వనున్నా, అంత కంటె శ్రేష్ఠమైన హృదయ కమలాన్ని అతనికి ఇస్తున్నానని పలుకగా వరుణుడు తన వీర్యాన్ని దివ్య కుంభంలో విడిచాడు.

తరువాత ఊర్వశి మిత్రుని సమీపించగా, అతడు క్రోధంతో, "దుష్టురాలా నేను మొదట కోరగా అంగీకరించిన నీవు మరొకనికి అవకాశ మిచ్చిన దోషంవల్ల నీ గౌరవం తగ్గునట్లు భూలోకంలో కాశీరాజైన పురూరవు భార్యవై కొంతకాలం సంచరింతువుగాక" అని శపించాడు. ఆ ప్రకారం ఆమె పురూరవుని భార్యయై అయువనే కుమారుని ప్రసవించింది. అయువు కుమారుడైన నహుషుడు పుట్టి ప్రశస్తంగా రాజ్యం పాలిస్తూ, ఆ సమయంలో వృత్రుని సంహరించడంతో ఇంద్రుడు మతిభ్రమించి సంచరిస్తుండగా అతని స్థానంలో దేవపతియై స్వర్గాన్ని చాలకాలం పాలించాడు. ఊర్వశి భూలోకంలో చాలకాలం గడిపి శాపం తీరగా, తిరిగి దేవ లోకం ప్రవేశించింది" అని వినిపించాడు.

## కుంభం నుండి అగస్త్య, వశిష్ఠులు జన్మించుట

అప్పుడు సౌమిత్రి "అన్నా, ఆ రాజర్షి, మహర్షులు తిరిగి ఎట్లు దేహాలు ధరించారో తెలుపుము" అని కోరాడు. అందుకు శ్రీరాముడు "లక్ష్మణా, వినుము. మిత్రుడు మొదట ఊర్వశిని చూచినప్పుడే దేహ సంపర్కం లేకుండా తన తేజస్సును దివ్యకుంభంలో విడిచాడు. తరువాత వరుణుడును ఆ విధంగానే తన వీర్యాన్ని అదే కుంభంలో చేర్చాడు

ఆ కలశం నుండి ముందు అగస్త్యుడు జన్మించి, అయోనిజుడు కావడంవల్ల కుంభసంభవుడనీ, కలశజుడనీ మైత్రావరుణుడనీ పిలువబడ్డాడు. తాను మిత్రా వరుణుల తేజస్సువల్ల కలుగుటచే, మిత్రునితో నీ కుమారుడను కానని పలికి వెడలిపోయాడు. తరువాత తేజస్వి వశిష్ఠుడు ఆ కలశం నుండే జన్మించి మైత్రా వరుణుడని ఖ్యాతిపొంది, ఇక్ష్వాకు మహారాజు ప్రార్థించగా అంగీకరించి, ఆ వంశ పురోహితుడయ్యాడు.

## దేవతలు, ఋషులు నిమికి వర మిచ్చుట

ఇక నిమి దేహం పొందిన విధం వినుము. యజ్ఞం నిర్వహిస్తున్న ఋషులు, ఆయన శరీరాన్ని గంధ, పుష్ప, వస్త్రాలతో అలంకరించి కాపాడుతూ, యజ్ఞాన్ని సాగించారు. యజ్ఞం పూర్తియైన సమయంలో తృప్తులైన భృగుమహర్షి, దేవతలూ నిమి ఆత్మతో "నిమీ, నీ జీవితాన్ని ఎందు నిలుపకోరుతావో, అడుగుము" అని కోరారు. అందులకు అతడు "వేల్పులారా, నేను సర్వభూతాల చూపుల్లోనూ నివశించ కోరుచున్నాను" అనగా వేల్పులు అంగీకరించి, అతడు జీవుల చూపుల్లో, వాయురూపంలో నివశించునట్లూ, ప్రాణులు బడలిక తీరడానికి కనురెప్పలు మూయునట్లూ వరమిచ్చారు. తరువాత మునులు నిమి దేహాన్ని పుత్రుడు కలగాలనే కోర్కెతో అరణిద్వారా మథించారు. ఆ అరణి మధ్యనుండి "మిథి" అను పేరుతో ఒక కుమారుడు పుట్టాడు. అతడు దేహాన్ని మథించడంవల్ల కలుగు

టచే మిథియనీ, జననముందుటచే జనకుడనీ, విదేహంవల్ల కలుగుటవల్ల వైదేహుడనీ ఖ్యాతి గాంచాడు తరువాత ఆ మిథి నిర్మించిన నగరమే మిథిల అయింది'' అని తెలిపాడు.

## శ్రీరాముడు యయాతి చరిత్ర తెలుపుట

అప్పుడు రామానుజుడు ఆయనతో ''పార్థివేంద్రా, ఇదెంతటి ఆశ్చర్యం? నిమిరాజు యజ్ఞ దీక్షలో ఉన్నా శాంతి వహించక, మహాత్ముడైన వశిష్ఠుని ఆగ్రహంతో శపించడానికి కారణమేమి?'' అని అడిగాడు. రామచంద్రుడు సమాధానంగా "సోదరా, ఆగ్రహాన్ని అణచడం, సామాన్యులకు కష్టసాధ్యం సుమా! దాన్ని నిగ్రహించిన సత్వగుణమూర్తి యయాతి మహారాజు చరిత్ర వినుము. నహుష కుమారుడైన యయాతికి శుక్రుని కూతురు దేవయాని, రాక్షసరాజు తనయ శర్మిష్ఠలను రూపవతులు భార్యలయ్యారు. వారిలో పెద్ద భార్య అయిన దేవయానికి యదువు చిన్నభార్య శర్మిష్టకు పూరుడు జన్మించారు. మహారాజుకు శర్మిష్ట పెంచు ప్రేమాస్పదురాలు కావడంవల్ల పూరుని ఆయన హెచ్చుగా లాలించేవాడు.

అందుకు యదువు దుఃఖించి తల్లితో "అమ్మా నీవు భార్గవుని కుమారివి, రాజుకు పట్టమహిషివయ్యా, నీ కన్నుల ఎదుట జరుగుచున్న అవమానాన్ని ఎట్లు భరించగలుగుచున్నావు? అంతకంటె నీవూ, నేనూ అగ్నిజ్వాలల్లో దూకి ఆత్మాహుతి చేసికోవడం మంచిదికాదా? మనపీడ తొలగితే, రాజు ఆ రాకాసితో హాయిగా సుఖించనీ! ఒకవేళ నీ వీ అవమానం భరించ గలిగితే, నేను మరణించడా కి అనుజ్ఞయిమ్ము!'' అని పలికి రోదనం చేశాడు. కుమారుని పలుకులు విన్న దేవయాని ఆగ్రహంతో తండ్రిని స్మరించగా ఆయన వెంటనే అక్కడికి వచ్చాడు.

ఆయన ఏడ్చుచున్న కూతురును చూచి "తల్లీ ఏమైనది? ఏల దుఃఖిస్తున్నావు? అని అడిగాడు. ఆమె ఆవేదనతో ''నాయనా, నా శోకానికి కారణం ఏమని చెప్పను? ఒకడు వృక్షాన్నే నరకాలనుకుంటే

దాని శక్తితో జీవించే కొమ్మలు, శాఖలు ఆకులు, పూలు, పండ్లు నశించటంలో ఆశ్చర్య మేముంది? నా భర్త గురుపువైన నిన్నే అవమానించి, మరొక రాక్షసిని తెచ్చుకొని, ఆమె పాశాల్లో చిక్కి, నా ముఖం చూడటం, మాటాడటం, నా గడప త్రొక్కటం మానుకుని ఆమెతోనే విహరిస్తున్నాడు" అని వినిపించింది.

శుక్రుడు ఆమె మాటలతో తోకత్రొక్కబడిన పామువలె వుగ్రుడై యయాతితో "రాజా ఇదేమి ఆగడం? నా బిడ్డను ఒకల్ల అవమానిస్తే సహిస్తానా? ఈ దుర్నీతికి కారణమైన నీయౌవనం తొలగి, ముసలిదొక్కువై తపించుము" అని ఘోరంగా శపించి కూతురిని ఓదార్చి పోయాడు. ఆ శాపంవల్ల వెంటనే ముసలితనం తన్ను సమీపించగా, ఆయన చింతాక్రాంతుడై పెద్దకుమారుడు యదుపును పిలిచి "నాయనా, ఇంకను నాకు సుఖ సంపదలు అనుభవించు కోరిక తీరలేదు; కనుక కొంతకాలం నా వృద్ధాప్యాన్ని తీసికొని, నీ యౌవనాన్ని నాకిమ్ము" అని అడిగాడు. అతడు హేళనచేస్తూ "తండ్రీ, ఇంతవరకు నన్ను దగ్గర చేరనీక అవమానించి, ఈనాడు నీ ముసలితనం తీసికొనడానికి నేను కావలసి వచ్చానా? న్యాయమెరిగిన రాజువయ్యుండీ, గారాబం చూపడం, ఆట పాటలు పూరునితో గడిపి, నీ జరను దాయభాగంగా నాకు యిస్తావా" అని కటువుగా సమాధాన మిచ్చాడు.

## పూరుడు తండ్రి వృద్ధాప్యాన్ని తీసికోడానికి అంగీకరించుట

అంతట ఆ నరేంద్రుడు పూరుని పిలిచి, యదుపును కోరినట్లే అడిగాడు. ఆయన మాటలు విన్నగానే ప్రాజ్ఞుడు, సంయమవంతుడైన ఆ కుమారుడు, అంజలిచేస్తూ "నాయనా, ఇది నా మహాభాగ్యంగా భావించి నీకు నా ప్రాయాన్ని యిచ్చి నీ జరను గ్రహించి, నా జన్మ సార్థకం చేసుకుంటాను" అని విన్నవించాడు. అందుకు ఆనందించిన యయాతి అట్లు చేసి, తేజోవంతుడై, కొన్ని సంవత్సరాలు సుఖ, సంతోషాలు అనుభవించి

తృప్తుడై పూరునితో "తనయా, ఇంతవరకు నా ముసలితనాన్ని నీవు అప్పగించి నీ యౌవనం తీసికొని సుఖించాను. సుగుణవంతుడా, ఇప్పుడు నా వృద్ధాప్యాన్ని నాకే ఇచ్చి, నీ యౌవనాన్ని గ్రహించి, సౌఖ్యవంతుడవగుము. నీవు నా యాజ్ఞను పాలించడంవల్ల, నీకే రాజ్యాభిషేకం చేస్తాను'' అని పలికాడు. తరువాత ఆయన యదువును రప్పించి ఆగ్రహంతో ''దుష్టుడా, నీవు నాకు పుత్రరూపంలో నున్న రాక్షసుడవే గాని కుమారుడవా? నా యాజ్ఞను ధిక్కరించిన నీకు రాజ్యమెట్లివ్వగలను? ధూర్తుడా తండ్రిననీ, రాజుననీ లేశమైనా గౌరవం చూపక, నన్ను అవమానించడంవల్ల, నీ సంతతి చంద్రవంశ ఖ్యాతిని పొందక క్రూరులు, నీతిహీనులూ అగుదురు గాక!'' అని పరుషంగా పలికాడు. తరువాత ఆయన వినయవంతుడైన, పూరునికి రాజ్యాభిషేకంచేసి తాను కొంతకాలం వానప్రస్థాశ్రమంలో గడిపి, పిమ్మట స్వర్గలోకం చేరాడు. పూరుడు ప్రతిష్ఠానపురం రాజధానిగా కాశీరాజ్యాన్ని ఖ్యాతితో పాలించాడు. ఇక తండ్రిచే బహిష్కరించబడిన దుర్వినీతుడైన యదువు, క్రౌంచవన ప్రాంతంచేరి, క్రూరులైన కుమారులు కలుగగా బాధల పాలయ్యాడు.

''తమ్ముడా,[1] వింటివి కదా, శుక్రుడు దురాగ్రహంతో క్రూరంగా శపించినా శాంతుడైన యయాతి ఎదురు పలుకలేదు సుమా! కనుక నృగుని బలసత్వ దోషం మనకు అంటకుండా జాగ్రత్త పడాలి" అని హెచ్చరించాడు. ఇంతలో సంధ్యారాగం ఎర్రని మేలిముసుగువలె మింటిని కప్పింది.

## శ్రీరామ దర్శనార్థం చ్యవనుడు మొదలైన ఋషులు వచ్చుట

అన్నదమ్ములు రాజకార్యాలు ముగిసినపిమ్మట పైవిధంగా ముచ్చటలాడుచుండిరి. ఇంతలో పగళ్ళు, చలి, వేడిమి సౌమ్యంగావుండే వసంత

---

1. వశిష్ఠ మహర్షి శాపానికి ఆగ్రహంతో ప్రతి శాప మిచ్చిన నిమిరాజుకు భిన్నంగా శుక్రుని శాపాన్ని మౌనంగా భరించిన యయాతి చరిత్రను రామచంద్రుడు తెలియచేశాడు.

ఋతువు ప్రవేశించింది. ఒకనాటి ఉదయం నిత్యకృత్యాలు ముగించి, రఘుపతి కొలువుకువచ్చి సుమంత్రుని పౌరులెవరైనా వేచియున్నారేమో చూచి రమ్మన్నాడు. అతడట్లు పోయి త్వరితంగానే తిరిగివచ్చి "రాజేంద్రా! యమునా తీరవాసులైన చ్యవనుడు మొదలైన మహామునులు మీతో ఏదో గొప్ప కార్యాన్ని గూర్చి మాట్లాడటానికివచ్చి త్వరపడుతూ, ద్వారంవద్ద వేచియున్నారు'' అని పలికాడు. ఆ ధర్మపరాయణుడు కాపలాదారుతో "ఓయీ! వెంటనే ఆ మహాత్ములను లోనికి పంపుము'' అని ఆదేశించాడు. అతడు వేగంగాపోయి మహర్షులకు నమస్కరించి సాదరంగా వారిని లోనికి పంపాడు.

చ్యవనమహర్షి, ఆయనతోబాటు నూరుమంది తపోధనులు తన సన్నిధికి రాగా, భూపాలుడు వారందరికి తగిన విధంగా సపర్యలు జరిపాడు. తాపసులు ఆనందంతో, తాము సమస్త తీర్థాలనుండి తెచ్చిన పవిత్ర జల కలశాలు, కందమూల ఫలాలు ఆయనకు సమర్పించారు. అయన వాటిని ప్రీతితో స్వీకరించి వారిని బంగారు పీఠాలపై కూర్చుండకోరగా, వారట్లు ఆశీనులయ్యారు. పిమ్మట దశరథరాముడు జోడించిన అంజలితో వారిని చూస్తూ "మహనీయులారా! మీరు ఎందుకు వచ్చారో, నన్నేమి చేయమంటారో ఆజ్ఞాపించండి. నా దేహ, జీవిత, రాజ్యసంపదలు ద్విజులకార్యాలు నెరవేర్చడానికే ధరిస్తున్నాను. ఇది సత్యం. మీ కార్యం ఎట్టిదైనా, అవశ్యంగా నెరవేరుస్తాను'' అని విన్నవించాడు.

ఆ పలుకులతో తృప్తులైన వారు సంతోషంతో "పావనశీలా! ఎందరో బలవంతులైన రాజులు మా కోర్కెవిని, కష్టసాధ్యమైనదని మౌనం వహించారు. అట్టిది నీవు మా కార్యం ఎట్టిదో వినకుండానే మామీది గౌరవంతో నెరవేరుస్తానని ప్రతిజ్ఞ చేయడం రఘుభూషణుడవైన నీకే చెల్లిందయ్యా! త్వరలో నీవు మమ్ములను ఆదుకొని మా ఇక్కట్లు తొలగింపుము'' అని కోరారు. ఆయన మీ బాధలేవో తెలియచేస్తే తీరుస్తానని రెట్టించి పలికాడు.

## చ్యవనుడు లవణుని వృత్తాంతం, తమ బాధలు తెలుపుట

చ్యవన మహర్షి సమాధానంగా "రఘుభూషణా, మా భయకారణం ఆలకించుము. పూర్వం కృతయుగంలో లోలకు పెద్దకుమారుడు, మహా విక్రమశాలియైన మధుడు అనబడే దైత్యుడు బ్రాహ్మణులకు, దేవతలకు ప్రియుడై, శంకరుని గూర్చి చిరకాలం తపస్సు చేశాడు.

"భక్తవత్సలుడైన మహాదేవుడు ప్రసన్నుడై తన శూలం యొక్క శక్తితో నిర్మించిన మరొక తేజోవంతము, తీక్షణమైన శూలాన్ని అతనికి ప్రసాదిస్తూ "ఓయీ మధూ, నీవు తపస్వులు, దేవతలకు హితుడవై, నేను మెచ్చే విధంగా తపస్సు చేయడంవల్ల తృప్తితో నీకీ మహాయుధాన్ని ఇస్తున్నాను। అయితే నీవు దేవ, బ్రాహ్మణులకు కీడు తలపెట్టనంతకాలం యిది నీ వద్దవుండి, నీ శత్రువులను వధించి, తిరిగి నీ వద్దకు వస్తుంది। కాని నీవు ఏనాడు పై వర్గాలకు కీడు తలపెట్టుతావో, ఆనాడు నీకీ శూలం వ్యర్థం కాగలదు" అని పలికి ఆ శూలాయుధాన్ని ప్రసాదించాడు. మధుడు ఆ శూలం తన వంశీకులందరివద్ద వుండునట్లు అనుగ్రహించవలెనని వేడగా ఆ లోకవంద్యుడు అంగీకరించక, అది అతని కుమారునికి మాత్రం ఉప కరిస్తుందని పలికి అదృశ్యుడయ్యాడు।

"అసురుడు ఆ మహాశూలం నిమిత్తం ఒక మందిరాన్ని నిర్మించి, దాన్ని అందులోచేర్చి నిత్యం పూజించుచుండెను. తరువాత అతడు విశ్రవసుని వంశంలోని అనల కూతురు కుంభీనసిని పెండ్లాడగా, వారికి లవణుడనబడే కుమారుడు కలిగాడు. ఆ లవణుడు చిన్నతనం నుండీ క్రూరుడై, పాపకార్యాల యందు ఆసక్తి చూపడం చూచిన తండ్రి బాధపడి, వానిని అనేక విధాల మందలించేవాడు. కాని ఆ తుంటరి వాటిని పాటించక పోవడంవల్ల తండ్రి ఖిన్నుడై, వానికి శూల మహిమను తెలిపి అప్పగించి, దేహం చాలించాడు.

"శ్రీరామచంద్రా, ఇప్పుడా దుష్టుడైన లవణుడు శూల మహిమతో లోకులను, ముఖ్యంగా తాపసులను అనేక విధాలుగా బాధిస్తున్నాడు. నీవు ప్రచండ విక్రమంతో దురాత్ముడైన రావణుణ్ణి బంధు, బలగాలతో నేల మట్టం చేశావని తెలుసుకొని, మాకు రక్షకుడవై లవణ వధను పూనుకొమ్మని వేడటానికే వచ్చామయ్యా" అని పలికారు.

వారి మాటలు విన్న రాఘవుడు వారికి నమస్కరిస్తూ "మహాత్ములారా, లవణుని ఆచారాలు ఎట్టివి? అతడే ఆహారం తీసికొంటాడు? ఎక్కడ సంచరిస్తుంటాడు? తెలుపండి. ఆ పాపాత్ముని త్వరలో సంహరించి, మీకు స్వస్థత కలిగిస్తాను" అని పలికాడు. ఆయనకు సమాధానంగా ఋషులు "రామభూపాలా, లవణుని చర్యలు భయంకరమైనవి. అతడు నిత్యం అన్ని విధాలైన జంతువులను, అవి లేనప్పుడు మునులను వందలు, వేల సంఖ్యలో తినుచున్నాడు; ప్రళయకాలంలో యముడు జీవులందరినీ మ్రింగే విధంగా ఈ రాక్షసుడు చిక్కిన మనుష్యుల్నీ జంతువుల్నీ నోటవేసి కొనుచున్నాడు. అతడు మధువనంలో నివశిస్తున్నాడు" అని తెలిపారు. రాఘవుడు వారితో "మౌనులారా, లవణుని వధించే బాధ్యత నేను తీసికొన్నాను. కనుక మీరు నిర్భయంగా ఉండవచ్చును" అని పలికాడు.

తరువాత ఆయన అచటనున్న భరత శత్రుఘ్నులలో ఎవరు లవణుని సంహరిస్తారని ప్రశ్నించాడు. వెంటనే భరతుడు లేచి "అన్నా, పెద్దవాడను నేనుండగా, చిన్నవాడైన శత్రుఘ్నుణ్ణి కష్టపెట్టడం ఎందుకు? కనుక లవణుని నేనే చంపుతాను" అన్నాడు. అయితే వెంటనే శత్రుఘ్నుడు లేచి వినయంతో "అన్నయ్యా, సుకుమారుడైన భరతుడు, మీరు అరణ్యంలో కష్టపడుతున్నారని పెక్కువిధాల మీ కొరకు తపిస్తూ, మీరు తిరిగి వచ్చే వరకూ సుఖమనేది ఎరుగకుండా, నగరాన్ని విడిచి, నంది గ్రామం నివాసంగా, నారలు, జడలు ధరించి, కందమూలాలు, ఫలాలు తింటూ నేలపై నిద్రిస్తూ, ఎన్నో బాధలు పడ్డాడు; బంటునై నేనుండగా, ఈయన

యిప్పుడైనా కష్టాలు మరచి సుఖపడవద్దా! కనుక లవణుని చంపడానికి నన్ను పంపండి" అని ప్రార్థించాడు.

## శ్రీరాముడు లవణ వధకు శత్రుఘ్నుని నియమించుట

శ్రీరాముడు చిన్నతమ్ముని ప్రార్థన మన్నించి, అతనితో "ముద్దు తమ్ముడా, నీ కోరిక ప్రకారం భరతుడు నగరంలోనే ఉంటాడు. నీవు శూరుడవే కాక, శస్త్రాలన్నిటిలోనూ సమర్థుడవు! కనుక నీవే మధువనంలో కొత్తనగరాన్ని నిర్మించి ఆ రాజ్యాన్ని పాలించుము! ఇప్పుడే నీకు వశిష్ఠాది మహర్షులు అభిషేకం చేస్తారు. శత్రుఘ్నా, అన్న ఆజ్ఞను తమ్ముడు పాలించడం యోగ్యం గనుక మారు మాట చెప్పకుము" అని ఆదేశించాడు శత్రుఘ్నుడాయన మాటలువిని, లజ్జతో తలవంచి మృదువుగా "మహా బాహూ, అన్నను విడిచి తమ్మునికి అభిషేకం చేయడం తగునా? అయినా నీ ఆజ్ఞ దాటరానిది గనుక తలను దాలుస్తున్నాను! అన్నయ్యా శ్రుతుల ద్వారానూ, నీ వల్లనూ కూడ అన్నకు తమ్ముడు ఎదురు చెప్పరాదని ఎరిగి కూడ, భరతుని లవణ వధకు పంపవద్దనీ, ఆ రాక్షసుని నేనే చంపుతాననీ పలికిన దోషంవల్లనే, నాకీ శిక్షపడింది! కనుక నా మనవిని ఆలకింపుము! నాకు రాజ్యంపై ఎట్టి ఆశలేదు! కేవలం నీ ఆజ్ఞ పాలించడానికే అక్కడికి పోతున్నాను! అందువల్ల నేను ఏ స్థితిలోనున్నా, నన్ను అధర్మం సోకకుండా అనుగ్రహించుము!" అని ప్రార్థించాడు.

## శ్రీరాముడు శత్రుఘ్నుని మధురాధిపతిగా అభిషేకించుట

రఘురాముడు తమ్ముని కోర్కెను అంగీకరించి లక్ష్మణునితో "సౌమిత్రీ నీవూ, భరతుడూ వెంటనే మంత్రులు, పౌరోహితులు, ఋత్విజులు, పౌరులను రప్పించి, తమ్ముని అభిషేక యత్నాలు చేయండి" అని ఆదేశించగా వారాయత్నాలన్నీ త్వరితంగా చేశారు. అప్పుడు కౌసల్యానందనుడు శత్రుఘ్నునికి, విధియుక్తంగా అభిషేకం చేశాడు. అభిషిక్తు

డైన ఆ తేజస్వి ఇంద్రునిచే అభిషేకించబడిన కుమారస్వామివలె ముగ్గురు తల్లుల అన్నల ఆశీస్సులూ, ప్రజా సముదాయాల జయ జయ ధ్వానులతో శోభించాడు!

## శ్రీరాఘవుడు లవణ వధ నిమిత్తం నారాయణాస్త్రాన్ని తమ్మునకు యిచ్చుట

శ్రీరామమూర్తి ఆనందంతో ఆ ముద్దు తమ్ముణ్ణి తొడలపై కూర్చుండ బెట్టుకొని తియ్యని పలుకులతో "శత్రుఘ్నా, నేను ఇచ్చే ఈ దివ్యమైన నారాయణాస్త్రంతో, భయంకరుడైన లవణుని కూల్చుము! పూర్వం లోకా ధ్యక్షుడైన మాధవుడు సాగర మధ్యంలో శేషశాయియై, కానరాకుండా వరుండి, దర్పాంధులైన మధుకైటభుల్నీ సర్వ రాక్షసుల్నీ సంహరించ దానికే ఈ అస్త్రరాజాన్ని సృష్టించి, మధుకైటభుల్ని కూల్చి జనుల సౌఖ్యానికై, ముల్లోకాలను సృష్టించాడు. ఈ మహాస్త్రం అంత అపారమైన శక్తిగలది సుమా! తమ్ముడా దుర్జయుడైన రావణునితో జరిగిన ఘోరమైన చివరిపోరాటంలో సైతం ఈ దివ్యాస్త్రం ప్రయోగిస్తే లోకాలు క్షోభిస్తాయని, అతణ్ణి కూల్చడానికి దీన్ని వదలలేదయ్యా! అయితే ఈ లవణుడు రావణుని కంటెను ఘోర విక్రమవంతుడు కావడంవల్లనే, ఈ అమోఘమైన అస్త్రాన్ని యిస్తున్నాను! ఆ లవణుడు శంకరదత్తమైన ఘోర శూలాన్ని పూజ నిమిత్తం మందిరంలో పెడిటిపెట్టి, జంతువులను వేటాడటానికి వనానికి పోతాడు. అతడు శత్రువులతో పోరాడవలసినప్పుడే, ఆ శూలాన్ని ధరించి వస్తాడు.

"పురుషశార్దూలా, కనుక నీ వీ విషయాలన్ని జాగ్రత్తగా దృష్టిలో పెట్టుకొని ఆ వైరి వేటకుబోయిన సమయంలోనే, నీవు మధువనంలోని, అతని మందిరం ముందు, ఆయుధధారివై నిలిచి, అతణ్ణి సమరానికి ఆహ్వా నించాలి. వేరు విధంగా అతణ్ణి జయించడం అసాధ్యం సుమా! నీవు తన్ను ఎదిరిస్తావనే వార్త, అతనికి ఏ మాత్రంకూడ తెలియనీయరాదు.

గనుక, వెంటనే నీ సైన్యం ఈ మహర్షులతో పయనించాలి. నీవు గ్రీష్మ ఋతువు దాటి, వర్షకాలం ప్రారంభంకాగానే, ఆ కాలంలో ఏ శత్రువు రాడని లవణుడు ఏమరపాటుగా శూలం విడిచి తిరిగే సమయంలోనే నీవు హెచ్చరికతో నుండి అతణ్ణి సంహరించాలి!

"తమ్ముడా, కనుక నీవు, వెంటనే మన సైన్యం నుండి రెండువేల రథాలు, నాలుగువేల అశ్వాలు, వేయి ఏనుగులు, సమృద్ధిగా సువర్ణాలతో నటగాయకులు, సరఫరాల నిమిత్తం వివిధ పదార్థలతో వైశ్యులూ, ముందు బయలుదేరి గంగాతీరం చేరి, వేసవి ముగియగానే, నదిని దాటి, ఆవలి తీరాన అనుకూల ప్రదేశాల్లో మజిలీలు చేయాలి. అచట నీ సైనికులకు భార్యా, బిడ్డలుగాని, ఇష్ట పదార్థాలు లభించడం గాని వుండవు. కనుక నీవు వారికి జీతభత్యాలు సకాలంలో చెల్లిస్తూ, నీ సల్లాపాలతో వారికి తృప్తి, ఆనందం కల్గించాలి! ఇక వర్షాలు ప్రారంభం కాగానే నీవు సైన్యాన్ని విడిచి, చాపధారివై అజ్ఞాతంగా పోయి మధువనం ప్రవేశించాలి" అని బోధించాడు.

శత్రుఘ్నుడు ఆ విధంగా సైన్యాల్ని సమకూర్చుకొని సేనా నాయకులతో "వీరులారా, మీరు వెంటనే సైన్యాంతో బయలుదేరి, సౌకర్యాలతో నున్న మజిలీలు మీరు ఎరిగినవే గనుక, ఆ ప్రదేశాల్లో నిలుస్తూ, దారుల్లో ప్రజలకు ఏ విధమైన ఒత్తిడులు కలుగకుండా ప్రయాణం సాగించండి" అని వివరాలన్నీ తెలియచేసి పంపాడు.

తరువాత అతడు అయోధ్యలో నెలరోజులు గడిపి, తల్లులకు ప్రణమిల్లి ఆశీస్సులందుకొని, రామచంద్రునకు వంచిన శిరస్సుతో ప్రణామం చేస్తూ ప్రదక్షిణంచేసి, అనుజ్ఞ తీసుకున్నాడు. పిమ్మట మిగత అన్నలకు మ్రొక్కి వశిష్ఠ మహర్షికి నమస్కారంతో ప్రదక్షిణంచేసి, ఆశీస్సులు పొంది ఒంటరిగా రథమెక్కి బయలుదేరాడు.

## శత్రుఘ్నుడు వాల్మీకాశ్రమంలో మజిలీ చేయుట

అతడు ప్రయాణంలో రెండు రోజులు గడిపి, తరువాత వాల్మీకి ఆశ్రమం చేరి, మహర్షికి ప్రణామంచేస్తూ ''మహర్షి చంద్రా, నేను అన్నగారి ఆజ్ఞ ప్రకారం పోతూ మీకు నా రాక అటంకంలేనిచో ఈ రాత్రి మీ ఆశ్రమంలో గడిపి, రేపటి ఉదయం పడమటి దిక్కుగా నా ప్రయాణం సాగిస్తాను'' అని ప్రార్థించాడు. అతడు తాను ఎచటికి పోవుచున్నది తెలుపక పోయినా దివ్యదృష్టి కలిగిన ఆ మహర్షి గుర్తించి మందహాసంచేస్తూ ఆదరంతో "యశశ్శాలీ, నీకు సుస్వాగతమయ్యా! ఈ ఆశ్రమం రఘువంశీకుల స్వగృహంగా భావించుము" అని పలికి, అర్ఘ్యం, పాద్యం, ఆసనం యివ్వగా అతడు తీసికొని, రుచికరాలైన ఫలాలు ఆహారంతో తృప్తుడయ్యాడు. తరువాత ఆ సమీపంలో యజ్ఞం జరిగిన గుర్తులు కనిపించగా, అతడు ఆ యాగం చేసిన వారెవరో తెలుపవలసినదిగా మహర్షిని ప్రార్థించాడు.

## వాల్మీకి మహర్షి సౌదాసుని చరిత్ర వినిపించుట

ఆయన సమాధానంగా "దాశరథీ, వినుము. పూర్వం మీ వంశీకుడు ధార్మికుడైన సుదాసుని పుత్రుడు వీరుడైన సౌదాసుడు యౌవనంతో తరచుగా అడవికి వేటకు పోయేవాడు. ఆ వనంలో యిద్దరు రాక్షసులు పులుల రూపంతో వరుసగా అక్కడి మృగాలను భక్షించడంవల్ల, కొంత కాలానికి అచటి మృగాలన్నీ క్షీణించాయి. సౌదాసుడు ఆ స్థితికి ఆగ్రహించి, ఆ రాక్షసుల్లో ఒకణ్ణి తన బాణంతో చంపాడు. అప్పుడు రెండవ వాడు, తన స్నేహితుని మరణానికి శోకిస్తూ, ఆయనతో "రాజకుమారా, నీవు నిర్దోషియైన నా సహచరుణ్ణి చంపావు గనుక నేను నీపై తప్పక పగ తీర్చుకుంటాను" అని పలికి మాయమయ్యాడు. కొంతకాలానికి, తండ్రి మరణించగా సౌదాసుడు రాజై, వశిష్ఠుని అధ్వర్యంలో యాగం చేశాడు.

ఆ యాగం ముగిసే సమయంలో వైరియైన రాక్షసుడు వశిష్ఠుని రూపంలో సౌదాసుని సమీపించి, "రాజా, నాకు మాంసంతో ఆహారం పెట్టించుమ"ని కోరాడు. రాజు వంటవానిని అట్లు సిద్ధపరచమనగా వంటవాని రూపంలో నున్నవాడు వైరియైన ఆ రాక్షసుడే గనుక, మనిషి మాంసం వండితెచ్చి, మహర్షికి వడ్డించాడు. అది మానవ మాంసమని గుర్తించిన మహర్షి ఆగ్రహంతో "రాజా, నా కే ఆహారం పెట్టించావో అదే నీకు నిత్యం ఆహార మౌతుంది" అని శపించాడు. సౌదాసుడు నిర్దోషి కావడంవల్ల కోపంతో, జలాలు తీసికొని మహర్షిని శపించడానికి సిద్ధపడగా, ఆయన ఇల్లాలు మదయంతి సమీపించి "నాథా, మన కులగురువు, మహాత్ముడైన వశిష్ఠుని శపించ బూనడం మీకు తగునా?" అని బోధించింది. రాజు ఆమె మాట లతో ఆగ్రహం విడిచి శాంతుడై, క్రోధ, తేజస్సులతో కూడిన ఆ జలాల్ని భూమిపై విడచిన అరిష్టమని, వానిని తన పాదాలపై విడువగా ఆ పాదాలు కమరి నల్లబడ్డాయి! ఆ కారణంవల్ల అతడు కల్మష పాదుడనికూడ పిలువ బడ్డాడు. వెంటనే ఆయన ఇల్లాలితోకూడ పోయి తాను నిర్దోషినని మహర్షిని వేడుకోగా, ఆయన దివ్యదృష్టితో జరిగినదంతా తెలుసుకొని, ఆయనతో "నరపతీ, నేను ఆగ్రహంతో శాపాన్ని యివ్వడంవల్ల మరల్చలేను; అయితే నీవు నిర్దోషివి గనుక, శాపాన్ని పన్నెండు సంవత్సరాలు అనుభవించిన తరువాత, తిరిగి నీ సహజ రూపాన్ని పొందినవాడవై గతాన్ని మరచి యథాప్రకారం రాజ్యమేలునట్లు వరమిస్తున్నాను" అని పలికి సమాధాన పరచాడు. ఆ ప్రకారం సౌదాసుడు శాపం అనుభవించి, తిరిగి రాజై, యిచటనే మరొక యజ్ఞం చేశాడు. ఈ గుర్తులు నాటివే" అని వినిపించాడు. శత్రుఘ్ను డాయనకు నమస్కరించి, ఆ రాత్రి అక్కడ విశ్రమించాడు.

### ఆ రాత్రి సీతాదేవి కవల కుమారులను ప్రసవించుట

ఆనాటి అర్ధరాత్రియందే సీతాదేవి కవల కుమారులను ప్రసవించగా మహర్షి శిష్యులు ఆయన్ని సమీపించి ఆ విషయం తెలిపారు. ఆయన వారి

వెంబడిపోయి, బాలచంద్రులవంటి ఆ కుమారులను చూచి సంతోషించి, వారికి భూతాలను సోకనీయని మంత్రాలతో మంత్రించబడిన దర్భలు ముని పత్నులకు ఇచ్చి, వాని కొనలపై ఒకనిని, మొదళ్ళపై మరొకనినీ పరుండబెట్టి స్నానం చేయించవలెననీ, వారిలో ఒకనిని కుశుడనీ, రెండవ వానికి లవుడనీ పలికి అవే వారికి పేర్లవుతాయనీ పలికాడు. శత్రుఘ్నుడు ముని కాంతల సందడి, మాటలవల్ల సీతాదేవి కవల కుమారులను ప్రసవించినదని తెలుసుకొని "జానకీమాత కవల కుమారుల్ని కనడం మహాభాగ్యమ"ని పలికి ఆనందించాడు. మరికొంత సేపటికి ఆ శ్రావణ రాత్రి గడచి, సూర్యోదయ మైంది.[1] ఆ వీరుడు మధ్యాహ్నానికి ముందు చేయవలసిన కార్యకలాపాలన్నీ ముగించి ముని చంద్రునికి నమస్కరించి, ప్రయాణం వేగంగా చేసి, ఏడు రాత్రుల తరువాత చ్యవనుడు మొదలైన మహర్షుల ఆశ్రమ ప్రాంతం చేరి, వారివల్ల పుణ్యగాథలు వింటూ, రాత్రులు గడపుచు, ఒకరాత్రి చ్యవనపు మహర్షితో, "మహర్షి శేఖరా, లవణుని పరాక్రమం, శూలం యొక్క శక్తిని గూర్చి, అతడా శూలంతో రాజు లెవరినైనా చంపినచో ఆ వివరాలు వినిపించ వేడుచున్నాను" అని అడిగాడు. ఆయన ప్రీతితో అతణ్ణి చూస్తూ "రామానుజా, లవణుడా ఆయుధంతో ఎందరో రాజుల్ని చంపాడు. అతడు సాధారణ రాజులనేగాక మీ పూర్వీకుడు యువనాశ్వుని కుమారుడైన మాంధాత మహారాజును సైతం హతుణ్ణి చేసిన కథ వినిపిస్తాను వినుము.

## చ్యవన మహర్షి శత్రుఘ్నునకు లవణునిచే మాంధాత మరణించిన కథ తెలుపుట

"మాంధాత మహారాజు మహా పరాక్రమ వంతుడై మహీ మండలాన్ని పాలిస్తూ, తృప్తిలేక స్వర్గలోకాన్ని జయించగోరి అక్కడికిపోయి,

---

1 అది శ్రావణ మాసమని తెలపడంవల్ల శత్రుఘ్నుడు, ఆషాఢంలో గ్రీష్మ ఋతువు గడవడంతో, అయోధ్యనుండి శ్రావణ ప్రారంభంలో బయలుదేరి యుండును.

దేవేంద్రుని అర్థాసనంలో కూర్చుండి, ఆ లోకాన్ని జయించాలనీ, దేవతల పూజలు పొందాలనీ ఆశించాడు. అది గుర్తించిన ఇంద్రుడు ఆయనతో మృదువుగా "మహారాజా, ఇంకను భూలోకం పూర్తిగా జయించకనే ఈ లోకంపై అధికారం కోరుచున్నావా? ఆ లోకాన్ని పూర్తిగా జయించి, నీ సైన్యాలతో యిచటికి రావచ్చును" అని పలికాడు.

దేవేంద్రుడు ఈ విధంగా తన్ను హేళనచేయగా మాంధాత లజ్జతో తలవంచి "దేవపతీ, భూలోకంలో ఏ ప్రాంతంలో నా ఆజ్ఞ చెల్లడం లేదూ, తెలుపగోరుచున్నాను" అని అడిగాడు. సహస్రాక్షుడు సమాధానంగా "నరేంద్రా, మధువనంలోనున్న లవణుడనబడే అసురుని రాజ్యంలో నీ శాసనం చెల్లుతోందా?" అని అడిగాడు. మాంధాత సిగ్గుతో "తిరిగి వస్తానని" పలికి, అనుజ్ఞ తీసికొని అయోధ్యచేరి, లవణుని వద్దకు తన దూతను పంపాడు. అహంకారియైన ఆ దూత అసురుని సమీపించి ప్రగల్భాలతో అతణ్ణి దూషించగా అతడు ఆగ్రహించి, అతణ్ణి చంపి, భక్షించాడు. మాంధాత మహారాజు దూత రాలేదని, సైన్యాలతో స్వయంగా లవణునిపై దాడిచేసి, అతనిపై ఘోర బాణాలు విసిరాడు. లవణుడు, తన శూలాయుధాన్ని సూటిగా ఆయనపై విసరగా, ఆ మహాయుధం రాజును, అతని మహాసైన్యాన్ని దగ్ధంచేసి, తిరిగి అతనివద్దకు చేరింది। ఆ శూల మహాత్త్వం చింతింతనరానిది। రఘువీరా, తెల్లవారగనే, దనుజుడు శూలాన్ని మందిరంలో విడిచి, ఆహారంకొరకు వనానికి పోయిన సమయంలో, నీ ప్రచండ విక్రమంతో అతణ్ణి ఎదిరించి, నేలకూల్చగలవు!" అని పలుకుచుండగానే, తూరుపుదిక్కున అరుణకాంతులు కానవచ్చాయి.

## శత్రుఘ్నుడు లవణుని పట్టణం ప్రవేశించకుండ అడ్డగించి యుద్ధానికి ఆహ్వానించుట

సూర్యోదయం కాగానే లవణుడు పట్టణాన్నుండి, ఆహారంకొరకు అడవికి బయలుదేరగా, రఘువీరుడు యమునను దాటి, తన ధనుస్సుతో అతని మందిర ద్వారం ముందు నిలిచాడు.

పెట్ట మధ్యాహ్న సమయానికి రక్కసుడు తాను చంపిన ఎన్నో జంతువుల్ని మోసుకుంటూవచ్చి, తన భవనంముందు ధనువుతో నిలచిన శత్రుఘ్నుని చూచి, "ఓయీ విల్లమ్ములతో నిలచిన నీవెవ్వడవు? నా ముందు నిలిచి నా నోటి కందగా చిక్కుటచే వెంటనే నిన్ను భక్షించి, కడుపు నింపుకుంటాను" అనిపలికి బిగ్గరగా నవ్వాడు.

వీరుడైన శత్రుఘ్నుడు అతణ్ణి చూచి, ఆగ్రహంతో వేడి బాష్పాలు, దేహంనుండి అగ్ని శిఖలవంటి చెమటలతో ; సమాధానంగా "దుష్టుడా, ఏల నవ్వుతావు? నేను దశరథ మహారాజు కుమారుడను ; లోక విద్రావణుడైన రావణుణ్ణి సమూలనాశంచేసిన శ్రీరామభద్రుని సోదరుడను ; శత్రువులను హతమార్చే శత్రుఘ్నుడను ; నిన్ను చంపడానికే సిద్ధమై నిలచాను. ఈనాడే నిన్ను చంపక పోనను ; కనుక నాతో యుద్ధానికి సిద్ధము కమ్ము" అని ఆహ్వానించాడు.

అంతట లవణుడు తన పరిహాసం క్రోధంగా మారగా "పురుషాధమా, నా తల్లికి తోబుట్టువైన వీరుడు దశకంఠుని సైన్య సమేతంగా నీ అన్న రాముడు స్త్రీనిమిత్తంగా హతమార్చినా, నేను అలక్ష్యంచేసి శాంతి వహించాను ; నేను ఇప్పటికే ఎందరో పూర్వకాలంనాటి, ఈనాటి వారైన రాజులను సంహరించి, మిగిలిన వారిని ఉపేక్షించాను ; నీవు కోరిన ప్రకారం నీతో యుద్ధం చేస్తాను. నేనిచేపోయి, నా మందిరాన్నుండి శూలాయుధం తెచ్చేవరకు ఓర్చుకో" అని పలికాడు.

రామానుజుడు సమాధానంగా "ఖలుడా, నేను నీ ఎదుట జీవంతో నిలిచియుండగా నన్ను తప్పించుకొని నీవు శూలాన్ని ఎట్లు తేగలవు? అయాచితంగా చేతికి చిక్కిన వైరిని విడిచిపెట్టే మూర్ఖుడుంటాడా? అందులోనూ జగతికంతకూ వైరివైన నిన్నెట్లు విడుస్తాను?" అన్నాడు.

## లవణ శత్రుఘ్నుల యుద్ధం

ఆ మాటలు విన్న లవణుడు క్రోధంతో చేతితో చేయి నలుపుచు అట్టహాసంగా పళ్లుకొరుకుతూ రఘువీరుణ్ణి పోరాటానికి ఆహ్వానించాడు. శత్రుఘ్నుడు అంగీకరిస్తూ, అతనితో "ఓయీ, నేను నీచే చంపబడిన రాజుల వంటివాడనుకాను నా ఘోరబాణాలతో నిన్ను నేలకూల్చి ఋషులు, లోకులూ ఇకపై నిర్భయంగా సంచరించునట్లు చేస్తాను" అని పలుకుచు, వైరి తనపై విసరిన వృక్షాన్ని తన అమ్ములతో తునకలుగా చేశాడు. లవణుడు మహా రోషంతో వృక్షాలను, పరంపరగా విసరగా, రామానుజుడు వాటిని ముక్కలుగా నరికి నేలకూల్చాడు.

అయితే ఉద్ధతుడైన లవణుడు ఒక చెట్టును పెరికి దానితో వైరి శిరస్సును మోదగా అతడు సంధులు సడలి, మూర్ఛితుడై నేలపై వ్రాలాడు. అదిచూచి ప్రేక్షకులుగా నున్న దేవ గంధర్వ అప్సరలు, ఋషిగణాలు హాహాకారాలు చేశారు. తృప్తుడైన లవణుడు తనవైరి మరణించాడని తలచి, శూలం అవసరంలేదని. ఆకలిపల్ల తానునేలపై వేసిన జంతువుల్ని తిన సాగాడు. ఇంతలో విక్రమశాలి సౌమిత్రి త్వరలో తేరుకొని ప్రేక్షకులు ఆనందిస్తుండగా తిరిగి ఆ మందిరం ద్వారం ముందు నిలచి ఏనూత్రం ఆలసించకుండా, దివ్యమూ, ఎదురులేనిదీ, దావాగ్ని వంటి కాంతితో దిక్కులను ప్రకాశింపచేసేదీ, మేరు మందరాల వంటి శక్తికలదీ, వజ్రాయుధం వంటి ముఖ, వేగాలు కలిగిన నారాయణాస్త్రాన్ని అమ్ముల పొదినుండి తీసి, శింజినికి పూన్చాడు. దానితో భూతజాలమంతా దిగ్భ్రమ చెందింది. అప్పుడు దేవ, గంధర్వ, ఋషి, అప్సరగణాలు వ్యాకులతతో విధాతను సమీపించి "భగవాన్, ఆకస్మికంగా లోక ప్రళయం వచ్చునట్లున్నది। ఇందుకు కారణం తెలుపండి" అని వేడుకున్నారు. పరమేష్ఠి వారితో "వేల్పులారా, లోకభయంకరుడైన లవణుని సంహరించడానికి, రామానుజుడు, తన శరాసనానికి నారాయణాస్త్రాన్ని పూన్చడంవల్లనే, లోకక్షోభ

కల్గింది. లోకనాథుడైన, నారాయణుడు పూర్వం మధుకైటభులనబడే ఘోర రాక్షసులను కూల్చడానికి తన తేజస్సుతో ఈ మహాస్త్రాన్ని సృష్టించాడు। ఆ మహావీరుడు ఇప్పుడే ఆ రాక్షసుణ్ణి సంహరిస్తాడు. కనుక మీరు నిబ్బరంగా ఆ దృశ్యాన్ని చూడండి" అని పలికాడు.

## శత్రుఘ్నుడు లవణుని నారాయణాస్త్రంతో సంహరించుట

అంతట నారాయణాస్త్రాన్ని పూన్చిన శత్రుఘ్నుడు వైరిని అహ్వానించగా, ఆ వీరుడు పరుగులో వచ్చాడు. అది గమనించిన ఆ మహాధనుర్ధారి ఆగ్రహంతో శింజిని చెవిని తాకునట్లులాగి, లవణుని వక్షాన్ని గురిచూచి, ఆ మహాస్త్రాన్ని విడిచాడు. ఆ దివ్యాస్త్రం మింటిని తన కాంతి ప్రవాహంతో నింపుచుపోయి లవణుని వక్షాన్ని చీల్చి మహావేగంతో భూమిలో ప్రవేశించి తిరిగివచ్చి రఘుభూషణుని అమ్ములపొదిలో ప్రవేశించింది. ఆ అస్త్రరాజంవల్ల భేదించబడిన లవణుడు వజ్రధారచే నరకబడిన పర్వతంవలె నేలకూలాడు। వాని మరణంతో గడువుతీరిన రుద్రుని మహాశూలం నిర్జరులందరూ చూస్తుండగా, తన స్వామిని చేరింది.

చీకట్లను పారద్రోలే భాస్కరునివలె, సుమిత్రా నందవర్ధనుడు ఒక్క మహాస్త్రంతో, వేల్పులు పొగడుచుండగా, ఆ లోకవైరిని సంహరించగా, ఘోరసర్పభయం తొలగినవారివలె, దేవ, పన్నగ ఋషిగణాలు నిర్భయులై ఆనందించారు.

## లవణుని వధించిన శత్రుఘ్నునకు దేవతలు వరాలు యిచ్చుట

అగ్నిసమేతంగా, వాసవాది అమరులు ఆ మహావీరుని సమీపించి, తీయని పలుకులతో, ప్రశంసిస్తూ, ''పురుషపుంగవా, లోకవిరోధి లవణుని సంహరించి, విజయువైన, నీకు వరమివ్వడానికి వచ్చాము. మా దర్శనం ఎన్నడూ వ్యర్థం కాదు. కనుక నీ కోరిక ఏదో తెలుపుము'' అన్నారు. వారికి ఆ మహాబాహుడు శిరస్సుకు చేతులు జోడించి వినయంతో ''అని

మిషలారా నా రాజధానిగా చేసికోడానికి అనువుగా, ఈ ప్రదేశంలో మధురాపురం త్వరలో దేవ నిర్మితం కావాలని వేడుచున్నాను" అని పలుకగా, వారు ఆనందంతో సమ్మతించడమేగాక, ఆ నగరాన్ని శూరుల నిలయమగునట్లు చేయగలమని కూడ వాగ్దానం చేసి తమ లోకం చేరారు.

శత్రుఘ్నుడు తన సైన్యాలను రప్పించగా, వారు వచ్చి అనువైన ప్రదేశాల్లో నివాసాలేర్పరచుకున్నారు. శ్రావణ మాసంతో ప్రారంభమైన ఆ నగర నిర్మాణం పన్నెండు సంవత్సరాలు సాగి, వీరులకు నిలయమై ఆ ప్రాంతాల ప్రజలు నిర్భయులయ్యారు. శత్రుఘ్నుని పాలనలో ఇంద్రుడు సకాలంలో వానలు కురిపించడంవల్ల సమృద్ధిగా పైరులు పండసాగాయి. నాలుగువర్ణాల ప్రజలు, ఆరోగ్యవంతులై, చక్కని ఇండ్లు నిర్మించుకొని, సౌఖ్యంగా జీవించారు. నగరంలో చాలాచోట్ల అంగడివీధులు ఏర్పడి, వాణిజ్యం వృద్ధిపొందింది. లవణుని మహాభవనం, పెక్కు మెరుగులు చేయబడి శోభించింది. యమునా[1] తీరంలో అర్ధచంద్రాకారంలో ఏర్పడిన మధురా నగరం సుందరాలైన భవనసమూహాలు, ప్రజలు విహరించడానికి మనోహరాలైన ఉద్యానవనాలతోనూ ఎంతగానో శోభించింది.

## శత్రుఘ్నుడు శ్రీరామ సందర్శనం కొరకు అయోధ్యకు బయలుదేరుట

శత్రుఘ్నుడు నగరం అభివృద్ధికి సంతోషించి, తాను అయోధ్యనుండి వచ్చి పన్నెండు సంవత్సరాలు గడవడంవల్ల, అన్నపాదాలకు నమస్కరించి రావాలనే కోర్కెతో, రాజ్యభారం మంత్రులు సేనాపతులకు అప్పగించి కొద్దిమంది పరివారంతో రథాల్లో బయలుదేరి, మజిలీలుగా వచ్చి వాల్మీకి మహర్షి ఆశ్రమం చేరాడు.

1. యమునా తీరంలో ఈ మధురానగరం ఈనాడు ఉత్తర ప్రదేశ్‌లో నున్నది.

అచట ఆ కీర్తిశాలి, మహర్షి పాదాలపైబడి నమస్కరించి, ఆయన ఆతిథ్యం స్వీకరించాడు. ఆ మహర్షి అతనికి ఎన్నో మధురగాథలు వినిపించి లవణ వధను ప్రస్తావిస్తూ "వీరవరేణ్యా! నీవా లోకభీకరుణ్ణి చంపడంద్వారా లోకానికి ఎంతో మేలు చేశావు సుమా! లోగా శ్రీరామచంద్రుడు మహా యత్నంతో క్రూరుడైన రావణుని బలగాలతో హతమార్చగా, నీవు యత్న మేమీ లేకుండానే, లవణుని కూల్చావు. నీవు యుద్ధంచేస్తున్న సమయంలో నేను దేవేంద్రుని విమానంలో కూర్చుండి నీ మహా విక్రమాన్ని ఆనందంతో చూశాను. దేవతలందరూ నిన్ను అభినందించారు. నీయందు నాకును నీయందు మిక్కిలి ప్రీతి కలగడంవల్ల నీ శిరస్సును వాసన చూతునా" అని పలుకుచు అట్లుచేసి తన ఆదరం తెలిపాడు. తరువాత పరివారమంతటితో సహా ఆ వీరునికి విందు చేశాడు.

## శత్రుఘ్నుడు అద్భుతగానంతో శ్రీ రామాయణం వినుట

ఆ రాత్రి రామానుజుడు భోజనానంతరం తృప్తుడై కూర్చుండగా ఆశ్రమం లోపలనుండి వీణెలమీద తాళ లయబద్ధమై వ్యాకరణ దోషాలు లేనిదై, మధురమైన సంస్కృత గీతాల్లో పూర్వం జరిగిన రామాయణ గాథ కళ్ళఎదుట జరుగుతున్నట్లు వినపడగా చేష్టలులేని తన్మయత్వంతో ఆనంద బాష్పాలతో కన్నులు చెమ్మగిల్లగా విన్నాడు. ఆయన పరివారంకూడ గాయ కులు కన్పించకుండా, వినవస్తున్న ఆ మధురగాథను విని విస్మయంతో తలలువాల్చి, మెల్లగా ఒండొరులతో "ఎంతటి ఆశ్చర్యమిది? పూర్వం మనం స్వయంగా ఎరిగియున్న గాథ ఈ ఆశ్రమంలో ఇంత మధురంగా విన వస్తోందే? మనం ఎక్కడ ఉన్నాము? ఇది కలకాదుకదా?" అని తర్కించు కొని, రాజును సమీపించి, ఆ విషయంతెలిపి, అది ఎట్లు జరుగుతోందో మహ ర్షిని అడుగవలెనని కోరారు. ఆయన సమాధానంగా "ఇట్టి మహిమ లెన్నో ఈ మహర్షి ఆశ్రమంలో ఉండటంవల్ల, వాటినిగూర్చి తెలుసుకోవాలనే కుతూ హలం మనకు తగదు" అని పలికాడు. తరువాత అతడు మహర్షికి నమస్క

రించి, తన కుటీరంలో విశ్రమించి తంత్రీ లయసమన్వితమై అతిమధురంగా వినవచ్చిన ఆ గాథను గూర్చియే యోచిస్తూ, నిద్ర లేకనే రాత్రి గడిపాడు.

ఉదయం కాగానే అతడు ఆ సమయంలో చేయవలసిన విధులు ముగించి, మునిరాజుకు ప్రణామంచేస్తూ "మహాత్మా, నా స్వామియైన రఘూత్తముని దర్శించాలని ఆరాటపడుచున్నాను. తాము అనుజ్ఞ ఇస్తే, బయలుదేరుతాను" అని వేడుకున్నాడు. ఆ మహాతపస్వి అతణ్ణి కౌగలించి, అనుమతించాడు. శత్రుఘ్నుడు వెంటనే రథమెక్కి వేగంగా ప్రయాణంచేసి, రాముని దర్శించాలనే ఆత్రం తో వేగాన్ని పెంచగా ఆ నగరంచేరి పూర్ణచంద్రునివంటి ముఖంలో రత్నఖచిత సింహాసనంపై కూర్చుండి దేవతల నడుమనున్న మహేంద్రునివంటి తేజస్వి అన్నకు పాదనమస్కారంచేసి, ఆయనతో "సత్యధర్మపరాయణా, నీ ఆనతి ప్రకారం పాపియైన లవణుణ్ణి చంపి, నూతన నగర నిర్మాణంచేసి, చక్కదిద్దగా ప్రజలందరా సుఖజీవనం చేస్తున్నారు.

"అన్నా అయితే నిన్ను విడిచి పన్నెండు సంవత్సరాలు గడపడం వల్ల ఆవ్రకు దూరమైన లేగవలె ఇక అక్కడ జీవించలేనయ్యా! కనుక నన్ను కరుణించుము" అని దీనంగా ప్రార్థించాడు. రామచంద్రుడు అతణ్ణి ఆదరంతో కౌగలించి "తమ్ముడా! నీవు నాకు ప్రాణాలకంటెను ప్రియతముడవైనా, రాజ్య పరిపాలన అగత్యమైన కర్తవ్యం సుమా! కనుక నీవు మాతో సుఖంగా వారం రోజులు గడిపి, మధురకు మరలుము. అయితే నీవు అప్పుడప్పుడు వచ్చిపోవుచుండవచ్చును" అని పలికాడు. శత్రుఘ్నుడు అందుకు అంగీకరించి, ఆ ప్రకారం గడిపి, అన్న అనుమతితో భరత లక్ష్మణులు సాగనంపగా, తన సైన్యాలతో మధురకు పోయాడు.

## ఒక విప్రుడు మరణించిన బాలకునిశవంతో రాఘవుని సమీపించుట

ఈ విధంగా శ్రీరాముడు సోదరులతో ధర్మయుక్తంగా రాజ్యపాలన సాగించుచుండెను. ఒకనాడు పల్లెవాసియైన విప్రుడొకడు భార్యతో చనిపోయిన

కుమారునిశవాన్ని భుజంపై వేసుకొనివచ్చి రాజద్వారం ముందుంచి "కొడుకా, కొడుకా" యని ఏడువసాగాడు. మరియు ఆయన దుఃఖంతో "అయ్యో! పూర్వం నేనెంత పాపం చేశానోకదా! లేకపోతే నా ఒక్క కుమారుడు మాకు పితృకార్యాలు చేయకుండానే పద్నాలుగేళ్ళ వయసులో మరణిస్తాడా? అయితే నేను ఎన్నడును కల్లలాడిగాని, ఏ జీవికి కీడుచేసిగాని కనీసం హింస తల పెట్టిగాని ఎరుగనే! అయ్యో దైవమా, ఇట్టి అకాలమరణం ఏ రాజ్యంలోనూ జరిగినట్లు వినడంగానీ, చూచిగాని ఎరుగనే! అట్టిది రామరాజ్యంలో నా కుమారుడు అకాలమృత్యువు వాతపడటానికి, శ్రీరాముడు ఏదో ఘోర పాపం చేసియుండాలి" అని పలుకుచు, రాజువద్దకుపోయి ఆయనకు బాలునిచూపుచు "మహాబాహూ! ఇంతవరకు నీ పాలనలో సుఖంగానే జీవించాము. కాని ఈ నాడు భరించలేని కుమారుని మరణంతో, దుఃఖ సముద్రంలో మునిగాము సుమా!

"శ్రీరామా, ఈ విధంగా మరే రాజ్యంలోనూ అకాల మరణాలు లేవు! రాజు, పట్టణాలు, లేక పల్లెల్లో జరిగే అకృత్యాలు తొలగించనిచో జనులకు యిట్టి అకాల మరణాలు తప్పవు! కనుక నా కుమారుణ్ణి బ్రతికించాలి. నీ వట్లు చేయవా, నేనూ, నా యిల్లాలూ అనాథలవలె నీ ద్వారంముందు మరణిస్తాం సుమా! మా బ్రహ్మ హత్య చుట్టుకోగా, నీవూ, తమ్ములూ సుఖాలు అనుభవిస్తూ చిరకాలం జీవించండి" అని నిందిస్తూ విలపించాడు. ఇట్లు దుఃఖంతో పొగులుచున్న బ్రాహ్మణుని చూచి, తమ్ములతో రాముడు భయపడి వెంటనే బ్రాహ్మణులు పౌరులను పిలిపించగా వశిష్ఠ, కాత్యాయన, మార్కండేయ, గౌతమ, జాబాలి, కాశ్యప, మౌద్గల్య, నారదులువచ్చి ఉచితాసనాలపై కూర్చున్నారు. రామచంద్రుడు వారికి నమస్కరించి దైన్యంతో బ్రాహ్మణుని గాథ వినిపించి, అట్లెందుకు జరిగినదీ, ఎట్లు దాన్ని తొలగించవలసినదీ తెలుపుమని ప్రార్థించాడు.

## నారదుడు బాలుని మరణ కారణం వినిపించుట

నారదుడు ఆయనకు సమాధానంగా "రాజా, బాలుడు మరణించడానికి కారణం తెలుపుతాను. నీవు ఆలకించి, తగిన ప్రతిక్రియకు పూనుకొనుము. పూర్వం కృతయుగంలో బ్రాహ్మణులే తప్ప, యితరులు తపస్సు చేసినవారు లేకుండిరి. ఆ కాలంలో బ్రహ్మజ్ఞానం ప్రబలంగా ఉండడంవల్ల సమస్త ప్రజలు స్వధర్మాలు పాలిస్తూ, దీర్ఘదృష్టి కలవారై మరణ భయం ఎరుగకుండిరి. వరుసలో త్రేతాయుగం ప్రవేశించగా, క్షత్రియులు దేహశక్తి కలవారై, తపస్సునకు పూనుకొన్నారు. అయినా కేవలం స్వధర్మాన్నే అనుష్ఠించిన తమ పూర్వులకంటె తక్కువవారైనారు. వారు స్వధర్మమైన క్షాత్రాన్ని ఉపేక్షించి తపస్సుకు పూనుకోవడంవల్లను, బ్రాహ్మణులు ఈ యుగంలో క్షత్రియులను ఆశ్రయించడంవల్లను, అధర్మం త్రేతాయుగంలో ఒక పాదం ప్రవేశించింది. అప్పుడే మహర్షులు నాలుగు వర్ణాల వ్యవస్థను ప్రారంభించిరి.

"కృతయుగంలో రాజసంతో కూడిన సేద్యకృషి హీనంగా చూడబడేది. కాని అదే వృత్తి, తేజస్సు కొరతపడిన త్రేతాయుగంలో జనులకు జీవనాధారమైంది. ఈ యుగంలో అసత్యం ప్రవేశించి ధర్మహాని కలగడంతో అధర్మం ఒక పాదం చోటుచేసుకొన్నది. ధర్మహానివల్ల ఆయువు క్షీణించడంతో ప్రజలు భీతిచెంది, యోగ్యాలైన సత్య, ధర్మాలయందు ఆసక్తి కలవారయ్యారు. ఆ కాలంలో బ్రహ్మ, క్షత్రియులు తపస్సుకు పూనుకోగా, వైశ్య శూద్రులు వారికి పరిచర్యలు చేయుచుండిరి.

"ఇక మూడవ యుగమైన ద్వాపరం ప్రవేశించడంతో అధర్మం రెండు పాదాలతో ప్రవేశించడంవల్ల అసత్య అధర్మాలు ఆ మేరకు వృద్ధి పొందుతాయి. ఈ యుగంలో కృషి అధికం, ఫలితం తక్కువ కావడంవల్ల, వైశ్యులుకూడ తపస్వులౌతారు. ఇట్లు మూడు యుగాల్లో వరుస క్రమంలో బ్రహ్మ, క్షత్రియ, వైశ్యులు తపస్సుకు పూనుకోగా, శూద్రులు

మాత్రం అందుకు పూనుకోరాదు అయితే వారు కలియుగంలో బహిరంగం గానే తపస్సుకు పూనుకుంటారు. అయితే ద్వాపరంలోనే వారు తపస్సుకు పూనడం దోషం. ఇప్పుడు నీ రాజ్యంలో ఎవడో శూద్రుడు తపస్సుకు పూనుకోవడంవల్లనే ఈ విప్ర బాలుడు మరణించాడు.

"నగర, రాజ్యాల్లో ఎక్కడ అధర్మానికి పూనుకొన్న వానినైనా దండించని రాజు అధోగతి పాలౌతాడు. అధ్యయన యజ్ఞ తపో పుణ్య కార్యాల్లో ఆరవ భాగం కప్పంగా స్వీకరించే రాజు ప్రజలను యుక్తంగా పాలించాలి. కనుక ఇప్పుడు నీ రాజ్యంలో ఎవ్వడిట్టి పనికి పూనుకున్నాడో అతణ్ణి వెతకి శిక్షించడం నీ విధి. అట్లు చేయడంవల్ల ఈ బాలుడు జీవించ డమేగాక, ప్రజల ఆయుస్సు పెరుగుతుంది" అని బోధించాడు. శ్రీరామ మూర్తి ఆయన మాటలకు హర్షించి, లక్ష్మణునితో "తమ్ముడా, నీవీ యోగ్యుడైన విప్రుని ఊరడించి, బాలుని శవం సంధులు వదులై చెడి పోకుండా సువాసన తైలపు కాగులో భద్రపరపించుము" అని ఆదేశించాడు. తరువాత ఆయన పుష్పక విమానాన్ని తలచుకోగా, సువర్ణ భూషితమైన ఆ విమానం త్వరలో వచ్చి నిలచింది.

## శ్రీరాముడు శూద్రమునిని వెదకబోవుట

అప్పుడు రాఘవుడు మహర్షులకు నమస్కరించి, తమ్ములను రాచ కార్యాలు చూడ నియమించి, ధనుర్ధారియై విమానం ఎక్కాడు. ఆయన పుష్పక విమానంలో ముందు పడమటి దిక్కునకూ, తరువాత క్రమంగా ఉత్తరదిశలో మంచుతోనున్న హిమాలయాల్లోను, అట్లే తూర్పుదిక్కును, తరువాత దక్షిణ దిక్కును వెతకుచుపోయి శైవలపర్వత ప్రాంతంలో ఒక సరస్సువద్ద, తల నేలవైపు వ్రేలాడుచుండగా తపస్సుచేస్తున్న ఒక తపస్వి ముందు విమానం దింపించాడు.

శ్రీరామమూర్తి ఆ దీక్షావంతుని సమీపించి అతనితో "ఓ సువ్రతుడా, నీవు ధన్యుడవు! నేను దశరథ కుమారుడనైన, రాముడను. నీవు ఏ

కోరికతో ఈ మహాదీక్ష సాగిస్తున్నావో, చాతుర్వర్ణ్యాలలో నీవు ఏ వర్ణానికి చెందినవాడవో, తెలిసికోవాలని కుతూహల పడుతున్నాను" అని అడిగాడు. ఆ తపస్వి వంచినతలతో "రామభూపాలా, నేను ఇంతవరకు కల్లలాడి ఎరుగను. ఇకముందును ఆడబోను. నేను శంబుకుడనబడే శూద్రుడను. శరీరంతో స్వర్గం చేరాలనే కోరికతో ఈ దీక్ష సాగిస్తున్నాను" అని వినిపించాడు.

## శ్రీరాముడు శంబుకుని వధించుట

ఆ మాటలు వినగానే శ్రీరాముడు ఒరనుండి ఖడ్గందూసి, అతని తలను ఖండించాడు. దేవతలాయనపై పరిమళపుష్పాల జల్లు కురిపించగా, పవనుడా పరిమళాన్ని దిక్కులన్నిటికీ వ్యాపించచేశాడు. అంతట అగ్ని ఇంద్రాది దేవతలు ఆయన సమీపాన ఆకాశంలో నిలచి ఆయనతో "రఘురామా, ఇతడు స్వధర్మాన్ని విడిచి, పరధర్మం ఆశ్రయించి తపస్సు చేయడంవల్ల స్వర్గానికి రాతగడు; అయినా కారుణికోత్తముడవైన[1] నీచే చంపబడటంవల్ల, ఇతడు మోక్షం పొందాడు! నీవు దేవకార్యం నెరవేర్చడంవల్ల నీవు కోరిన వరం ఇవ్వడానికి వచ్చాము" అని పలికారు.

## దేవతలు శ్రీరామునకు వరమిచ్చుట

రఘుపతి ఇంద్రునకు నమస్కరిస్తూ "దేవపతీ, నా అపరాధంవల్లనే, విప్రకుమారుడు మరణించడంవల్ల, నేను అతణ్ణి ప్రాణవంతుని చేస్తానని శపథం చేశాను. అందువల్ల, నీవు ప్రసన్నుడవై ఆ బాలుని ప్రాణాలు యిచ్చి రక్షించాలని వేడుతున్నాను" అని పలికాడు.

---

1. శ్రీరామమూర్తి కారుణికోత్తముడు ఎట్లు అయ్యాడంటే స్వర్గలోకానికే అర్హుడు కాని శంబుకుడు ఆయనచే చంపబడటం, ఆయన దర్శన భాగ్యం వల్ల సర్వోత్తమమైన మోక్షపదాన్ని పొందాడు. ఆయన అతణ్ణి ద్వేషంతో గాక, స్వధర్మ నిర్వహణకొరకే సంహరించాడు.

ఆ మాటలకు తృప్తుడైన దేవేంద్రుడు "రాఘవా, ఆ బాలునికై నీవు విచారించనక్కరలేదు. ఎలనంటే నీవు ఎప్పుడైతే శంబుకుని వధించావో, అప్పుడే ఆ బాలుడు జీవితుడై తనవారితో కలసి తిరుగుచున్నాడు. అగస్త్య మహర్షి పన్నెండు సంవత్సరాలు జలాల్లో పరుండి చేసిన దీక్ష నేడు ముగించడంవల్ల మే మాయన్ని చూడబోవుచున్నాము. నీవును వచ్చి ఆయనను దర్శిస్తే, నీకు శుభాలు కలుగుతాయి" అని పలికాడు. దాశరథి అంగీకరించి, వారివెంట పుష్పకంలో అగస్త్యాశ్రమానికి బయలుదేరాడు.

అగస్త్యమహర్షి ఆనందంతో ముందువచ్చిన వేల్పులను ఆదరంతో పూజించగా, వారు తృప్తులై తమలోకం చేరారు.

## అగస్త్యుడు శ్రీరాముని అభినందించి దివ్యాభరణం సమర్పించ కోరుట

తరువాత దశరథరాముడు ఆశ్రమ ముందు పుష్పకందిగి వెళ్ళి మహర్షికి ప్రణామం చేయగా ఆ పుణ్యమూర్తి ఆనందంతో ఉప్పొంగుచు, సత్కారాలుచేసి అతిథ్యమిచ్చి "రాజేంద్రా, నా హృదయవాసివి, పరమ పావనుడవు, సర్వసుగుణాభిరాముడవైన నీవు పరమ ఆదరంతో నాకు అతిథివి కావడం నా మహాభాగ్యమయ్యె! నీవు శూద్రమునిని చంపడం ద్వారా, విప్రకుమారుణ్ణి బ్రతికించినట్లు యిప్పుడే విన్నాను. నీకు సుస్వాగతం పలుకుచున్నాను! ఈ రాత్రి నీవు యిచ్చట నాతోగడిపి, రేపు అయోధ్యకు పోవచ్చును.

"మహాభాగా, నీవే సనాతనుడవైన పురుషుడవు! అఖిలలోకాలకు ఆధారభూతుడవైన జనార్దనుడవు! సర్వభూతాలకు పూజ్యుడవైన నారాయణుడవు! దివ్యము, తేజోవంతమై, విశ్వకర్మచే నిర్మించబడిన ఈ రత్నాభరణాన్ని నీవు తీసికొని ధరించి, నాకు ఆనందం కలిగించుము!

దీన్ని ధరించే అర్హత నీకు తప్ప మరెవ్వరికి లేదు। మహేంద్రసమేతంగా అమరులందరిని రక్షించే సమర్థుడవు నీవు కనుకనే, ఆశ్చర్యకరము, కమలాప్తుని తేజస్సు కలిగిన ఈ దివ్యరత్నాన్ని నీకు సమర్పిస్తున్నాను। తనకు దానం చేయబడిన వస్తువును, తాను మరొకరికి యివ్వడం వల్ల మహత్తరమైన ఫలం కలుగుతుంది" అని పలికాడు.

రఘుపతి ఆయన పలుకులు విని, క్షత్ర ధర్మాన్ని గుర్తు చేసికొని, ఆయనతో "మహాత్మా, దానం తీసికోవడం బ్రాహ్మణునకు తగునే గాని క్షత్రియునికి ఎట్లు యోగ్యమౌతుంది? రాజునైన నేను, మీ నుండి దీన్ని ఎట్లు స్వీకరించగలనో చెప్పండి" అని అడిగాడు. మహర్షి సమాధానంగా, "అరవిందలోచనా, ఆలకించుము. లోగాకృతయుగంలో, భూలోకాన రాజ వ్యవస్థ లేకుండెను. ప్రజలు అమరులకు ఇంద్రుని వలె తమకును ప్రభువు కావలెనని, బ్రహ్మదేవునిగూర్చి తపస్సుచేశారు. పద్మాసనుడు ప్రత్యక్షం కాగా, వారు "లోకకర్తా, మేము పాపకార్యాలు చేయకుండా మమ్ము పాలించ డానికి సురలకు వాసవునివలె, మాకును రాజును ప్రసాదించుము" అని వేడారు.

"ఆయన అంగీకరించి, దిక్పాలకులను అందుకొరకు తమలోని ఒక్కొక్క అంశను యివ్వవలెనని కోరగా వారు అంగీకరించారు. అప్పుడు సృష్టికర్త నిర్జరపతినుండి ప్రజలను పాలించే అంశను, వరుణునినుండి శరీ రాన్ని పోషించే అంశను, కుబేరుని అంశగా, ధనం సేకరించేశక్తినీ, యముని అంశగా ప్రజలను శిక్షించే శక్తిని గ్రహించి, ఆ అంశలన్నిటితో రాజును సృష్టించి, అతనికి క్షుపుడని పేరుపెట్టి ప్రజలకు ప్రసాదించాడు. నరేంద్రోత్తమా, కనుక మహేంద్రుని అంశతో ఈ ఆభరణం స్వీకరించి, నన్ను పావనుని చేయుము" అని పలికాడు. దాశరథి ఆ ధార్మికుని కోర్కె ప్రకారం ఆ రత్నాభరణాన్ని తీసికొని ధరిస్తూ "తాపసశ్రేష్ఠా, అద్భుతమైన ఈ యాభరణం మీకెట్లు లభించింది?" అని అడిగాడు.

## అగస్త్యమహర్షి శ్రీరామునకు శ్వేతుని కథ వినిపించుట

మహర్షి ఆయనతో "రామభద్రా, నా కీ ఆభరణం ఎట్లు లభించిందో ఆ కథ వినిపిస్తాను వినుము. పూర్వం కృతయుగంలో నేను నూరు యోజనాల విస్తీర్ణం కలిగి మృగాలు గాని పక్షులుగాని లేక పుష్పఫలాలు సమృద్ధిగా నున్న అరణ్యాన్ని చూచి అచట తపస్సు చేయదలచి ఆ అరణ్యమధ్యంలో నిర్మలజలాలతో నున్న సరస్సు, దాని యందు పూచిన కమలాల మధ్యనున్న చక్రవాకాలు ఇతర జలపక్షులూ తిరుగాడు చుండెను. ఆ సరస్సు తీరంలో నిర్మానుష్యమైన ఒక ఆశ్రమాన్ని చూచి, విస్మయం పొంది, ఆ రాత్రి అచట నిద్రించాను. మరునాటి ఉదయం సరస్సును తీరికగా చూడగా, ఆ జలాల్లో పుష్టిగా నున్న ఒక శ్రీమంతుని శవం తేలు చుండటం చూచి, మరింత అబ్బురపడ్డాను.

"ఇంతలో అక్కడికి మనోవేగంతో హంసలు మోస్తున్న విమానం రాగా అందు కొందరు అప్సరసలు నాట్యం చేస్తుండగా మరికొందరు జవ్వనులు బంగారు పిడుగల వింజామరాలతో విసరుచుండగా, వారి మధ్య పద్మదళాలవంటి నేత్రాలు సుందరమైన దేహంపై రత్నాభరణాలు ధరించిన ఒక దివ్య పురుషుడు సింహాసనంపై కూర్చుండి ఉండటం చూచాను.

"ఆ విమానం కొలను ఒడ్డున ఆగగానే, ఆ దివ్యుడు సింహాసనం నుండి దిగి, సరాసరి కొలనులోని పీనుగువద్దకుపోయి, ఎంతో ఆకలితో నున్న వానివలె ఆ శవ మాంసం కడుపునిండునట్లుతిని, ఆ జలాలు త్రాగి విమానాన్ని సమీపించడం చూచాను.

"పురుషోత్తమా, నేను మిక్కిలి ఆశ్చర్యంతో అతణ్ణి సమీపించి, "ఓ దివ్య పురుషా, నీ వెవ్వడవు? దివ్యుడవైయుండీ, ఈ నికృష్టాహారం ఏల తిన్నావు? ఇందుకు కారణమేమో తెలుపుము!" అని ప్రశ్నించాను."

అంతట దేవతల నడుమనున్న అతడు నాకు నమస్కరిస్తూ "మహాత్మా, నా దౌర్భాగ్య గాధను ఆలకింపుము. విదర్భను పాలించే సుదేవు

డనే రాజు నా తండ్రి. ఆయన యిద్దరు భార్యల్లో ఒకరికి శ్వేతుడనబడే నేనూ, మరొకరికి సురధు డనబడే నా తమ్ముడు కలిగాము. నేను ధర్మ నిష్ఠతో చిరకాలం రాజ్యం పాలించి ఆయువు స్థిరంకాదని, నా తమ్ముని రాజ్యాధిపతినిచేసి, మృగాలు, పక్షులూలేని ఈ వనంలోని ఈ సరస్సు ఒడ్డుననే నిష్ఠతో మూడువేల సంవత్సరాలు తపస్సుచేసి, ఆ పుణ్యఫలంతో, బ్రహ్మలోక నివాసి నయ్యాను. అయినా, నన్ను ఆకలి, దప్పులు బాధిం చడంవల్ల దుఃఖంతో ఆ విషయం బ్రహ్మదేవునికి వినిపించి, నివార ణోపాయం తెలుపుమని వేడుకున్నాను.

"ఆ మహాత్ముడు నన్ను చూస్తూ "వత్సా, నీవు శరీరాన్ని నిండుగా పోషించి నీకు ఇంద్రునివంటి ఐశ్వర్యం వున్నా అతిథులకుగాని భిక్షుకులకు గాని, దానంచేసి ఎరుగవు. విత్తనం నాటకుండా మొక్క ఎట్లు మొలుస్తుంది? అందువల్లనే నీవు ఘోర తపస్సుచేసి ఈ దివ్యలోకం చేరికూడ, ఆకలి, దప్పికలతో బాధపడుచున్నావు! చేసిన కర్మఫలం ఎట్టివారికిని తప్పదు. కనుక దేహాభిమానివై జీవించిన నీవు తపస్సు చేసిన కొలనిలో, నిత్యం పుష్టితో వుండే నీ శవ మాంసాన్నే తింటూ, అచటి నీళ్ళే త్రాగుచుండుము! ఎంతో కాలం గడచిన తరువాత దేవతలను సైతం రక్షింప గలిగిన అగస్త్య మహర్షి ఆ వనానికి వచ్చి నీ దోషాన్ని తొలగించగలడని అనతిచ్చాడు. మహనీయమూర్తీ, నీవు తప్పక ఆ అగస్త్య మహర్షివే అయ్యుండాలి! మహాత్మా, నేను ఎంతోకాలంగా ఈ నికృష్టాహారాన్నే తింటున్నా, నా ఆకలి దప్పులు తీరడంగాని, ఈ శవం తరగడంగాని జరగటంలేదు. నా యీ దుర్గతి తప్పించడానికి నీవుతప్ప వేరు గతిలేదు. మహనీయా నీవు కరుణతో ఈ రత్నాభరణాన్ని స్వీకరించి నా దౌర్భాగ్యాన్ని తొలగింపుము" అని పెక్కు విధాల వేడగా నా హృదయం ద్రవించి నాకు ఆభరణం అవసరం లేకున్నా, దానం తీసికోవడం నాకు నిషిద్ధమైనా, ఆయననుండి స్వీకరించాను. ఆ క్షణంలోనే, కొలనినుంచి శవం మాయంకాగా, శ్వేతుడు, తన బాధలు తొలగాయన్న ఆనందంతో బ్రహ్మలోకం చేరాడు. విశుద్ధాత్మా, నా దోషం

తొలగించడానికి, నీ వీ ఆభరణం తీసికోవడంలో దోషంలేదు. కనుక అంగీకరింపుము" అని కోరాడు.

## అగస్త్యుడు దండకారణ్య వృత్తాంతం తెలుపుట

ఆ వృత్తాంతాన్ని విన్న రాఘవుడు ఆశ్చర్య, ఆదరాలతో, "మహర్షి శ్వేతుడు తపస్సుచేసిన ఆ వనం ఎందువల్ల పక్షులు, మృగాలు లేనిదైంది? నిర్జనమైన అచ్చట, అతడెట్లు తపస్సు చేశాడు? వివరించండి" అని ప్రార్థించగా ఆయన సమాధానంగా "రఘువంశభూషణా, వినుము. పూర్వం కృతయుగంలో భూమండలాన్ని మనువు పాలించాడు. ఆయన తన కుమారుడు ఇక్ష్వాకుణ్ణి రాజుగాచేసి, రాజవంశకర్తవుకమ్మని ఆశీర్వదించగా, ఆయన అంగీకరించాడు. మనువు ఆనందంతో అతనికి ధర్మాలు బోధిస్తూ, "కుమారా, పరిపాలకుడు ప్రజలను దండభీతితో రక్షిస్తూ, నిష్కారణంగా ఎవ్వరినీ దండించక, దోషులను దండనచేస్తుంటే, అదే రాజును స్వర్గవాసిని చేస్తుందిసుమా!" అని బోధించి బ్రహ్మలోకం చేరాడు.

శౌర్యవంతుడైన ఇక్ష్వాకుడు తండ్రి బోధించిన విధంగా రాజ్యం పాలించి, సత్కార్యాలుచేస్తూ, దేవసమానులైన నూర్గురు కుమారులకు తండ్రి అయ్యాడు. అయితే వారిలో చివరివాడు జ్ఞానం నీతి విద్యలు లేక, అన్నల శుశ్రూష చేయక దుష్టుడు కావడంవల్ల, తండ్రి వాడు ఎపటికి పోయినా దండించ బడునని, వానికి దండుడని పేరుపెట్టి, అడవిప్రాంత మైన వింధ్య, శైవల పర్వతాల మధ్య ప్రాంతానికి ప్రభువును చేశాడు. దండుడు అచట సర్వసౌకర్యాలతో మధుమంతమనే పట్టణాన్ని నిర్మించి, శుక్రాచార్యుని పురోహితునిగా చేసికొని సమృద్ధిగానున్న జనసమూహాలతో నున్న ఆ రాజ్యాన్ని ఇంద్రుడు దేవలోకాన్నిపలె చిరకాలం పాలించాడు. చైత్రమాసంలో ఒకనాడతడు శుక్రుని ఆశ్రమానికిపోయి, అక్కడి వనంలో ఒంటరిగానున్న దేవకన్యవంటి రూపసియైన శుక్రుని కూతురు అరజనుచూచి

కాముకుడై సమీపించి "సుందరీ, నీవు ఎవ్వరిదానవు? ఇక్కడ ఒంటరిగా ఏల వున్నావు? నీ రూపం నన్ను ఆకర్షిస్తోంది" అని పలికాడు.

అతని దుష్ట సంకల్పాన్ని గ్రహించిన ఆ కన్య సమాధానంగా మృదువైన పలుకులతో "రాజా, నేను నీ గురువర్యుడు శుక్రాచార్యుని తనయను. నన్ను అరజ అంటారు. నేను తండ్రి వశంలో ఉన్న కన్యనని గుర్తించి తొలగిపొమ్ము! లేక నన్ను వివాహమాడ తలచావా, నా తండ్రిని వేడుము. ఆయన తప్పక ఆమోదిస్తాడు. అట్లు కాక నీవు నీతి తప్పావంటే, భువనాల్ని దగ్ధంచేయగల ఆ తేజస్వి ఆగ్రహంతో నీవు మసికాగలవు" అని హెచ్చరించింది.

కాని ఆ దుష్టుడు ఆమె హెచ్చరికను చెవిని చొరనీయక, ఆమెకు చేతులు జోడిస్తూ, "కల్యాణీ నీ కొరకు నా ప్రాణాలు విలవిల్లాడుతుండటం వల్ల నేను తాళలేను! నీవు నన్ను కరుణించావంటే నీ తండ్రి నాకు యమ దండం వంటి శాపమిచ్చినా లేక నన్ను హతం చేసినా కూడ భరిస్తాను" అని పలుకుతూ, దూరం తొలగుచున్న ఆ కన్యను బలాత్కారంగా పట్టుకొని దురాగతానికి పాల్పడి, తరువాత తన దారిని పోయాడు. అరజ దుఃఖంతో అచటి ధూళిపై పొరలుచు తండ్రి కొరకు నిరీక్షించింది. ఆయన శిష్యులు వడిగా గురువును సమీపించి, దండుని దురాగతాన్ని విన్నవించారు.

## శుక్రుడు దండుని రాజ్యంపై మట్టి వాన కురియునట్లు ఘోరంగా శపించుట

ఆ వార్తను విన్న శుక్రుడు ఆగ్రహోదగ్రుడై శిష్యులతో వడిగా ఆశ్రమానికి వచ్చి దీనురాలై ధూళిలో పడియున్న కూతురిని చూచి "ఔరా పాపియైన ఆ ఖలుడు కండకావరంతో అగ్నిశిఖ వంటి నా బిడ్డకు ఎంతటి ఘోర అపచారం చేశాడు! ఈ దారుణ పాప ఫలితంగా ఆ తులువ, తన

వారందరితో, వారం రోజుల్లో మట్టి పాలు కాగలదు! అంతేకాదు, నూరు యోజనాల పర్యంతం గల ఆ పాతకి రాజ్యంపై ఇంద్రుడు మట్టి వర్షం కురిపించి, ఇచటి మనుషుల్నీ, జంతుజాలాన్నీ నాశనమొనర్చుగాక!" అని ఘోరంగా శపించి తన శిష్యుల్నీ, ఆశ్రితుల్నీ ఆ రాజ్యం పొలిమేరలు దాటి పోవలసినదిగా ఆదేశించాడు. తరువాత ఆయన అరజను చూస్తూ, "మతిహీనురాలా![1] ఈ పాతకం తొలగడానికి నీవు ఇంద్రియాల్ని జయించి, తపస్సు చేస్తూ, మిగిలిన జీవితాన్ని యిక్కడనే గడుపుము! యోజన విస్తీర్ణం గల ఈ సరస్సుకూ ఇందుండే జీవజాలానికి ఏట్టి కీడు జరగదు" అని పలుకగా, అరజ దుఃఖంతో అంగీకరించింది. పిమ్మట ఆయన శిష్యులతో దూర ప్రాంతానికి పోయి నివాస మేర్పరచుకున్నాడు. ఆయన శాపానుసారంగా, దండుడు, అతని సైన్యాలు, ప్రజలు ధూళి వర్షం వల్ల హతులయ్యారు.

"శ్రీరామచంద్రా, ఇట్లా మౌనిచే దారుణంగా శపించబడి నిర్జన మైన దండుని రాజ్యమే దండక యని, అందు మునులు నివసిస్తున్న ప్రాంతం జనస్థానమనీ పిలువబడుతోంది. ఈ విధంగా నీవు కోరిన దండ కారణ్య చరిత్ర వినిపించానయ్యా! ఇప్పుడు సూర్యాస్తమయ సమయం కావడం వల్ల, తపస్వులు స్నాన సంధ్యలు ముగించి, సూర్యునికి అర్ఘ్యాలు యివ్వడానికి సిద్ధపడుచున్నారు. నీవును సంధ్యా కార్యాలు నిర్వర్తించడం యుక్తం కదా!" అని పలికాడు. మహర్షి ఆదేశ ప్రకారం ఆ నియమశీలి అప్సరలు సేవించే ఆ పుణ్య సరస్సు వద్ద సంధ్యోపాసన చేసి ఆశ్రమానికి రాగా, మహర్షి శేఖరుడు ఆయనకు ఆప్యాయంగా వరి అన్నంతో కూడిన పదార్థాలు, మధుర ఫలాలు సమకూర్చగా, అమృతో పమానమైన ఆ భోజనాన్ని ఆయన తృప్తిగా ఆరగించి, విశ్రమించాడు.

---

1. ఆయన కూతురును మతిహీనురా లనడానికి, ఆమె అతని దౌర్జన్యాన్ని సహించి మతిహీన అయ్యెనని భావించి యుండాలి.

మరునాడు సూర్యోదయంతో ఆయన మేలుకొని, ఉదయ విధులు నెరవేర్చి, సంయమీంద్రునకు ప్రణామం చేస్తూ, "మహాత్మా, మీ పవిత్ర దర్శన, కృపాధనాలు లభించడం వల్ల ధన్యుడనయ్యాను। పుణ్యమూర్తీ, నాకు తీరిక చిక్కినప్పుడు అడపా తడపా వచ్చి పోవడానికి మీ అనుజ్ఞ కోరుచున్నాను" అని ప్రార్థించాడు

ఆయన అమృత వాక్కులను విన్న మహర్షి ఆనందంతో "శ్రీ రామచంద్రా, నీ వంటి పరమ పావనుడు భూతజాలమంతటిలోనూ, వేరొ కడు లేడయ్యా ! నిన్ను ప్రీతితో ఎంతటి స్వల్ప కాలం చూడగలిగిన ధన్యు డైనా, దివ్యలోకంలో వేల్పులచే పూజించబడతాడు। అట్లే నిన్ను కీర్తించే వారు సైతం ముక్తులౌతారు। ఇందుకు భిన్నంగా నిన్ను క్రూర దృష్టితో చూచే వ్యక్తి యమపాశాలకు వశుడై నరకయాతన లనుభవిస్తాడయ్యా :

"పావనమూర్తీ : ఇక నీవు అయోధ్యకు పోయి, ప్రజలను ధర్మ మార్గంలో పాలించుము" అని పలుకగా, రాఘవుడు ఆయనకు, మిగిలిన మునులకు నమస్కరించి, విమానంలో అయోధ్య చేరి తన ప్రాసాదం నడిమి కక్ష్యలో దిగి, విమానాన్ని పంపివేసి, కావలావానితో తాను వచ్చి నట్లు తమ్ములకు తెలిపి, వారిని పిలుచుకొని రమ్మనగా అతడు వారిని తీసికొని వచ్చాడు.

## శ్రీరాముడు తమ్ములతో రాజసూయాన్ని గూర్చి చర్చించుట

ఆ మహావీరుడు ఆదరంతో భరత సౌమిత్రులను కౌగలించి, "తమ్ములారా, విప్రుని కార్యం నెరవేర్చి వచ్చాను। అసాధారణమూ, పాపహరమూ, కీర్తివర్ధనమూ అయిన రాజసూయం చేయాలనుకుంటున్నాను. ఈ యాగం నిర్వహించియే పూర్వం మిత్రుడు వరుణుడయ్యాడు। మరియు ఈ యాగం చేయడంవల్లనే చంద్రుడు శాశ్వత పదవిని సంపాదించాడు। కనుక దీని నిర్వహణను గూర్చి మీ అభిప్రాయాలు తెలుప కోరుచున్నాను" అని పలికాడు.

## భరతుడు రాజసూయంవల్ల జనక్షయ మౌతుందని తెలుపుట

అప్పుడు వాగ్విపుణుడైన భరతుడు ఆయనకు అంజలిచేస్తూ సమాధానంగా "పురుషవరేణ్యా, నీవు ధర్మపరాయణుడవు కావడంవల్ల వసుంధర, ధర్మ యశస్సులు స్థిరంగా నిలచివున్నాయి! ప్రజాపతిని దేవతలు సేవించునట్లుగా, నిన్ను రాజులందరూ విధేయులై సేవిస్తున్నారు! ఇక ప్రజలందరూ నిన్ను తండ్రివలె భావిస్తున్నారు. పృధివీవలయమంతా నీ ఆజ్ఞానుసారంగా నడుస్తోంది.

"అన్నయ్యా ఈ పరిస్థితిలో రాజవంశాలను నశింపచేసే రాజసూయాన్ని, నీవు తలపెట్టడం తగునా? ఈ యాగంవల్ల రాజుల్లో విరోధాలు ఏర్పడి, యుద్ధాలు ప్రారంభిస్తే జనులు నాశనమౌతారు! కనుక యిందును గూర్చి తిరిగి యోచించడం మంచిదనుకుంటాను" అని పలికాడు.

ఆ మాటలకు తృప్తుడైన రఘుపతి "ధర్మజ్ఞుడా, నీ మాటలు నాకు అమితమైన ఆనందాన్ని కలిగించాయి! నీవు ధర్మ యుక్తంగానూ, లోక శ్రేయోదాయక దృష్టితోను చెప్పడంవల్ల, నేను నీతో ఏకీభవిస్తున్నాను. బుద్ధివంతుడైనవాడెవడూ లోకులకు బాధ కలిగించే పనిచేయరాదు. కనుక నేను రాజసూయం చేయాలనే సంకల్పాన్ని విరమిస్తున్నాను" అని పలికాడు.

## అన్నకు లక్ష్మణుడు అశ్వమేధాన్ని చేయవచ్చునని తెలుపుట

పిమ్మట సౌమిత్రి శుభవాక్కులతో "అన్నా అశ్వమేధ యాగం పాపాలను హరించేదీ శుభాలు కలిగించేదీ, పావనత్వం కలిగించేదీ కావడంవల్ల, దాన్ని చేయడం మంచిది. పూర్వం మహాత్ముడైన మహేంద్రుడు బ్రహ్మహత్యా దోషం తొలగించుకోడానికి ఈ యాగం చేశాడని పెద్దలవల్ల విన్న గాథను వినిపిస్తాను ఆలకించుము.

## సౌమిత్రి ఇంద్రుడు వృత్రాసురుని సంహరించిన కథ వినిపించుట

పూర్వం మహాకాయుడూ, ధర్మమందు ఆసక్తి, కృతజ్ఞతలు కలిగిన వృత్రుడనబడే అసురుడు, ముల్లోకాల్ని, ధర్మాత్ముడై పాలించాడు. అతని పాలనలో భూదేవి కామధేనువువలె దున్నకుండానే సమృద్ధిగా పంటలను, ఫలాలను, పరిమళ పుష్పాలను యిచ్చుచుండెను. అయినను అతడు యితర సుఖాలన్నీ అల్పమైనవనీ, తపస్సే సారభూతమైనదనీ తలచి, అరణ్యానికి పోదలచి, పెద్దకుమారుణ్ణి మధురకు పట్టాభిషిక్తునిచేసి, తాను కఠోరమైన తపస్సుకు పూనుకున్నాడు.

అది చూచి భీతిచెందిన ఇంద్రుడు, అమరులను వెంటబెట్టుకొని, శ్రీ మహా విష్ణువును సమీపించి, ఆర్తితో "లోకనాయకా, వృత్రాసురుడనబడే దైత్యుడు, అతి బలశాలియే గాక, ఇప్పుడు తీవ్ర తపోనిష్ఠకు పూనుకొనుటచే లోకాలన్నీ భీతి చెందుచున్నాయి. ఇప్పటికే అతడు మహా విక్రమశాలి కావడం వల్ల నేనతణ్ణి ఎదిరించలేకపోతున్నాను. ఇక అతని తపస్సు సిద్ధించి, మాకు పరిపాలకుడైతే, మేమంతా అతనికి కలకాలం బానిసలు కావలసిందే! కారుణ్యనిధీ మాకు రక్షకుడవైన నీవు వానిని సంహరించి, మాకు స్వస్థత కలిగించుము" అని వేడుకున్నాడు.

## నారాయణుడు వృత్రుని సంహారమునకు ఉపాయం తెలుపుట

ఆ మొర విన్న మధుసూదనుడు సమాధానంగా "సురనాయకా, వృత్రుడు అసురుడైనా, యోగ్యుడు కావడం వల్ల అతని యందు మిత్ర భావం కలిగిన నేను ప్రత్యక్షంగా అతని వధకు పూనుకోజాలను అయితే నీవు అతణ్ణి చంపే ఉపాయం వినుము. నా తేజస్సును మూడు విధాలుగా విభజించి, ఒక భాగం నీలోనూ, మరొక భాగం నీ వజ్రాయుధమందూ, మూడవ భాగం భూమి యందూ నిలుపుతాను. అందువల్ల నీవాతని వధకు పూనుకొనుము" అని ఆదేశించగా, దేవపతి, అమరులు ఆయనకు ప్రణా

మాలు చేసి, వృత్రుని తపోవనానికి పోయాడు. అయితే, ఆకాశాన్ని దహించునట్లున్న అతని అమోఘ తేజస్సును చూచి, భయపడ్డారు. అయితే ఆదిదేవుని తేజస్సు తన్నూ, తన ఆయుధాన్నీ ఆవరించడంవల్ల మహేంద్రుడు తెంపు చేసి, తన వజ్రాయుధంతో క్రూరంగా వృత్రుని సంహరించాడు. కాని, సాధువును తపస్వినీ చంపడం వల్ల బ్రహ్మ హత్యాపాతకం వికట రూపంతో వాసవుని వెంటబడి తత్సమగా అతడు తేజోహీనుడై పరుగెత్తి లోకాలకు ఆవలనున్న చీకటిని ఆశ్రయించాడు.

దేవతలు, శత్రువు హతుడైనా, పురందరుడు కానరాకపోవడంవల్ల విచారంతో అగ్నితోకూడ తిరిగి మాధవునిచేరి ప్రణామాలుచేస్తూ "జగన్నాథా, పరమేశా, మాకు నీవే రక్షకుడవు। జగతిని పాలించడానికే విష్ణుడవైన నీవు తిరుగ మమ్ము కనికరించుము। నీ అనుగ్రహంవల్ల వృత్రుడు హతుడైనా, శచీపతి బ్రహ్మహత్యా పాతకంతో బాధపడుచున్నాడు. నీవు కరుణించి, అతని కా పాతకం తొలగి శుద్ధుడయ్యే మార్గం ఆదేశించాలి'' అని ప్రార్థించారు. నారాయణుడు వారికి సమాధానంగా "అనిమిషులారా, వాసవుడు నా ప్రీతికొరకు అశ్వమేధంచేస్తే బ్రహ్మహత్య తొలగుతుంది। కనుక వెంటనే అతనిచే ఆ యాగం చేయించండి'' అని ఆదేశించాడు. అందుకు వారు ఆనందంతో ఆయనను పొగడి తమ లోకం చేరారు.

## ఇంద్రుడు అశ్వమేధం చేసి బ్రహ్మహత్యాదోషం తొలగించు కొనుట

అక్కడ ఇంద్రుడు బ్రహ్మ హత్యాదోషంవల్ల గాఢమైన చీకటిచే ఆవరించబడి గ్రహం పట్టిన వానివలె మతి చెడి, సర్పం వలె సంచరించుచుండెను. అతని పాలన లోపించడంవల్ల వర్షాలు లేక నదీ నదాలు ఎండి, పైరు పచ్చలు మాడిపోయి భూమండలం కరువు కాటకాలతో క్షోభించింది ఈ సమయంలో దేవదేవుని ఆజ్ఞానుసారంగా వేల్పులూ, ఋషులూ బృహ

స్పతితో పోయి, ఇంద్రుని గుర్తించి అతనికి వుత్సాహం కల్గించి అశ్వమేధ యాగం చేయించారు.

"ఆ యజ్ఞం ముగియగానే, బ్రహ్మ హత్య వేల్పులను తన నివాసానికి స్థానం చూపవలెనని వేడగా, వారు నాలుగు రూపాల్లో లోకంలో ఎక్కడైనా నివసించమన్నారు. అప్పుడా పాతకం వారితో "అనిమిషులారా, నేను వానకాలంలో వెల్లువగా పారే నదీ జలాల్లో స్నానం చేసేవారి కామాన్నీ, దుష్టుల దర్పాన్నీ అణగించే బురద రూపంగానూ, భూమి యందు చవుడు రూపంలోనూ, యౌవనవతులైన స్త్రీలలో కామం తొలగునట్లు వారిలో ప్రతి నెలలో మూండు రాత్రులందునూ, కల్లలాడుతూ, నిర్దోషులైన బ్రాహ్మణులను చంపు వారి యందూ, యిట్లు నాలుగు అంశలతోను నివసిస్తాను" అని పలుకగా, వారు అంగీకరించారు. తరువాత వారు శుద్ధులైన దేవేంద్రునితో తమ లోకం చేరారు. ఆయన పాలనతో తిరిగి లోకాలు సుభిక్షమయ్యాయి. అన్నా, కనుక యిట్టి మహిమ కలిగిన పావన యాగానికి పూనుకొనుము" అని వినిపించాడు.

## శ్రీరాముడు ఇలుని గాథ వినిపించుట[1]

వాగ్మియైన[2] శ్రీరాముడు తమ్ముని మాటలు విని నవ్వుచు "లక్ష్మణా అశ్వమేధ యజ్ఞం అత్యంత శక్తివంతమైనదే! ఇట్టిదేయైన ఇలుడను రాజు కథను వినిపిస్తాను. వినుము. పూర్వం బాహ్లిక దేశపు రాజు కీర్తివంతుడైన కర్దమ ప్రజాపతి కుమారుడు ఇలుడు విక్రమవంతుడు ధార్మికుడై ప్రజలను కన్నబిడ్డల వలె ప్రేమిస్తూ, భూమండలాన్ని పాలించుచుండెను.

---

1. ఇంతకుముందు సౌమిత్రి అశ్వమేధం విష్ణువునకు ప్రీతికరమైనదని చెప్పగా, ఇప్పుడు శివ ప్రీతికర మెట్లయ్యెననగా ఆ యాగం సర్వదేవతలకు తృప్తి కలిగించునది గనుక శివునకు హర్షం కలిగించునని చెప్పబడింది శాపం యిచ్చిన రుద్రుడే యిప్పుడు ఆ శాపాన్ని తొలగించాడు.

2. వాగ్మి = వాక్కులో నిపుణుడు.

దేవ, గంధర్వ, యక్ష, నాగులూ, దైత్య రాక్షసులూ ఆయన్ని సదా భయభక్తులతో కొలుచుచుండిరి. ఆ వీరాగ్రేసరుడు ఆగ్రహిస్తే లోకాలు వణికేవి. ఈ విధంగా అతడు ధర్మ పరాక్రమ, ఔదార్య బుద్ధి బలాలతో రాజ్యం పాలిస్తూ, ఒక చైత్ర మాసంలో, వేటాడే కోర్కెతో బలగం, వాహనాలతో అరణ్యం ప్రవేశించి, వేలకొలది మృగాలను కూల్చాడు.

అయినా తృప్తి పడక, అతడు ఒంటరిగా బయలుదేరి కుమార స్వామి జన్మించిన ప్రదేశానికి వెళ్లాడు. ఆ సమయంలో అచట పార్వతీ పరమేశ్వరులు పరిచారికలతో విహరించుచుండిరి, తన దేవికి సంతోషం కలిగించాలని పరమశివుడు తాను మహిళయై, అచటి వృక్షాలన్నిటిని స్త్రీలుగా మార్చాడు. ఆ దృశ్యాన్ని విస్మయంతో చూస్తున్న ఇలుడు స్వయంగా మగువయై, అతని పరివారమంతా స్త్రీలయ్యారు. అది శంకరుని యిచ్ఛ వల్ల జరిగినదని గుర్తించిన ఆ రాజు, ముక్కంటి పాదాలపై వ్రాలి శరణు వేడాడు. మహేశ్వరుడు చిరునవ్వుతో "కర్దమ కుమారా, స్త్రీత్వం తొలగించాలనే కోర్కె తప్ప, వేరే వరమైనా కోరుము" అని పలికాడు. కాని అతడు తనకు మరే వరం కోరడం యిష్టం లేనందున జగన్మాత పాదాలపై తల మోపి, "అమ్మా భవానీ, లోకాలన్నిటినీ పాలించే కరుణా స్వరూపిణీ, నీ కరుణా దృష్టితో, నా దోషం మన్నించి రక్షింపుము!" అని ప్రార్థించాడు. అందుకు సర్వ మంగళ ఆ రాజర్షి కోరికను, నాథుని ఇంగితాన్ని గుర్తించి మధుర వాక్కులతో "కుమారా, దేవదేవుని దేహంలో సగ భాగమైన నేను నీకు సగం వరం మాత్రమే యివ్వగలను. మిగత సగం మహదేవుడు ఇవ్వవలసినదే. కనుక నీ కోర్కె ఏమో తెల్పుము" అని పలికింది. ఆ దేవి అమృత వాక్కులకు తృప్తుడైన ఇలుడు "తల్లీ, నీవు కరుణించి నేను ఒక మాసం స్త్రీగాను, మరొక మాసం పురుషుడుగాను, సంచరించే వరం ప్రసాదించుమ"ని వేడాడు. అందుకు దేవి ప్రసన్నమైన ముఖంతో "అట్లే కమ్ము! నీవు పురుషుడుగా ఉన్న సమయంలో మగువగా చేసిన పనులను, సుందరిగా వున్నప్పుడు మగవాని రూపంలో చేసిన కార్యాలను మరువ

గలవు" అని వరం ప్రసాదించింది. ఆ వర ప్రభావం వల్ల, అతడు కాంత యైనప్పుడు ఇలయనీ, పురుషుడైనప్పుడు 'ఇలుడు' గాను పిలువబడ్డాడు"

ఆ కథను విన్న లక్ష్మణ, భరతులు కుతూహలంతో "అన్నయ్యా, అతడు వనిత గాను, పురుషుడు గాను ఎట్లు సంచరించాడో వివరంగా తెలుపుము" అని కోరారు. ఆయన కథను సాగిస్తూ "తమ్ములారా వినండి. మొదటి నెల అతడు సుందరీమణియై, తన సేవకులందరూ పరిచారికలు కాగా, వాహనాలను విడిచి, సౌందర్యంతో ఆ వనాన్ని తేజోవంతం చేస్తూ, కాలి నడకను పోయి, చంద్రుని కుమారుడు సుందరుడైన బుధుడు, తండ్రి వంటి తేజస్సుతో, వివిధాలైన పక్షులతో సుందరంగా నున్న ఒక సరస్సు మధ్యలో తీవ్రమైన తపస్సు చేయడం చూచి, తన చెలికత్తెలతో ఆ సరస్సులో జలక్రీడ లాడసాగింది.

బుధుడు ఆ జవ్వని సౌందర్యానికి ముగ్ధుడై మనస్సు చలింపగా, తపస్సు చాలించి, ఆమె యందే దృష్టి నిలుపుతూ, తనలో "ఔరా ఏమి ఈమె అపురూప సౌందర్యం! నేను ఇంతవరకు చూచిన దేవ, అప్సర, దానవ కన్య లెవరూ, రూప సంపదల్లో ఈమెకు సాటి రారు. కనుక ఈమె కన్య యైనచో నాకు తగిన అర్ధాంగి కాగలదు" అని నిశ్చయించుకొని, అక్కడ నుండి తన ఆశ్రమానికి పోయి, ఆమె చెలికత్తెలు కొందరిని రప్పించి వారితో "తరుణులారా, మీ యజమానురాలు ఎవరు? ఇక్కడికి ఏం వచ్చింది?" అని అడిగాడు. అందుకా యువతులు "తపస్వీ, మా యజమానురాలు అవివాహిత. అందువల్లనే మాతో వనాల్లో సంచరిస్తోంది" అని సమాధానం చెప్పారు.

ఆయన తన తపోమహిమవల్ల, వారి వృత్తాంతం గ్రహించి, వారిని అచ్చటి పర్వత ప్రాంతంలో నివసించవలెననీ, వారికి కావలసిన కందమూల ఫలాలన్నీ తాను ఇవ్వగలననీ, వారికి అచట కింపురుషులు భర్తలు కాగలరనీ తెలుపగా వారు అంగీకరించి అట్లు చేశారు. వారు

దూరం పోగా, బుధుడు ఇలాదేవిని సమీపించి చిరునవ్వుతో "సుందరీమణీ, నేను చంద్రుని కుమారుడను. నన్ను బుధుడని పిలుస్తారు. నన్ను నీ ప్రసన్న దృష్టితో చూడుము" అని వేడాడు. ఆమె సంతోషంతో "సుధాకర నందనా, నేను స్వతంత్రురాలనైనా, నీవు చెప్పినట్లు చేయగలన"ని పలుకగా, అతడామెను తన కుటీరానికి తీసికొనిపోయాడు. అపటి వారు భార్యాభర్తలై సుఖంగా కాపురం చేస్తుండగా, ఆ నెల నిమిషం వలె గడచి పోయింది.

ఆ మరునాటి ఉదయం పురుషుడైన ఇలుడు, సరస్సు మధ్యకు పోయి, ఆ జలాల్లో తపస్సుచేస్తున్న బుధుని చూచి "మహాత్మా, నేను నా భటులతో ఈ వనానికి వేటకు వచ్చాను। వారి ఏలనో నావా రెవ్వరూ కనిపించడంలేదు. కరుణించి వారేమైనారో చెప్పగలరా ?" అని ప్రార్థించాడు. బుధుడు, అంతకుముందటి తన చరిత్రను మరచిన ఆతణ్ణి ఓదారుస్తూ "రాజా, ఇక్కడ గొప్ప రాళ్ళవాన కురవడంవల్ల, నీ సైనికులంతా మరణించారయ్యా। నీవా సమయంలో, నా కుటీరంలో నిద్రిస్తుండటంవల్ల నీకా ఆపద తప్పింది। భూపాలా జరిగినదానికి చింతించక నియతితో కందమూల ఫలాలు ఆరగిస్తూ నా వద్దనే నివసించవచ్చును" అని పలికాడు.

అయితే ఇలుడు సమాధానపడక, తనవారు మరణించినందుకు ఖిన్నుడై "సంయమీ, నేను రాజ్యానికి దూరంకాగా నా భటులు మరణించారు. కనుక నేనిక్కడ ఉండలేను. తాము అనుజ్ఞయిస్తే, నేను నా నగరానికి పోయి, నా కుమారుల్లో పెద్దవాడూ, ధర్మాత్ముడూ అయిన శశిబిందుణ్ణి రాజు చేస్తాను. నేను నా రాజ్యాన్నీ, భార్యల్నీ, సౌఖ్యాన్నీ, పరివారాన్నీ విడిచి, యిక్కడి కష్టాలు భరించలేను" అని పలికాడు. బుధుడు అతని పలుకులకు ఆశ్చర్యపడుచు "వీరుడా, నీవీ యోచనలన్నీ మాని, యిచ్చట నాతో ఒక సంవత్సరం గడపుము. అప్పుడు నీకు శ్రేయస్సు కలిగిస్తాను!" అని తెలుపగా అతడు అంగీకరించి తీవ్రమైన తపస్సు ప్రారంభించాడు.

ఇంతలో ఆ నెల గడవగానే అతడు ఇలాదేవియై భర్తతో సుఖిస్తూ, మరొక నెల పురుషుడౌతూ తొమ్మిది నెలలు గడప స్త్రీగా పురూరవుడను కుమారుని ప్రసవించి, భర్తకు అప్పగించింది. మరికొన్ని నెలలకు సంవత్సరం ముగియగానే ఉదారుడైన బుధుడు తన పుత్రులు, మహాత్ములైన సంవర్త్య, చ్యవస, కశ్యప, దుర్వాస మహర్షులను రప్పించి "మహర్షులారా, ఈ కర్దమ కుమారుని దయనీయ స్థితి మీకు తెలిసినదేకదా! ఇతనికి శుభం కలిగే ఉపాయం యోచించండి" అని పలికాడు. అప్పుడే, కర్దమ ప్రజాపతి, కొందరు దివ్యులైన బ్రాహ్మణులతోను క్రతువు, పులస్త్యుడు, వషట్కార, ఓంకారాలతోను అచటికి విచ్చేశాడు.

అప్పుడు వారంతా సంతోషిస్తుండగా కర్దముడు "ఇలునికి తోడ్పడటానికి ఉమాకాంతుని తృప్తిపరచడంతప్ప వేరు మార్గంలేదు! కనుక ఆయన హర్షించునట్లుగా, ఇతనిచేత అశ్వమేధం చేయించడం ఒక్కటే యుక్తమైనది" అని తెలుపగా వారందరూ అంగీకరించారు. రుద్రునకు అంకితంగా ఆ యజ్ఞం బుధుని ఆశ్రమ ప్రాంతంలో ప్రారంభమైంది. సంవర్తుని శిష్యుడైన మరుత్తు మహారాజు యజ్ఞ సంభారాలన్నీ సమకూర్చాడు.

### శంకరుడు ఇలునకు శాశ్వత పురుషత్వం ప్రసాదించుట

యజ్ఞాంతంలో మహాదేవుడు ప్రసన్నుడై దర్శనమిచ్చి "ద్విజోత్తములారా, మీరు నిర్వహించిన క్రతువు నాకు తృప్తి కలిగించింది! మీ కోరిక ఏమో తెలుపండి" అని పలికాడు. వారందరునూ "చంద్రశేఖరా, ఇలుడు ఎల్లప్పుడూ పురుషత్వంతో వుండునట్లు అనుగ్రహించండి" అని వేడగా, ఆ భక్త పరాయణుడు "అట్లే ఔగాక!" అని పలికి అదృశ్యమయ్యాడు. ఆ యాజకులు యజ్ఞం పూర్తిచేసి, తమ ఆశ్రమాలకు పోయారు. ఇలుడు తన రాజ్యం ప్రవేశించి, తన కుమారుడైన శశిబిందుణ్ణి రాజుగాచేసి, తరువాత (బుధునివల్ల తనకు కలిగిన కుమారుడు) పురూరవుని మధ్య

దేశంలోని ప్రతిష్ఠాన పురంలో రాజుగా అభిషేకించాడు. తరువాత తాను తపస్సుచేసి బ్రహ్మలోకం చేరాడు. తమ్ములారా విన్నారుకదా, అశ్వమేధ యాగ మహిమవల్ల బాహ్లీకుడైన ఇలుడు, స్త్రీత్వంనుండి పురుషత్వం పొంద డమేగాక బ్రహ్మలోక నివాసం పొందగా ఇక సాధించరాని దేముంటుంది?" అని వినిపించాడు.

## శ్రీరాముడు సౌమిత్రిని అశ్వమేధానికి ఏర్పాట్లు చేయగోరుట

పిమ్మట ఆయన లక్ష్మణునితో "తమ్ముడా, అశ్వమేధాన్నిగూర్చి వివరాలు చర్చించడానికి పురోహితులైన వశిష్ఠ, వామదేవాదులైన ద్విజోత్త ములను రప్పించుము. వారితో సంప్రదించిన పిమ్మట శుభ లక్షణాలు కలిగిన అశ్వరాజాన్ని విడుస్తాను" అని పలికాడు. ఆ ప్రకారం లక్ష్మణు డా మహాత్ములను ఆహ్వానించగా వారు శీఘ్రమే వచ్చారు. రాఘవుడు వారికి నమస్కరించగా వారు ఆశీర్వదించి, తమ ఆసనాలపై కూర్చున్నారు. దాశరధి వారికి తన సంకల్పాన్ని వినిపించగా, వారు మనస్సులలో శంభుని స్మరించి, అశ్వమేధం రాజులందరు చేయతగిన విశిష్ట యాగమని ప్రశంసించారు.

రామభద్రుడు వారి మాటలకు హర్షించి, లక్ష్మణునితో "తమ్ముడా, ఈ యజ్ఞ మహోత్సవంలో పాల్గొనడానికి మహాత్ముడైన సుగ్రీవుడు అంగ దుడు మొదలైన వానరవీరు లందరితోను వచ్చునట్లు, వెంటనే దూతలను పంపుము. అట్లే విభీషణుడు, అసురులతోను, నాకు ప్రియులైన రాజు లందరూ పరివారాలతో వచ్చునట్లూ దూతలను పంపుము. అట్లే యజ్ఞం కొరకు మునులు, పూజ్యులైన విప్రులు, సతులతో వచ్చునట్లాహ్వానించాలి. ఇంకను నటులు, గాయకులు, తాళాలు వాయించువారినీ రప్పించుము.

"వీరుడా గోమతీ నదీతీరంలోని పవిత్ర నైమిశారణ్యంలో విశాలా లైన యజ్ఞగృహాలు నిర్మించాలి. పవిత్రులు, ధర్మపరాయణులైన, మహాత్ము

లందరినీ యజ్ఞాన్ని తృప్తికలుగునట్లు చూడటానికి ఆహ్వానించుము. శ్రీ భరతుడు లక్ష ఒంటెలపై బియ్యాన్ని, పదివేల ఎడ్లపై పెసలు, శనగలు, మినుములు, నువ్వులు, పప్పు తైలాలు, గంధపు చెక్కలు, కోటి బంగారు, పదికోట్ల వెండి నాణాలతో వెంటనే అక్కడకు బయలుదేరాలి. మరియు అతడు, నా పత్ని[1] బంగారు ప్రతిమను యజ్ఞానికి కావలసిన సామగ్రినీ తల్లులు, పిల్లలతో అంతఃపుర స్త్రీలు సేవకులు నాట్యగాండ్రు, వర్తకులు మృదంగులు వంటవారు, సైనికులు, కోశాధ్యక్షులనుకూడ వెంటబెట్టుకొని పయనించాలి. నాయనా, రాజులు, శ్రీమంతులు వారి పరివారాలతో సుఖంగా నివశించడానికి పెద్దెలు, భవనాల వరుసలు నిర్మింపచేయుము" అని ఆదేశించాడు.

## శ్రీరాముడు భూప్రదక్షిణకు అశ్వాన్ని విడుచుట

సౌమిత్రి ఆ ప్రకారం ఏర్పాట్లన్నీ చేయగా, రామభద్రుడు నల్లటి లేడితో సమానమై, సర్వలక్షణాలు కలిగిన హయాన్ని లక్ష్మణుడు, ఋత్విజులు రక్షించుచుండగా భూప్రదక్షిణానికై విడిచాడు. తరువాత ఆయన సైన్యాలతో వడిగా నైమిశారణ్యానికి పోయి. అచట నిర్మించబడిన యజ్ఞశాలలు, వసతి గృహాలు మొదలైనవన్నీ పరిశీలించి, ఏర్పాట్లు అద్భుతంగా వున్నవని మనస్సులో సంతోషించి అందు ప్రవేశించాడు. ఆహ్వానాలు అందగానే వరుసగా రాజులందరూ. కానుకలు తీసికొని, పరివారాలతో రాగా, రాఘవుడు వారికి స్వాగత సత్కారాలు జరిపి వారిని అచటి విశాల మందిరాలలో నివశించునట్లు చేశాడు. భరత, శత్రుఘ్నులు వారికి వారి పరివారాలకు సమృద్ధిగా నీటి వసతి అన్నపానాలు వసతివంటి అక్కరలకు ఏలోటూ రాకుండా ఏర్పాట్లు చేయుచుండిరి. అట్లే వానరులతో సుగ్రీవుడు విప్రులను వెతకి వారి అక్కరలను తీర్చుచుండగా వినయవంతుడైన విభీషణుడు తన

---

1. యజ్ఞశాలలో నా పత్ని బంగారు ప్రతిమను పెట్టాలి అనడంవల్ల శ్రీరామమూర్తి ఏకపత్నీవ్రతం లోకానికి మరొకసారి ప్రస్ఫుటంగా నిరూపితమైంది.

పరివారంతో, శిష్యులతోనున్న మునులను, వృద్ధులను అర్చిస్తూ, వెంట వెంటనే వారి అవసరాలను తీర్చుచుండెను.

లక్ష్మణుడు అశ్వరక్షణలో నుండగా, మహాయజ్ఞం యథా శాస్త్రీయంగా సాగుతూ, తినువారికి "తృప్తిగా వడ్డించండి, వడ్డించండి" అనే ధ్వనులు మాత్రమే అన్ని ప్రదేశాల్లోనూ వినపడుచుండెను పిండి వంటలు బెల్లం, కండ చక్కెరలు, తినుచున్నవారు కోరకుండానే వంటల వారు, వడ్డించేవారు "చాలు, చాలు" అనే వరకు వడ్డించుచుండిరి. ఆ మహా యజ్ఞంలో మురికిగా వున్నవాడు కాని, దీనుడు కాని, దరిద్రుడు కాని మచ్చునకైన కానరాకుండిరి. దీర్ఘకాలం జీవించిన ఋషులు సైతం, ఆ యజ్ఞంలో కోరిన వారందరికీ, ధనాలు, రత్నాలు, వస్త్రాలు కనివి తీరునట్లు పంచిపెట్టారనీ, తామెరిగియున్న ఇంద్ర, యమ, వరుణ, కుబేరుల యజ్ఞాలేవీ దీనికి సమానం కావనీ హర్షంతో ప్రశంసించారు. వానర, దానవ సమూహాలు అన్ని ప్రదేశాల్లోనూ చేతుల నిండా వస్త్రాలు, ధనాలు, భోజన పదార్థాలు తెచ్చి అర్థులకు పంచిపెట్టుచుండిరి. ఈ ప్రకారం ఆ సప్తతంతువు, సంవత్సరం గడిచాక కూడ సాగుచుండెను.

## వాల్మీకి మహర్షి అశ్వమేధాన్ని చూడవచ్చుట

ఈ ప్రకారం పావనమైన ఆ యాగం అద్భుతంగా సాగుచుండగా వాల్మీకి మహర్షి శ్రీరాముని యందుగల ప్రీతితో అనేకమంది శిష్యులతోనూ, కందమూలాల బండ్లతోనూ వచ్చి, మునుల వాటికలో, సీద కలిగిన కుటీరాల్లో నివాస మేర్పరచుకున్నాడు. ఆయన రాక తెలియగానే రామచంద్రుడూ, తాపసులూ అతిథి సత్కారాలు చేయగా స్వీకరించాడు.

## వాల్మీకి మహర్షి కుశ లవులకు రామాయణం గానం చేయ నియమించుట

తేజస్వీ, ఆత్మవిదుడూ అయిన ఆ మహర్షి తన శిష్యులూ, గాయకులైన కుశ లవులనబడే బాలకులతో ఆప్యాయంగా "నాయనలారా, మీరు

రేపటి ఉదయాన్నుండీ మీరు సంతోషంతో బ్రాహ్మణులు, రాజులు, మునులు, ఋత్విజుల నివాసాల ముందు, రామచంద్రుని భవనం ఎదుట యజ్ఞశాల సమీపంలోనూ, నేను నేర్పిన రీతిలో రామాయణాన్ని చెవులకు విందు కలుగునట్లు గానం చేయండి. అందునా ముఖ్యంగా ఋత్విక్కులు వినునట్లు అరణ్యంలోని సుందరమైనవీ, మధురాలైన ఫలాల్ని తిని పాడండి. అట్టి ఫలాలు తినడం వల్ల మీ కంఠాలు జీరపోవడం గాని, మీకు అలసట కలగడం గాని ఉండదు! బాలకులారా,[1] మనము కందమూల ఫలాలతో జీవించేవారము గనుక, మనకు లోభంగాని, ధనాశగాని ఉండరాదనే విషయం మరువకండి!

"నాయనలారా, శ్రీరామమూర్తి మీరు ఎవరి వారని ప్రశ్నిస్తే, మేము వాల్మీకి మహర్షి శిష్యులమని నిర్భయంగా తెలుపండి! మీరు ముందటివలె వీణల తంత్రులు మధురంగా మీటుచు, మూర్ఛనా పద్ధతి తప్పనీక శ్రుతి కలిపి, జంకు లేకుండానూ, మనోహరంగానూ గానం చేయండి. వత్సలారా, ధర్మ పద్ధతి ప్రకారం ప్రజలకు పరిపాలకుడు తండ్రివంటివాడు గనుక రామ భూపాలుని మీరు తండ్రిగా భావించి, ఏ విధమైన అవిధేయత చూపక, రేపటి వుదయం నుండి కావ్యం మొదటి నుండి ప్రారంభించండి" అని బోధించాడు. వారు ఆనందంతో అట్లా చేస్తామనిపలికి ఆయన వాక్కులు స్మరిస్తూ, ఆ రాత్రి సుఖంగా నిద్రించారు.

## కుశ లవుల రామాయణ గానాన్ని శ్రీరామచంద్రుడు వినుట

మరునాటి ఉదయం ఆ బాల గాయకులు స్నానం చేసి, హోమం జరిపి తమ గురుదేవుని ఆదేశ ప్రకారం వీణలు మీటుచు, ఆది సంగీతా

1. వాల్మీకి మహర్షి తనకు, తన శిష్యులకు కావలసిన ఫలమూలాలు స్వయంగా తెచ్చుకొని కుశలవులకు ఫలాలే తినాలని చెప్పడంద్వారా తన అపరిగ్రహాన్ని పాలించాడు. కుశలవులు శత్రుఘ్నుడు లవణుని చంపబోతూ వాల్మీకి ఆశ్రమానికి వచ్చిన రోజున పుట్టడంవల్ల ఇప్పటికి వారి వయస్సు 18, 14 సంవత్సరాలకు మించదు.

చార్యుడై భరతునిచే నిర్మితము, అపూర్వమై, ఆరోహణ, అవరోహణల సాధన కలదై, పాడుటకు యోగ్యమై, వీణ ద్వారా లయతో గానం చేయ వీలైన రామాయణాన్ని మధురంగా పాడసాగారు.

ఆ అద్భుత గానాన్ని కుతూహలంతో ఆలకించిన శ్రీరామ భూపాలుడు యాగ కర్మల విరామ సమయంలో సభ జరిపి, అందు పాల్గొన డానికి ధర్మశాస్త్ర నిపుణులు, మునులు, రాజులు, భూసురులు, పండితులు, వైశ్యులు, పౌరులు, పురాణ, వ్యాకరణాల్లో వృద్ధులు, వేదవేత్తలు, సాముద్రిక శాస్త్రజ్ఞులు, గాయకులు, శబ్దవిదులు, నీతి, స్వర, బహుభాషా నిపుణులు, కావ్య తార్కిక నిపుణులు మొదలైన వారందర్నీ ఆహ్వానించి, ఆ సుందర బాలకులను గానం చేయమన్నాడు. వారు హర్షంతో సభికుల హృదయాలు ఆనంద పరవశాలగునట్లు పాడ నారంభించారు.

ఆ సభాసదులు తేజోమూర్తి రామచంద్రునీ, గాయకులనూ కనులతో త్రాగునట్లుగా తనివితీరకుండా చూస్తూ ఒండొరులతో "ఎంతటి విచిత్రమిది? అద్దంలో కాన్పించే ప్రతిబింబాలవలె, ఈ కుమారులు, రామచంద్రుని పోలి యున్నారే! ఇదెట్లు సాధ్యమైంది? వీరు ధరించిన జటలు, నారవస్త్రాలు లేనిచో రామభద్రునికి, వీరికీ భేద ముండగలదా?" అని తర్కించుకొను చుండిరి. ఆ గానం అతిమానుషము, మధురమైసాగి శ్రోతలను పరవశుల్ని చేసింది. ఆ బాలకులు నారద మహర్షి వాల్మీకికి సంగ్రహంగా బోధించిన మొదటి సర్గనుండి ఇరవయ్యో సర్గవరకు వినిపించారు. అప్పటికి మిట్ట మధ్యాహ్నమయ్యెను.

## కుశలవులు శ్రీరాము డిచ్చిన కానుకలను నిరాకరించుట

రఘుభూషణుడు సభికులతోబాటు ఆ అపూర్వ గానాన్ని హర్షంతో ఆలకించి, భరత, లక్ష్మణులతో బాలగాయకులకు పద్దెనిమిదివేల బంగారు నాణాలనేగాక, వా రేది కోరినా ఇవ్వవలసినదిగా ఆదేశించాడు. వారు ప్రీతితో ఆ ధనాన్ని వారిముందుంచి, ఆ మొత్తాన్ని తమలో పంచుకోమన్నారు.

కుశలవులు ఆ సువర్ణ నాణాలను చూచి అశ్చర్యపడి వారితో "మహాత్ములారా, వనాల్లో పండిన ఫలాలు, కంద మూలాలూ తింటూ, దైవ చింతనతో తపస్సుచేసి జీవితాలు గడిపే మాకు వెండి బంగారాలతో పని ఏమున్నది? కనుక వీనిని తీసికోజాలనందుకు మమ్ము మన్నించండి" అని పలికారు.

## శ్రీరాముడు కుశలవులను రామాయణాన్ని గూర్చి ప్రశ్నించుట

రాఘవుడు, సోదరులు, సభికులు ఆ బాల గాయకుల మాటలకు మిక్కిలి ఆశ్చర్యపడ్డారు. రఘుపతి సంతోషించి వారితో "బాలకులారా, ఈ కావ్యం ఎవరు వ్రాశారు? ఏ ఆధారంతో వ్రాయబడినది? ఎవరిని గూర్చి వ్రాయబడింది? నాకు పూర్తిగా వినాలని కుతూహలంగా ఉన్నది. కనుక వరుసగా మొత్తం కావ్యాన్ని వినిపించండి" అని అడిగాడు. ముని బాలకులు సమాధానంగా "ప్రభూ, మేము వినిపిస్తున్న శ్రీ రామాయణ మహా కావ్యాన్ని భగవంతుడైన వాల్మీకి మహర్షి రచించారు. ఆయన ఈ యజ్ఞ వాటికలోనే వున్నారు. ఈ కావ్యానికి మీరే నాయకులుకాగా, వివరాలతో కూడిన మీ జీవిత చరిత్రను వివరిస్తోంది! ఈ మహాకావ్యం ఉత్తరకాండ సహా ఏడు కాండలు, నూరు ఉపకథలు, రెండువందల సర్గలు, ఇరవై నాలుగువేల శ్లోకాలతో శోభిస్తోంది. తాము వినగోరినచో తమ యజ్ఞవిధుల విరామ సమయంలో పూర్తి కావ్యాన్ని వినిపించగలము" అని పలుకగా అయన అంగీకరించి హితులతో యజ్ఞశాలకు చేరాడు. పిమ్మట ఆ ముని బాలకులు సంతోషంతో తమ కుటీరానికిపోయి, సభా విశేషాలు గురుదేవునికి విన్నవించారు. తరువాత రామభూపాలుడు, ఆప్తులు, మునులు, రాజులు వానరులతోసహా దినమునకు ఇరవై సర్గల వంతున, క్రమంగా రామాయణం

ఉత్తరకాండలో కుశలవుల పుట్టుకవరకువిని, దానిని[1] బట్టియే బాల గాయకులు సీతాదేవి కుమారులని తెలుసుకున్నాడు.

## శ్రీరాముడు వాల్మీకి మహర్షి వద్దకు దూతలను పంపుట

తరువాత ఆయన దూతలను రప్పించి సభవారు వినుచుండగా "దూతలారా, మీరు వెంటనే వాల్మీకి మహర్షిని సమీపించి, నా మాటలుగా ఇట్లు వినిపించండి "ఋషిపుంగవా, వసుధాతనయ పవిత్రురాలని మీ నమ్మకమైతే మాకందరికీ తెలిసే విధంగా ఆమె తాను నిర్దోషిననీ, పవిత్రురాలననీ శపథం చేయగలదా? అందునుగూర్చి మీ అభిప్రాయం, సీత అభిప్రాయం కూడ తెలుపగోరుచున్నాను." అని తెలిపి, వారి అభిప్రాయాలు నాకు తెలియ జేయండి" అని ఆదేశించాడు. సభాసదులంతా ఆశ్చర్యభరితులయ్యారు.

ఆ దూతలు వెంటనేపోయి ఆ తేజశ్శాలిని దర్శించి, ప్రణామాలుచేసి శ్రీరామ సందేశాన్ని మృదువైన పలుకులతో వినిపించారు. ఆ పూజ్యమూర్తి వారితో "దూతలారా, సతులకు పతియే దైవసమానుడు గనుక రామభద్రుడు కోరినప్రకారం రేపు జానకీదేవి శపథం చేస్తుందని రామచంద్రునకు తెలుపండి" అని పలికాడు. వారా వార్తను వెంటనేపోయి భూపతికి విన్నవించారు.

## శ్రీరాముడు సీతాశపథాన్ని దర్శించడానికి సభికులను రమ్మని ప్రార్థించుట

ఆ వార్తవిన్న రఘుభూషణుడు సంతోషించి సభికులనుద్దేశించి "ఓ శిష్యసమేతులైన మునులారా, పరివారాలతోఉన్న రాజులారా, సీతాశీలాన్ని శంకించే పౌర, జానపద సమూహాల్లారా, రేపటి ఉదయం మీరందరూ వచ్చి సీత జగతికంతా తన నిందను తొలగించు నిమిత్తంచేసే ఉత్తమ శపథాన్ని

1. అంతవరకు శ్రీరామచంద్రునకు కుశలవులు తన కుమారులనిగాని ఆ బాలకులు ఆయన తమ తండ్రి అనిగాని ఎరుగరు. వారికి తమ తల్లియే సీతామహాదేవియని తెలియదేమో?

దర్శించండి" అని పలికాడు. ఆయన మాటలువిన్న నరపతులు, తపస్వులు అట్టి నిర్ణయం తీసికోవడం ఆయనకే తగినదని పెక్కు విధాల అభినందించారు. ఆ రాజసింహుడు తిరిగి వారందర్నీ, మరునాటి ఉదయం తప్పకరావలెనని హెచ్చరించగా, వారందరూ అంగీకరించి ఆ ముచ్చటలే చర్చిస్తూ రాత్రి గడిపారు.

## సీతాదేవి శపథం చూచుటకు ప్రజలు సమూహాలుగా వచ్చుట

మరునాటి ఉదయం శ్రీరామచంద్రమూర్తి యజ్ఞశాలకు వచ్చి మహాత్ములైన వశిష్ఠ, వామదేవ, జాబాలి, కశ్యప, భరద్వాజ, పులస్త్య, గౌతమ, విశ్వామిత్ర, దుర్వాస, పర్వత, నారద, వామన, భార్గవ మౌద్గల్య కాత్యాయన అగస్త్య, మార్కండేయ, సుప్రభ, సుయజ్ఞులను మహర్షులను, ఆగతా మునులు రాజులు, వానర, దానవులను వైశ్య శూద్రులను పిలువనంపగా వారు సమూహాలుగా వచ్చారు. ఇంకను దూరప్రదేశాలనుండి ఎందరో వ్రత నిష్ఠాపరులైన విప్రులు కర్మ, జ్ఞాన యోగ నిష్ఠాపరులైన వారూ ఆ మహాదేవి శపథాన్ని చూడటానికి వచ్చారు. వారందరూ ఉత్కంఠతో పర్వతంవలె మౌనంగా కూర్చుండిరి.

## వాల్మీకి మహర్షి సీతాదేవితో యజ్ఞశాలకు వచ్చుట

జనసమూహాలు వేచియున్నారన్న వార్త చేరగానే వాల్మీకిమహర్షి జానకీదేవి వెంటడించగా యజ్ఞశాలకు బయలుదేరాడు. మహర్షి వెంట సీతాదేవి తలవంచుకొని, కమలాలవంటి చేతులు జోడించి, మనస్సులో నాథుని ధ్యానిస్తూ కన్నీళ్ళు కంఠంలో నిలుపుకొని వేదమూర్తివెంట నడిచే శ్రుతివలె వచ్చింది. నారచీర ధరించి, కృశించిన ఆ శీలవతీమణిని చూచిన జనులు దుఃఖభారంతో శోకిస్తూ "అయ్యో, మీరెంతటి లోకాతీత దంపతులు!" అని సీతారాములను శ్లాఘించారు.

## వాల్మీకిమహర్షి సీతాదేవి పతివ్రత, నిర్దోషి అని ప్రమాణం చేయుట

ఆ విధంగా సీతాదేవితోసహా జనుల మధ్యనిలచిన ఆ మహర్షి దగ్గరగా రాఘవుని సంబోధిస్తూ "దశరథరామా ఈ సీత పతివ్రతామణి, ధర్మనిష్ఠాపరాయణ సుమా! ఇది నీవు స్పష్టంగా ఎరిగివుండికూడ లోక నిందకు వెరచి ఈమెను నా తపోవన ప్రాంతంలో విడిచి పెట్టించావు! సువ్రతుడా, లోకాపవాద భీతితో కుములుచున్న నీకు నమ్మకం కల్గించ డానికి ఈ భూపుత్రికి అనుజ్ఞయిమ్ము! రాఘవా, దుర్ధర్షులైన ఈ కవలలు నీకు జన్మించిన వారేనని ప్రమాణంచేసి పలుకుతున్నానయ్యా!

"రఘువంశమణీ, నేను ప్రచేతసుని పదవ కుమారుడను, మనస్సులో కూడ అసత్యం తలచి ఎరుగను! నేను ఎన్నోవేల సంవత్సరాలు నిష్ఠతో తపస్సుచేసి యున్నాను! ఈ మైథిలి దుష్టురాలైతే, నా తపస్సంతా దగ్ధ మగుగాక! ఇంతవరకు నేను మనస్సుచేత గాని, వాక్కుచేత గాని, క్రియల చేతగాని, ఎట్టి పాపముచేసి ఎరుగను! రామచంద్రా, ఈ సాధ్వి పావని యైతేనే, నేను పై పుణ్యఫలమంతటినీ పొందగలను! నేను పంచభూతాల ద్వారాను, బుద్ధితోను, ఈమె శుద్ధురాలని గ్రహించడంవల్లనే, ఈమెకు ఆశ్రయం ఇచ్చానయ్యా!

"శ్రీరామచంద్రా అంతేకాదు, నేను దివ్యదృష్టితో ఈ సాధ్వి నిర్దోషి, పరమపావని అని గుర్తించియే రక్షణకల్పించాను![1] కనుక, పాప

---

1. వాల్మీకి మహర్షి పై శపథాల వివరణలనుబట్టి, ఆయన పూర్వం క్రూరుడైన బోయవాడని ప్రచారంలోనున్న జనగాథ ఆధారరహితమని మనం గ్రహించవచ్చును మరియు ఆమె తన ఆశ్రమానికి వచ్చిన తరువాతనే, ఆమె పవిత్ర శీలాన్ని గూర్చి లోకమంతటికి తెలుపడానికే "సీతా మహాదేవి చరిత్రము"ను శ్రీరామాయణాన్ని ఆ కరుణా పరాయణుడు వ్రాసి యుండాలి.

కేశమైనా లేనిది, పతివ్రతామణి, పవిత్రశీలయైన ఈ సీతాదేవి, జనుం నిందకు జంకే నీకు నమ్మకం కలిగించడానికి ఇప్పుడు ప్రమాణం చేయ గలదు" అని పలికాడు.

## శ్రీరాముడు లోకనింద తొలగడానికి సీతను శపథం చేయగోరుట

ఆ మహర్షి వాక్కులు విన్న కౌసల్యానందనుడు వినయంతో ఆ మహర్షి శేఖరునకు కరములు జోడించి జన మధ్యంలోనున్న సీతవంక చూస్తూ "పరమ తపస్వీ, నీ దివ్యవాక్కులవల్ల ఈమె పవిత్రురాలని పూర్తిగా నమ్ముచున్నాను; అందును గురించి నా కే సందేహం లేదు. పూర్వం ఈ మహాభాగ వేల్పుల సమక్షంలో తాను నిర్దోషినని ఘోరమైన అగ్ని పరీక్షద్వారా ఋజువు చేయడంవల్లనే లోగా నే నీమెను స్వీకరించాను; మహాత్మా అయితే ఈమె పావనియని ఎరిగియుండికూడ లోకనింద భరించ లేకనే ఈమెను విడిచిపెట్టినందుకు నన్ను క్షమించుము. ఈ బాలురిద్దరూ, నా కుమారులేనని ఎరుగుదును; అయినా ఈ భూవలయంలోని వారందరూ సీత నిర్దోషియనీ, పవిత్రురాలనీ పలికితే సంతోషిస్తాను" అని విన్న వించాడు. రాఘవుని అభిప్రాయాన్ని గుర్తించిన ఇంద్రాది సురలు, బ్రహ్మదేవుని ముందుంచుకొని, సీతాదేవి శపథం చూడవచ్చి ఆకాశంలో నిలిచారు. అట్లే ఆదిత్యులు, వసువులు, రుద్రులు, విశ్వేదేవతలు, అప్సరలు గంధర్వులు, నాగులు అశ్వినీ దేవతలు, మరుత్తులు, సాధ్యులు, సిద్ధులు దివ్యఋషులు తొట్రుపాటుతో ఆ మహాదేవి శపథాన్ని చూడవచ్చారు. అట్లు వచ్చిన వేల్పులు, మహర్షులను చూచి, రఘురాముడు తిరుగ "అసురులారా, మహర్షులారా, వాల్మీకిమహర్షి పలికిన విధంగా సీత నిర్మలాత్మురాలని నేను పూర్తిగా నమ్ముచున్నాను; అట్లు లోకంకూడ నమ్మితే సంతోషిస్తాను" అని పలికాడు. ఆ సమయంలో కృతయుగంలోవలె సుఖం కలిగిస్తూ, మనోహర మైన పరిమళాలతో హాయికలిగిస్తూ వాయువు వీచగా జనులు మహాద్భుత మని ఆశ్చర్యపడ్డారు.

## సీతాదేవి శపథం చేయుట

అప్పుడు కాషాయచీర ధరించి, తలవంచి కరకమలాలు జోడించి సీతాదేవి భూమాతను నిశ్చలంగా చూస్తూ, ఎల్లరు వినునట్లు బిగ్గరగా ''ఓ తల్లీ మాధవీదేవీ,[1] నేను మనస్సులోనైనా శ్రీరామచంద్రుని తప్ప, మరొక పురుషుణ్ణి స్మరించనిదాననై, సాధ్వినైతే, నాకు నీ లోనికి దారి ఇమ్ము!

"ఓ తల్లీ మాధవీదేవీ, నేను నిత్యం మనస్సు, వాక్కు, క్రియల్లో నా వల్లభుని ఆరాధించడం యదార్థమైతే, నాకు నీలోనికి దారిఇమ్ము.

''ఓ తల్లీ మాధవీదేవీ, నావల్లభుడైన రామభద్రుని తప్ప నేను పర పురుషుని ఎరుగననే నా వాక్కు త్రికరణాల్లోనూ యదార్థమైతే నాకు ఇచటి వారందరూ చూస్తుండగా నీలోనికి దారిఇమ్ము" అని శపథాలు పలికింది

## భూమాత సీతమ్మను రసాతలానికి తీసికొనిపోవుట[2]

ఇట్లా నారీమణి ముమ్మారు శపథాలు పలుకటం ముగించగానే మహా ద్భుతం కల్గిస్తూ లోకులందరూ రెప్పలు వాల్చకుండా చూస్తుండగా అచటి భూమిపగిలి బలవంతులైన నాగులు మోయుచున్న దివ్యరత్నాలతో వెల్గులచే నిర్మింపబడి భూమాత కూర్చున్న సింహాసనం భూమిపైకి వచ్చింది. అందు కూర్చున్న వసుంధరాదేవి సీతాదేవికి స్వాగతం తెల్పి, ఆమెను ఆదరంతో

1. మాధవీదేవి = భూదేవి (భూదేవి విష్ణుదేవుని పత్ని).

2. కొందరు సీతాదేవి తిరిగి అగ్నిపరీక్ష చేసియుండరాదా అని భావించవచ్చును. అయితే ఆమె లంకలో ఆ పరీక్ష జరిపినా, అయోధ్య రాజ్యవాసులు దాన్ని చూడనందున మన్నించరైరి. పైగా రెండవసారి ఆ పరీక్షయే చేస్తే ఆమె అగ్ని స్తంభనవంటి విద్య చూపెనని భావించియుందురు. అట్లు చేసినా, ఆ సభాసదులు చూచిన పరీక్షను దూర ప్రాంతాలవారు, ముందు తరాల వారు నమ్మకపోవచ్చును. అందువల్ల పౌరుల నిష్కారణ నిందతో విసిగి పోయిన ఆ మహాసాధ్వి ఈ లోకాతీత ప్రమాణం చేసియుండాలి.

తన చేతులతో అందుకొని సరసను కూర్చుండబెట్టుకొని రసాతలానికి తీసికొని పోయింది. అంతట పరమపావనియైన ఆ భూదేవి ముద్దుకుమారిపై అమరులు తెరపిలేకుండా పుష్పవర్షం కురిపించి ఆమెను వేయినోళ్ళతో కొనియాడారు.

తరువాత అంతరిక్షంలో నిలిచిన వేల్పులు, ఋషులు సాధువాదాలతో "తల్లీ సీతమ్మా నీ పాతివ్రత్యమెంత దొడ్డదమ్మా! నీవెంతటి నిర్మలాత్మవు!" అని బహువిధాల కీర్తించారు ఆ మహాద్భుత దృశ్యాన్ని చూచి యజ్ఞశాలలో ఆసీనులైయున్న రాజులు, మునులు, యాజకులు, ప్రజలు ఆశ్చర్యసాగరంలో మునిగి, ప్రతిమలవలె అయ్యారు. ఆకాశం, భూమి, రసాతలంలోని నాగ, దానవ, మానవులతో సహా స్థావరజంగమాలు ఆశ్చర్య విషాదాలతో ఒక ముహూర్తం సేపటివరకు స్మృతి కోల్పోయాయి. రాముపత్ని అపవాదం తొలగినదని కొందరు ఆనందంతో అరవగా, మరికొందరు ఆమె ఇక కానరాదే అని దుఃఖించారు. కొందరు రాముని చూడగా, మరికొందరు సీతాదేవిని మనస్సుల్లో చూచారు.

## శ్రీరాముడు సీతకై శోకించి, భూదేవిపై ఆగ్రహించుట

జానకీదేవి రసాతలానికి పోవడం చూచిన వానరులామెను ఎన్నో విధాల పొగడారు. శ్రీరామమూర్తి, దుఃఖంతో దీనుడై, దీక్షాదండం వూతగా అనుకొని, తలవాల్చి కన్నీళ్లు కారుస్తూ, చాలసేపు రోదనం చేశాడు. తరువాత ఆయన శోక, క్రోధాలతో కండ్లు ఎర్రకలువలవలెకాగా "అయ్యో, ఇటువంటి ఘోర దుఃఖం నేను ఎన్నడు అనుభవించి ఎరుగను! సాక్షాత్తు మహాలక్ష్మివంటి సీత నాకన్నుల ఎదుటనే, మాయమైందికదా! ఈ దుఃఖాన్ని, ఎట్లు భరించగలను? అయితే పూర్వం సముద్ర మధ్యంలో, దేవతలు సైతం ప్రవేశించరాని లంకలో నిర్బంధించబడిన ఇల్లాలిని విడిపించిన నాకు, ఈ భూదేవి దాచిన సీతను రప్పించడం మహాకార్యమా?

"ఓ వసుంధరాదేవీ, వెంటనే నా సీతను తెచ్చి అప్పగించుము! పూర్వం నాగలితో దున్నుచున్న జనకుడు, నీలో నుండియేకదా, ఈ సీతను

బయటకు తెచ్చాడు ! ఆ వరుసప్రకారం, నీవు నాకు అత్తగారివికదా ! అత్తయ్యా, కనుక నా దేవిని నాకు అప్పగించుము ! లేదా, నా సీతతోబాటు నివశించడానికి రసాతలానికో స్వర్గానికో నాకును దారిఇమ్ము ! అట్లు దారి ఇవ్వక, ఏ విధంగా సీతను నాకు యీ క్షణంలో అప్పగించవా, నా తీవ్ర విశిఖాలతో, పట్టణాలు, వనాలు పర్వతాలతో నున్న నీ రూపు మాపగలను !" అని ఆగ్రహంతో పలికాడు.

## బ్రహ్మ శ్రీరాముని శాంతింప చేయుట

ఆయన తీవ్రక్రోధ భాషణాలు విన్న పరమేష్ఠి, సురగణాలతో సమీపించి "విజితాత్మా శ్రీరామా, శాంతించుము ! నీవు, ఈ అవతారం ఎత్తడానికి పూర్వం విష్ణువుగా మాతో చేసిన నిర్ణయాలను జ్ఞప్తిచేయడానికి, నేను ఎంతవాడను ? కనుక విష్ణంశతో జరిగిన నీ పుట్టుకను స్మరించి. శాంతించుము ! నీ పూర్వ సహధర్మచారిణియైన భూదేవికుమారి, నీ శుశ్రూషా, తపశ్శక్తులతో యిప్పుడు నాగలోకంలో దివ్యసౌఖ్యాలు అనుభవిస్తోంది ! నీవు వైకుంఠధామం చేరగానే తప్పక నీ సాన్నిధ్యానికి రాగలదు !

"రఘుభూషణా, వాల్మీకి మహర్షి రమ్యంగా రచించిన ఆదికావ్యమైన శ్రీ రామాయణం నీవు పుట్టిననాటనుండి అనుభవించిన కష్టసుఖాలన్నిటినీ కన్నుల ఎదుట జరిగినట్లు వివరించడమేగాక, ఉత్తరకాండ పేరుతో సీతాదేవి నిష్క్రమణ తరువాత ముందు జరుగబోయే సంఘటనలను సైతం తెలుపుతోంది. నీకే అంకితమైనదీ, సత్యమైనదీ, అద్భుతమూ, దివ్యమైనదీ అయి అజ్ఞానాన్ని తొలగిస్తూ శోభిస్తోంది. ఈ ఉత్తమ కావ్యాన్ని, సురముఖ్యులతో నేను వినియున్నాను.

"కకుబంధనా, ఈ నా మాటలు మనసులో నుంచుకొని, ఇంతవరకు నీవు విన్నది గాక, భవిష్య సంఘటనలను గూర్చిన ఉత్తరకాండ మిగిలినది

ఇతరులు వినరాదు. గనుక దానిని ముని ముఖ్యులతో నీవే ఆలకింపుము. తద్వారా, నీవు సర్వమూ గ్రహించగలవు" అని పలికి అమరులు, ఋషులతో అంతర్ధానమై తన దివ్యలోకం చేరాడు.

సీతాపతి విధాత పలికిన ప్రకారం చేయదలచి వాల్మీకి మహర్షితో "మహాత్మా, నేను భవిష్యత్తును గూర్చి వివరించే ఉత్తరకాండ మిగత భాగాన్ని వినగోరుచున్నాను" అని పలికి, అచట వున్నవారిని పంపివేసి, కుశలవులను వెంటబెట్టుకొని, ఆ మహర్షి కుటీరానికిపోయి, తన దేవిని తలచుకుంటూ ఆ రాత్రి గడిపాడు.

## శ్రీరాముడు మిగిలిన ఉత్తరకాండము వినుట

మరునాడు సూర్యోదయం కాగానే ఆ సువ్రతుడు బ్రహ్మర్షులతో కూర్చుండి కుమారులను రప్పించి, "బాలకుమారా, మీరు నిశ్శంకతో మిగిలిన ఉత్తరకాండాన్ని వినిపించండి" అని కోరగా, వారు గానం ప్రారంభించి, అట్లు వినిపించారు. కొద్దిరోజుల్లో యజ్ఞం ముగియగా, శ్రీరామమూర్తి వేదనతో తనదేవిలేని విశ్వమంతా శూన్యమైనట్లు తోచగా దీక్షచాలించి, రాజులు, వానర రాక్షస సమూహాలు, విప్రులు, పౌర జానపదులకు ధనాలు వగైరాలు పంచిపెట్టి, వారి వారి స్థానాలకు పంపి, ఇల్లాలిని తలచుకుంటూ, కుమారులు సోదరులు బంధువులతో, అయోధ్య ప్రవేశించాడు.

ఆయన ధర్మమందు స్థిరబుద్ధితో రాజ్యం పాలిస్తూ నిష్ఠతో అనేక అశ్వమేధాలు అగ్నిష్టోమ, గోసవ అతిరాత్రాలనబడే పెక్కు యజ్ఞాలను తన ప్రక్కను జానకీదేవి సువర్ణ విగ్రహాన్ని పెట్టుకొని, విస్తారంగా దక్షిణలతో నిర్వహించాడే గాని, ఆ దీక్షా పరుడు మరొక మహిళను వివాహమాడలేదు. ఈ విధంగా ఆ మహాత్ముడు ఏకపత్నీ నియమాన్ని అచంచలంగా పాలించాడు.

ఆయన ఆజ్ఞకు లోబడి సామంతరాజులు, వానర, రాక్షసులు సంచ రిస్తుండగా, సకాలంలో వర్షాలు కురవడంవల్ల, పంటలు సమృద్ధిగా పండుతూ, కరువు, కాటకాలు, వ్యాధులు, అకాలమరణాలు, అరిష్టాలు ఎరుగక, జనులు సంపదలు తుష్టి, పుష్టులతో సుఖ జీవనాలు సాగిస్తుండగా, ధర్మ యుక్తమైన రామరాజ్యం బహుకాలం సాగింది.

## కౌసల్యా, కైక, సుమిత్రలు స్వర్గస్థులగుట

ధర్మపరాయణ, యశోవతి అయిన కౌసల్యాదేవి, పుత్రులు, మనుమ లతో సుఖంగాచాలకాలం జీవించి, స్వర్గలోకం చేరింది. అదే విధంగా అనేక సౌఖ్యాలు అనుభవించి, పెక్కు దానధర్మాలుచేసి, కైకా, సుమిత్రలు దేహాలు చాలించి, దేవలోకంలో దశరథ మహారాజును చేరుకున్నారు.

రఘురాముడు వారి కొరకు ఎన్నోదానాలు మునులు బ్రాహ్మణులకు యివ్వడంద్వారా పరలోక క్రియలు జరిపి పితృదేవతలకు తృప్తికలిగించాడు.

## యుధాజిత్తు గార్గ్యుని శ్రీరాముని వద్దకు పంపుట

ఒకనాడు కేకయరాజు, భరతుని మేనమామఆయిన యుధాజిత్తు తన గురువు, అంగీరసుని కుమారుడైన గార్గ్యమహర్షిద్వారా సందేశంతో వెంట పదివేల అశ్వాలు, ఆభరణాలు, విచిత్రవస్త్రాలు కంబళ్ళు కానుకలుగా రామ భద్రునకు పంపాడు. ఆయన వస్తున్నవార్త తెలుసుకొన్న రాఘవుడు తమ్ము లతో కోసెడు దూరం ఎదురువెళ్ళి మహేంద్రుడు బృహస్పతికివలె ఆ మహ ర్షికి స్వాగతసత్కారాలు జరిపి, ఆయన తెచ్చిన కానుకలను ప్రీతితో స్వీక రించి, మేనమామ క్షేమసమాచారం తెలుసుకొని, అయోధ్యకు తీసుకొనివచ్చి ఆయన రాకకు కారణం అడిగాడు.

ఆ బ్రహ్మర్షి సాదరంగా సమాధానమిస్తూ, ''రాఘవేంద్రా, మీ మామ సందేశం ఆలకించుము "సింధునదికి రెండువైపులనున్నదేశం వివిధ

ఫలాలు మూలాలతో శోభిస్తోంది. ఆ రాజ్యాన్ని మూడుకోట్లమంది సాహసులు శూరులైన గంధర్వులు పాలిస్తున్నారు. వారు దుర్జయులు కావడంవల్ల, ఎవ్వరును వారిని ఎదిరించలేకపోతున్నారు. వీరాగ్రగణీ, నీకు అంగీకారమైతే వారిని జయించి, వారి నగరరాజ్యాలు నీ రాజ్యంలో కలుపుకోవచ్చునని తెలుపుమన్నాడని" వినిపించాడు.

ఆ మాటలు విన్న శ్రీరాముడు అనురాగంతో భరతునిచూచి మహర్షికి అంజలిచేస్తూ "బ్రహ్మర్షీ ఈ భరతుని కుమారులైన తక్ష, పుష్కలులన బడే వీరులు అక్కడకు వచ్చి, తాత రక్షణతో స్థిరపడగలరు. భరతుడు వీరితోనూ సైన్యాలతోనూ వచ్చి గంధర్వులను జయించి వారి రాజ్యాన్ని ఈ కుమారులకు పంచియిచ్చి నా వద్దకు రాగలడు" అని తెలిపాడు. వెంటనే ఆ ప్రకారం ఆయన భరతునికి చాలినంత సైన్యం యిచ్చి, అతని కుమారులకు పట్టాభిషేకాలు జరిపించాడు. భరతుడు విధాతవంటి మహర్షినీ కుమారులనూ సైన్యాలను వెంటబెట్టుకొని వైభవంతో బయలుదేరగా, రాఘవుడు కొంతదూరం వారిని సాగనంపాడు. ఆ సైన్యానికి ముందు యుద్ధంలో తమకు తృప్తిగా ఆహారం దొరుకుతుందని మాంసాన్ని భక్షించే భూతాలు, తోడేళ్ళు, నక్కలు, గద్దలు రాబందులూ బయలుదేరాయి. భరతుడా సైన్యంతో, మజిలీలు చేస్తూ ఒకటిన్నర మాసాలు ప్రయాణంచేసి కేకయ రాజ్యం చేరాడు.

## భరత, యుధాజిత్తులు గంధర్వులతో సమరంచేసి వారిని జయించుట

ఆ వార్త విన్న యుధాజిత్తు, తన సైన్యంతో వారివెంట బయలుదేరి గంధర్వనగరాన్ని ముట్టడించాడు. వీరులైన గంధర్వులు ఉత్సాహంతో, తమ బలగాలతో శత్రువులను ఎదుర్కొని, వారితో సమానంగా వారం రోజులు ఘోరయుద్ధం చేశారు. ఆ యుద్ధరంగంలో ఆయుధాలు మొనసళ్ళుగా, నరకళేబరాల్ని కట్టెలవలె కొట్టుకొనిపోతూ, రక్తం ప్రవాహంగా పారింది. భరతుడు శత్రువులు ఏమాత్రం వెనుతీయక తమతో సమానంగా పోరాడటం చూచి, ఆగ్రహంతో మండుతూ యమధర్మరాజు యొక్క సంవర్తం

అనబడే భీకరాస్త్రాన్ని శత్రువులపై విడిచాడు. ఆ మహాస్త్రం ప్రళయకాల దావాగ్ని జ్వాలలతోవలె, కత్తులను శూలాలను ధారగా కురిపించి వానితో ముక్కోటి గంధర్వులను మాడ్చి మసిచేయగా దేవతలు తామెన్నడు అట్టి అస్త్ర రాజాన్ని చూడలేదన్నారట.

ఇట్లు శత్రువులను హతం చేసిన భరతుడు ధనాలు, రత్నాలు, వనాలు సమృద్ధిగానున్న గాంధారదేశం ప్రవేశించి, అందుతక్షశిల అనబడే నగరంలో తక్షుడనే పెద్దకుమారుని, పుష్కలావతి అనబడే నగరంలో చిన్నకుమారుడు పుష్కలుని ప్రభువులుగా చేశాడు. ఆ రెండు నగరాలూ ధనాలు సమృద్ధిగా కలిగి, ఉద్యానవనాలు, మనోహరాలైన గృహ, గోపురాల పంక్తులు, దేవమందిరాలు, తాల, తమాల, తిలక, వకుళ వృక్షాలు కోల్లలుగా నుండి, ఒకదానితో మరొకటి పోటీపడుచున్నట్లుండెను. భరతుడు అక్కడి వ్యవహారాలు చక్కదిద్దుతూ అయిదు సంవత్సరాలు గడిపి తరువాత అయోధ్యకు తిరిగివచ్చి, సభలో ధర్మమూర్తియా అన్నట్లున్న అన్నపాదసరోజాలకు పరమేష్ఠికి, మహేంద్రునివలె సాష్టాంగ ప్రణామంచేసి, జరిగిన వ్యవహారాలన్నీ విన్నవించగా ఆయన సంతోషించాడు.

## శ్రీరాముడు అంగదీయ, చంద్రకాంతపురాలకు లక్ష్మణ కుమారులను అభిషేకించుట

తరువాత ఒకనాడు తమ్ములతోనున్న దాశరధి ఉత్సాహంతో సౌమిత్రిని చూస్తూ "లక్ష్మణా, నీ కుమారులైన అంగద, చంద్రకేతులు, ధర్మమెరిగిన వారూ విక్రమవంతులై రాజ్యపాలనకు అర్హులైనారు కదా! ఏ ప్రదేశాలు మునులకూ, ఇదివరకు రాజ్యాలు పాలిస్తున్న రాజులకు బాధలులేకుండా దూరంలో వున్నవో తెలుపుము" అని అడిగాడు. భరతుడు ఆయనకు సమాధానంగా "అన్నయ్యా కారుపథం అనబడే రాజ్యం రమణీయమైనదీ, తాపసాశ్రమాలకు దూరమైనదీ, రాజెవ్వడూలేనిదీ కావడంవల్ల దాని

రాజధాని అంగదీయపురికి అంగదునీ, సరిగా అట్టిదేఅయిన చంద్రకాంత మనబడే రాజ్యానికి చంద్రకాంతునీ పరిపాలకులుగా చేయవచ్చును" అని పలికాడు. రాఘవుడు అతని మాటలకు సంతోషించి, ఆ ప్రకారం లక్ష్మణ కుమారులకు పట్టాభిషేకం జరిపించాడు. పడమటి దిక్కునఉన్న కారు పథానికి కుమారునితో లక్ష్మణునీ, ఉత్తరదిక్కునగల చంద్రకాంత రాజ్యానికి ముఖ్యపట్టణమైన చంద్రకాంత పట్టణానికి భరతునితో చంద్ర కాంతునీ పంపాడు. ఆ యా రాజ్యాలలో వ్యవహారాలు చక్కబరచి సంవత్సరం కాగానే సౌమిత్రీ, సంవత్సరానికి కొద్దికాలం తరువాత భరతుడూ, అన్న సేవకొరకు తిరిగి వచ్చారు. ఆ సోదరులు, రామ పాద సేవలో కాలం గడవడంగాని, తమ పుత్రులను తలచుకోవడంగాని ఎరుగకుండిరి. ఇట్లా సోదరులు ముగ్గురూ, పౌరులకార్యాలు చేయడంలో ఆసక్తి కలవారూ, కోర్కెలు నిండినవారూ, తేజస్వులూ, భాగ్యసంపదలు కలవారై, తేజోవంతాలైన త్రేతాగ్నులవలె శోభించారు.

## శ్రీరామ చంద్రుని దర్శించడానికి యముడు వచ్చుట

కొంతకాలం తరువాత ఒకనాడు, ఆ రాజీవాక్షుని చూడగోరి సమవర్తి[1] మునివేషంతో రాజద్వారంవద్ద నిలచి సమీపంలోనున్న లక్ష్మణునితో "నాయనా, నేనొక బలిష్ఠుడు, మహా తేజస్వియైన మహర్షి సందేశం రామభూపాలునికి వినిపించడానికై దూతనైవచ్చి ఆయన దర్శనం కోరుచున్నాను" అని తెలిపాడు. అతడు వడిగాపోయి, అన్నకు ఆ విషయం తెలియపరచాడు. ఆయన వెంటనే ఆ తపస్విని తీసికొనిరమ్మనగా అట్లు చేశాడు.

ఆ సంయమి మధురవాక్కులతో రఘురాముని దీవించగా, ఆయన స్వాగతంపలికి, ఆయన్ని బంగారుపీఠంపై కూర్చుండచేసి, తన సందేశాన్ని వినిపించకోరాడు. ఆయన సమాధానంగా "రాఘవా, మన సంభాషణ

1. సమవర్తి = యమధర్మరాజు.

పరను రహస్యమైనది. కనుక ఆ సంభాషణ సమయంలో ఎవరైనా మనలను చూడటంగాని, మన సంభాషణ వినడంగాని తగదు। అట్లుచేసిన వానిని చంపడానికి నీవు అంగీకరిస్తే నేను తెచ్చిన సందేశాన్ని వినిపిస్తాను" అన్నాడు. ఆయన అంగీకరించి, సౌమిత్రిని పిలిచి "లక్ష్మణా మేము ఉభయులము మాటాడుచుండగా, మమ్ము చూచినవాడూ, లేక మా సంభాషణ విన్నవాడూ వధించబడతాడు. కనుక ద్వారపాలకుని దూరం పంపి నీవే ద్వారంవద్ద నిలువుము" అని పలికి, అతడట్లు చేయగా, మునితో "సంయమీ, ఇప్పుడు మీ సందేశం వినిపించండి" అని ప్రార్థించాడు.

## యముడు శ్రీరామునకు, బ్రహ్మ సందేశం తెలుపుట

ఆ తపస్వి "రాజేంద్రా, ఆలకించుము. నేను తపస్విని కాను। పూర్వజన్మలో నీ కుమారుడను, నీ ఆజ్ఞానుసారంగా సర్వ సంహారకుడనైన యముడను. లోకపితామహుడు, నీకీ దిగువ సందేశం పంపగా దూతనై వచ్చాను ఆలకింపుము.

"విశ్వపతీ, ఇంతవరకు నీవు భూమిని చాలకాలం పాలించడంవల్ల ఇక నీ లోకాన్ని పాలించవలసిన సమయం వచ్చింది. ఇదివరకు నీ సంకల్పంతో సృష్టి సంహారంచేసి జలధిమధ్యంలో నిద్రించి, నీ నాభినుండి వెలువడిన పద్మంనుండి నన్నూ, పిదప అనంతుడనబడే శేషునీ సృష్టించావు। పిమ్మట భూమిని నిర్మించతలచి, నీ మాయతో మధుకైటభులను పుట్టించి, తరువాత సంహరించి, వారి అస్థులనుండి పర్వతాలను, మేధస్సు నుండి మెత్తని భూభాగాన్ని సృష్టించి, ఆ భూమిని ధరించే భారం అనంతునికీ, జీవకోట్లను సృష్టించునట్లు నన్నూ ఆదేశించగా అంగీకరించాము. అట్లు నేను సృష్టించిన జీవుల రక్షణభారం నీవు వహించుమని నేను వేడగా, అంగీకరించి నీవు విష్ణుడవైనావు. ఆ బాధ్యత ప్రకారమే నీవు అదితి కుమారుడవు, వామనుడవై సురలను రక్షించావు। తరువాత రావణుని బాధలనుండి ప్రజలను రక్షించడానికి దశరథునకు మనోమయ పుత్రుడవైన

రాముడవై అవతరించి, ఆ కార్యం నిర్వహించావు! అందుకొరకు భూలోకంలో పదకొండువేల సంవత్సరాలు నిలువగలనన్న నీ నియమ సమయం సమీపించింది! అయితే నీవు ప్రజల రక్షణకొరకు మరికొంత కాలం నిలుపదలచిన అట్లే చేయుము! లేక నీవు త్వరలో వైకుంఠానికి విచ్చేస్తే, వేల్పుల బాధలుతొలగి రక్షణకలవారై హర్షిస్తారు" అని వినిపించాడు.

రాఘవుడు ఆ సందేశాన్ని విని హర్షిస్తూ "శమనా, నేను యోచిస్తున్న విషయాన్ని హెచ్చరించటానికే నీవు బ్రహ్మ సందేశం తేవడంవల్ల ఆనందిస్తున్నాను. ముల్లోకాల రక్షణకొరకు అవతరించిన నేను ఆ బాధ్యత యిక్కడ తీరడంవల్ల విధాత కోరిన ప్రకారం భక్తపరతంత్రుడనై నావశంలోనున్న అమరనాయకులు తమ విధులు నెరవేర్చునట్లు చూడటం నా కర్తవ్యం. కనుక త్వరలోనే నా లోకానికి రాగలనని ఆయనకు తెలుపుము" అని పలికాడు.

## దుర్వాస మహర్షి రామ దర్శనంకొరకు వచ్చుట

వారిట్లు మాటాడుచున్న సమయంలోనే, దుర్వాస మహర్షి రామ దర్శనం కొరకువచ్చి రాజద్వారంవద్ద నిలచి, అక్కడ కావలాగా వున్న సౌమిత్రితో "లక్ష్మణా, నేను అగత్యంగా శ్రీరాముని చూడాలి! ఏ మాత్రం ఆలస్యానికి ఓర్వలేను! కనుక వెంటనే ఆయనకు నా రాక తెలుపుము! పొమ్ము" అని తొందరపెట్టాడు సౌమిత్రి ఆయనకు అంజలిచేసి, "భగవానుడా, రాఘవుడు అత్యవసరమైన సంభాషణలో వుండటంవల్ల ముహూర్తం సేపు తాళుము! లేదా తాము ఏ కార్యం నిమిత్తం వచ్చారో తెలిపితే, దాన్ని వెంటనే నేను నెరవేర్చగలను!" అని విన్నవించాడు.

కాని ఆ ఋషి శార్దూలుడు ఆగ్రహంతో, అతన్ని నిప్పులు కురిసే చూపులతో చూస్తూ "సౌమిత్రీ, నీవీ నిమిషంలోనే పోయి రాజుకు వార్త చెప్పాలి! అట్లు చెప్పవా, నిన్నూ నీ సోదరులనూ, రఘువంశాన్నీ, మీ

నగర రాజ్యాలనూ మాడుస్తాను! పెరిగే కోపాన్ని నిలువరించలేను ఇదిగో శపిస్తాను" అన్నాడు. ఆ కఠోర వాక్కులకు చలించిన లక్ష్మణుడు తనలో "ఇంతమంది సర్వనాశనం కావడంకంటె, నేను ఒక్కడినే మరణించడం మంచిదికదా" అని నిశ్చయించి, అతి వేగంగా రాఘవుని సమీపించి, ఆయనకు విషయం నివేదించాడు. ఆయన తక్షణమే కాలుని పంపివేసి, త్వరితంగా ఋషిని సమీపించి, ప్రణామం చేస్తూ "ముని శ్రేష్ఠా, మీరు వచ్చినపని ఏదో ఆజ్ఞాపించండి" అని పలికాడు.

మహర్షి సమాధానంగా "భక్తవత్సలా, నేను ప్రారంభించిన వేయి సంవత్సరాల ఘోర తపస్సు ఇప్పుడే ముగియడంవల్ల, ఆకలి భరించ లేకున్నాను! నాకు సిద్ధమైయున్న విందు భోజనం పెట్టించాలి" అని కోరాడు. శ్రీరాముడు సంతోషంతో, ఆయన కోపం తొలగునట్లు సిద్ధంగా వున్న అమృతోపమానమైన భోజనం తృప్తిగా పెట్టించాడు. తృప్తిచెందిన మహర్షి సంతోషించానని పలికి ఆయన్ని ఆశీర్వదించి, తన ఆశ్రమానికి పోయాడు.

## శ్రీరాముడు సౌమిత్రిని గూర్చి చింతాక్రాంతుడగుట

శ్రీరామమూర్తి కాలునికి చేసిన వాగ్దానం జ్ఞప్తికి తెచ్చుకొని, విలయం ప్రారంభమైనదని తలచి శోకంతో దీనుడై తలవాల్చి మౌనం వహించాడు. సౌమిత్రి రాహువుచే కబళించబడిన పూర్ణచంద్రునివలె నిస్తేజుడు, దీనుడైన అన్నను చూచి, సుమంత్రుని మాటలు జ్ఞప్తికిరాగా, విచారంలేని, మృదువు లైన పలుకులతో "మహాబాహూ, పూర్వమే నిర్ణయించబడిన కర్మ పరిణా మంగానే ఈ పరిస్థితి ఏర్పడటంవల్ల నా కొరకు విచారించకుము! శపథాన్ని నిలుపుకొనలేనివారు నరకవాసు లౌతారు! కనుక నన్ను అనుగ్రహించ తలచినచో శంకమాని హృదయాన్ని చిక్కబట్టి నీ సత్యపాలనకై నన్ను వధించుము" అని వేడుకున్నాడు.

## వశిష్ఠ మహర్షి ఆదేశ ప్రకారం, శ్రీరాముడు లక్ష్మణుని త్యజించుట

రఘుపతి సోదరుని మాటలకు చలించి, వెంటనే పురోహితుడు వశిష్ఠుని, మంత్రులను రప్పించి, వారితో తపస్వి రాక, తన వాగ్దానం దుర్వాసుని రాక మొదలైన విషయాలన్నీ వినిపించి సలహా అర్థించాడు. వశిష్ఠ మహర్షి ఇంగిత వాకందరు వినుచుండగా ఆయనతో "మహా యశస్వీ, ఈ విషయ మెట్లు జరుగునని, ముందే నిర్ణయించబడ్డది. కాలమహిమ నీ వెరుగనిదికాదు గదా। లక్ష్మణుని విడుచుట అనగా, అది నీ విలయమే! కనుక ఈ సుగుణనిధిని విడిచిపెట్టుము। ఏలననగా ప్రతిజ్ఞ భంగపరిస్తే ధర్మం నశిస్తుంది. దానితో సచరాచరాలతోకూడిన ముల్లోకాలూ, దేవ, ఋషిగణాలతో సహా నశిస్తాయిసుమా। దాశరథీ అందువల్ల నీ సత్యం పాలించడానికీ, ముల్లోకాల్ని రక్షించడానికీ, లక్ష్మణుని త్యజించుము" అని ఆదేశించాడు.

అధర్మ పరాయణుడు గురుదేవుని ఆదేశాన్ని అంగీకరించి సౌమిత్రితో "ప్రియ సోదరా లక్ష్మణా, సాధువులు ఆత్మీయుల్ని విడిచిపెట్టటం, చంపడంతో సమానమే గనుక ధర్మహాని కలుగకుండుటకై నిన్ను విసర్జిస్తున్నాను" అని పలికాడు.

## సౌమిత్రి శరీరంతో స్వర్గలోకం చేరుట

ఆయన వాక్కులువిన్న సౌమిత్రి శ్రీరాముని విడువవలసి వచ్చెననే దుఃఖంతో కన్నీళ్ళు కారుస్తూ, ఇంటికైనాపోక, ఇల్లాలికైనా చెప్పక, వడిగా సరయూనదిని సమీపించి. ఆ జలాలు ఆచమనంచేసి, చేతులు మోడ్చి ఇంద్రియాలను నిగ్రహించి, శ్వాసను బిగబట్టి నిలుచుండగా, ఇంద్రాది దేవతలు, అప్సరలు ఋషి సమూహాలు ఆ సుగ్రహవంతునిపై పుష్ప వర్షం కురిపించారు. ఆ సమయంలో దేవేంద్రుడు కానరాకుండా వచ్చి, ఆ ధన్యమూర్తిని శరీరంతో ఎత్తికొని దివ్యలోకం చేర్చాడు. ఈ విధంగా, విష్ణుని నాల్గవ భాగమూ ఆదిశేషుడూ అయిన లక్ష్మణుడు దేవలోకం చేరగా, వేల్పులూ, ఋషులూ సంతోషంతో ఆయన్ని పూజించారు.

## శ్రీరాముడు మహాప్రస్థానానికి బయలుదేర నిశ్చయించుట

అక్కడ సభలో శ్రీరామమూర్తి సోదరుని విడిచిన దుఃఖంతో పౌరోహితులు, మంత్రులు పౌరులను చూచి "హితులారా, ఇక నేను ధర్మశీలి భరతుని అయోధ్యాపతిగా అభిషేకించి, లక్ష్మణుడు చూపిన మార్గంలోనే వనానికి పోతాను. కనుక వెంటనే భరతుని అభిషేకానికి యత్నాలు చేయండి" అని పలుకగా సుమంత్రాది మంత్రులు, పౌర జానపదులు, తలలు వాల్చి బొమ్మలవలె నిలిచారు. ఆ మాటలకు భరతుడు నిశ్చేష్టుడై, రాజ్యాన్ని ఏవగించుకుంటూ "అన్నా, నీవులేని స్వర్గమైనా, నేను ఒల్లను ! ఇక రాజ్యమెందుకు ! ఇది యథార్థమని ప్రమాణంచేస్తున్నాను. కనుక వెంటనే కుశుని దక్షిణ కోసలకు, లవుని ఉత్తర కోసలకు అధిపతులుగా అభిషేకించుము. మన మహాప్రస్థాన యాత్రనుగూర్చి తెలుపుతూ, శత్రుఘ్నుని వద్దకు దూతలను పంపుము" అని విన్నవించాడు. భరతుని పలుకులువిన్న పౌరులు తలలు వాల్చడం చూచిన వశిష్ఠ మహర్షి శ్రీరామునితో "భక్తవత్సలా, ఈ పౌరుల స్థితి చూడుము ! వీరి కోర్కె ఏమో తెలిసికొని, నెరవేర్చడం యోగ్యంగా వుంటుంది" అని బోధించాడు.

ఆ ప్రకారం రఘువీరుడు నేలపై తలలు మోపియున్న పౌరులను ఆదరంతో లేవదీసి, "నా హితులారా, మీరు ఎందుకిట్లు దుఃఖిస్తున్నారో తెలుపండి" అని అడిగాడు.

అందుకు వారందరూ ఏక వాక్యంగా "శ్రీరామప్రభో, నీకు మాయందు అనుగ్రహముంటే, నీ వెంట తపోవనానికో, పర్వత సీమలకో, జలాల్లోలో సముద్ర జలాల్లోనో మునుగుటకో, మమ్ము భార్యాపుత్రాదులతో రానివ్వాలని వేడుచున్నాము" అని కోరారు. వారి దృఢ భక్తిని గుర్తించిన ఆ కరుణామూర్తి అంగీకరించాడు.

## శ్రీరామచంద్రుడు కుశలవులకు పట్టాభిషేకం చేయుట

జానకీ రమణుడు వెంటనే కుశ కుమారుని దక్షిణ కోసలకు, లవుని ఉత్తర కోసలకు అధిపతులుగా పట్టాభిషేకం జరిపించాడు. తరువాత వారిని ఆప్యాయంగా తొడలపై కూర్చుండపెట్టుకొని ప్రీతితో శిరస్సులు మూర్కొని కౌగలించుకొని, ఒక్కొకరికీ పదివేల ఏనుగులు, లక్ష అశ్వాలు, వెయ్యేసి రథాలు, పుష్కలంగా ధనాలు రత్నాలు యిచ్చి, ప్రజలు తుష్టి, పుష్టులతోనున్న వారి రాజధానులైన కుశావతి శ్రావస్తి పురాలకు పంపాడు.

## శత్రుఘ్నుడు కుమారుల్ని అభిషేకంచేసి అయోధ్యకు వచ్చుట

పిమ్మట ఆయన చిన్న తమ్ముని రప్పించడానికి వేగవంతులైన చారులను పంపగా వారు మూడు రోజులు విరామం లేకుండా ప్రయాణంచేసి మధురానగరంచేరి, ఆయనకు జరిగిన సంఘటనలన్నీ వినిపించి, శ్రీరామ భరతులు పౌరులందరితో అయోధ్యను నిర్జనంగా విడిచి స్వర్గారోహణకు నిశ్చయించి, తన్ను తీసికొని రమ్మన్నారని తెలియచేశారు. ఆ వార్తతో శత్రుఘ్నుడు కులము కూలుచున్నదని గ్రహించి వెంటనే కాంచనుడనే పౌరోహితుని, మంత్రులను పౌర పెద్దలనూ రప్పించి, వారికి వార్తలన్నీ తెలిపి, తాను అన్నలతోపోవ నిశ్చయించి, తన రాజ్యాన్ని కుమారులు యిద్దరికి చెరి సగంగా పంచి, పెద్దవాడైన సుబాహువుకు మధురను చిన్నవాడైన ఘాతికి వైదికమను పట్టణాన్ని రాజధానులుగా అభిషిక్తులనుచేసి, ధనాలు సైన్యాన్ని పంచిపెట్టి, తాను ఒంటి రథంమీద బయలుదేరి అయోధ్య చేరాడు.

అచట మహర్షుల నడుమ సన్నని తెల్లవస్త్రాలు ధరించి అగ్నివంటి తేజస్సుతోనున్న అన్నకు చేతులు జోడించి నిలచి, "అన్నయ్యా, నీ వార్త చేరగానే, కుమారు లిద్దరినీ అభిషేకించి, తగు ఏర్పాట్లుచేసి, మీతో బయలు

చేరడానికి సిద్ధమై వచ్చాను! ఇక నాకే ఆటంకులు చెప్పక, అనుజ్ఞ ప్రసాదించుము'' అని వేడగా, ఆయన అంగీకరించాడు.

అదే విధంగా శ్రీరాముని వార్తలు కిష్కింధ, లంకలకు చేరగా సుగ్రీవునితో దేవ గంధర్వ పుత్రులైన ఎలుగులు, వానర సమూహాలు, విభీషణునితో రాక్షస ముఖ్యులు శీఘ్రంగా శ్రీరామ దర్శనం కోసం వచ్చి, ఆ మహా పురుషునితో ''శ్రీరామ ప్రభూ. నీవు ఎక్కడికి బయలుదేరితే అక్కడికి రావడానికి మేము సర్వసిద్ధమై వచ్చాము. పురుషోత్తమా, మాపై గల నీ కరుణ విడువక మమ్మందరినీ నీతో తీసికొని పొమ్ము! నీవు విడిచి పెట్టావంటే మమ్ము యమదండనకు విడిచావని భావిస్తాము సుమా!'' అని వేడుకోగా, ఆయన సప్రేమగా వారి రాకకు అనుమతించాడు.

అంతట సుగ్రీవుడు ఆయన్ని సమీపించి "మిత్రవత్సలా, మీ వార్త చేరగానే నేను అంగదుని పట్టాభిషేకం జరిపి, మీతో రావడానికి సిద్ధపడి వచ్చాను. నన్ను వారించడం నీకు న్యాయం కాదు" అని విన్నవించాడు. రఘునాధుడు అతని పావన మైత్రిని స్మరిస్తూ "సుగ్రీవా, నిన్ను విడిచి స్వర్గానికిగాని, పరమపదానికిగాని పోనేను. కనుక తప్పక రమ్ము" అని ఆశ్వాసించాడు.

## శ్రీరాముడు హనుమ విభీషణులకు వరాలు ప్రసాదించుట

పిమ్మట ఆ కమలలోచనుడు విభీషణునితో "రాక్షసపతీ, నీవు సూర్య చంద్రులూ, భూమి, ప్రజలు నా చరిత్ర ఉండునంత కాలం, ధర్మ యుక్తంగా లంకను పాలించుమనీ, ధర్మం నుండి లేశమైనా తొలగవద్దనీ, నీ యందుగల మైత్రితో శాసిస్తున్నాను! అంతేగాక సురలు సైతం అర్చించే మా కులదైవమైన ఈ జగన్నాధుని భక్తితో ఆరాధించుము" అని పలుకుచు అతని యందుగల అపార ప్రీతితో తాను నిత్యం ఆరాధించే శ్రీ రంగశాయి అర్చా విగ్రహాన్ని సంతోషంతో ప్రసాదించగా అతడు స్వీకరించి, ఆయన శాసనాన్ని పాలిస్తానని అంగీకరించాడు.

## శ్రీరామమూర్తి సకలజీవులతోను మహాప్రస్థానానికి బయలుదేరుట

తరువాత శ్రీరామమూర్తి, తన పరమ భక్తుడు, సుగుణ భూషణుడు, వినయవంతుడైన మారుతిని ప్రసన్న దృష్టితో చూస్తూ "ఆంజనేయా, నా చరిత్ర లోకంలో వ్యాపించి వుండేవరకు జీవించి వుంటాననే, నీ ప్రతిజ్ఞను మరువబోకుము! ఆ చరిత్రను సదా ఆలకిస్తూ, నన్ను ధ్యానిస్తూ, హాయిగా సంచరించుము" అని ఆదేశించాడు. పావని ఆయన మాటలకు ఉప్పొంగుతూ, "పావనమూర్తీ రఘుభూషణా, నీ ఆదేశాను సారంగా, పావనమైన నీ గాథ జగతిలో ఎంత కాలం స్థిరంగా వుంటుందో, అంతకాలం జీవిస్తాను" అని పలికాడు. తరువాత ఆ మహాత్ముడు జాంబవంత, మైంద, ద్వివిదులను చూచి "వీరులారా, మీరు కలియుగం ప్రవేశించే వరకు జీవించండి" అని పలికి, మిగిలిన ఋక్ష, వానరులందరూ తనతో రావడానికి అనుమతించాడు. ఇట్లు రాత్రి గడిపి, మరునాడు సూర్యోదయం కాగానే ఆ రాజీవలోచనుడు, విశాలవక్షుడైన శ్రీరామచంద్రుడు గురుదేవునితో "మహాత్మా, అగ్నిహోత్రాలతో బ్రాహ్మణులు ముందు బయలు దేరునట్లూ, బాటల్లో వాజపేయ ఛత్రాలుండునట్లూ ఏర్పాట్లు చేయించండి" అని జెప్పగా, మహర్షి అట్లు ఏర్పరచి, ఆ సమయంలో చేయవలసిన వైదిక విధులన్నీ జరిపాడు. అప్పుడు శ్రీరామమూర్తి సన్నని వస్త్రం ధరించి, వ్రేళ్ళ సందుల్లో దర్భలు ధరించి, పాదుకలు విడిచి, ఇంద్రియాలను నిగ్రహించి మనస్సులో నిశ్చేష్టుడై దారిలో మాటాడక ఓంకారాన్ని జపిస్తూ దారిలో సుఖాలు కోరక ఆదిత్యునివంటి తేజస్సుతో గృహాన్నుండి బయలు దేరాడు.

ఆయన ఎడమ పార్శ్వంలో పద్మహస్తయైన శ్రీదేవి, కుడివైపున భూదేవి, ముందుగా సంహారశక్తి నడుస్తుండగా, సర్వరక్షణియైన గాయత్రి వేదాలు ప్రణవ, వషట్కారాలు, ధనుస్సు, శరాలు, సమస్త అస్త్రాలు

పురుషరూపాలతో వెంటబడించారు. వారి వెంట ఋషులు, బ్రాహ్మణులు తెలుపబడిన వాకిళ్ళుగల సాంతానిక లోకంనుండి వైకుంఠంవరకుగల లోకాల్లో తమ తమ యోగ్యతలనుబట్టి ప్రవేశించడానికి బయలుదేరారు.

మరియు రామచంద్రుని వెంట అంతఃపుర స్త్రీలు, బాలలు, వృద్ధులు, పరిచారికలు, ద్వారాలనుకాసే నపుంసకులు, సంతోషంతో బయలుదేరారు. భరత, శత్రుఘ్నులు, వారి అగ్నిహోత్రాలు వారి సతులు,[1] అట్లే మహాత్ములు, సాగిపోగా, వెంబడి మంత్రులు, బంధువులు పౌరులు వారి పరివారాలు, పశువులు, పక్షులతోకూడ నడిచారు. ఇంకను స్నానాలుచేసి, శుచులై నిశాచరులూ, కిలకిల ధ్వనులుచేస్తూ వనచరులు, ఎలుగులు ప్రోత్సాహంతో బయలుదేరాయి. అట్లే శ్రీరామచంద్రుని దర్శింపవచ్చిన పల్లెల్లోని జానపదులుసైతం ఆయన సుగుణశీలాలవల్ల ఆకర్షితులై వెంబడించారు.

అంతేగాక నగరంలో కానరాకుండా సంచరించే భూతాలు, రామచంద్రుణ్ణి అనురాగ దృష్టితో చూచిన స్థావరాలు సైతం ఆయన్ని వెంబడించాయి. ఆ విధంగా శ్వాసపీల్చే ఒక్క జీవికూడ నగరంలో మిగులకుండా అందరూ ఆయన యందుగల భక్తితో బయలుదేరారు. అట్లు ప్రయాణమైన వారిలో, మరణభీతి చెందినవారుగాని, ఎవరి నిర్బంధంవల్లగాని, బయలుదేరవలసివచ్చెనే యని దిగులుపడినవారుగాని, దుఃఖితులుగాని మచ్చునకైన లేరు. ఇట్లు ప్రజలందరూ తన్ను వెంబడింపగా కౌసల్యానందనుడు ఒకటిన్నర యోజనాలు నడచి, అక్కడ పశ్చిమ వాహినిగా సుళ్ళుతిరుగుచు ప్రవహిస్తున్న సరయూపుణ్యనదిని సమీపించి నిలిచాడు.

## బ్రహ్మాది దేవతలు శ్రీరాముని దర్శింప వచ్చుట

ఆ సమయంలో బ్రహ్మదేవుడు, వేల్పులు, దివ్యఋషులూ తన్ను కొలుచుచుండగా, అసంఖ్యాక విమానాల కాంతితో ఆకాశం శోభిస్తుండగా

1. ఇందు ఊర్మిళాదేవి తెలుపబడక పోవడంవల్ల, ఆమె లక్ష్మణుని వెంట వెళ్ళి యుండాలి.

పరమపదం చేరడానికి సిద్ధంగా రామచంద్రుడు నిలిచిన ప్రదేశానికి వేగంగా చేరవచ్చాడు. కాంతిమంతమైన ఆకాశం, సహజకాంతులుగల దేవతల కాంతులు తనపై ప్రసరించగా చూపరులు విస్మితులగునట్లు వింతకాంతులతో శోభించింది.

ఆ శుభసమయంలో అనిమిషులు తమ చేతులతో సుగంధపుష్పాలు చల్లారు; వాయువు చల్లనై, పావనమూ, సుఖం కలిగించే విధంగా పరిమళం వ్యాపింపచేస్తూ వీచింది. విస్తారంగా వాద్యాలు మ్రోగిస్తూ అప్సరలు, గంధర్వులూ సమూహాలుగా చేరారు. ఆ సమయంలో పాద చారియై రఘురామమూర్తి సరయూ జలాల్లో ప్రవేశిస్తుండగా పరమేష్ఠి ఆకాశంలో నిలచి "జయము విష్ణుదేవా, విచ్చేయుము; నీకు శుభమగుగాక; దేవ దేవా, మా మహాభాగ్యంవల్లనే, నీవు తిరిగి పరమపదానికి విచ్చేస్తున్నా వయ్యా! దేవసమానులైన సోదరులతో, నీవు కోరేవిధంగా వైష్ణవమైన నీ మహాతేజస్సునందో, కాక నిత్యము, సనాతమైన పరమాకాశమందో, నీ యిచ్ఛాప్రకారం ప్రవేశింపుము! జగతికి ఆధారమైనవాడా, నీ అనాది సహచారిణీ, విశాలాక్షియైన రమాదేవి తప్ప నీ తత్వాన్ని ఎరిగిన వారెవరు న్నారు? కరుణామయా నీవు నిత్యుడవు, మనస్సుకు గోచరించనివాడవు, అజరుడవు, అమృతుడవు; విశ్వమంతా నీ రూపమే కనుక నీ కోరిక ప్రకారం, ఏ రూపమందైనా ప్రవేశింపుము" అని ప్రార్థించాడు.

## శ్రీరాముడు సోదరులతో సహా, స్వశరీరాలతో వైష్ణవ తేజస్సులో ప్రవేశించుట

ఆ రఘువంశ సుధాకరుడు, మనస్సులో నిశ్చయించి తానూ,[1] తమ్ములూ స్వశరీరాలతో వైష్ణవ తేజస్సు నందు ప్రవేశించగా, అమరు లందరూ ఆనందించారు. తరువాత ఇంద్రునితో కూడిన మరుత్తులు,

1. ఇట్లు వారు స్వశరీరాలతోనే వైష్ణవ తేజస్సునందు ప్రవేశించడంవల్ల వారి శరీరాలు ప్రాకృతములైనవి కావని స్పష్టమౌతోంది.

సాధ్యులు, దేవ, యక్ష, గంధర్వులు, నాగులు, అప్సరలు, దివ్య ఋషులు, శుక్రునితో కూడిన దైత్య దానవులూ విష్ణు రూపుడైన ఆ దేవ దేవుని పూజించి, "లోకపతీ, నీ రాకతో మా కోరికలు ఫలించాయి। దివము దోషరహితమూ, పుష్టివంతమూ, ఆనందమయమూ అయింది।" అని స్తుతించారు.

అప్పుడా పురుషోత్తముడు ధాతతో "విధాతా, ఇచటికి వచ్చిన ప్రజలందరూ నా మీదగల అనన్య భక్తి మైత్రులతో, నా వియోగాన్ని భరించలేక, వెంబడించి ప్రాణాలు విడిచారు। వీరందరూ నాకు పూజనీయులు। కనుక వీరికి యోగ్యమైన లోకంలో ప్రవేశం కల్గించుము" అని ఆదేశించాడు.

## ప్రజాపతి సమస్త జీవులను సంతాన లోకంలో ప్రవేశపెట్టుట

కమలాసనుడు ఆయనకు సమాధానంగా "కరుణానిధీ, వీరందరూ బ్రహ్మ లోకానికి పై భాగంలో పరిపూర్ణ బ్రహ్మ గుణము కలిగిన సంతాన లోకంలో నివశిస్తారు. ప్రజలే కాకుండా, పశు పక్ష్యాదులు సైతం నిన్ను స్మరించినా, నీకై ప్రాణాలు త్యజించినా, అవి కూడ ఆ లోకం ప్రవేశిస్తాయి। వానర రాజు సుగ్రీవుడు తండ్రియైన ఆదిత్యునిలోనూ అట్లే మిగిలిన ఋక్ష వానరులు ఏ యే దేవతాంశల్లో జన్మించారో వారిలోనూ లీనం కాగలరు।" అని వివరించాడు, జగద్గురుడు యిట్లు పలుకుచుండగానే, సరయువులో గోప్రవారమను రేవులో నున్న ప్రజలందరూ, ఆనందాశ్రువులు కారుస్తూ, రాఘవుని యందుగల అనన్యభక్తితో, ఆ పావన జలాల్లో మునిగి, దేహాలు విడిచి, దివ్యదేహాలతో విమానాల్లో సంతాన లోకం చేరారు. [1]అట్లే

1. ఇందువల్ల భగవంతునియందు అనన్య భక్తి కలిగి దేహాలు చాలించేవారు లింగ, వర్గ వర్ణ భేదం లేకుండా మానవులేగాక పశుపక్ష్యాది జీవులు సైతం సరాసరి పరమపదం పొందగలరని ఋజువైంది.

వేలకొలదీ పశువులు, పక్షులు, ఎలుగులు, వానరులు, రాక్షసులు సరయువులో మునగడం ద్వారా శరీరాలు విడిచి, అమర తేజస్సు కలిగిన దేహాలతో విమానాలు ఎక్కి, ఆ దివ్యలోకం చేరారు.

ఇట్లు తన ఆదేశంతో, ఆ జీవులందరూ సంతోషంతో మనోజ్ఞమైన సంతాన లోకం చేరగా, బ్రహ్మదేవుడు హర్షించి తన లోకం ప్రవేశించాడు. అవతార మెత్తుటకు ముందున్న విధంగా చరాచరాలకు ఆత్మయై, వాని శరీరాలే తన దేహమైన వాసుదేవుడు, నిర్జరులందరూ ఆనందిస్తుండగా, స్వర్గానికి పరమ స్వర్గమైన వైకుంఠం ప్రవేశించాడు.

## శ్రీరామాయణం చదువుట వినుటవల్ల కలిగే ఫలం

ఈ కాండం ఉత్తర కాండ పేరుతో, శ్రీరామచంద్రుని పట్టాభిషేకానంతరం జరిగిన చరిత్రను వివరిస్తూ, భక్తి ద్వారా మాయను జయించిన వాల్మీకి మహర్షిచే లోక హితం కొరకు వ్రాయబడి, లోకకర్త, వేల్పులతో విని ఆయనచే అంగీకరించబడినది భగవంతుని పరమైనది కావటంవల్లనే శ్రీరామాయణాన్ని స్వర్గ లోకంలో దేవ గంధర్వ సిద్ధులు, మహర్షులు నిత్యం ఆనందంతో పఠిస్తుంటారు. ధర్మ, త్యాగ భరితమైది, వేద సమానమై పాపాలను నశింపచేసి, సౌభాగ్యాన్ని, ఆయుస్సునూ వృద్ధి చేస్తుంది. వేదాలనే వినతగిన శ్రాద్ధ సమయాల్లో, వేద సమానమైన ఈ రామాయణం వినతగినది.

ఈ కావ్యంలోని ఒక్క పాదమైనా సంతానం లేనివారు శ్రద్ధతో ప్రతిరోజూ చదివితే కుమారులను పొందగలరు! పేదలైనవారు అట్లు చేస్తే ధనవంతులౌతారు! అదే విధంగా పాపాలు చేసేవారైనా, శ్రద్ధతో రోజూ కొద్దిగానైనా పఠిస్తే, అగ్ని తగిలిన దూది కుప్పలవలె, వాని పాపాలు భస్మమౌతాయి.

ఈ దివ్య గాధను విన్నవారు, వినిపించినవారికి గోవులు, బంగారం, వస్త్రాలు ఇచ్చి సత్కారం చేస్తే, దేవతలు తృప్తులౌతారు. ఆయుస్సును వృద్ధి పరచే రామాయణాన్ని పఠించేవారు, కుమారులు మనుమలతో ఈ లోకంలో సౌఖ్యాలు అనుభవించి, అనంతరం వైకుంఠంలో శాశ్వతానందం పొందుతారు.

యోగ్యమైన అయోధ్యా నగరం రామచంద్రుడు వదలిన తరువాత చాలకాలం శూన్యంగా వుండి, తరువాత ఋషభుడనే రాజు పాలనలో తిరిగి జనులకు నిలయమై, సౌఖ్యాలు కలిగిస్తుంది

శ్రీరామమూర్తి పట్టాభిషేకానంతర చరిత్రను, ముందు జరిగే సీతాదేవి రసాతలం ప్రవేశించడం, ఇతర గాథలను వివరిస్తూ వాల్మీకి మహర్షి రచించిన ఈ ఆది కావ్యాన్ని ఈ కావ్య నాయకుడు శ్రీరామమూర్తి స్వయంగా విని సత్యమైనదని అంగీకరించడంవల్ల, పరమ ప్రమాణ గ్రంథమై వేల్పులకు కూడ ఆదరణీయమైంది.

పావనమైన శ్రీరామచరిత్రను వినడం, ధ్యానించడం, చేసే ధన్యులు వేలకొలది అశ్వమేధయజ్ఞాలు, లక్ష వాజపేయాలు చేసిన ఉత్తమఫలాన్ని, గంగా మొదలైన పుణ్యనదీజలాల్లో స్నానంచేసిన సుకృతాన్నీ పొందుతారు. అంతేగాక సూర్యగ్రహణ సమయంలో నైమిశారణ్యం ప్రయాగ, కురుక్షేత్రం వంటి పవిత్రక్షేత్రాల్లో విస్తారంగా సువర్ణదానంచేసిన పుణ్య ఫలాన్ని పొందగలరు.

సీతావల్లభుని గాథను శ్రద్ధాసక్తులతో వినేవారు, ఘోరపాపాలనుండి విముక్తులై, విష్ణుదేవుని సన్నిధిలో స్థిరంగా నివసిస్తారు. అట్లే మహర్షిచే వ్రాయబడిన ఈ కావ్యాన్ని నియమంగా నిత్యం భక్తితో వినేవారు నిశ్చయంగా ఆ లోకనాథుని సారూప్యముక్తిని పొందుతారు. ఈ కావ్యాన్ని నియమంగా ఆలకించే పుణ్యాత్ముల ఆలుబిడ్డలు వృద్ధిపొంది, తెంపులేని

సంపదలతో, వారి పంశాలు తామరతంపరగా పెరుగుతాయి. ఎల్లప్పుడు రాఘవధ్యాన పరాయణులైన భక్తులుకోరే శ్రేయస్సులు లభిస్తాయి.

దశరథరాముని త్యాగ, ధర్మమయ గాథను నిర్మల మనస్సులతో ఆలకించేవారు పాపరహితులు భక్తులై చిరకాలం జీవించి, మోక్ష పదాన్ని చేరగలరు.

గాయత్రీ రూపమైన రామాయణంలోని ఒక్క పదమైనా పఠించేవారి పాపాలు దూరమై, కుమారులు స్థిరమైన ధనాలతో సుఖిస్తారు. ఈ చరిత్రను పూర్తిగా చదివే నియమపరులు సదా వైకుంఠంలో నివసిస్తారు. ఈ పుణ్య గాథను తరచుగా వినువారి తండ్రులు తాతలు ముత్తాతలు, వారి తండ్రులు సైతం విష్ణులోక వాసులౌతారు.

ఈ మహనీయ చరిత్ర చదవడం, వినడంవల్ల ధర్మ, అర్థ, కామాలనే పురుషార్థాలనేకాక పరమపదాన్ని సైతం అందచేస్తుంది. కనుక జనులందరూ, శ్రద్ధతో చదవడం వినడం చేయాలి. ఇట్టి మహామహిమ కలిగినదీ, పూర్వచరిత్రల్లో శ్రేష్ఠమైనదీ, శీలాన్ని వృద్ధిపొందించేదీ అయిన శ్రీరామాయణాన్ని శంకలు విడిచి నిండు శ్రద్ధతో పఠించేవారు పాపరహితులై, విస్తారశ్రేయస్సులు పొంది విష్ణుదేవుని మహిమాతిశయంవల్ల మరింత వర్ధిల్ల గలరు!

ఉ॥ రాముడు ఘోరపాతకమి, రాముడు సద్గుణ కల్పవల్లికా
రాముడు షడ్వికార జయ, రాముడు సాధుజనావన వ్రతో
ద్దాముడు రాముడే పరము, దైవము మాకని మీయడుంగు
గెందామరలే భజించెదను, దాశరథీ కరుణాపయోనిధీ!

చ॥ సలలిత రామనామ జప, సారమెరుంగను గాశికాపురీ
నిలయుడగాను మీ చరణ, నీరజరేణు మహాప్రభావము
దెలియ నహల్యగాను జగ, తీధవ నీదగు సత్య వాక్యముం
దలపగ రావణాసురుని, తమ్ముడగాను భవద్విలాసముల్
గలచినుతింప నాతరమె, దాశరథీ కరుణాపయోనిధీ!

చ॥ హరునకు నవ్విభీషణున కద్రిజకున్ దిరు మంత్రరాజమై
కరికి నహల్యకున్ ద్రుపద, కన్యకు నార్తిహరించు చుట్టమై
పరగిన యట్టి నీ పతిత, పావన నామము జిహ్వపై నిరంత
తరము నటింప జేయుమిక, దాశరధీ కరుణాపయోనిధీ

ఉ॥ నీ సతి పెక్కు గల్మలిద, నేర్పరి లోక కల్మషంబుగా
నీ సుత సేయు పావనము, నిర్మితకార్యధురీణ దక్షుడై
నీ సుతుడిచ్చు నాయువులు, నిన్ను భజించిన గల్గకుండునే
వాసుల కీప్సితార్థములు దాశరధీ కరుణా పయోనిధీ.

ఉ॥ పాపము లొందువేళ రణ, పన్నగ భూత భయజ్వరాదులం
దాపదనొందు వేళ భర, తాగ్రజ మిమ్ము భజించువారి కిం
బ్రాపుగ నీవు, దమ్ము డిరు, పక్కియలం జని తద్విపత్తి సం
తాపము మాన్పి కాతురట, దాశరధీ కరుణాపయోనిధీ.

ఉ॥ రామహరే కకుత్థకుల, రామహరే రఘురామ రామ శ్రీ
రామహరే యటంచు మది, రంజిల భేకగళంబుచేల నీ
నామము సంస్మరించిన జనంబు భవంబెడ బాసి తత్పరం
ధామని వాసులౌదు రట, దాశరధీ కరుణాపయోనిధీ.

చ॥ పరమ దయానిధే పరమ పావన నామ హరేయటంచు సు
స్థిరమతులై సదా భజన, చేయు మహాత్ముల పాదధూళి నా
శిరమున దాల్తు మీరటకు, జేరకుడంచు యముండు కింక రో
త్కరముల కానబెట్టునట, దాశరధీ కరుణాపయోనిధీ
(దాశరధీ శతకం నుండి

శ్లో॥ ఆపదామప హర్తారం, దాతారం సర్వసంపదాం
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహం

రామాయణ సుధ ఉత్తర కాండ సర్గం సమాప్తం
శ్రీ సీతారామచంద్రార్పణమస్తు.

# తప్పొప్పుల పట్టిక

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 3 | 19 | మాయవులూ | మాయావులూ |
| 4 | 6 | మిచిన | మించిన |
| 5 | 7 | లభిచిన | లభించిన |
| 7 | 2 | తోరణాలతో | తోరణాలతో నిర్మితమై |
| | | మనోహరమైన | మనోహరమైన |
| 11 | 1 | మాల్యవతాదుల | మాల్యవంతాదుల |
| 14 | 19 | అమ్మలు | అమ్ములు |
| 16 | 8 | శూలయుధాన్ని | శూలాయుధాన్ని |
| 17 | 3 | నుంటి | నుండి |
| 17 | 21 | సంపారింతుసా | సంపాదింతునా |
| 18 | 23 | బారవహులైన | భారవహులైన |
| 20 | 17 | తరవాత | తరువాత |
| 21 | 5 | దద్గద | గద్గద |
| 22 | 2 | గపుక | గనుక |
| 22 | 9 | శక్తితోవే | శక్తితోనే |
| 22 | 15 | వాక్కులోకుండె | వాక్కులోనుండి |
| 22 | 21 | నిర్జనులతో | నిర్జరులతో |
| 22 | 23 | సుమలు | సురలు |
| 23 | 2 | యిస్టానుసారంగా | ఇష్టానుసారంగా |
| 23 | 22 | అక్క చెల్లెలు | అక్కచెల్లెళ్లు |
| 24 | 13 | కుబేరునీ | కుబేరుని |

| | | | |
|---|---|---|---|
| 25 | 7 | పరివాహ | పరీవాహ |
| 27 | 10 | మేఘనాధు | మేఘనాదు |
| 32 | 14 | పాపే | పాపీ |
| 36 | 9 | సమిపించి | సమీపించి |
| 39 | 17 | సత్రం యాగానికి | సత్రయాగానికి |
| 43 | 21 | ప్రళయ కాళంలో | ప్రళయ కాలంలో |
| 50 | 18 | శోకాలతో కారిన | శోకాలతో కార్చిన |
| 53 | 24 | విభీషణాదులచు | విభీషణాదులను |
| 54 | 2 | పరస్త్రిలను | పరస్త్రీలను |
| 54 | 5 | దీని ప్రతీకారంగా | దీనికి ప్రతీకారంగా |
| 57 | 7 | చూస్తూంటాడు | చూస్తుంటాడు |
| 59 | 7 | సమరంతో | సమరంలో |
| 60 | 7 | పలాయ నయ్యారు | పలాయన మయ్యారు |
| 60 | 22 | లేయడం | వేయడం |
| 61 | 2 | దిక్కులు | దిక్కుల |
| 62 | 2 | నోప్పించాడు | నొప్పించాడు |
| 67 | 14 | వెంటినే | వెంటనే |
| 68 | 18 | స్నానలు చేస్తూ | స్నానాలు చేస్తూ |
| 69 | 2 | జలక్రిడకు | జలక్రీడకు |
| 70 | 14 | తినేత్రుడు | త్రినేత్రుడు |
| 70 | 24 | వెనుకకుయి పోయి | వెనుకకు పోయి |
| 71 | 4 | దంతావళస్నీ | దంతావళాన్నీ |
| 71 | 19 | పురోహింతుడు | పురోహితుడు |
| 76 | 7 | ఇందుకు కారణం హనుమకు | ఇందుకు హనుమకు |
| 78 | 6 | జలోదను | జలోదరుల |

| | | | |
|---|---|---|---|
| 0 | 21 | శపిఃచాడు | శపించారు |
| 1 | 10 | ప[భాకరునకు | ప్రభాకరునకు |
| 1 | 13 | చఃదస్సులు | ఛందస్సులు |
| 2 | 10 | యటీవలనే | ఇటీవలనే |
| 3 | 10 | జనార్ధనివతె | జనార్ధనునివతె |
| 5 | 2. | ప్రసన్న దృష్టితో తూస్తూ | ప్రసన్న దృష్టితో చూస్తూ |
| 5 | 21 | వారఃరురూ | వారందరూ |
| 6 | 8 | ఆభరణా లన్నింటితోనూ | ఆభరణా లన్నిటితోనూ |
| 8 | 1 | ఆ పారశ్యంతో | ఆ పారవశ్యంతో |
| 0 | 1 | ఆ వనంతో | ఆ పనంలో |
| 3 | 23 | అవాచ్చాలు | అవాచ్యాలు |
| 4 | 4 | అసరు డామెను | అసురు డామెను |
| 5 | 2 | శోక సాగరంతో మునిగీ | శోక సాగరంలో మునిగి |
| 5 | 22 | పోపుచున్నాను | పోవుచున్నానని |
| 5 | 22 | త్వదగా | త్వరగా |
| 6 | 16 | అవశకునాలను | అపశకునాలను |
| 01 | 1 | సాష్టాంగా | సాష్టాంగ |
| 03 | 3 | కేశమాత్రమైనా | లేశమాత్రమైనా |
| 03 | 19 | రాజుల | రాజు |
| 06 | 14 | ప్రసస్నుడై | ప్రసన్నుడై |
| 12 | 20 | పురూరపు | పురూరవుని |
| 12 | 21 | ఆయుపు కుమారుడైన | ఆయువు కుమారుడై |

| | | | |
|---|---|---|---|
| 114 | 17 | అవమానా | అవమానాన్ని |
| 114 | 20 | మరణించడా కి | మరణించడానికి |
| 114 | 23 | అయన | ఆయన |
| 115 | 4 | విహరిస్తూ | విహరిస్తు |
| 115 | 7 | నా బిడ్డను ఒకల్ల | నా బిడ్డను ఒల్లక |
| 115 | 20 | మాటలు విన్నగానే | మాటలు వినగానే |
| 125 | 13 | చ్యవనపు మహర్షిలో | చ్యవన మహర్షితో |
| 125 | 18 | యవనాశ్వుని | యువనాశ్వుని |
| 126 | 7 | చెల్లడం లేదూ | చెల్లడం లేదో |
| 126 | 22 | చుండనే | చుంచగానే |
| 126 | 24 | పట్టణాన్నుండి | మధువనాన్నుండి |
| 128 | 11 | మూర్చితుడై | మూర్ఛితుడై |
| 128 | 19 | వెగాలు కలిగిన | వేగాలు కలిగిన |
| 129 | 1 | మధుకైటబు లనబడే | మధుకైటభు లనబడే |
| 129 | 21 | కవిరోధి | లోకవిరోధి |
| 131 | 8 | నాకును సీయండు | నాకును |
| 143 | 7 | మిగిలిని | మిగిలిన |
| 147 | 6 | తేజోహీనుడై | తేజోహీనుడై |
| 147 | 2 | ఈ | ఆ |
| 151 | 2 | దండ్రుని | చంద్రుని |
| 152 | 2 | గడప | గడిపి |
| 153 | 23 | వైమిశారణ్యంలో | నైమిశారణ్యంలో |
| 154 | 3 | పప్పు తైలాలు | పప్పులు తైలాలు |
| 155 | 24 | నాయనలారా మీరు | నాయనలారా, |

తప్పొప్పుల పట్టిక

| | | | |
|---|---|---|---|
| 157 | 1 | చార్యుడై | నభరతునిచే |
| 157 | 18 | వాల్మీకికీ | వాల్మీకికి |
| 159 | 19 | స్త్రీతా శీలాన్ని | సీతా శీలాన్ని |
| 165 | 21 | శోభిస్తోంది | శోభించే |
| 166 | 11 | బాలకుమారా | బాలకులారా |
| 169 | 7 | పుష్కరావతి | పుష్కలావతి |
| 175 | 21 | జలాల్లోలో | జలాల్లోనో |
| 176 | 19 | వైదికమను | వైదిశమను |